సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 14

శనివారం 6-4-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




జాతీయస్థాయిలో
నారాయణకు మాత్రమే సాధ్యం...
వేరెవ్వరికైనా అసాధ్యం !
ప్రతీ సంవత్సరం నారాయణ ప్రోగ్రామ్స్‌తోనే
ఈ అపురూప ఘట్టాలు ఆవిష్కృతం !!
1st AIR RANK NEET 2022
1st AIR RANK JEE ADV - 2022
1st AIR RANK JEE MAIN - 2022
715 720 ARNAB PATI
712 720 SHASHANK
710 720 G GIRI VARSHITHA
710 720 SURYA PRATAP MISHRA
710 720 MEGH DHIRAJ C
710 720 LAKSHMI RASMITHA G
710 720 ANMOL RAWAT
710 720 PRAGATA GHOSH
NEET ప్రిపరేషన్‌లో నారాయణ ను నమ్మారు,
2023 NEETలో 3128 మంది డాక్టర్లు అయ్యారు
NEET 2023లో జాతీయస్థాయిలో టాప్ 10 లోపు ర్యాంకులు
AIR 3 PIYUSH JHA App. No. 230410882637
AIR 4 SHASHANK SINHA HT. No. 230410815258
AIR 7 PRANJAL SINGH HT. No. 230410699884
AIR 8 PRAGATA GHOSH HT. No. 230410006129
AIR 8 ANKITA MANDAL HT. No. 230410416872
ALL INDIA OPEN CATEGORY RANKS BELOW TOP 500
19 20 31 35 51 52 62 69 88 89 123 128
150 171 191 197 219 225 255 256 269 284 301
303 339 344 360 385 388 417 439 451 458
వేసవి సెలవులు మీ పిల్లల భవిష్యత్తుకు పునాదులు
నారాయణ
STAR CO SUPER CHAINA
10వ తరగతి పూర్తయిన విద్యార్థుల కోసం
ఫిజిక్స్ మరియు కెమిస్ట్రీ ఫౌండేషన్ తో డాక్టర్ సీట్‌ను ఈజీగా సాధించవచ్చు
ఇంటర్‌తో పాటే మెడికల్‌లో సీటు సాధించాలంటే మీ పిల్లల యొక్క డాక్టర్ కల సాకారం అయ్యేది
నారాయణ
STAR CO SUPER CHAINA NEET PROGRAMMEతోనే
ప్రోగ్రామ్ ప్రారంభించు తేది: 04-04-2024
టాప్ ర్యాంక్ అయినా, టాప్ మార్క్ అయినా, ఏ జాతీయస్థాయి పోటీపరీక్ష అయినా...
ఎవరూ ఢీకొట్టలేని...వేరెవ్వరూ దరిచేరలేని...ఆల్‌టైమ్ రికార్డ్ !
నారాయణ కు మాత్రమే సొంతం ! నారాయణతోనే ఇది సాధ్యం !!
JEE Main 2024 (Session-1)
6 గురు విద్యార్థులచే 300/300 మార్కులు
8 మంది విద్యార్థులచే 100 పర్సంటైల్
300 300
Overall 100 Percentile
AMOGH AGRAWAL
SHAIK SURAJ
ARYAN PRAKASH
M SAI TEJA
ROHAN SAI PABBA
M ANOOP
H VEDITH
TANVA DINESH REDDY
Scan QR Code For Students' Testimonials
Scan QR Code For Admission
SRAMAYEVA JAYATHE
NARAYANA EDUCATIONAL INSTITUTIONS
మీ IIT-JEE / NEET కలలను నారాయణ నిజం చేస్తుంది
మీ కలలే మా కలలు
Toll Free: 1800 102 3344 | /TheNarayanaGroup | www.narayanaschools.in | www.narayanagroup.com
drusya.in

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 22 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 14

శనివారం 6-4-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





దేశం నిశ్శబ్దంగా ఒక ముఖ్యమైన జనాభా మార్పుకు గురవుతోంది.
ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 ప్రకారం దేశ జనాభాలో 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గల వారు దాదాపు 15 కోట్ల మంది ఉన్నారు.
ఈ సంఖ్య 2050 నాటికి రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.
సంతానోత్పత్తి రేటు తగ్గడం, అందుబాటులోకి వచ్చిన చికిత్సా విధానాల వల్ల భారతదేశ జనాభాలో వృద్ధుల వాటా నిశ్శబ్దంగా పెరుగుతోంది.
అయితే, దీనికి తగినట్టుగా వారి ఆర్థిక శక్తి పెరగడం లేదు.
ఫలితంగా వృద్ధులు సొంత కుటుంబాల నుంచే ఈసడింపులకు, వేధింపులకూ గురవుతున్నారు.
వృద్ధుల జీవితం భరోసాగా గడవడం ఎలా?!

సీనియర్ సిటిజన్స్‌కు భరోసా ఏది?



పాశ్చాత్య దేశాల మాదిరి కాకుండా భారతదేశంలోని 40 శాతం మంది వృద్ధులు అత్యంత పేదరికంలో ఉన్నారు. 60 నుంచి 80 ఏళ్ల వయసులో ఉన్న మహిళలు ఆర్థిక, ఇతర అవసరాల కోసం వారి కుటుంబాలపై పూర్తిగా ఆధారపడి ఉన్నారు. గ్రామీణ వృద్ధులు కుల, వర్గ ఆధారిత వివక్షకూ గురవుతున్నారు.

గ్రామాల్లో పెను సవాల్!

నగరాలలో ఉండే సీనియర్ సిటిజన్స్ జీవితాలతో పోల్చితే గ్రామాల్లో వారి పరిస్థితి దయనీయంగా ఉంది. వీరు కనీస సౌకర్యాలు కూడా లేకుండా జీవిస్తున్నారు. మన ఆరోగ్య విధానం సాధారణంగా మాతా, శిశు సంరక్షణపైనే ఉంటుంది. వృద్ధుల సంరక్షణకు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. గ్రామీణ వృద్ధులలో ప్రత్యేకించి మహిళలు ఆర్థిక, అవసరాల కోసం వారి కుటుంబాలపై పూర్తిగా ఆధారపడుతున్నారు. మన దేశంలో వృద్ధుల సంరక్షణ ఎక్కువ భాగం వారి పిల్లలు చూసుకోవడం ఆనవాయితీ. అయితే, కాలంతో పాటు ఈ విధానాలూ వేగంగా మారుతున్నాయి.

పిల్లల వలస..

పెరుగుతున్న ఒంటరితనం

విద్య, ఉద్యోగాల కోసం పిల్లలు వలసలు వెళ్లడం, ఉమ్మడి కుటుంబం వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, వృద్ధుల సంరక్షణను ప్రశ్నార్థకంగా మార్చింది. నివేదికల ప్రకారం 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులలో 6 శాతం మంది ఒంటరిగా జీవిస్తున్నారు. 20 శాతం మంది పిల్లలు లేకుండా వారి జీవిత భాగస్వామితో మాత్రమే జీవిస్తున్నారు. ఈ సంఖ్య భవిష్యత్తులో గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. తక్కువ ఆదాయ కుటుంబాలలో వృద్ధుల ఆరోగ్య అవసరాలు ఆర్థికంగా భరించలేనంత భారంగా మారుతున్నాయి. భారతదేశంలో వృద్ధులపై వేధింపుల కేసులు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. 'హెల్ప్ ఏజ్ ఇండియా' నివేదిక ప్రకారం 25 శాతం మంది పెద్దలు తమ సొంత కుటుంబాల ద్వారా వేధింపులకు గురవుతున్నారు.

సామాజిక భద్రత

హెల్ప్ ఏజ్ ఇండియా సూచనల మేరకు..

- దేశంలో వృద్ధుల కోసం అధికారిక సంస్థాగత సంరక్షణలో పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉంది. పటిష్ఠమైన పెన్షన్, సామాజిక భద్రతా వ్యవస్థ, మెరుగైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందించడం ద్వారా వారి కుటుంబ సభ్యులపై వృద్ధులు ఆధారపడటం తగ్గించవచ్చు.
- దాదాపు 33 శాతం మంది వృద్ధ స్త్రీలకు ఎటువంటి ఆదాయం లేదు. 11 శాతం మందికి మాత్రమే పెన్షన్ ద్వారా ఆదాయం వస్తోంది. 16.3 శాతం మంది సామాజిక పెన్షన్ పొందుతున్నారు. సీనియర్ కేర్ సంస్కరణలపై ఇటీవల 'నీతి అయోగ్' సమర్పించిన ఓ నివేదిక ప్రకారం వృద్ధుల ఆర్థిక సాధికారతను నిర్ధారించడానికి ప్రభుత్వ నిధుల కవరేజీని పెంచడం, తిరిగి పని నైపుణ్యాలవైపు మళ్లించడం, తప్పనిసరి పొదుపు ప్రణాళికలు, రివర్స్ మార్టిగేజ్ మెకానిజమ్స్, పన్ను, జీఎస్టీ సంస్కరణల వంటి అనేక చర్యలు చేపట్టాలని పేర్కొంది.
- ఎటువంటి ఆస్తులు, ఆదాయం లేకుండా ఉన్నవారి అవసరాలకు అనుగుణంగా సంపూర్ణ వృద్ధాప్య సంరక్షణ నమూనాను అభివృద్ధి చేయాల్సి ఉంటుందనేది మరో సూచన.

నలుగురు కలిసి ఉంటే ఎంతో మేలు..

వృద్ధులైనా డబ్బున్నవారి పరిస్థితి బాగానే ఉంది. డబ్బులేని వారే జీవశ్ఛవాలుగా బతుకీడుస్తున్నారు.

- వృద్ధులకు ఓల్డేజీ హోమ్స్ తప్ప మరో మార్గం లేదు. ఫుడ్ షెల్టర్ ఈ రెండే ఇస్తుంది. కానీ, ఎమోషనల్‌గా ఒంటరితనం ఫీలవుతుంటారు. అందుకే, రీ మ్యారేజ్ ద్వారా మేం ఒక సొల్యూషన్ చూపిస్తున్నాం. లేదంటే, ఒంటరిగా ఉన్న వృద్ధులు ప్రమాదాలకు, దోపిడీలకు గురవుతున్నారు. ఇలాంటప్పుడు నలుగురు వృద్ధులు కలిసి ఒక చోట ఉండవచ్చు. దీని వల్ల ఒంటరితనం పోగొట్టుకోగలుగుతారు.
- అప్పడాలు, వడియాలు వంటివి చేసి, వ్యాపారం చేసుకోవచ్చు. కానీ, 70 ఏళ్ల వయసులో ఏ పనీ చేయడానికి ఓపిక ఉండదు. పెట్టింది తినడం తప్ప ఏ రకమైన ఫిజికల్ స్ట్రెయిన్ పడలేరు. అందుకని, రూమ్మేట్స్ లాగా కలిసి ఉండాలి. అక్కడ చిన్న చిన్న కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవచ్చు, ఇండోర్‌గేమ్స్, స్థానిక పర్యాటక స్థలాలు చూసి రావచ్చు.
- యువత పట్టించుకోదు. మధ్య వయసువారికి కుటుంబ సమస్యలు. సీనియర్ సిటిజన్స్ పట్ల ఎవరికీ జాలి, దయ ఉండదు. వృద్ధులకు ఇచ్చే ఆత్మీయ స్పర్శను ఎంతో ఓదార్పుగా ఫీలవుతారు.
- రాజకీయ వర్గం తరచుగా యువ జనాభాను ఆర్థిక ఆస్తిగా పేర్కొంటుంది. పెరుగుతున్న వృద్ధ జనాభాకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక, సామాజిక మద్దతును అందించడానికి అంతగా ఆసక్తి చూపదు. ఏ రకమైన ఆదాయం లేనివారికి ప్రభుత్వమే వారికో దారి చూపించాల్సి ఉంటుంది. ప్రభుత్వం పెన్షన్ రూపేణ వచ్చే వనరుతోనూ నలుగురు కలిసి ఉండవచ్చు.



– ఎస్.ఎమ్.రాజేశ్వరి, తోడు నీడ స్వచ్ఛంధ సంస్థ, హైదరాబాద్

సేవాపథం

సెక్స్–ట్రాఫికింగ్ సర్వైవర్స్‌కు అండగా నిలబడి వారికి ఒక దారి చూపుతోంది రుచిర గుప్తా. యాంటీ–ట్రాఫికింగ్ యాక్టివిస్ట్, యూఎస్ అడ్వైజర్, విజిటింగ్ ప్రొఫెసర్, 'అప్నే ఆప్' కో–ఫౌండర్, రైటర్ రుచిర ఎందరో బాధితులకు అక్కగా, అండగా నిలబడింది.

చీకటి కూపం నుంచి వెన్నెల దారుల్లోకి



రుచిర

యువ జర్నలిస్ట్‌గా రుచిర గుప్తా నేపాల్‌కు వెళ్లింది. 'సహజ వనరులను గ్రామాలు ఏ రకంగా ఉపయోగించుకుంటున్నాయి' అనే అంశంపై కథనాలు రాయడానికి ఎన్నో గ్రామాలకు వెళ్లింది. సహజవనరులకు సంబంధించిన సమాచారం మాట ఎలా ఉన్నా చాలా గ్రామాల్లో వినిపించిన మాట....

'మా ఊళ్లో కొందరు అమ్మాయిలు కనిపించడంలేదు. వారి ఆచూకి తెలియడం లేదు' మారుమూల హిమాలయ కుగ్రామం అయిన సింధుపాల్‌చౌక్‌లో పేకాట ఆడుతున్న వారిని అమ్మాయిల అదృశ్యం గురించి అడిగింది రుచిర.

'వాళ్లు ముంబైలో ఉన్నారు' అని అసలు విషయం చెప్పారు వాళ్లు.

నేపాల్ నుంచి మన దేశానికి వచ్చిన తరువాత ముంబైలోని రెడ్‌లైట్ ఏరియా కామాటిపురాకు వెళ్లింది రుచిర. అక్కడ చిన్న చిన్న గదుల్లో అమ్మాయిలు బంధించి ఉండటాన్ని గమనించింది. బాధగా అనిపించింది. అయితే ఆమె బాధ దగ్గరే ఆగిపోలేదు. ' వారికోసం ఏదైనా చేయాలి' అని మనసులో గట్టిగా అనుకుంది.

నేపాల్ గ్రామాల నుండి ముంబైలోని వ్యభిచార గృహాలకు యువతులు, బాలికల అక్రమ రవాణాను బహిర్గతం చేయడానికి కెనడియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ కోసం 'ది సెల్లింగ్ ఆఫ్ ఇన్నోసెంట్స్' అనే డాక్యుమెంటరీ తీసింది.

ఈ డాక్యుమెంటరీ కోసం ఎంతోమంది అమ్మాయిలతో మాట్లాడింది. వారు చీకటికూపాల్లో చిక్కుకుపోవడానికి ప్రధాన కారణం...కటిక పేదరికం. ఈ డాక్యుమెంటరీ చేస్తున్నప్పుడు ఆమెపై హత్యా ప్రయత్నాలు కూడా జరిగాయి. ఒకడు కత్తితో పొడవడానికి వచ్చినప్పుడు అక్కడ ఉన్న మహిళలు తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ ఆమెను రక్షించారు.

అవుట్ స్టాండింగ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం కోసం ఇచ్చే ఎమ్మీ అవార్డ్‌ను 'ది సెల్లింగ్ ఆఫ్ ఇన్నోసెంట్స్' గెలుచుకుంది.

అవార్డ్ అందుకుంటున్నప్పుడు చప్పట్ల మధ్య, ప్రకాశవంతమైన దీపాల మధ్య ఆమెకు కనిపించిందల్లా చీకటి కొట్టాలలోని బాధితుల కళ్లు మాత్రమే. 'జర్నలిజంలో నేను మరో మెట్టు పైకి చేరడానికి కాకుండా మార్పుకోసం ఈ డాక్యుమెంటరీ ఉపయోగపడాలని కోరుకున్నాను' అంటుంది రుచిర.

అక్రమ రవాణాపై కఠిన చట్టాలు తీసుకురావడానికి సహాయపడాల్సిందిగా అప్పటి యూఎస్ హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ సెక్రటరీ డోనా షలాలాతో మాట్లాడింది రుచిర. డోనా ద్వారా ఐక్యరాజ్య సమితి సమావేశంలో తన డాక్యుమెంటరీని ప్రదర్శించడమే కాదు వివిధ దేశాలకు చెందిన 180 మంది ప్రతినిధులతో మాట్లాడింది.

ఇరవై రెండు మంది మహిళలతో కలిసి 'అప్నే ఆప్–ఉమెన్ వరల్డ్ వైడ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది రుచిర గుప్తా. అక్రమ రవాణ నిరోధించడానికి, బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందించడానికి ఈ సంస్థ అలుపెరుగని కృషి చేస్తోంది. వ్యభిచారాన్ని'కమర్షియల్ రేప్'గా పిలుస్తున్న 'అప్నే ఆప్' బాధితులకు సంబంధించి విద్య, ఆరోగ్య సంరక్షణ, లైఫ్ స్కిల్స్, చట్టపరమైన రక్షణ, ప్రభుత్వ పథకాలు... మొదలైన వాటిపై దృష్టి పెట్టింది.

ఇప్పటివరకు ఇరవై రెండు వేలమందికి పైగా మహిళలు, బాలికలను వ్యభిచార కూపాల నుంచి బయటికి తీసుకురావడంలో సహాయపడిన రుచిర ఎంతోమంది అమ్మాయిలు చదువుకునేలా చూసింది. సొంత కాళ్ల మీద నిలబడేలా చేసింది.

దేశ, విదేశాలకు చెందిన ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డ్‌లు అందుకుంది రుచిరా గుప్తా. అయితే వాటి కంటే కూడా చీకటి కూపం నుంచి బయటికి వచ్చిన బాధితుల కంట్లో కనిపించే వెలుగే తనకు అతి పెద్ద అవార్డ్‌గా భావిస్తానంటుంది రుచిర.

ఇంటిప్స్

బూట్ల నుంచి దుర్వాసన రావడానికి ప్రధాన కారణం చెమటతో తడిసిన సాక్స్‌ను అలాగే ఉంచడం, తడీపొడిగా ఉన్న సాక్స్‌ను అలాగే ధరించడం. అందువల్ల సాక్స్ తడిగా కాకుండా చూసుకోవాలి.
- బూట్లను ఉపయోగించిన తర్వాత గాలి ఆడేటట్లు బైట పెట్టాలి. సాక్స్‌ను ఎప్పటికప్పుడు ఉతికేసి ఆరేయాలి. కానీ కొందరు వారం రోజుల పాటు ఒకేజత సాక్స్ లను ధరిస్తారు. దీంతో బూట్లనుంచి భరించలేని దుర్వాసన వస్తుంది.
- ముఖ్యంగా బైటకు రాగానే సాక్స్ తీసి పక్కన పెట్టాలి. షూ లేస్‌ను కూడా ఉతికి ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచుకోవాలి. వారానికి ఒకసారి షూస్‌ను కూడా శుభ్రంగా కడిగేసుకోవాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా, వైరస్ ఉండవు.
- నిమ్మకాయ తొక్క లేదా కమలా, నారింజ తొక్కల వంటివి బూట్లలో వేస్తే వాటినుంచి చెడువాసన రాదు. అందుకే రాత్రిపూట కొన్ని నిమ్మ/ నారింజ/ కమలా తొక్కలను బూట్లలో వేసి పొద్దున్నే తీసేయాలి. ఇలా చేస్తుంటే బూట్ల నుంచి దుర్వాసన అనేది ఉండదు.
- తడిగా ఉన్న బూట్లలో బేకింగ్ సోడా వేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇది బూట్లలోని తేమను గ్రహించుకుంటుంది. అందుకే షూస్ వాసన వచ్చినప్పుడు బేకింగ్ సోడా వేస్తుండాలి. కొన్నిరకాల డస్టింగ్ పౌడర్‌లు వేసినా దుర్వాసన రాకుండా ఉంటుంది.



టిప్



బఠాణీతొక్క కూడానూ..

పచ్చిబఠాణీ మనకు ఎంతమేలు చేస్తుందో తెలిసిందే. అయితే బఠాణీ గింజలు తీసి తొక్కలను పారేస్తుంటాము. కానీ ఈ తొక్కలు మొక్కలు చక్కని పోషకాలు అందిస్తాయి. అందుకే తొక్కలను మిక్సీజార్‌లో వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టులో కాసిన్ని నీళ్లు పోసి వడగట్టాలి. ఈ నీటిని గార్డెన్‌లోని మొక్కలకు పోయాలి. ఈ నీరు మొక్కలు మంచి బలవర్థకమైన టానిక్‌లా పనిచేసి చక్కగా పెరిగేందుకు దోహదపడతాయి.

స్ఫూర్తి

సైన్స్‌ను సామాన్యుల దగ్గరికి తీసుకుపోవడానికి 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి ఫాల్కి. 'సైంటిఫిక్ స్టోరీ టెల్లర్'గా దేశవిదేశాల్లో పేరు తెచ్చుకున్న జాహ్నవి సైన్స్‌కు సంబంధించిన డాక్యుమెంటరీలు తీసింది. పుస్తకాలు రాసింది.

జాహ్నవి సామాన్య శాస్త్రం



జాహ్నవి ఫాల్కి

'అడగడం' 'తెలుసుకోవడం' అనే ప్రక్రియ జాహ్నవికి ఎంతో ఇష్టమైనది. ఆమెకు బాగా నచ్చే మాట... రైట్ క్వశ్చన్. రిసెర్చ్ వర్క్ నుంచి కెరీర్‌కు సంబంధించి డైరెక్షన్‌ను మార్చుకోవడం వరకు 'రైట్ క్వశ్చన్' అనేది ఆమెకు ఎంతో ఉపయోగపడింది. అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరకు తీసుకెళ్లింది. అక్కడ భారతదేశ శాస్త్ర సాంకేతిక చరిత్రను అధ్యయనం చేసింది.

ఆ చరిత్రపై బాగా ఇష్టాన్ని పెంచుకుంది.

తాను తెలుసుకున్న విషయాలను, తన అభిప్రాయాలను నలుగురితో పంచుకోవడానికి వివిధ మాధ్యమాలను ఎంచుకుంది.

'బాంబే యూనివర్శిటీ'లో సివిక్స్ అండ్ పాలిటిక్స్ చదువుకున్న జాహ్నవి 'జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో సైన్స్ అండ్ టెక్నాలజీ హిస్టరీలో డాక్టరేట్ చేసింది. సామాజిక శాస్త్రాల అధ్యయనం ద్వారా సామాజిక కోణంలో సైన్స్‌ను అర్థం చేసుకుంది.

ఆమె మాటల్లోనే చెప్పాలంటే 'సైన్స్ అనేది ఒంటరి కాదు'

సైన్స్‌ను ప్రభావితం చేసే అంశాలు సమాజంలో ఎన్నో ఉంటాయి. ఆ అంశాలకు సైన్స్‌కు మధ్య ఉండే అంతః సంబంధాన్ని లోతుగా అధ్యయనం చేసింది.

'ఆటోమిక్ స్టేట్: బిగ్ సైన్స్ ఇన్ ట్వంటీయత్ సెంచరీ ఇండియా సైన్స్' పుస్తకం జాహ్నవికి ఎంతో పేరు తెచ్చింది. 'కీ కాన్సెప్ట్స్ ఇన్ మోడ్రన్ ఇండియన్ స్టడీస్'కు కో–ఎడిటర్‌గా వ్యవహరించింది. 'సైక్లోట్రాన్' పేరుతో సైన్స్ డాక్యుమెంటరీ తీసింది. సైంటిఫిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ద్వారా కథలు చెప్పడం తనకు ఇష్టమైన పని.

'మెనూ గురించి తెలుసుకోవాలంటే మనం మొదట ఉండాల్సింది టేబుల్ దగ్గర' అంటున్న జాహ్నవి 'సైన్స్' అనే మెనూ గురించి తెలుసుకోవడానికి 'సైన్స్ గ్యాలరీ' అనే టేబుల్ దగ్గరికి ప్రజలను తీసుకువస్తుంది.

లండన్‌లోని కింగ్స్ కాలేజీ ఫ్యాకల్టీగా పనిచేసిన జాహ్నవి 2018లో 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ఫౌండింగ్ మెంబర్‌గా నియమితురాలైంది.

ఉరుకుల పరుగుల పోటీ ప్రపంచానికి కాస్త దూరంగా... సృజనాత్మకంగా ఆలోచించేలా, సైన్స్‌కు దగ్గరయ్యేలా యువతను ఆకట్టుకోవడానికి 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి.

'మ్యూజియం' వాతావరణం ఆమెకు కొత్త కాదు. 'సైన్స్ మ్యూజియం లండన్' ఎక్స్‌టర్నల్ క్యూరేటర్‌గా పనిచేసి ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది.

'మా టార్గెట్ ఆడియెన్స్ పదిహేనేళ్ల పైబడిన వారు అయినప్పటికీ అండర్ గ్రాడ్యుయేట్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లపై కూడా దృష్టి సారిస్తాం. అంతరిక్షానికి సంబంధించి సమకాలీన, భవిష్యత్ విషయాలపై దృష్టి పెట్టేలా గ్యాలరీ తోడ్పడుతుంది' అంటుంది జాహ్నవి.

శాస్త్రీయ విషయాలతో యువత మమేకం కావడానికి డిజిటల్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి. 'బ్రేకింగ్ ది వాల్స్ బిట్వీన్ సైన్స్ అండ్ కల్చర్' శీర్షికతో నిర్వహించిన ఆన్‌లైన్ సైన్స్ గ్యాలరీకి కూడా మంచి స్పందన వచ్చింది.

ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ జాహ్నవిని హ్యూమానిటీస్ విభాగంలో 'ఇన్ఫోసిస్ ప్రైజ్'తో సత్కరించింది.

సైన్స్‌ను జాహ్నవి అర్థం చేసుకున్న కోణాన్ని, చేపడుతున్న కార్యక్రమాలను ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ప్రశంసించింది.

• నీటి పంట

షెల్ఫ్‌లో పండిద్దాం





శరవణన్

శరవణన్ తాత సేంద్రియ సేద్యం చేశాడు, తండ్రి కెమికల్ ఫార్మింగ్ వెంట పరుగెత్తి దిగుబడి పెంచాడు. ఆ పరుగునే వారసత్వంగా అందుకున్న శరవణన్ కూడా 2006 వరకు కొనసాగించాడు. ఆ తర్వాత అతడు తన జీవితానికి తానే పరిశోధకుడయ్యాడు. పంట పొలం నుంచి ఇంటి అల్మరాల వరకు సాగిన ప్రయోగాల్లో మొక్కజొన్నను ఇంటిలోపల అరల్లో నీటితో పండిస్తున్నాడు. శరవణన్ ప్రయోగాలకు మెచ్చిన శాస్త్రీయమైన శాస్త్రవేత్తల సమాఖ్య ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అతడిని 'ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డ్'తో సత్కరించింది. శరవణన్ గురించి ఇంకా తెలుసుకోవాలంటే తమిళనాడు, నమక్కల్ జిల్లాలోని 'అరియగౌండమ్ పట్టి' బాట పట్టాల్సిందే.

మట్టిలేని పంట

అది 2005, ప్రభుత్వం వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చేపడుతూ మైక్రో ఇరిగేషన్ విధానాన్ని తెచ్చింది. డ్రిప్, స్ప్రింక్లర్ సాగును పరిచయం చేసింది. అందుకు అవసరమైన పరికరాలను రాయితీతో ఇచ్చింది. అప్పుడు ఓ తొలి అడుగు వేశాడు శరవణన్. అది తనను గేమ్ చేంజర్‌గా మారుస్తుందని ఊహించలేదతడు. ప్రయోగాత్మకంగా ఆచరణలో పెట్టాలనే ఆలోచన అలా ఉండగానే అతడు అప్పటి వరకు సాగు చేస్తున్న రసాయన ఎరువుల పంటను అంతు చిక్కని తెగులు తినేసింది. కృషి విజ్ఞానకేంద్రాల శిక్షణతో కొత్తపంథాలో నడిచాడతడు. వర్మీ కంపోస్ట్, పంచగవ్య, వేపచెక్క వంటి ప్రయోగాలన్నీ చేశాడు. ఆరు ఎకరాల పొలంలో పసుపు, వేరు శనగ, కూరగాయలు పండించాడు. వీటితో పాటు అక్వాకల్చర్, పాడి, కోళ్ల పరిశ్రమ, బయోగ్యాస్ ప్లాంట్‌లను కూడా నిర్వహించాడు. ఒక వ్యర్థాలు మరొక పంటకు ఎరువుగా మారే విధానాలన్నింటినీ ఏర్పాటు చేశాడు. తనకైతే వ్యవసాయ భూమి ఉంది కాబట్టి పాడి పశువులకు కావలసిన గడ్డికి సమస్య లేదు. పొలం లేని వాళ్లు పాడిపరిశ్రమ మీద ఉపాధి పొందేవారి కోసం ఓ ప్రత్యామ్నాయం ఉండాలనుకున్నాడు. ఆ ప్రయోగంలో భాగంగా హైడ్రోఫోనిక్ కల్చర్ మొదలు పెట్టారు. అంటే నీటితో పంటలు పండించే విధానం అన్నమాట. హైడ్రోఫోనిక్ కల్చర్‌లో కూరగాయలు పండించుకునే వాళ్లు సంబంధిత సామగ్రిని ఇంటి పైకప్పు మీద ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు. శరవణన్ అదే ప్రయత్నాన్ని మొక్కజొన్న పంటను ఒక అల్మైరాలో చేసి చూపించాడు. శరవణన్ ప్రయోగాన్ని రైతులకు మోడల్‌గా చూపించింది కృషి విజ్ఞాన్ కేంద్రం. షెల్ఫ్ అరల్లో దశలవారీగా మొక్కజొన్న గింజలను వేస్తూ ఏడాదంతా పాడి పశువులకు పచ్చిగడ్డి అందేలా రూపొందించాడు. రైతులకు సౌకర్యంగా ఉండేటట్లు ఒక కిట్‌ను రూపొందించాడు. అర కేజీ మొక్కజొన్న గింజలతో ఐదుకేజీల గడ్డిని వారం రోజుల్లో సాధించవచ్చు. ఎనిమిదవ రోజు ఆ అరను ఖాళీ చేసి మళ్లీ కొత్తగింజలను వేసుకోవచ్చన్న మాట. ఇంట్లో నాలుగు షెల్ఫ్‌లుంటే చాలు రెండు పాడిగేదెల కడుపు నింపే మేత చేతికొస్తుంది.

విజయవంతమైన ప్రయోగాలు చేయాలంటే పెద్ద పెద్ద చదువులు చదివి ఉండాల్సిన అవసరం లేదు, ఆసక్తి, నిరంతర శ్రమ ఉంటే సాధించవచ్చని నిరూపించాడు శరవణన్. అతడు రైతులకు మార్గదర్శనం చేయడంతోపాటు వ్యవసాయ విద్యార్థులకు పాఠ్యాంశం అవుతున్నాడు.





సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 22 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 14
శనివారం 6-4-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'


ఉప్పల్ స్టేడియంలో హీరో వెంకటేశ్‌తో కలిసి సరదాగా మ్యాచ్‌ను వీక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

రైజర్స్... విన్నర్స్

సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ అలరించింది. డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌పై 6 వికెట్లతో నెగ్గింది. చెన్నై 5 వికెట్లకు 165 పరుగులు చేసింది. సన్‌రైజర్స్ 18.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. 16లో



ఎన్నికల తర్వాత ప్రధాని అభ్యర్థి

సార్వత్రిక ఎన్నికల్లో తమ 'ఇండియా' కూటమి నెగ్గాక ప్రధాని అభ్యర్థిని ఉమ్మడిగా నిర్ణయిస్తామని రాహుల్ గాంధీ తెలిపారు.
- వివరాలు 6లో




ఎన్నికల భారతం చూసొద్దాం!

ప్రపంచమంతా మన ఓట్ల పండుగ వైపు చూస్తోంది. విదేశీ టూరిస్టులు కూడా ఈ కోలాహలాన్ని వీక్షించాలనుకుంటున్నారు.
- వివరాలు 6లో



ప్రపంచంలోనే 'పిన్న' బిలియనీర్

ప్రపంచంలో అత్యంత చిన్న వయసులోనే ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో నిలిచి లివియా అనే టీనేజర్ చరిత్ర సృష్టించింది
- వివరాలు 6లో



అసలైన అభివృద్ధి ముందుంది

పదేళ్లలో జరిగిన దేశాభివృద్ధి ఆకలి పుట్టించే స్టార్టర్ మాత్రమేనని.. అసలైన అభివృద్ధి భోజనం ముందుందని మోదీ అన్నారు.
- వివరాలు 6లో

మళ్లీ పాత తెలంగాణ

మంచినీళ్ల గోసలు, బిందెల కొట్లాటలు, కాలిపోయిన మోటార్లు పునరావృతం

కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫైర్

- పరిపాలించే సామర్థ్యం, శక్తి, తెలివి లేకే కరెంటు, నీటి కొరత
- రాష్ట్రంలో ఇప్పుడు పంట ఎండని, మోటార్లు కాలని జిల్లాలు లేవు
- 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండాయి
- ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు
- చనిపోయిన 209 మంది రైతుల వివరాలు సీఎస్‌కు పంపాం
- వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలి
- ప్రజల్ని మభ్యపెట్టి గద్దెనెక్కారు
- రుణమాఫీ, తులం బంగారం, పింఛన్లు, పంటల బోనస్ ఏమయ్యాయి?
- హామీలు నెరవేర్చేదాకా వదలిపెట్టం... ప్రభుత్వాన్ని వెంటాడతాం...
- కేసీఆర్ బయల్దేరిండు..ఇక ఆగడు.. గద్ద లెక్క వాలుతా.. భరతం పడతా
- వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రు కాల్చి వాతపెట్టాలి
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రెండు మూడురోజుల్లో స్పందిస్తానని వెల్లడి


సిరిసిల్ల జిల్లాలోని బోయిన్‌పల్లిలో ఓ రైతు పొలంలో ఎండిన వరి కంకులను పరిశీలిస్తున్న కేసీఆర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'అమలు సాధ్యం కాని హామీలతో ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి పరిపాలించే సామర్థ్యం, శక్తి లేవు. అందుకే రాష్ట్రంలో వనరులున్నా నీటికి, కరెంటుకు కొరత ఏర్పడుతోంది. కాంగ్రెస్ ఇందిరమ్మ పాలనలో పాత తెలంగాణ పునరావృతమైంది. రాష్ట్రంలో మంచినీళ్ల గోసలు, బిందెల కొట్లాటలు, కాలిపోయిన మోటార్లు.. అవే దృశ్యాలు తిరిగి కనిపిస్తున్నాయి. లత్కోర్, అసమర్థుల రాజ్యంలో ఉన్నాం కాబట్టే, కరెంట్, మిషన్ భగీరథ నడిపే తెలివిలేదు కాబట్టే ఈ పరిస్థితి వచ్చింది. అడ్డగోలు హామీలతో గద్దెనెక్కి ఒక్కటీ నెరవేర్చలేదు. రైతుబంధు, దళితబంధు, కల్యాణలక్ష్మి, తులం బంగారం, వృద్ధాప్య పింఛన్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్, చేనేతల బకాయిలు, బ్రాహ్మణ పరిషత్, గొర్రెల పంపిణీ వంటి పథకాలకు నిధులు కేటాయించడం లేదు. కాంగ్రెస్ ఇచ్చిన ఈ హామీల అమలు కోసం మిగతా 2వ పేజీలో ▶


శుక్రవారం తుక్కుగూడ సభాస్థలి వద్ద ఏర్పాట్లు..

తుక్కుగూడ నుంచే ప్రచార పర్వం

కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం తెలంగాణ నుంచే ప్రారంభం

- నేడు జనజాతర సభ... హాజరుకానున్న రాహుల్.. ఖర్గే, ప్రియాంకల షెడ్యూల్ రద్దు
- సభా వేదికపై తెలుగులో ఎన్నికల మేనిఫెస్టో విడుదల.. తెలంగాణకు ప్రత్యేక హామీలు
- ఏపీలో విలీనమైన 5 గ్రామాలను తెలంగాణలో కలుపుతామనే హామీ కూడా! 8లో
- విపక్షాల నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు.. లిస్ట్‌లో ముగ్గురి నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు!

'పాలమూరు'కు జాతీయ హోదా!

నేటి సభలో తెలంగాణకు 23 ప్రత్యేక హామీలు ఇవ్వనున్న కాంగ్రెస్ పార్టీ

- జాతీయ క్రీడా విశ్వవిద్యాలయం.. ప్రత్యేక ఇండస్ట్రియల్ కారిడార్లు
- ఐటీఐఆర్.. విభజన హామీల అమలు

8లో

ఐదు న్యాయాలు.. 25 గ్యారంటీలు

- రిజర్వేషన్లపై 50% పరిమితి తొలగింపు
- ఎంఎస్పీకి చట్టబద్ధత.. 'అగ్నిపథ్' రద్దు
- కేంద్ర ఉద్యోగాల్లో స్త్రీలకు 50% కోటా

కాంగ్రెస్ మేనిఫెస్టోను విడుదల చేసిన సోనియా, ఖర్గే, రాహుల్ 6లో

న్యూస్‌రీల్

శాంతిస్వరూప్ కన్నుమూత



దూరదర్శన్ చానల్‌లో తొలి తెలుగు యాంకర్‌గా ప్రసిద్ధులు, తెలుగు ప్రజలకు తనదైన శైలిలో వార్తలు వినిపించిన జయంత్ శాంతి స్వరూప్ (74) కన్నుమూశారు. శుక్రవారం ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందారు.
- వివరాలు 12లో

మేనిఫెస్టో పేరిట ఎన్నాళ్లీ మోసం: హరీశ్



ఎన్నికల సమయంలో మేనిఫెస్టోల పేరిట ప్రజలను మోసం చేయొద్దని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి సూచించారు. ఈ మేరకు లేఖ రాశారు.
- వివరాలు 2లో

ఎమ్మెల్సీ కవితను విచారించనున్న సీబీఐ



ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవితను ప్రశ్నించేందుకు సీబీఐకి ప్రత్యేక కోర్టు అనుమతినిచ్చింది. కవిత నుంచి మరింత సమాచారం సేకరించాల్సి ఉన్నందున ప్రశ్నించేందుకు అనుమతి ఇవ్వాలని సీబీఐ శుక్రవారం పిటిషన్ వేయగా కోర్టు అందుకు అంగీకరించింది.
- వివరాలు 7లో



అంతరిక్ష పర్యాటకం సాధ్యమే!

- భవిష్యత్‌లో పూర్తిస్థాయి దేశీయ అంతరిక్ష పరిశోధనలు
- చంద్రయాన్ ల్యాండర్ మన పరిశోధనల సక్సెస్‌కు సూచిక
- సైన్స్‌కు లింగ భేదం లేదు.. పురుషులు, మహిళలు ఉమ్మడి లక్ష్యం కోసం పనిచేస్తున్నారు... ఫిక్కీ కార్యక్రమంలో డీఆర్‌డీఓ, ఇస్రో మహిళా శాస్త్రవేత్తలు టెస్సీ థామస్, కల్పన కాళహస్తి 14లో


టెస్సీ థామస్

జూన్‌లో జాబ్‌ల జాతర

- ఈసారి అన్ని నియామకాలు టీఎస్‌పీఎస్సీ ద్వారానే...
- గ్రూప్–4తో పాటు, వివిధ కేటగిరీల్లో తుది ఎంపిక జాబితాలు
- అనంతరం ప్రత్యేక కార్యక్రమం ద్వారా నియామకపత్రాల అందజేత
- టీఆర్ఈఐఆర్‌బీ ద్వారా పెండింగ్‌లో ఉన్న పత్రాలు కూడా పంపిణీ

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగాల భర్తీలో భాగంగా జూన్ నెలలో అపాయింట్‌మెంట్, పోస్టింగ్‌లు ఇచ్చేందుకు టీఎస్‌పీఎస్సీ కసరత్తు చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగియగానే జాబ్‌ల జాతరకు లైన్‌క్లియర్ కానుంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో గ్రూప్–4 కేటగిరీలో 9వేల ఉద్యోగాలకు సంబంధించి ఇప్పటికే జనరల్ ర్యాంకింగ్ లిస్ట్(జీఆర్ఎల్)ను టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. దీంతో పాటు అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మిగతా 12వ పేజీలో ▶

నేడు బీజేపీ టిఫిన్ బాక్స్ బైఠక్‌లు

- సంస్థాపక దినోత్సవం సందర్భంగా పోలింగ్ బూత్ కేంద్రాల్లో నిర్వహణ
- ఎవరి అల్పాహారం వారే తెచ్చుకోనున్న నేతలు, కార్యకర్తలు
- లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధత, పార్టీ కార్యక్రమాలపై చర్చ
- కేడర్ మధ్య సమన్వయం పెరుగుతుందని భావిస్తున్న నాయకత్వం

12లో


శుక్రవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్షలో మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి - వివరాలు 12లో

5 జిల్లాల్లో 43 డిగ్రీల పైనే..

- రాష్ట్రంలో భగ్గుమంటున్న ఎండలు
- వడదెబ్బకు ఐదుగురు మృతి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/ సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. శుక్రవారం నల్లగొండ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లాలో 43.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, జోగుళాంబ గద్వాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 43.3 డిగ్రీల సెల్సియస్, సంగారెడ్డిలో 43.2 డిగ్రీలు, ఆదిలాబాద్‌లో 43 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నల్లగొండ జిల్లాలోని 18 మండలాలకు చెందిన 20 గ్రామాల్లో 43 డిగ్రీలు దాటిపోయింది. ఈ జిల్లాలోని మాడుగులపల్లి మండల కేంద్రంతోపాటు మునుగోడు మండలం గూడాపూర్‌లో 43.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దామరచర్ల మండల కేంద్రం, అనుముల మండలం ఇబ్రహీంపేట, కనగల్ మండల కేంద్రం, మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామాల్లో 43.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు ఎండలు తీవ్రం కావడంతో వడదెబ్బ కారణంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మిగతా 14వ పేజీలో ▶

మధ్యాహ్నం వేళ.. బయటకు రావొద్దు

- ఎండల నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి
- ప్రజలకు వైద్య, ఆరోగ్యశాఖ సూచనలు

- వివరాలు 14లో

ఇదంజగత్



మేనిఫెస్టో మొత్తం చదివి వినిపిద్దామనా, ఓటరుతో చెలగాటమా??

క్లుప్తంగా...

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

సీఎం రేవంత్, దీపాదాస్ మున్షీల సమక్షంలో కండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే



సీఎం రేవంత్‌రెడ్డితో కూన శ్రీశైలంగౌడ్. చిత్రంలో దీపాదాస్ మున్షీ, శ్రీధర్‌బాబు, పట్నం మహేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేత, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం ఆయన జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీల సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి సలహా దారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నేతలు కొలన్ హన్మంతరెడ్డి, భూపతిరెడ్డి నర్సారెడ్డి, చరణ్‌కౌశిక్ యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి తదితరులు ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి దండోరా ఉద్యమకారులు

మాదిగ దండోరా ఉద్యమానికి చెందిన 100 మందికిపైగా నాయకులు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. దేవని సతీశ్ మాదిగ, చింత స్వామి మాదిగల ఆధ్వర్యంలో ఉమ్మడి 10 జిల్లాల నుంచి వచ్చిన దండోరా నేతలకు జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కాంగ్రెస్ కండువాలు కప్పారు. ఈ సందర్భంగా సతీశ్, స్వామి మాదిగలు మాట్లాడు తూ తెలంగాణ అంతటా మాదిగల మద్దతు కూడగట్టి పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తామని అన్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టే పార్టీకే మద్దతు

రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య




కాచిగూడ (హైదరాబాద్): పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టే పార్టీకే బీసీల మద్దతు ఉంటుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ జూన్‌లో పార్లమెంట్ వద్ద ప్రదర్శన, పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో టికెట్ల కేటాయింపులో, నామినేటెడ్ పదవుల కేటాయింపుల్లో బీసీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. బీసీ కార్పొరేషన్ బడ్జెట్ ఏటా రూ.50 వేల కోట్లు కేటాయించి ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు 80% సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ రైతు దీక్షలు

సాక్షి, హైదరాబాద్: కరువు పరిస్థితుల్లో అల్లాడుతున్న రాష్ట్ర రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్న డిమాండ్‌తో భారత రాష్ట్ర సమితి శనివారం రాష్ట్ర వ్యాప్తంగా రైతు దీక్షలు చేపట్టాలని నిర్ణయించింది. పార్టీ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు శనివారం అన్ని జిల్లా నియోజకవర్గ కేంద్రాల్లో ఉదయం 11 గంటలకు రైతు దీక్షలో మొదలవుతాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ వద్ద జరిగే రైతు దీక్షలో పాల్గొంటారు. సిద్దిపేటలో హరీశ్‌రావు, సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డి, పాలకుర్తిలో ఎర్రబెల్లి దయాకర్‌రావు దీక్షల్లో పాల్గొంటారు. రైతుల ను ఆదుకోవాలని ఈ నెల 2న పార్టీ నేతలు జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేయడం తెలిసిందే.

కేసీఆర్‌కు ఇంకా బుద్ధి రాలేదు: నిరంజన్



సాక్షి, హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా బుద్ధి రాలేదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ విమర్శించారు. సిరిసిల్ల ప్రెస్‌మీట్‌లో కేటీఆర్ మాట్లాడిన భాష ఎన్నికల నియమావళికి విరుద్ధమని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, తమ పార్టీ నేతలను దూషిస్తూ ఆయన మాట్లాడిన భాషపై ఎన్నికల అధికారులు నివేదిక తెప్పించుకుని కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ తాను మాట్లాడే తీరును మార్చుకోవాలని హితవు పలికారు. కూతురు జైలు పాలైందన్న బాధలో ఆయన ప్రజలను రెచ్చగొట్టేలా శృతి తప్పి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. చేసిన తప్పిదాలకు ప్రజలకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి.. రెచ్చగొట్టేలా మాట్లాడడం సరైంది కాదని హితవు పలికారు.

మేనిఫెస్టో పేరిట ఎన్నాళ్లు మోసం?

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బీఆర్‌ఎస్ నేత హరీశ్ లేఖ

- హామీలిచ్చి అమలును విస్మరించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటే!
- పార్టీ మారితే పదవి పోయేలా చట్టం చేస్తామనడం హాస్యాస్పదం
- నైతికత, పార్టీ ఫిరాయింపుల గురించి కాంగ్రెస్ ప్రకటనలు సిగ్గుచేటు



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో మేనిఫెస్టోల పేరిట ప్రజలను మోసం చేయొద్దని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి సూచించారు. మేనిఫెస్టోల పేరుతో మోసపూరిత హామీలు ఇచ్చి ఓట్లు దండుకోవడం, ఆ తర్వాత విస్మరించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటేనని విమర్శించారు. పార్టీని మారిన వెంటనే పదవి పోయేలా చట్టం తెస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ గాంధీని ఉద్దేశించి శుక్రవారం హరీశ్‌రావు లేఖ రాశారు. 'ఉమ్మడి ఏపీలో 2004, 2009 ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చినా అమలు చేయలేదు. అదే తరహాలో గత ఏడాది జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనూ అనేక హామీలు ఇచ్చి విస్మరించారు. కేంద్రంలో, రాష్ట్రంలో అనేకమార్లు మాట తప్పి ఏ ధైర్యంతో మేనిఫెస్టో విడుదల చేస్తున్నారో అర్థం కావడం లేదు' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

ఎన్ని సార్లైనా మోసం చేయొచ్చనే మీ ధైర్యానికి..

'రాజ్యాంగ పరిరక్షణ చాప్టర్ లోని 13వ పాయింట్ కింద ప్రజా ప్రతినిధులు ఎవరైనా పార్టీ మారితే, ఆ వెంటనే సభ్యత్వం పోయేలా చట్టం చేస్తామని తాజా మేనిఫెస్టోలో హామీనిచ్చారు. కానీ తెలంగాణలో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను చేర్చుకుని వారికే ఎంపీ టికెట్లు కూడా ఇచ్చారు. మేనిఫెస్టోలో చెప్పిన నీతులకు, అధికారంలో ఉండి చేస్తున్న చేతలకు ఏమాత్రం పొంతన లేదు. ప్రజలను ఎన్నిసార్లైనా మోసం చేసి గెలవవచ్చు అనే మీ మొండి ధైర్యానికి ఆశ్చర్యం కలుగుతోంది' అని పేర్కొన్నారు. 'తెలంగాణ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు ఓట్లేశారు. డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసే సందర్భంగా కూడా ఆరు హామీలకు చట్టబద్ధత కల్పించే పత్రంపై మీ సంతకాలు చేసినా ఆ హామీలేవీ రాష్ట్రంలో అమలు కావడం లేదు' అని ఆరోపించారు.

మీకు కొత్తహామీలిచ్చే హక్కు లేదు

'మహాలక్ష్మి పేరుతో కాంగ్రెస్ పార్టీ మహిళలకు మహా మోసం తలపెట్టింది. రైతులను దగా చేసి వారికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నట్టేట ముంచింది. రూ.2లక్షల రుణమాఫీపై తుక్కుగూడ సభలో స్పష్టమైన ప్రకటన చేయాలని రైతుల పక్షాన కోరుతున్నాను. ఎకరాకు రూ.15వేల రైతుబంధు సాయం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. క్వింటాలకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామనే బోగస్ మాటలతో మీ పార్టీ తమాషా చేస్తోంది. వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇలా ప్రతీ హామీ బూటకమని తేలింది. మీ పార్టీ అధికారంలోకి వంద రోజుల్లోనే 210 మంది రైతులు మరణించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు మళ్ళీ కష్టాలు మొదలుకావడానికి కారకులైన మీరు, మీ పార్టీ క్షమాపణలు చెప్పాలి. హామీల అమలులో శ్రద్ధ లేని మీకు మళ్ళీ కొత్త హామీలను ఇచ్చే నైతిక హక్కు లేదు. తెలంగాణ ప్రజలను మళ్లీ మళ్లీ మోసం చేయాలనుకునే మీ ఎత్తుగడలు ఇక ముందు సాగవు' అని హరీశ్‌రావు తన లేఖలో హెచ్చరించారు.

మళ్లీ పాత తెలంగాణ





సిరిసిల్ల జిల్లా శబాష్‌పల్లి బ్రిడ్జిపై నుంచి మిడ్‌మానేరు డ్యామ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

వెంటపడతాం. ఆయా పథకాల లబ్ధిదారులు కూడా వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీకి కర్రు కాల్చి వాతపెట్టాలి. రైతుబంధుకు నిధులు ఇవ్వకుండా, రుణమాఫీ చేయకుండా తమ తాబేదార్లకు బిల్లులు విడుదల చేసి రైతుల నోట్లో మట్టి కొట్టారు. కాళేశ్వరం గురించి ఈ ప్రభుత్వానికి అసలేమీ తెలియదు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు. ఇంతకాలం కొత్త ప్రభుత్వం మీద విమర్శలు చేయకూడదని ఆగాం. కానీ ఇక ఆగేది లేదు..' అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎండిన పంటలను పరిశీలించేందుకు 'పొలం బాట' చేపట్టిన కేసీఆర్.. శుక్రవారం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో పంటలు, ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సాధారణం కంటే అధిక వర్షం కురిసినా..

'మానేరు వాగు, వరద కాలువ, ఎల్లంపల్లి, గోదావరి నదులు.. నాలుగు సజీవ జలధారలను జిల్లా ప్రజలు అనుభవించారు. కరీంనగర్ లక్షల టన్నుల ధాన్యం పండించింది. అలాంటిదాన్ని నాలుగు నెలల్లోనే ఎడారిగా మార్చారు. కరీంనగర్, సిద్దిపేట ప్రజల దాహార్తి తీర్చిన ఎల్ఎండీలో నీటి కటకట. ఎడారిని తలపిస్తూ స్మశానంలా మారింది. రోజూ తాగునీరు వచ్చే కరీంనగర్‌లో రోజు విడిచి రోజు నీళ్లు వస్తున్నాయి. గోదావరి బేసిన్‌లో ఉన్న కరీంనగర్, ఇతర జిల్లాలకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది? రాష్ట్రవ్యాప్తంగా 15 నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. తెలంగాణలో ఇపుడు పంట ఎండని, మోటార్లు కాలని జిల్లాలు లేవు.

ఎకరానికి రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలి

వాస్తవానికి ఈసారి తెలంగాణలో సాధారణం కంటే అధిక వర్షపాతం కురిసింది. నీటిని నిల్వ చేసుకునే, వాడుకునే తెలివిలేక, నాణ్యమైన కరెంటు సరఫరా చేయక పోవడం వల్ల పంటలు ఎండినయ్. ఎండిన పంటకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలి. రైతుబంధు ఇప్పటికీ పూర్తిగా వేయలేదు. వంద రోజుల్లో 200 మంది రైతులు చనిపోయారంటే సీఎం లిస్టు ఇమ్మన్నాడు. మేం 209 మంది వివరాలు సీఎస్‌కు పంపాం. కానీ ఇప్పటికీ ఉలుకు పలుకూ లేదు. వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇచ్చి, పరామర్శించే దాకా వదలం..' అని కేసీఆర్ అన్నారు.

నేను వస్తున్నా అనగానే నీళ్లిస్తున్నారు..

'తెలంగాణలో వ్యవసాయ సంక్షోభానికి ప్రభుత్వ తీరే కారణం. నేను నల్లగొండకు వెళ్తున్నా అనగానే.. సాగర్ నుంచి, కరీంనగర్‌కి వస్తున్నా అనగానే.. కాళేశ్వరం నుంచి నీళ్లు ఇస్తున్నారు. అదేంటి అంటే కేసీఆర్ మాకు చెప్పలేదు అంటున్నారు.. సీఎం నువ్వా? నేనా? సీఎంగా నువ్వు, నీ యంత్రాంగం ఏం చేస్తున్నాయి? ఒక 25 రోజుల ముందు నీళ్లు ఇచ్చి ఉంటే.. నల్లగొండ, కరీంనగర్‌లో పంటలు ఎండేవి కావు. రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని రైతులను పరుగులు పెట్టించి ఎందుకు రుణమాఫీ చేయడం లేదు? బ్యాంకర్ల నుంచి రైతులకు నోటీసులు వస్తుంటే ఉలుకూ పలుకూ లేదెందుకు?..' అని మాజీ సీఎం నిలదీశారు.

సీఎంకు తులం బంగారం దొరకడం లేదా?

'నాలుగు నెలల్లో పథకాలను ఆగమాగం చేశారు. గొర్రెల పంపిణీ బంద్ అయింది. 1.30 లక్షల మందికి దళితబంధు రెండో విడత నిలిపివేశారు. రూ.12 లక్షలిస్తామని చెప్పి ఇవ్వలే. కళ్యాణలక్ష్మీ పథకంలో తులం బంగారం ఇస్తామన్నారు.. తులం బంగారం సీఎంకు దొరకడం లేదా? ఇంట్లో ఇద్దరికీ వద్ధాప్య పింఛన్ ఇస్తామని చెప్పి 30 లక్షల మంది కుటుంబాలకు ప్రతి పింఛన్ మీద రూ. 24,000 చొప్పున బకాయి పడ్డారు. కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని మోసం చేశారు, మహాలక్ష్మీ లేదు మన్నూ లేదు. ప్రతి మహిళకు రూ.2 వేలిస్తామని శఠగోపం పెట్టారు..' అని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

చేనేతలు పులులై తరిమి కొడతరు

'ఒకప్పుడు సిరిసిల్లలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు చూసి చలించిన నేను భిక్షాటన చేసి వారి కుటుంబాలను ఆదుకున్నా. తెలంగాణ వచ్చాక చేనేతలకు చేతినిండా పని కల్పించాం. రంజాన్, బతుకమ్మ, స్కూలు యూనిఫామ్‌లు అంటూ పని ఇచ్చాం. వారు కష్టం చేసి ప్రభుత్వానికే పంపారు. వీటికి సంబంధించిన బకాయిలు రూ.300 కోట్లు ఇస్తలేరు. ఈ విషయంపై కోర్టుకు పోతాం. సిరిసిల్లలో ధర్నా చేస్తాం. రైతుబంధు అడిగితే చెప్పుతో కొట్టాలని ఓ మంత్రి అంటాడా? చేనేత కార్మికులు నిరోధ్‌లు అమ్ముకోవాలని అంటారా? చేనేతలు పులులై తరిమి కొడతరు..' అని కేసీఆర్ హెచ్చరించారు.

మేం వ్యవసాయానికి ఊపిరిలూదాం

'మేం అస్తవ్యస్తమైన తెలంగాణ రైతు ఆర్థిక స్థితిని తిరిగి గాడిన పెట్టాం. రైతుబంధు పథకంతో వలస వెళ్లిన రైతులను గ్రామాలకు వచ్చేలా చేసి వ్యవసాయానికి ఊపిరిలూదాం. మీరు తాబేదార్లకు బిల్లులు చెల్లించి రైతుల నోట్ల మట్టి కొట్టారు. ఇపుడు రైతుల అప్పుల పాలై వడ్డీలు కడుతున్నారు. మేము రాష్ట్రంలో విద్యుత్ సామర్థ్యాన్ని 7,600 మెగావాట్ల నుంచి 18,600 మెగావాట్లకు తీసుకుపోయినా ఎందుకు కొరత వస్తోంది? దీనికి కూడా కేసీఆర్ చెప్పలేదు అంటారా?..' అని కేసీఆర్ ఎద్దేవా చేశారు.

50 వేలమంది రైతులతో మేడిగడ్డకు పోతా..

'కాళేశ్వరం గురించి ఈ ప్రభుత్వానికి తోకా తొండం తెల్వదు. మేడిగడ్డ బ్యారేజీ మీద మూడు పిల్లర్లు కుంగిపోయినయి. కాంగ్రెస్ హయాంలోనూ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయ్. 25 సెం.మీల వానకు ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి కంపెనీ కట్టిన ఎంఎండీ కొట్టుకుపోయింది. మేము కోమటిరెడ్డి కంపెనీ మీద కేసు పెట్టలేదు. నిండ నింపి గంగమ్మ లెక్క చేసినం.. అందుకే ఎండాకాలంలోనూ చెరువులు మత్తళ్లు దుంకినయ్. జూన్‌లో 25 వేల క్యూసెక్కుల వరద వస్తుంది. ఈసారి నీటిని ఎత్తిపోయకుంటే నేను 50 వేలమంది రైతులతో మేడిగడ్డ వద్దకు పోయి పండవెట్టి తొక్కుతా. కేవలం కేసీఆర్‌ను బద్నాం చేయాలనే కుట్రతో చిన్న ఇంజినీరింగ్ లోపాన్ని పెద్దది చేసి చూపే విఫల యత్నం చేశారు..' అని కేసీఆర్ ధ్వజమెత్తారు.



మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో గంగుల కమలాకర్, వినోద్, కేటీఆర్ తదితరులు

రాజధానిలో ట్యాంకర్లా?

'హైదరాబాద్‌లోని ప్రతి పేదవారి ఇంట్లో నల్లా ఉండాలన్న లక్ష్యంతో, రూ.1కే నల్లా కింద అందరికీ నల్లాలు ఇచ్చినం. బిందెలు కనబడకుండా చేసినం. కానీ ఇపుడు బిందెలు, ట్యాంకర్లు కనిపిస్తున్నయ్. దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలి. కేసీఆర్ బయల్దేరిండు. ఇక ఆగడు..గద్ద లెక్క వాలుతా.. మీ భరతం పడతాం .. మెడలు వంచుతాం..' అని మాజీ సీఎం స్పష్టం చేశారు. ఫసల్ బీమా యోజన గుజరాత్ లోనే లేదని, అసలు బీజేపీకి ఓ విధానం లేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రెండు, మూడురోజుల్లో ఖచ్చితంగా స్పష్టమైన జవాబు ఇస్తానని తెలిపారు.

ఉద్యోగులకు ఒకటో తేదీన వేతనం ఏమైంది?

- నాలుగు నెలల పాలనలో అన్ని వర్గాలకు మోసం
- ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజం



స్క్రీన్‌పై నాటి ఎన్నికల వీడియో క్లిప్పింగ్‌ను చూపుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్/పాపన్నపేట: వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా గజ్వేల్, పాపన్నపేట, చిన్నశంకరంపేట మండలాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో అన్నివర్గాలకు మోసం జరిగిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయు లకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు వేస్తామని చెప్పిన ప్రభుత్వం.. మాట నిలుపుకోవడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఎన్నికల కోడ్ రాకముందే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కావాల్సినంత సమయమున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని అన్నారు. మార్చి 31న పదవీ విరమణ పొందనున్న ఉద్యోగులకు అందాల్సిన డబ్బులను బాండ్ల రూపంలో ఇస్తారని లీకులు వస్తున్నాయని చెప్పారు. కాగా, రాష్ట్రంలో బీజేపీ ఉనికే లేదని.. కేవలం రాముడిని చూపుతూ ఆ పార్టీ ఓట్లు పొందాలని ప్రయత్నిస్తోందని అన్నారు.

వీడియోలతో విమర్శనాస్త్రాలు

బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం వినూత్నంగా సాగుతోంది. శుక్రవారం పాపన్నపేట మండలం కొత్తపల్లిలో ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశంలో వీడియో క్లిప్పింగ్‌లు ప్రదర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీల వీడియో క్లిప్పింగ్‌లను చూపుతూ.. ఇవి అమలు అయ్యాయా అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- బీజేపీలో చేరిన ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్



తాడూరి శ్రీనివాస్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కిషన్‌రెడ్డి. చిత్రంలో ఈటల

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదని, ఏం చేశారని మీటింగ్‌లు పెట్టి ఓట్లు అడుగుతారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చింది. యూత్ డిక్లరేషన్, రైతు డిక్లరేషన్, మహిళా డిక్లరేషన్ పేరుతో హామీలు ఇచ్చి కాంగ్రెస్ మోసం చేసింది. వంద రోజుల్లో అమలు చేస్తామన్న హామీలు ఏమయ్యాయి? ఇప్పుడు వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం మసిపూసి మారేడు కాయ చేసే ప్రయత్నం చేస్తోంది'అని విమర్శించారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత తాడూరి శ్రీనివాస్‌తో పాటు ఉప్పల్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో 17 ఎంపీ సీట్లు కాంగ్రెస్ గెలవాలని, రాహుల్ గాంధీ ప్రధాని కావాలని.. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని, అప్పుడే హామీలు అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పరోక్షంగా చెబుతున్నారన్నారు. 'రాహుల్ ప్రధాని కాలేరు, కాంగ్రెస్ గ్యారంటీలను అమలు చేయలేదు'అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో కరెంటు కోతలున్నాయని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా కరెంటు కోతలు ఉన్నాయా? అని ప్రశ్నించారు. తెలంగాణలో అత్యధిక ఎంపీ సీట్లు బీజేపీకి రాబోతున్నాయని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు, పార్టీ అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు అరెస్టు భయం.. అందుకే యాత్రలు

- ఫోన్ ట్యాపింగ్ కేసులో శిక్ష ఖాయమనే జనంలో సానుభూతికి రాజకీయ టూర్లు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టు భయంతో ప్రజల్లో సానుభూతి కోసమే కేసీఆర్ రాజకీయ యాత్రలు చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఆ కేసులో సంబంధిత చట్టం ప్రకారం మూడేళ్ల జైలుశిక్ష పడే అవకాశం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, వరుసగా రెండేళ్లు జైలు శిక్ష పడితే ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసే వీలుండదని, ఇక కేసీఆర్ రాజకీయాలు వదిలేస్తే మంచిదని సూచించారు. అరెస్టు భయంతోనే ఇప్పుడు కేసీఆర్ యాత్రలు చేస్తున్నారే తప్పించి ఏనాడూ ప్రజల గురించి చిత్తశుద్ధితో పనిచేయలేదని గుర్తు చేశారు. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవాలపై తాను కేసీఆర్‌ను నిలదీస్తే, కేసీఆర్ తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తనకు వారిలా బూర్జుఖలీఫాలో ఇల్లు లేదనీ, ఇప్పటికీ కిరాయి ఇంట్లోనే ఉంటున్నానని వెల్లడించారు. 'నాకు కంపెనీ ఉంటే నిరూపించాలని, గాలిమా టలతో తప్పుడు ఆరోపణలు చేయటం సరికాదు. నీలా తప్పులు చేసే వ్యక్తిని కాదు, నా గురించి మాట్లాడేముందు ఓసారి ఆలోచించుకుని మాట్లాడాలి' అని సూచించారు.

వర్షాభావం కాంగ్రెస్ వైఫల్యమా: పొంగులేటి

వర్షాభావ పరిస్థితులను, ప్రకృతి వైపరీత్యాన్ని ప్రభుత్వ వైఫల్యంగా చూపేందుకు కేసీఆర్ శతవిధాలా ప్రయత్నిస్తున్నారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. తొమ్మిదిన్నరేళ్లు సీఎంగా ఉండి, తన హయాంలో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతే ఏనాడూ పంటపొలాలకు వెళ్లి రైతులను పరామర్శించని కేసీఆర్‌కు అధికారం పోగానే రైతులు గుర్తుకొచ్చారని ఎద్దేవా చేశారు. కరీంనగర్ వరకు వచ్చిన కేసీఆర్, పక్కనే ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టులోని దెబ్బతిన్న పిల్లర్లను కూడా సందర్శించి ఉంటే బాగుండేదని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చేతి కర్రతోనే పొలం బాట

- కరీంనగర్, సిరిసిల్లలో ఎండిన పంటలను పరిశీలించిన కేసీఆర్
- ముగ్దుంపూర్, బోయినపల్లి రైతులతో మాటామంతీ
- సాగునీళ్లు అందకే పంటలు ఎండిపోయాయన్న రైతులు



ముగ్దుంపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కేసీఆర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్ / కరీంనగర్ రూరల్ / సిరిసిల్ల: సాగునీటి కొరత వల్ల ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. ఎండిన పంటలకు ప్రభుత్వం ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వకపోతే మేడిగడ్డ వద్ద రైతులతో ధర్నాకు దిగుతానని చెప్పారు. పొలంబాటలో భాగంగా శుక్రవారం ఆయన కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల్లో పర్యటించారు. తుంటి ఎముకకు ఆపరేషన్ అయిన నేపథ్యంలో ఆయన చేతికర్ర సాయంతోనే పంట పొలాల్లో నడిచారు. ఉదయం ఎర్రవెల్లి ఫాంహౌస్ నుంచి భారీ కాన్వాయ్‌తో రోడ్డు మార్గాన బయల్దేరిన ఆయనకు బెజ్జంకి వద్ద గులాబీ నేతలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి భారీగా అనుచరులు వెంటరాగా కరీంనగర్ రూరల్ మండలం ముగ్దుంపూర్‌లో రైతు కొలగాని తిరుపతి పొలంలో ఎండిన వరి పంటను పరిశీలించారు. సాగునీరు అందక పంటలు ఎండిపోయాయని రైతులు ఈ సందర్భంగా ఆయనకు విన్నవించారు. మాజీ మంత్రి గంగుల కమలాకర్ ఇంట్లో భోజనానంతరం.. సిరిసిల్లకు వెళ్లే మార్గంలో వెదిర వద్ద రైతులను పలకరించారు. ఆ తరువాత సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో రైతు గంగు రమేశ్ పొలంలో ఎండిన పంటను, ఎండిన మిడ్ మానేరు జలాశయాన్ని పరిశీలించారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, మాజీ ఎంపీ వినోద్, సీనియర్ నేతలు తుల ఉమ, నారదాసు లక్ష్మణరావు, రవీందర్‌సింగ్, మేయర్ సునీల్‌రావు తదితరులు ఉన్నారు.

సీఏఏ అమలు చేయకపోతే రాష్ట్రపతి పాలన


నిజామాబాద్ ఎంపీ అర్వింద్



సుభాష్‌నగర్ (నిజామాబాద్ అర్బన్): రాష్ట్రంలో సీఏఏ, ఎన్ఆర్‌సీ అమలు చేయకపోతే రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి పాలన పెడతామని ఎంపీ అర్వింద్ ధర్మపురి తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సమస్యలపై నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో ఆయన మాట్లాడారు. సీఏఏ, ఎన్ఆర్‌సీ అమలు చేయబోమంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. సీఏఏ, ఎన్ఆర్ సీలకు వ్యతిరేకంగా ఇంకా ఎక్కువ మా ట్లాడితే తిహార్ జైల్లో వేస్తామని అర్వింద్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ హిందువులను శత్రువులుగా చూస్తోందన్నారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి జగిత్యాలలో పీఎఫ్ఐ, టెర్రరిస్టు కార్యకలాపాలను ప్రోత్సహి స్తున్నారని ఆరో పించారు. పసుపు బోర్డు ఏర్పా టైనట్లు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందని, ఇందూరులోనే బోర్డు కార్యాలయం ఏర్పాటవుతుందని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నిజామాబాద్ పార్లమెంట్ ప్రభారి వెంకటరమణి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ద్రోహులను ఇంటికి సాగనంపాలి

బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



అచ్చంపేట రూరల్: కాంగ్రెస్ గేట్లు తెరిస్తే తెలంగాణ ద్రోహులు మాత్రమే ఆ పార్టీలో చేరారని, తెలంగాణకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్ నాయకులను ఇంటికి సాగనంపాలని బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తోందని, ఇక నుంచి ఆకలి పోరాటం ఆగదని పేర్కొన్నారు. అచ్చంపేటలోని శుక్రవారం ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తప్పుడు హామీలను నమ్మి ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డికి పట్టం కట్టారని, అధికార పీఠాన్ని ఎక్కిన రేవంత్ మూడు నెలల్లోనే బంగారు తెలంగాణను బంజరు తెలంగాణగా మార్చారని విమర్శించారు. ప్రజలకు తాగునీరు అందించలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వం విషపు నీళ్లు అందించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని నీటి ట్యాంకులో కోతులు పడి చనిపోయిన నీటినే సరఫరా చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. తాను రూ.వెయ్యి కోట్ల ప్యాకేజీకి బీఆర్‌ఎస్‌లో చేరానని ఆరోపిస్తున్నారని, ప్యాకేజీ కోసమైతే కాంగ్రెస్‌లోనే చేరేవాడినని తెలిపారు. తాను కిరాయి ఇంట్లోనే ఉంటున్నానని, ఎంపీకి జీతం కేవలం రూ.లక్ష వస్తుందని, తనకు వచ్చే రూ.2.63 లక్షల జీతం వదులుకుని రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు.


LIVESMART
SMART BAZAAR
జరుపుకోండి ఉగాది స్మార్ట్ తో
టి-షర్ట్స్ ₹149
ఫ్యాషన్ కుర్తాస్ ప్రారంభ ధర ₹499
పోలో టీ-షర్ట్స్ ₹299
కుర్తా ₹399
షర్ట్స్ ₹299
షార్ట్స్ ₹399
షర్ట్ ₹299
ఫ్రాక్స్ ₹499
కుర్తా ₹399
టి-షర్ట్స్ ₹149
జీన్స్ ₹299
డ్రెసెస్ ₹499
టాప్స్ ₹399
ఫ్యాషన్ కుర్తాస్ ప్రారంభ ధర ₹499
టి-షర్ట్స్ ₹299
జీన్స్ ₹599
SMART BAZAAR
SMART SUPERSTORE
కూకట్‌పల్లి: CMR కాంప్లెక్స్, కూకట్‌పల్లి మెట్రో స్టేషన్ పక్కన. పంజాగుట్ట: గలేరియా మాల్, పంజాగుట్ట మెట్రో స్టేషన్ పక్కన, హైదరాబాద్: అరిహంత్ టవర్ సంతోష్‌నగర్, క్రాస్ రోడ్ దగ్గర. తార్నాక: ఇన్నర్ రింగ్ రోడ్ ఆరాధన 70mm థియేటర్ ఎదురుగా. కొంపల్లి: రన్‌వే 9 దగ్గర, కుత్బుల్లాపూర్, కొంపల్లి రోడ్. మాదాపూర్: ఇనార్బిట్ మాల్, ఎల్1. అబిడ్స్: MPM మాల్, GPO ఎదురుగా, అబిడ్స్ X రోడ్. కాచిగూడ: మహేశ్వరి పరమేశ్వరి టవర్స్, కాచిగూడ ఎక్స్ రోడ్. అమీర్‌పేట్: GS 24 క్యారెట్ బిల్డింగ్, మెయిన్ రోడ్. గుడిమల్కాపూర్: కింగ్స్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ పక్కన, గుడిమల్కాపూర్ రోడ్. తిరుమలగిరి: మిలటరీ డెయిరీ ఫామ్ రోడ్ సుభాష్ నగర్ బస్టాప్. మియాపూర్: మెయిన్ రోడ్ మియాపూర్ బస్టాప్, మియాపూర్ ఎక్స్ రోడ్స్. టోలిచౌకి: సలార్‌పురియా సత్వ మాగ్నస్, బ్లాక్ A, టోలిచౌకి రోడ్ షేక్‌పేట ఫ్లైఓవర్ కింద. గచ్చిబౌలి: గచ్చిబౌలి ఫ్లైఓవర్ పక్కన. పాత అల్వాల్: IG విగ్రహం దగ్గర, CYSR గార్డెన్స్. కూకట్‌పల్లి: యశోద గార్డెన్స్, శాంతినగర్. వాంబ్రాయబగుట్ట: బార్కాస్ రోడ్ భారత్ పెట్రోల్ పంప్ దగ్గర. శంషాబాద్: బస్టాండ్ కాలనీ, RB నగర్. బండ్లగూడ: HP పెట్రోల్ బంక్ దగ్గర, చేవెళ్ల రోడ్డు. బక్రాపేట్: శ్రీ ఎల్లమ్మ దేవాలయం పక్కన, బికె గూడ, నిజాంపేట్: గోకుల్స్ ప్లాజా, నిజాంపేట్ రోడ్. బాచుపల్లి: కేపీఆర్ ప్యారడైజ్ కాలనీ దగ్గర, మల్లంపేట రోడ్డు. కొత్తపేట: మోహన్ నగర్, ఎస్బీఐ కాలనీ, గడ్డిఅన్నారం: ఏషియన్ శివ గంగా రోడ్డు. బోడుప్పల్: విల్మానగర్ మెయిన్ రోడ్ SSS గార్డెన్ ఎదురుగా. నాచారం: ESI హాస్పిటల్ ఎదురుగా. పీర్జాదిగూడ: సాయిపురం కాలనీ, ZP ఉన్నత పాఠశాల ఎదురుగా. ఫిల్మ్ నగర్: రోడ్ నం. 3, ఫిల్మ్ నగర్
రామ్యాంగో 1 kg స్మార్ట్ ప్రైస్ ₹39 మార్కెట్ ధర ₹54
పెద్ద కొబ్బరికాయ 1 యూనిట్ స్మార్ట్ ప్రైస్ ₹22 మార్కెట్ ధర ₹28
బనానా రోబస్టా 1 kg స్మార్ట్ ప్రైస్ ₹29 మార్కెట్ ధర ₹35
మ్యాంగో తోతాపురి 1 kg స్మార్ట్ ప్రైస్ ₹60 మార్కెట్ ధర ₹84
ఫార్చ్యూన్ రైస్ బ్రాన్ హెల్త్ ఆయిల్ 3 L + ఇండియా గేట్ బాస్మతి రైస్ 5 kg స్మార్ట్ ప్రైస్ ₹725 కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹1000 ఆదా చేసుకోండి ₹275
గుడ్ లైఫ్ ఆల్మండ్ వెల్యూ ప్యాక్ / గుడ్ లైఫ్ బాదం 500 g స్మార్ట్ ప్రైస్ ₹309/ ₹349 ఎమ్ఆర్‌పి ₹499 / ₹549 ఆదా చేసుకోండి ₹190 / ₹200
₹60 భారత్ చనా దాల్ 1 kg
₹137.50 భారత్ ఆటా 5 kg
₹290 భారత్ రైస్ 10 kg
ఇక్కడ లభించును
పార్థ్ బెల్లం 950 g స్మార్ట్ ప్రైస్ ₹64 ఎమ్ఆర్‌పి ₹90 ఆదా చేసుకోండి ₹26
మైదా / శనగపిండి / బొంబాయి రవ్వ 500 g / 1 kg BUY 1 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹49 మొదలుకుని
ద నట్ హౌస్ రెసిన్స్ సూపర్ / విక్టల్ బాలాజీ సూపర్ వెల్యూ క్యాష్యూ 500 g స్మార్ట్ ప్రైస్ ₹99/ ₹299 ఎమ్ఆర్‌పి ₹199 / ₹449 ఆదా చేసుకోండి ₹100 / ₹150
గుడ్ లైఫ్ / హలో లైఫ్ రిఫైన్డ్ సన్‌ఫ్లవర్ ఆయిల్ 1 L స్మార్ట్ ప్రైస్ ₹99/ ₹103 ఎమ్ఆర్‌పి ₹150 / ₹138 ఆదా చేసుకోండి ₹51 / ₹35
విజయా ఘీ 1 L స్మార్ట్ ప్రైస్ ₹575 ఎమ్ఆర్‌పి ₹690 ఆదా చేసుకోండి ₹115
లాల్ కాజా కట్లీ / మైసూర్ పాక్ క్లాసికల్ / బాంబే హల్వా / హార్లిక్స్ బర్ఫీ / బేసన్ లడ్డూ / మిల్క్ కేక్ / దూద్ పేడా 200 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) BUY 1 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹150
MTR / ఆచి / ఆశీర్వాద్ / బాంబినో ఇన్స్టంట్ గులాబ్ జామూన్ 160 g మొదలుకుని BUY 1 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹145
మాజా 1.2 L ఆదా చేసుకోండి ₹21 ఎమ్ఆర్‌పి ₹75 మొదలుకుని స్మార్ట్ ప్రైస్ ₹54 మొదలుకుని
తెలుగు నంకీన్ 150 g (సెలెక్ట్ వేరియంట్స్) BUY 1 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹80
జెర్సీ టోన్డ్ మిల్క్ 1 L స్మార్ట్ ప్రైస్ ₹51 ఎమ్ఆర్‌పి ₹60 ఆదా చేసుకోండి ₹9
MTR వెర్మిసెల్లి 850 g ఆదా చేసుకోండి ₹30 ఎమ్ఆర్‌పి ₹87 మొదలుకుని స్మార్ట్ ప్రైస్ ₹57 మొదలుకుని
సైకిల్ / మంగళ్‌దీప్ అగర్బత్తి వెల్యూ ప్యాక్ (సెలెక్ట్ వేరియంట్స్) ఆదా చేసుకోండి ₹36 ఎమ్ఆర్‌పి ₹125 మొదలుకుని స్మార్ట్ ప్రైస్ ₹89 మొదలుకుని
మెన్స్ అండ్ ఉమెన్స్ డియో 135 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) BUY 1 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹259 మొదలుకుని
లూజ్ స్టీల్ (ఎంపిక శ్రేణి) BUY 1 GET 1 FREE ఎమ్ఆర్‌పి ₹49 మొదలుకుని
HAPPY LIVING TRIDENT BOMBAY DYEING Ulhoos డబుల్ బెడ్ షీట్ స్మార్ట్ ప్రైస్ ₹399 మొదలుకుని ఎమ్ఆర్‌పి ₹1199 మొదలుకుని
వద్ద కూడా లభ్యం
SMART SUPERSTORE
మీకు సమీపంలో ఉన్న స్టోర్ లొకేట్ చేయడానికి స్కాన్ చేయండి
నియమ నిబంధనలు వర్తిస్తాయి. బ్యాంకింగ్ కార్డ్ / వాలెట్ ఆఫర్లు కేవలం స్మార్ట్ బజార్, స్మార్ట్ సూపర్‌స్టోర్, స్మార్ట్ పాయింట్ మరియు రిలయన్స్ ఫ్రెష్ సిగ్నేచర్ వద్ద మాత్రమే వర్తిస్తాయి. స్టాక్స్ ఉన్నంతవరకు ఆఫర్లు చెల్లుతాయి. ఆఫర్లన్నీ నోటీస్ చేయకుండానే మార్పు చేయబడగలవు. చూపించబడిన ఉత్పాదనల బొమ్మలు/ఫోటోగ్రాఫులు కేవలం ప్రదర్శన కోసం మాత్రమే. హోమ్‌వేర్ మరియు అపరెల్ ఆఫర్లు ఎంపిక చేయబడిన స్మార్ట్ బజార్ మరియు స్మార్ట్ సూపర్ స్టోరులలో మాత్రమే వర్తిస్తాయి. ఉత్పాదనలన్నిటి యొక్క ఎమ్ఆర్‌పి అన్ని పన్నులతో కూడి ఉంటుంది. డిస్కౌంట్ పర్సెంటేజ్‌ను ఆఫర్ ధర యొక్క సమీప పర్సెంటేజ్‌కు రౌండ్ ఆఫ్ చేయబడింది. ఆఫర్లన్నీ 9 ఏప్రిల్ 2024 వరకు చెల్లుతాయి. ఆక్షేపణలన్నీ ముంబయిలోని కోర్టులో ప్రత్యేక అధికారానికి మాత్రమే లోబడి ఉంటాయి.

> మనస్సులోని మలినాలను తొలగించి, మీ హృదయాన్ని అత్యంత స్వచ్ఛమైన భావాలతో నింపుకోండి. జగత్తు బ్రహ్మకాంతితో నిండి ఉందని జ్ఞాన నేత్రం మీకు తెలియజేస్తుంది.
>
> – ప్రశ్నోపనిషత్తు

సాక్షి

శనివారం, 6 ఏప్రిల్ 2024

ఇదా ప్రత్యామ్నాయం!

ఇది మేనిఫెస్టోల సీజన్. అధికార పక్షాల మాటెలావున్నా విపక్షాల మేనిఫెస్టోలు అమల్లోవున్న విధానాలను ధిక్కరిస్తున్నట్టు, నిలదీస్తున్నట్టు కనబడతాయి. తమ రాకను నిండైన ఆత్మవిశ్వాసంతో ప్రకటిస్తాయి. ప్రజానీకానికి అలాంటి భరోసా ఇచ్చే ప్రయత్నం చేస్తాయి. న్యూఢిల్లీలో శుక్రవారం కాంగ్రెస్ విడుదల చేసిన మేనిఫెస్టోకు అలాంటి లక్షణాలు లేశమాత్రమైనా కనబడవు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సెక్యులర్ విలువలకు తిలోదకాలిచ్చి హిందుత్వ రాజకీయాలను పెంచి పోషిస్తున్నదని పదేళ్లుగా కాంగ్రెస్‌తో సహా వివిధ పక్షాలు ఆరోపిస్తున్నాయి. కానీ చిత్రంగా 'న్యాయ్‌పత్ర' పేరుతో విడుదల చేసిన 48 పేజీల మేనిఫెస్టోలో ఆ ప్రస్తావన లేదు. దర్యాప్తు సంస్థలు, ఇంటెలిజెన్స్ సంస్థలు చట్టబద్ధంగా పనిచేసేలా, వాటిపై చట్టసభల పర్యవేక్షణవుండేలా చర్యలు తీసుకుంటామన్న వాగ్దానం వినసొంపుగానే వుంది. కానీ తమ ఏలుబడిలోనే ఆ సంస్థలు భ్రష్టు పట్టడం మొదలైందని గ్రహించినట్టు లేదు! 27 పార్టీలున్న ఇండియా కూటమికి కాంగ్రెస్ నేతృత్వం వహిస్తోంది. గత ఆదివారం ఆ కూటమి ఆర్భాటంగా రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించింది. తీరా అధికార కూటమికి ప్రత్యామ్నాయం తామేనన్న విశ్వాసాన్ని కలగజేసే విధాన ప్రకటనకు మాత్రం కాంగ్రెస్ సిద్ధపడలేదు. వాగ్దానాలకేమి... మేనిఫెస్టోలో చాలావున్నాయి. వర్తమాన యుగంలో చాలా పార్టీలు అమలు చేయటం కోసం కాక జనాన్ని మభ్యపుచ్చటానికే ఎడాపెడా వాగ్దానాలు చేస్తున్నాయి. వీటి మోహంలో పడి జనం ఓట్లు కుమ్మరిస్తారన్నది ఆ పార్టీల అంచనా కావొచ్చు. కానీ జనం తెలివిమీరారు. ఆచరణేమిటన్నది గమనిస్తున్నారు. ఉదాహరణకు ప్రజాప్రతినిధులు ఫిరాయింపులకు పాల్పడితే వెంటనే వారి సభ్యత్వం రద్దయ్యేలా చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకటిస్తోంది. కానీ కళ్లముందు తెలంగాణలో బీఆర్ఎస్‌నుంచి కాంగ్రెస్‌కు గోడ దూకుళ్లు స్పష్టంగా కనబడుతుండగా ఈ వాగ్దానానికి విలువుంటుందా? గతంలో బీఆర్ఎస్ చేసింది కనుక తామూ అదే చేస్తున్నామన్న సంజాయిషీ చెల్లదు. తానూ ఆ తానులోని ముక్కనేనని కాంగ్రెస్ చెప్పదల్చుకుంటే ఇలాంటి వాగ్దానాలకు చోటీయకూడదు.

మేనిఫెస్టోలోని 'పాంచ్ న్యాయ్–పచ్చీస్ గ్యారంటీస్'లో సామాజిక న్యాయం గురించిన హామీ వుంది. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర'లో ఈ అంశాలు ప్రస్తావనకొచ్చినవే. యువత, రైతులు, మహిళలు, కార్మికులు, సమానత్వం వగైరాలు ఈ మేనిఫెస్టోలో వున్నాయి. బీజేపీ మినహా దాదాపు అన్ని పార్టీలూ డిమాండ్ చేస్తున్న కులగణనకు కాంగ్రెస్ సంసిద్ధత తెలిపింది. స్వామినాథన్ కమిషన్ ప్రధానమైన సిఫార్సుల్లో ఒకటైన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పిస్తామన్న వాగ్దానం కూడా వుంది. తమ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో ఈ పని ఎందుకు చేయలేకపోయారో మేనిఫెస్టో చెప్పలేదు. కనీసం ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులైనా వివరణనివ్వలేదు. విద్యార్థులు బ్యాంకులు నుంచి తీసుకొన్న విద్యారుణాలను రద్దు చేస్తామన్న హామీ నిరుద్యోగ యువతను ఆకర్షిస్తుంది. కానీ ప్రభుత్వరంగంలో 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీని ఎందరు విశ్వసిస్తారన్నది అనుమానమే. ఎందుకంటే ఆ విషయంలో గత యూపీఏ సర్కారు తీరు నిరాశాజనకం. అటువంటి అసంతృప్తి ఉండబట్టే అప్పట్లో అన్నా హజారే నేతృత్వంలో సాగిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో యువత భారీయెత్తున పాల్గొన్నది. రిజర్వేషన్లపై ఇప్పుడున్న 50 శాతం పరిమితిని తొలగిస్తామని, కేంద్ర ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం కోటా కల్పిస్తామని మేనిఫెస్టో చెబుతోంది. అలాగే నిరుపేద మహిళలకు ఏడాదికి లక్ష రూపాయలు నేరుగా అందజేస్తామని అంటున్నది. 2018 ఏఐసీసీ సదస్సు దేశం మళ్లీ బ్యాలెట్ ఎన్నికలకు మళ్లాలని తీర్మానించింది. కానీ చిత్రంగా మేనిఫెస్టో ఈవీఎం విధానంవైపే మొగ్గింది. అయితే ఎన్నికల చట్టాలను సవరించి ఈవీఎంలు, వాటికి అనుసంధానించే వీవీ ప్యాట్‌లు మరింత పారదర్శకంగా వుండేలా చూస్తామంటున్నది. అగ్నిపథ్ స్కీం రద్దు, జమ్మూ, కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్ర హోదా, న్యాయమూర్తుల నియామకాలకోసం ఎన్‌జేసీ, జీఎస్టీ చట్టాల ప్రక్షాళన వగైరా సరేసరి. ఒక్కమాటలో చెప్పాలంటే అధికారపక్షంపై ఏయే అంశాల్లో విమర్శలున్నాయో చూసుకుని వాటన్నిటినీ మేనిఫెస్టోలో గుదిగుచ్చిన వైనం కనబడుతోంది.

వోటర్లను ఆకర్షించటానికి అవతలి పార్టీకి మించి వాగ్దానాలు చేయటం, అధికారంలోకొచ్చాక వాటిని విస్మరించటం మన దేశంలో కొత్తగాదు. కానీ సైద్ధాంతికంగా అధికార పక్షానికి ప్రత్యామ్నాయం అనే భావన కలగజేయటానికి మేనిఫెస్టోలో కాంగ్రెస్ పెద్దగా ప్రయత్నించలేదు. దాని ఆచరణ సైతం అదేవిధంగా వుంటున్నది. కేరళలోని వైనాడ్‌లో బుధవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా పార్టీ జెండాలు లేకుండానే రాహుల్ నిర్వహించిన రోడ్ షో చూస్తే ఈ సంగతి బోధపడుతుంది. బీజేపీపై ప్రధానంగా పోరాడుతున్నామంటూనే ఆ పార్టీ బలంగా వున్న ఉత్తరాదిని విడిచిపెట్టి రాహుల్ కేరళకు ఎందుకు వలస వచ్చారో కాంగ్రెస్ చెప్పలేకపోతోంది. ఆ సంగతలా వుంచి రాహుల్ రోడ్ షోలో జెండాలు కనుమరుగవటానికి గల కారణాలు దిగ్భ్రాంతి కలిగిస్తాయి. 2019లో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ జెండాలతోపాటు కనబడిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ జెండాలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాకిస్తాన్ జెండాతో పోల్చటంతో ఈసారి అవి రెండూ కనుమరుగయ్యాయి. ముస్లింలీగ్ జెండా ఏమిటో తెలియకుండానే ఆ పార్టీతో పొత్తు పెట్టుకుందా? సెక్యులర్ విలువలు పాటిస్తున్నామంటూనే ఇలాంటి విమర్శలకు బెదరటం ఆశ్చర్యం కలిగిస్తుంది. కాంగ్రెస్ మేనిఫెస్టో సైతం ఈ ధోరణినే ప్రతిబింబించింది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, మార్గశిర మాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.7.36 వరకు తదుపరి త్రయోదశి తె.5.13 వరకు (తెల్లవారితే ఆదివారం). **నక్షత్రం:** శతభిషం ప.1.29 వరకు, తదుపరి పూర్వాభాద్ర. **వర్జ్యం:** రా.7.28 నుండి 8.56 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.55 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** ఉ.6.44 నుండి 8.13 వరకు.

సూర్యోదయం : 5.55
సూర్యాస్తమయం: 6.10
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

చుక్కాని లేని జనసేనాని

అభిప్రాయం



టంకశాల అశోక్

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు, జనసేన పార్టీకి ఇవి మూడవ ఎన్నికలు. ఇప్పటికీ ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు ఒక సిద్ధాంతం లేదు. పార్టీ నిర్మాణం లేదు. ఇవి చాలదన్నట్లు ఆయన కొమరం భీం, వీరమల్లు, చేగువేరా, జన సైన్యం, వీర మహిళలు అంటూ బీజేపీ వంటి పార్టీ పక్షం వహించటం ఎబ్బెట్టుగా కనిపిస్తున్నది. అది ఒకటైతే, మొదట ముఖ్యమంత్రి పదవి అంటూ మాట్లాడి, తర్వాత 50–60 స్థానాలలో పోటీ, తద్వారా ప్రభుత్వంలో పెద్ద చెయ్యి అని ప్రకటించి, చివరకు 21 సీట్లకు పరిమితం కావటం తన పార్టీ వారికి, తన సామాజిక వర్గం వారికి కూడా ఇబ్బందికరంగా తయారైంది. చుక్కాని అంటూ లేని పార్టీ పరిస్థితి ఇంతకు భిన్నంగా ఉంటుందా?

స్థాపించి నిండా పది సంవత్సరాలు గడిచినా తన సిద్ధాంతాలు ఏమిటో తెలియని రాజకీయ పార్టీ ఒకటి ఉందంటే నమ్మబుద్ధి కావటం లేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఏ పార్టీకి అయినా సిద్ధాంతాలు, లక్ష్యాలు, విధానాలన్నవి చుక్కాని వంటివి. కానీ పవన్ కల్యాణ్ 2014లో స్థాపించిన జనసేన పార్టీకి నేటి వరకు కూడా ఒక సిద్ధాంత పత్రం ఏమీ లేదు. కనీసం ఎన్నికల సమయంలోనైనా వారు మేనిఫెస్టో ఏదీ ప్రకటించలేదు. ఆంధ్రప్రదేశ్ చారిత్రకంగా, ఆర్థికంగా, సామాజికంగా ఈ దేశంలోని ప్రముఖ రాష్ట్రాలలో ఒకటి. అక్కడి అయిదు కోట్లమంది ప్రజలు అనేక రంగాలలో ఇతర రాష్ట్రాలలో, విదేశాలలో కూడా క్రియాశీలంగా ఉన్న వివేకవంతులు. అటువంటి రాష్ట్రానికి సారథ్యం వహించగోరే ఒక పార్టీ ఇంత దారీ తెన్నూ లేని విధంగా సాగుతుండటం ఆశ్చర్యకరమైన విషయం. ఇటువంటివి ఆలోచించదగిన విషయాలనే స్పృహ అయినా ఆ పార్టీ అధ్యక్షునికి ఉందా అనే అనుమానం కలుగుతున్నది.

పవన్ కల్యాణ్ అసలు పార్టీ ఎందుకు పెట్టినట్లు? పెట్టిన ఈ పదేళ్లుగా ఏమి చేసినట్లు? మునుముందు ఏమి చేయాలన్నది తన ఆలోచన? తన మాటలను, చేతలనుబట్టి చూస్తే రాజకీయ పరిశీలకులకు ఇందులో ఏ ఒక్క ప్రశ్నకు అయినా స్పష్టమైన సమాధానాలు కన్పించటం లేదు. ఆయన పార్టీ ప్రకటించిన 2014లో ఆంధ్రప్రదేశ్ ఒక పరీక్షా సమయాన్ని ఎదుర్కొంటున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయింది. విభజిత రాష్ట్రం అనేక వనరులను కోల్పోయింది. రాజకీయ పార్టీలకు, సాధారణ ప్రజలకు కూడా కొత్త రాష్ట్రాన్ని తిరిగి ఏ విధంగా నిలబెట్టాలనేది ఒక పెద్ద సమస్య. అప్పటి పరిణామాలన్నీ వారికి మానసికంగా కూడా కొంత అయోమయాన్ని సృష్టించాయి. అటువంటి స్థితిలో ఏర్పడే ఒక కొత్త రాజకీయ పార్టీ తనదైన విధంగా సమాధానాలను వెతకాలి. వాటిని ఒక సిద్ధాంత పత్ర రూపంలో రూపొందించి ప్రజల ముందుంచాలి. ఆ మేరకు స్వయంగానూ, ఏకీభావం గల ఇతర పార్టీలు, వర్గాలతోనూ కలిసి కార్యాచరణను చేపట్టాలి. కానీ ఇటువంటిదేమీ చేయలేదు. నేటికీ చేయటం లేదు.

ఇది ఒక కోణం కాగా, మరొక కోణాన్ని చూద్దాము. పవన్ కల్యాణ్ సామాజికంగా కాపు వర్గానికి చెందిన వ్యక్తి. ఆంధ్రప్రదేశ్‌లో రెడ్లు, కమ్మల తర్వాత మూడవ బలమైన వర్గం. అయినప్పటికీ రాజకీయాధికారం తమకు లేకుండా పోయిందని, దానిని అందుకోవాలనే కోరిక వారిలో బలంగా ఎప్పటి నుంచో ఉంది. అందుకోసం గట్టి ప్రయత్నాలు మొదటిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో పి. శివశంకర్ ఆధ్వర్యాన జరిగాయి. దక్షిణ కోస్తా, ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణల నుంచి కూడా ఈ సామాజిక తరగతులను కదిలించారు. ఆ ప్రయత్నాలు విఫల మయ్యాయి. తర్వాత చిరంజీవి రాకతో వారిలో తలెత్తిన ఆశలు కూడా ముందుకు సాగలేదు. ఇపుడు ఆ వర్గానికి చెందిన పవన్ కల్యాణ్‌ను వారిలోని కొందరు తమ వాడు అనుకోవటం



తప్ప ఆశాభావాలు గత రెండు విడతలలోనూ ఎంత మాత్రం కనిపించటం లేదు. అందుకు ఒక కారణం ఆయన... శివశంకర్, చిరంజీవి వంటి గౌరవ ప్రతిష్ఠలను, నమ్మకాన్ని సంపాదించు కోలేక పోవటం. రెండు – తనలో అటువంటి పరిణతిగానీ, దార్శనికత గానీ ఉన్నాయనే అభిప్రాయం ఆ వర్గం వారికి 2014లో గానీ, తర్వాత ఈ పదేళ్లలోగానీ ఏర్పడక పోవడం. మూడు – ఒక పార్టీని సీరియస్‌గా నడిపే ఆలోచన, దక్షత, స్థిరత్వం, వ్యవహార ధోరణి అసలెప్పుడూ కన్పించక పోవటం. నాలుగు – పైన అనుకున్నట్లు తన సిద్ధాంతాలు, విధానాలు, ప్రణాళికలు, ఆ ప్రకారం ఆచరణలు ఏమిటో అర్థం కాక పోవటం. అయిదు – సినిమాలలో కావలసిన కొన్ని లక్షణాలకు, సీరియస్ రాజకీయాలకు అవసరమైన పద్ధతులకు మధ్య తేడా పాటించక తన విలువను తానే తగ్గించుకోవటం.

దానితో, కాపులలోని యువతరానికి పవన్ కల్యాణ్ పట్ల ఇతరత్రానూ గల సినిమాటిక్ ఆకర్షణ రాజకీయ ఆకర్షణగా మారటం తప్ప, వారిలోని ఇతరులకు ఆయనపై తమనేదో ఉద్ధరించగలడనే ఆశాభావం ఏమీ కలగటం లేదు. గత ఎన్నికల ఫలితాలు ఇందుకొక స్పష్టమైన సూచన. గమనించదగినదేమంటే, ఒకవేళ ఆయన శివశంకర్, చిరంజీవిల వలె తమ సామాజిక వర్గాన్ని, ఇతర బడుగు, బలహీన వర్గాలను కూడదీసే ప్రయత్నం చేసినట్లయితే ఆంధ్ర రాజకీయాలలో మూడవ ధ్రువం ఏర్పడే అవకాశం ఉండేది. వ్యక్తిగతంగా తనకు ఆ దార్శనికత, సమర్థత ఉన్నట్లు కనిపించదనేది వేరే విషయం. కానీ కనీసం సూత్రరీత్యా అటువంటి అవకాశం ఉండేది. ఈ పరిస్థితుల దృష్ట్యా పవన్ కల్యాణ్ గత పది సంవత్సరాలలో ఎటువంటి విలువనూ పెంచుకోలేక పోయారు. తనకు సంబంధించి అంతా సినిమాటిక్ గానే కనిపిస్తుంది. జనసేన అనే పేరు, కార్యకర్తలను సైనికులు అనటం, మహిళా సభ్యులను వీర మహిళలనటం, ఎక్కడైనా సమస్య కనిపిస్తే తోకచుక్క తెగిపడినట్లు వచ్చి హడావిడి చేసి మాయమవటం తప్ప అందుకు కొనసాగింపు లేకపోవడం, ప్రసంగాలలో దురుసుతనం, వీరాలా పాలు, అందుకు తగినట్లు సినిమాలలో వలెనే హావభావాలు.

ఈ విధంగా, ఆంధ్రప్రదేశ్ వంటి ముఖ్య రాష్ట్రం ఒక పరీక్షా సమయాన్ని ఎదుర్కొంటుండిన దశలో, ఒక సిద్ధాంతం, విధానాలంటూ లేకుండా ఒక పార్టీని నెలకొల్పటం, పదేళ్లయినా అదే పరిస్థితి ఉండటం, రాజకీయాధికారాన్ని కోరుకుంటున్న తన సామాజిక వర్గానికి ఎటువంటి ఆశాభావాన్ని కల్పించలేక పోవటం, చివరకు పార్టీ నిర్వహణ సైతం గందరగోళంగా సాగుతుండటాన్ని బట్టి, పవన్ కల్యాణ్ జనసేన ఆంధ్రప్రదేశ్‌లో, నిజమైన అర్థంలో ఒక నికరమైన, స్థిరమైన, సీరియస్ రాజకీయ పార్టీ అనే గుర్తింపును, గౌరవాన్ని సంపాదించుకోలేక పోయింది.

సిద్ధాంతాలు, లక్ష్యాల మాట ఇలా ఉంటే, జనసేన అధ్యక్షుని ఎన్నికల వ్యవహరణ ఏ విధంగా ఉన్నదో చూద్దాం. ఆయన రాష్ట్ర విభజనకు వ్యతిరేకి. కానీ ఆ విషయంలో డబుల్ గేమ్ ఆడిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును 2014 ఎన్నికలలో బలపరిచారు. చంద్రబాబు రైతాంగానికి, పేదలకు నష్టం చేసినందున 2004లో, 2009లో వరుసగా రెండుసార్లు ఓడిపోయిన వ్యక్తి. అదే విధంగా, రాష్ట్ర విభజనను పూర్తిగా బలపరచిన బీజేపీతోపాటు అపుడు చంద్రబాబు వెంట నిలబడ్డారు. తర్వాత 2019 ఎన్నికలలో వామపక్షాలతో స్నేహం చేశారు. అప్పటికి అయిదేళ్ల రాజకీయం చేసినా, తన సామాజిక వర్గం పెద్ద సంఖ్యలోగల గాజువాక, భీమవరం స్థానాల నుంచి స్వయంగా పోటీ చేసి కూడా ఓడారు. అయిదేళ్లలో తన సిద్ధాంతాలేమిటో చెప్పలేదు. సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం పేరిట తమ వారినీ ఒప్పించలేక పోయారు. ఆ వర్గానికి కంచుకోటలైన జిల్లాలు అంతటా అదే పరిస్థితి ఎదురైంది.

విభజిత ఆంధ్రప్రదేశ్‌కు, జనసేన పార్టీకి ఇవి మూడవ ఎన్నికలు. ఇప్పటికీ తనకు సిద్ధాంతం లేదు. పార్టీ నిర్మాణం లేదు. సోదరుడు చిరంజీవి రాజకీయాలలో ఉండినప్పటిలా తన సామాజిక వర్గంగానీ, ఇతర బడుగు బలహీన వర్గాలుగానీ ఆయనను ఒక ఉద్ధారకునిగా ఏమీ చూడటం లేదు. అది ఒకటైతే, మొదట ముఖ్యమంత్రి పదవి అంటూ మాట్లాడి, తర్వాత 50–60 స్థానాలలో పోటీ, తద్వారా ప్రభుత్వంలో పెద్ద చెయ్యి అని ప్రకటించి, చివరకు 21 సీట్లకు పరిమితం కావటం తన పార్టీ వారికి, తన సామాజిక వర్గం వారికి కూడా ఇబ్బందికరంగా తయారైంది. తీరా అందులో గెలిచేదెన్ని, తమ కూటమి అధికారానికి రాగలదనే హామీ ఎంత అనేవి ఎవరికీ అంతు పట్టని ప్రశ్నలయ్యాయి. మౌలికంగా చుక్కాని అంటూ లేని పార్టీ పరిస్థితి ఇంతకు భిన్నంగా ఉండగలదా?

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎక్కడికక్కడ!



'ఇండియా' కూటమిని ఎన్నికల్లో గెలవనీయకూడదని ఆయన ఫిక్స్ అయ్యారు. ఎన్నికల కమిషన్‌లో తన సొంత మనుషులను జొప్పించారు. ఇద్దరు సిట్టింగ్ ముఖ్యమంత్రులను జైల్లో పెట్టించారు. కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. న్యాయ వ్యవస్థపై ఒత్తిడి తెస్తున్నారు.

– రియా, మిడిల్ ఈస్ట్ జర్నలిస్ట్

కారు ఆపిన క్వీన్



'క్వీన్' అనే పిలుపునకు కంగనా రనౌత్ అనేక విధాలుగా అర్హురాలు అనేందుకు ఒక కారణం : తన ఎన్నికల ప్రచారంలో తన కారును ఆపమని భద్రతా సిబ్బందికి సూచించి, ఒక అభిమాని కోరిక మేరకు సెల్ఫీ దిగడానికి ఆమె అనుమతించారు. "ప్రజలను ప్రేమిస్తే, వారు మిమ్మల్ని తిరిగి ప్రేమిస్తారు" అనే మాటలో నిజం ఉంది.

– రాహుల్ చౌహాన్, ఐటీ ప్రొఫెషనల్

పదికి ఒకసారి!



ఉప్మా పదికి తొమ్మిదిసార్లు సిమెంటును తిన్నట్లుగా ఉంటుంది. మిగిలిన ఆ ఒక్కసారీ ఉప్మాలా ఉంటుంది. ఆ ఒక్కసారి ఉప్మాను తినడం కోసం పదిసార్లు సిమెంటును ఇష్టపడేవాళ్లు కొందరు ఉంటారు. (ఒక ఇంటర్వ్యూలో మోదీ తనకు ఉప్మా అంటే ఇష్టం అని చెప్పిన సందర్భంలో వచ్చిన అనేక ట్వీట్‌లలో ఒకటి).

– కార్తీక్ బాలచంద్రన్, ఎండోక్రైనాలజిస్ట్

వీళ్లు అనుచరులంటే!



నాయకుడు దగ్గర లేనప్పుడు అనుచరులు కలిసికట్టుగా ముందుకు వెళ్లటం గొప్ప సంగతి. కేజ్రీవాల్‌కు మద్దతుగా ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో 'ఇండియా' కూటమితో కలిసి విజయవంతంగా ర్యాలీ నిర్వహించిన ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలందరికి అభినందనలు. మీ పోరాటం ఆగకూడదు.

– డెరెక్ ఒబ్రియన్, టీఎంసీ ఎంపీ

వాళ్లు మాత్రం..!!



యు.ఎస్.లో ట్రాన్స్‌జెండర్ భావజాల సమర్థింపునకు ప్రధానంగా బాధ్యత వహించవలసిన వారు మిషెల్ ఒబామా, ఆమె భర్త బరాక్ ఒబామా. ఇప్పటికీ వారు ట్రాన్స్‌జెండరిజంను పెంచి పోషిస్తూ ఉన్నారు. స్వయంగా ట్రాన్స్‌జెండర్ అయిన మిషెల్, 'గే' అయిన ఒబామా... ఆ సంగతిని బహిర్గతం చేసి ప్రపంచంతో నిజాయితీగా ఎందుకు మెసలలేరు?!

– డా॥ డాన్ మిషెల్, యాంటీ–రెమ్‌డిసివిర్ యాక్టివిస్ట్

ఎవర్నడిగి ఇచ్చారు?



శ్రీలంక, తమిళనాడుల మధ్య 163 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ద్వీపం కచ్చతీవు రామేశ్వరంలోని రామ్‌నాడ్ రాజ్యానికి చెందినది. స్వాతంత్ర్యానంతరం అది తమిళనాడులో భాగమైంది. 1974లో అప్పటి భారత ప్రధాని ఇందిరాగాంధీ కనీసం పార్లమెంటు ఆమోదమైనా లేకుండానే శ్రీలంకకు కచ్చతీవును బహుమతిగా ఇచ్చారు!

– రిపీ బగ్రీ, చరిత్ర విశ్లేషకులు

మంచికి పోతే...!



రీ సైక్లింగ్ మంచిదే. నా సొంత వీడియోలను నేను ఆసక్తికరమైన అనేక పార్ట్‌లుగా రీ సైకిల్ చేశాను. దెబ్బకు నా సబ్‌స్క్రైబర్‌ల సంఖ్య 70 లక్షలకు చేరుకుంది. కానీ టిక్ టాక్ నన్ను... "ప్రమాదకర చర్యలకు" పాల్పడుతున్నాననే ఆరోపణపై శాశ్వతంగా నిషేధించింది. ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని నేను నా చందాదారులకు చెప్పడమే నా తప్పు!!

– మెహదీ సదర్ధర్, ఎలక్ట్రో 'బూమ్' గై

ఇన్ బాక్స్

వైద్యం ఎందుకంత ఖరీదవుతోంది?

మనదేశంలో నేడు వైద్యం చాలా ఖరీదైపోయింది. గతంలో మందులపై జీఎస్టీ ఐదు శాతం మాత్రమే ఉండేది. మోదీ ప్రభుత్వం 12 శాతానికి పెంచింది. ఇప్పుడు మళ్లీ మందులు రేట్లు పెంచే ప్రయత్నం చేస్తోంది. సూదులు, సిరంజ్‌లు, డయాగ్నొస్టిక్ కిట్స్, దూది వంటి వాటిపై 12 నుంచి 18 శాతం జీఎస్‌టీ వసూలు చేస్తున్నారు. ఏ వైద్యుడైనా పదేళ్లు బాగా ప్రాక్టీస్ చేయగలుగుతారు. అందులో ఐదేళ్లు ఆ యా విభాగాలు ఎస్టాబ్లిష్ చేసుకోవడానికే సరిపోతుంది. మంచి ప్రాక్టీస్ ఉండేది ఐదు సంవత్సరాలు మాత్రమే. ఈ కొద్ది కాలంలోనే చదువు ఖర్చు, హాస్పిటల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఖర్చు, హాస్పిటల్ పరికరాలకు అయిన ఖర్చు సంపాదించుకోవాలని ఏ వైద్యునికైనా ఉంటుంది. కాబట్టే ఏ ఒక్క అవకాశాన్నీ వదలకుండా ఎడాపెడా సంపాదించాలనుకుంటున్నారు.

ప్రభుత్వాలు మొత్తం 17 నుంచి 20 రకాల పన్నులు ముక్కు పిండి, వైద్యుల నుంచి వసూలు చేస్తున్నాయి. వైద్యులు కమర్షియల్ కరెంటు బిల్ కట్టాలి. పారిశ్రామికవేత్తలకు అనేక రాయితీలు ఉంటాయి. కానీ హాస్పిటల్‌కు ఏ రాయితీలు ఉండవు. మున్సిపల్ టాక్స్ కమర్షియల్. పేషెంట్ రూమ్స్, ఐసీయూ బెడ్‌ల లగ్జరీ టాక్స్, చెత్త పన్ను, బయో మెడికల్ వేస్ట్ పన్ను, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పన్ను, వాటితో పాటు ఫైర్ ఎన్‌ఓసి ఫీజు (అగ్నిమాపక విభాగం ఎఓసీ రావాలంటే లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది). వీటికి తోడు అనధికార ఆర్థిక లావాదేవీలు తప్పనిసరి అవుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి దగ్గర రిజిస్ట్రేషన్ ఫీజు, లేబర్ ఫీజు, భవిష్యనిధి, సిబ్బంది జీత భత్యాలు మొత్తం వెరసి ఆసుపత్రుల నిర్వహణ బహుభారం అయిపోయింది. అందువల్లనే చిన్న చిన్న ఆస్పత్రులు పోయి, నేడు పెద్ద పెద్ద కార్పొరేట్ ఆస్పత్రులు వచ్చేస్తున్నాయి. ఇక్కడ సామాన్యులకు వైద్యం చాలా భారం అయిపోతోంది.

'కర్ణుని చావుకు కారణాలు అనేకం' అన్నట్టు వైద్య విద్య, వైద్యసలహా, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు, ప్రభుత్వ విధిస్తున్న వివిధ రకాల పన్నులు, క్లినిక్ లు, ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ ఖర్చులు... వెరసి వైద్యాన్ని ఖరీదైనదిగా మార్చాయి. ఇటీవల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వెల్నెస్, ఫ్యామిలీ ఫిజిషియన్ క్లినిక్‌ల వల్ల కాస్త పేద ప్రజలకు లాభం చేకూరవచ్చు. వైద్యం ప్రతి ఒక్కరికీ అనివార్యం. దాన్ని సాధ్యమైనంత వరకు పేదలకు సైతం అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

– డా॥ టి. సేవకుమార్; నేషనల్ కౌన్సిల్ మెంబర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్
(ఏప్రిల్ 7న 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం)

దేశం మార్పు కోరుతోంది!

అభిప్రాయం



డా॥ కొనగాల మహేష్

కాంగ్రెస్ అంటేనే గ్యారంటీ, చెప్పిందే చేస్తుంది, చేసేదే చెప్తుంది. కాంగ్రెస్ పార్టీకి, వివిధ రాష్ట్రాలకు జరిగిన శాసన సభ ఎన్నికల్లో ఇచ్చిన గ్యారెంటీలను వంద రోజుల్లో తు.చ. తప్పకుండా అమలు చేసిన ఘనత ఉంది. శనివారం హైదరాబాద్ తుక్కుగూడలో లోక్‌సభ ఎన్నికల శంఖం పూరిస్తోంది. ఈ దేశంలో ఉన్న మేధావులతో, ప్రజాస్వామికవాదులతో చర్చించి '5 న్యాయాలతో కూడిన మేనిఫెస్టో'ను రూపొందించి అమలుకు సిద్ధమైంది. కాంగ్రెస్ మేనిఫెస్టోను ప్రధానంగా 1. వర్క్(పని) 2. వెల్త్(సంపద) 3. వెల్ఫేర్(సంక్షేమం) కలయికగా చెప్పవచ్చు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 'జోడో యాత్ర'లో ప్రతిపాదించిన ఐదు న్యాయాలు: యువ న్యాయం, నారీ న్యాయం, రైతు న్యాయం, శ్రామిక న్యాయం, సామాజిక న్యాయం కోసం 25 గ్యారెంటీలు ప్రజలకు ఇస్తున్నాం.

యువ న్యాయం కింద చదువుకున్న యువతకు ఉద్యోగ నియమకాల్లో భరోసా కల్పిస్తాం. జాబ్ క్యాలెండర్ ప్రకారం ఖాళీలను భర్తీ చేస్తాం. 30 లక్షల కొత్త ఉద్యోగాలు నిరుద్యోగ యువతకు అందిస్తాము. పేపర్ లీక్‌ల నుంచి విముక్తి కల్పిస్తాం, అందుకు పటిష్ఠమైన పరీక్ష విధానాన్ని కఠినమైన చట్టాలను రూప కల్పన చేస్తాం. 'యువ క్రాంతి పథకం' కింద నిరుద్యోగ యువతీ యువకుల కోసం రూ. 5000 కోట్లతో 'స్టార్ట్ ఫండ్' ఏర్పాటు చేస్తాం.

నారీ న్యాయం కోసం 'మహాలక్ష్మి' పథకం కింద ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు ప్రతి ఏడాదికి లక్ష రూపాయల సాయం చేస్తాం. కేంద్ర ప్రభుత్వం నియామకాల్లో 50 శాతం ఉద్యోగాలు మహిళలకు రిజర్వ్ చేస్తాం. మహిళా శక్తిని గౌరవిస్తాం. 'ఆశా' వర్కర్లు, మధ్యాహ్న భోజన– అంగన్వాడీ కార్యకర్తలకు అధిక జీతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వ సహకారం రెట్టింపు చేస్తాం. 'అధికారం– మైత్రి' కార్యక్రమంలో భాగంగా మహిళలకు చట్టపరమైన హక్కులు, ప్రభుత్వ పథకాల గురించి తెలియజేసేందుకు ప్రతి గ్రామంలో ఒక 'అధికార మైత్రి' నియామకం చేపడుతాం. సావిత్రీబాయి పూలే పేరిట హాస్టళ్లు ఏర్పాటు చేస్తాం.

ఇండియా కూటమి ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేయబోతున్నాం. రైతు ప్రాధాన్యంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో రూపొందింది. స్వామినాథన్ కమిషన్ సూచనల మేరకు రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధర కల్పిస్తూ, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తాం. 'రైతు రుణ మాఫీ' పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించాము. అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా రైతుల రుణమాఫీ కోసం 'రైతు కమిషన్' ఏర్పాటు చేయబోతున్నాం. దానికి చట్టబద్ధత ఉంటుంది.

రైతులకు పంట నష్ట సమయంలో ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలు పంటల బీమా చెల్లింపు విషయంలో అనేక కొరీలు పెడుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నట్టు జోడో యాత్రలో రాహుల్ గాంధీ దృష్టికి వచ్చింది. దీని పరిష్కారం కోసం పంటం నష్టపోతే 30 రోజుల్లో బీమా సొమ్ము నేరుగా రైతు బ్యాంకు ఖాతాలోకి జమ చేసే విధంగా బీమా చెల్లింపు ప్రత్యక్ష బదిలీ పద్ధతిని అమలు చేయబోతున్నాం. వ్యవసాయ పనిముట్లకు, ఎరువులకు, విత్తనాలకు జీఎస్టీ మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించాం.

శ్రామిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా శ్రామికులకు రోజువారీ వేతనం రూ. 400కు పెంచడం జరుగుతుంది. ఇది జాతీయ ఉపాధి హామీ కూలీలకు కూడా వర్తింప చేస్తాం. అసంఘటిత రంగంలో ఉన్న కార్మికులకు ఉచిత చికిత్స అందిస్తాం. మందులు, పరీక్షలు, శస్త్రచికిత్సతో సహా మరో 25 లక్షల హెల్త్ కవరేజ్ ఇస్తాం. కేవలం గ్రామాలకే పరిమితమైన



జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాలకు కూడా విస్తరించేటట్టు కొత్త చట్టాలు తీసుకు రాబోతున్నాం. కీలకమైన ప్రభుత్వ విధుల్లో కాంట్రాక్టు కార్మిక వ్యవస్థను రద్దు చేయబోతున్నాం. సైన్యంలో కాంట్రాక్టు పద్ధతిని ప్రోత్సహించే 'అగ్నిపథ్ పథకా'న్ని రద్దు చేయబోతున్నాం.

ఈ దేశంలో జనాభా దామాషా ప్రకారంగా ప్రజలకు ప్రభుత్వ ఫలాలు అందాలని, రాజకీయ అవకాశాలు కూడా అందాలనే సమున్నత ఆలోచనతో దేశంలో అట్టడుగు వర్గాలను వృద్ధిలోకి తీసుకువచ్చే లక్ష్యంతో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశాం.

దేశంలోని ప్రజల సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం కులగణన చేపడుతున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ల పై ఉన్న 50 శాతం పరిమితిని తొలగించి రాజ్యాంగ సవరణ ద్వారా పూర్తి హక్కులను కల్పించే విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోబోతున్నాం. ఎస్సీ–ఎస్టీ జనాభా ప్రకారం 'ఎస్సీ–ఎస్టీ సబ్ ప్లాన్' పేరుతో స్పెషల్ బడ్జెట్ కేటాయించి వారి సమున్నత అభివృద్ధికి కృషి చేస్తాం. 'జల్ జంగల్ జమీన్' చట్టం కింద వచ్చే క్లెయిమ్స్ సంవత్సరంలో పరిష్కరించి వారికి పోడుభూమి పట్టాలు అందజేస్తాం. గిరిజన జనాభా అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో 'పీసా' చట్టం తీసుకొచ్చి వారి భూములపై యాజమాన్యం వాళ్ళకే అందజేస్తూ, 'మనభూమి – మన పాలన' అమలు చేయబోతున్నాం.

సమాజంలో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ప్రణాళికలు రూపొందించి, వాటికి చట్టబద్ధత కల్పించి అవి తప్పనిసరి అమలయ్యేటట్టుగా చూసి ఈ దేశంలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోంది. మేనిఫెస్టో రూపకల్పనలో, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం, కేంద్ర మాజీ మంత్రి జై రామ్ రమేష్, తెలంగాణ ప్రభుత్వ ఐటీ, ఇండస్ట్రీ, శాసన వ్యవహారాల మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కీలక పాత్ర పోషించారు.

ఇప్పుడు ఎన్నికల్లో పార్టీల జెండాలను ప్రజలు చూసే పరిస్థితి లేదు. మోదీకి వ్యతిరేకంగా ఓటు వేసి, ఈ పాలనకు చమర గీతం పాడడానికి దేశ ప్రజలు నిర్ణయించుకున్నారు.

వ్యాసకర్త కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి
మొబైల్: 98667 76999

క్లుప్తంగా...



భద్రాచలం ఆలయంలో కుటుంబ సభ్యులతో హైకోర్టు జడ్జి మాధవీదేవి

భద్రాద్రి రామయ్య సన్నిధిలో హైకోర్టు జడ్జి

భద్రాచలం/దుమ్ముగూడెం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు జడ్జి టి.మాధవీదేవి తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఈఓ రమాదేవి, అర్చకులు వీరికి స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులతో పాటు ఉపాలయాలను దర్శించుకున్నారు. ఆ తర్వాత దుమ్ముగూడెం మండలం పర్ణశాలలో కూడా శ్రీ సీతారామచంద్రస్వామి వారిని కూడా దర్శించుకున్నారు. ఇక్కడే పంచవటీ కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉద్యోగులు, అర్చకులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు సీఎం రేవంత్ నివాళి



సాక్షి, హైదరాబాద్: దివంగత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, పట్నం మహేందర్‌రెడ్డిలతో పాటు మాదిగ దండోరా నేతలు పాల్గొన్నారు.

అత్యధిక సీట్లలో బీజేపీ గెలుపునకు ఓబీసీలు కృషిచేయాలి

బీజేపీ సంస్థాగత ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ పిలుపు



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అత్యధికస్థానాల్లో గెలుపు సాధించడం కోసం ఓబీసీలు ముఖ్య పాత్ర పోషించాలని బీజేపీ సంస్థాగత ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తివారీ పిలుపునిచ్చారు. రాష్ట్ర జనాభాలో సగ భాగంగా ఉన్న బీసీలు బీజేపీ పక్షాన నిలిచేలా కృషి చేయాలని కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో చంద్రశేఖర్‌తో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, ప్రధానకార్యదర్శులు నందనం దివాకర్, ఈశ్వరప్ప, ఉపాధ్యక్షులు సంజయ్ ఘణాటే, జి.మహేశ్ ఇతర నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ...ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఇప్పటికే రాష్ట్రస్థాయిలో 300కు పైగా సామాజిక సమావేశాలు నిర్వహించామన్నారు. రాబోయే రోజుల్లో ఎంపీ సీట్ల పరిధిలో ఈ భేటీలు నిర్వహించి బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.

హిందువులంతా సమానమే

వీహెచ్‌పీ కేంద్రీయ సహ సంఘటన కార్యదర్శి వినాయక్‌రావు

సాక్షి,హైదరాబాద్: హిందువులంతా సమానులేనని ఎవరూ అంటరాని వారు కాదని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) కేంద్రీయ సహ సంఘటన కార్యదర్శి వినాయక్ రావు దేశ్ పాండే పేర్కొన్నారు. అగ్రవర్ణం, అణగారిన వర్గము అనే భావాలకు హిందూ సమాజంలో తావులేదన్నారు. రామాయణం రచించిన మహర్షి వాల్మీకి నుంచి మొదలుకుంటే...రాజ్యాంగం రచించిన అంబేడ్కర్ వరకు ఎందరో మహనీయులు హిందూ సమాజానికి ఆదర్శనీయులని తెలిపారు. శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి వినాయక్‌రావు నివాళులర్పించారు. సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని స్వామి శివానంద ఆశ్రమంలో సామాజిక సామరస్యత ఆధ్వర్యంలో చిరంజీవులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాబు జగ్జీవన్ రామ్ తరతరాలకు ఆదర్శమని, అలాంటి మహనీయుల చరిత్రను నేటి సమాజం తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. మన దేశంలో ఒకప్పుడు కులాల ప్రస్తావనే లేదని ఆంగ్లేయులు, మహమ్మదీయుల పరిపాలన కారణంగా మనుషుల మధ్య అంతరాలు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త సామాజిక సామరస్యత పాటించాలని, అంటరానితనాన్ని రూపుమాపాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి సత్యం, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు భోజనంపల్లి నరసింహామూర్తి, శాలివాహన పండరీనాథ్, కసిరెడ్డి వెంకటరెడ్డి, సునీతా రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్.. అప్‘లేట్’

తప్పని తిరస్కరణ తిప్పలు | కార్డులో చేర్పులు మార్పులపై పరిమితి | ఇక హైదరాబాద్ రీజినల్ ఆఫీస్‌కు క్యూ కట్టాల్సిందే

సాక్షి, హైదరాబాద్: ఆధార్‌కార్డు అప్‌డేట్‌కు ‘తిరస్కరణ’తిప్పలు తప్పడం లేదు. ఒకటి రెండుసార్లు చేర్పులుమార్పులు చేసుకుంటే ఆ తర్వాత అప్‌డేషన్ ప్రక్రియ తిరస్కరణకు గురవుతోంది. దీంతో రాష్ట్రం నలుమూలల నుంచి హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రానికి పరుగులు తీసి పడిగాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థుల ఆధార్‌కార్డులో అప్‌డేషన్ సమస్యగా తయారైంది. చిన్నప్పుడు ఆధార్ నమోదు చేసుకోవడంతో ఆ తర్వాత బయోమెట్రిక్ గుర్తింపు సమస్యగా మారింది. మరోవైపు చిన్నచిన్న తప్పిదాలు సైతం ఇబ్బందులకు గురిచేస్తోంది. చిన్నదానికి కూడా హైదరాబాద్‌కు తరలిరావడం పేదలకు భారంగా మారుతోంది.

ఏదీ..ఎలా మార్చుకోవచ్చు అంటే...

ఆధార్‌కార్డు అనేది గుర్తింపును చూపే ముఖ్యమైన సాధనంగా మారింది. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం చాలా అవసరం. భారత విశిష్ట ప్రాధికార గుర్తింపు సంస్థ (యూఐడీఏఐ) 2019లో ఆధార్‌కార్డులో చేర్పులు మార్పులపై కొన్ని నిబంధనలు విధించింది. ఆధార్ కార్డులో ఓ వ్యక్తి తన పేరు, జన్మదినం, జెండర్ వంటి వాటిని మార్చుకోవడం అప్‌డేట్ చేసుకునేందుకు పరిమితి విధించింది.

- యూఐడీఏఐ నిబంధనల ప్రకారం ఆధార్ కార్డులో పేరును కేవలం రెండుసార్లు మాత్రమే అప్‌డేట్ చేసుకోవచ్చు. ఇంటి పేరు, స్పెల్లింగ్ తప్పిదాలను సరిచేసుకోవచ్చు.



- ఆధార్ కార్డులో డేట్‌ఆఫ్‌బర్త్ కేవలం ఒకసారి మాత్రమే అప్‌డేట్ చేసుకోవాలి. దీనికీ కొన్ని షరతులు ఉన్నాయి. ఎన్‌రోల్‌మెంట్ సమయంలో ఇచ్చిన తేదీకి కేవలం మూడేళ్లు మాత్రమే తగ్గించుకోవచ్చు. అలాగే ఎంతైనా పెంచుకోవచ్చు. డేట్ మార్చుకోవాలనుకునే వారు తప్పనిసరిగా దానికి సంబంధించిన ఆధారాలు సమర్పించాలి.
- ఆధార్ కార్డులో జెండర్ వివరాలు ఒక్కసారి మాత్రమే మార్చుకోవచ్చు.
- ఆధార్ కార్డుపై ఉండే ఫొటోను మాత్రం ఎన్నిసార్లయినా మార్చుకోవచ్చు. దీనిపై ఎలాంటి పరిమితి లేదు. ఆధార్ నమోదు కేంద్రంలో ఫొటో అప్‌డేట్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో మార్చుకోవడం కుదరదు.
- అడ్రస్ ఎన్నిసార్లు అయినా మార్చుకోవచ్చు. దీనికి సంబంధించి చిరునామా ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.

ప్రాంతీయ కార్యాలయంలోనే

ఆధార్‌కార్డులో పేరు, పుట్టిన తేదీ వివరాలు, జెండర్ వివరాలను పరిమితికి మించి మార్చేందుకు వీల్లేదు. పరిమితి దాటిన తర్వాత ఏమైనా మార్పులు చేయాలనుకుంటే ప్రత్యేక పద్ధతి ఉంటుంది. ఇందుకు ప్రాంతీయ కార్యాలయంలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. ఈ–మెయిల్, పోస్ట్ ద్వారా కూడా ప్రాంతీయ కార్యాలయాలకు రిక్వెస్ట్ చేసుకోవచ్చు. యూఆర్‌ఎన్ స్లిప్, ఆధార్ వివరాలు, దానికి సంబంధించిన ఆధారాలను జత చేస్తూ ఎందుకు మార్చాల్సి వస్తుందో కూడా స్పష్టంగా వివరించాలి.

జూన్ 14 వరకు ఉచిత అప్‌డేట్‌కు అవకాశం

పదేళ్లు దాటిన ఆధార్‌కార్డుల అప్‌డేట్ తప్పనిసరి. ఆధార్ జారీ తర్వాత చాలామంది అప్‌డేట్ చేసుకోలేదు. వీరి కోసం యూఐడీఏఐ ఉచితంగానే..ఆధార్ కార్డులో తప్పులను సరిచేసుకోవడానికి ఆన్‌లైన్‌లో అవకాశం కల్పించింది. కొంతకాలంగా గడువు పొడిగిస్తూ వస్తోంది. ఈసారి జూన్ 14 వరకూ ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్ డేట్ చేసుకోవచ్చు. చిరునామా, పేర్లలో అక్షర దోషాలు సరిచేసుకోవాలంటే దానికి సంబంధించిన ప్రూఫ్ సమర్పించి అప్‌డేట్ చేసుకోవాలి.

అప్‌డేట్‌కు ప్రయత్నిస్తే తిరస్కరించి రద్దు చేశారు

అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రానికి వెళ్లాను. దరఖాస్తు నింపి ఇవ్వగా అప్‌లోడ్ చేశారు. కొద్ది రోజులకు రిజెక్ట్ అయ్యిందనే మెసేజ్ వచ్చింది. మళ్లీ దరఖాస్తు చేయగా ఆధార్ రద్దు అయ్యిందని చెప్పారు. హైదరాబాద్‌లోని రీజనల్ కార్యాలయానికి వెళ్లగా అక్కడ చెక్ చేసి కొత్త కార్డు జారీ చేస్తామని చెప్పి దరఖాస్తు తీసుకున్నారు. ఇంకా సమస్య పరిష్కారం కాలేదు.

– అక్షర, స్టూడెంట్, కామారెడ్డి జిల్లా

నెలరోజుల నుంచి తిరుగుతున్నా...

ఆధార్ కార్డులో పుట్టిన తేదీ తప్పుగా నమోదైంది. సరిచేసుకునేందుకు రీజినల్ కార్యాలయం చుట్టూ నెల రోజులుగా తిరుగుతున్నా. సరైన పత్రాలు సమర్పించి అప్‌లోడ్ చేయించినా కార్డు రాలేదు.

– సాయికుమార్, వికారాబాద్ జిల్లా

పేరు మారడం లేదు

ఆధార్ కార్డులో పేరు మార్చుకునేందుకు రెండు నెలల నుంచి రీజినల్ కార్యాలయానికి తిరుగుతున్నాను. వచ్చిన ప్రతిసారి కావాల్సిన పత్రాలు సమర్పించినా కార్డులో పేరు మాత్రం మారడం లేదు.

– బాషా, కర్నూలు

చట్టప్రకారం 3 వారాల్లో వారికి సభ్యత్వం ఇవ్వండి

మత్స్యకారుల సహకార శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట జిల్లా ఖాజీపూర్ గ్రామ మత్స్యకారుల సహకార సంఘంలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్న దాదాపు 40 మంది ముదిరాజ్‌లకు 3 వారాల్లో సభ్యత్వం ఇవ్వాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. దీని కోసం సరైన ఫార్మాట్‌లో వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. రికార్డుల ప్రకారం ఖాజీపూర్‌లో సర్వేనంబర్ 417లో 154 ఎకరాల్లో చెరువు ఉంది. చట్టప్రకారం ముదిరాజ్‌లకు కూడా గ్రామ మత్స్యకారుల సహకార సంఘంలో ప్రాథమిక సభ్యత్వం ఇవ్వాలని ఖాజీపూర్ గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పి.గణేశ్, ప్రధాన కార్యదర్శి భూపతి గత ఆగస్టులో అధికారులను కలిశారు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. తమకు గ్రామ మత్స్యకారుల సహకార సంఘంలో సభ్యత్వం ఇచ్చేలా ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. చట్టప్రకారం ముదిరాజ్ కులానికి చెందిన వారికి మత్స్యకారుల సహ కార సంఘంలో సభ్యత్వం ఇవ్వాల్సిందేనని, అధికారులు తిరస్కరించడానికి వీలులేదని పిటిషనర్ల తరఫున న్యాయవాది డీఎల్ పాండు వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్టప్రకారం 3 వారాల్లో వారి దరఖాస్తులను పరిశీలించి, నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఏ కష్టమొచ్చినా.. నేనున్నా..

తల్లి, ముగ్గురు పిల్లలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భరోసా

బంజారాహిల్స్(హైదరాబాద్): ఊరుగాని ఊరు.. హైదరాబాద్‌లో తెలిసిన వారు లేరు. కానీ యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముషిపట్ల నుంచి ముగ్గురు చిన్నపిల్లలతో బస్సెక్కింది ఓ తల్లి. కనిపించిన వారిని అడ్రస్ అడుగుతూ చివరికి మంత్రి కోమటిరెడ్డి ఇంటి వద్దకు చేరింది. రావైతే వచ్చింది కానీ..తెలిసిన మనిషిలేడు..బిక్కు బిక్కుమంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇంటి ఎదుట తన పిల్లలతో కూర్చుంది ఆ తల్లి. తన దినచర్యలో భాగంగా బయటకు వెళుతున్న మంత్రి.. అక్కడ కూర్చున్న ఆ తల్లిని చూసి.. ఎవరమ్మా అంటూ పలకరించారు.. మంత్రి పలకరింపుతో ఏడుస్తూ తన కష్టమంతా చెప్పింది ఆ మహిళ. తన భర్త బ్రెయిన్ స్ట్రోక్‌తో చనిపోయాడని ఆస్తులన్నీ అమ్మి చికిత్స చేయించానని, చేతిలో చిల్లిగవ్వ లేక పిల్లల్ని పోషించలేకపోతున్నానని.. సీఎంఆర్‌ఎఫ్ ఇప్పించాలని కోరింది. కారు దిగి ఆ అభాగ్యురాలిని, ముగ్గురు పిల్లల్ని ఇంట్లోకి తీసుకెళ్లి.. పిల్లలతో మాట్లాడి చలించిపోయారు. స్వయంగా మంత్రే ఇంట్లోకి వెళ్లి చాక్లెట్లు తెచ్చి అప్యాయంగా పిల్లలకు తినిపించారు. బాగా చదువుకోవాలని ఉంది సారూ.. అన్న ఆ చిన్నారుల మాటలకు భావోద్వేగానికి గురైన మంత్రి.. ఎంత చదివితే అంత వరకు చదివిస్తానని మాటిచ్చారు. ముగ్గురు పిల్లలతో ఇబ్బంది పడుతున్న ఆ తల్లి పరిస్థితిని గమనించి అప్పటికప్పుడే లక్ష రూపాయల ఆర్థికసాయం చేశారు.. సీఎం కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చూసే అధికారితో మాట్లాడి.. ముఖ్యమంత్రి అనుమతితో వైద్య ఖర్చులు మొత్తం మంజూరు చేయాలని ఆదేశించారు. తానే చెక్కును ఇంటికి పంపిస్తానని భరోసా ఇచ్చాడు. నేనున్నానని ఏ కష్టం వచ్చినా నా గుమ్మం తెరిచే ఉంటుందని భరోసా ఇచ్చి పంపించారు.



బాధితురాలితో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

డాక్టర్ రఘురామ్‌కు అరుదైన గౌరవం

దక్షిణాసియాలో ఈ ఫెలోషిప్ అందుకున్న మూడోవ్యక్తి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన కిమ్స్–ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్, ప్రఖ్యాత సర్జన్ డాక్టర్ రఘురామ్ పిల్లరిశెట్టికి అంతర్జాతీయస్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. శుక్రవారం వాషింగ్టన్‌డీసీలో అమెరికన్ సర్జికల్ అసోసియేషన్ (ఏఎస్‌ఏ) అధ్యక్షుడు ప్రొఫెసర్ స్టీవెన్ స్టెయిన్ డాక్టర్ రఘురామ్‌కు ఈ గౌరవ ఫెలోషిప్‌ను ప్రదానం చేశారు. ప్రపంచంలోనే అత్యంత అరుదైన ఫెలోషిప్ ఇది. 144 ఏళ్ల చరిత్రలో ఈ ఫెలోషిప్‌ను అందుకున్న దక్షిణాసియాకు చెందిన మూడో వ్యక్తి కావడం గమనార్హం. మన దేశం నుంచి మొదటి వ్యక్తి కావడం విశేషం. అమెరికా సహా ప్రపంచం నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రతినిధులకు డాక్టర్ రఘురామ్ సాధించిన ఘనతను ప్రొఫెసర్ స్టీవెన్ స్టెయిన్ వెల్లడించారు. ఈ సందర్భంగా స్టెయిన్ మాట్లాడుతూ ‘భారతదేశంలో రొమ్ము కేన్సర్ సంరక్షణలో విప్లవాత్మక మార్పులు చేయడంలో డాక్టర్ రఘురామ్ ఒక కీలక వ్యక్తి. వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. ఆ దేశంలో అత్యాధునిక సమకాలీన రొమ్ము కేన్సర్ చికిత్సపై అవగాహన కల్పించడానికి తన వృత్తి జీవితాన్ని అంకితం చేశారు. ఆయన రోల్ మోడల్. భారతదేశంలో సర్జరీకి అంకితమైన పెద్ద డాక్టర్. ఆయన అమెరికన్ సర్జికల్ అసోసియేషన్‌లో గౌరవ ఫెలోషిప్‌కు నిజంగా అర్హుడ’ని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘురామ్ మాట్లాడుతూ ఈ అత్యున్నత గౌరవాన్ని నా మాతృభూమి (భారత్)కి అంకితం చేస్తున్నానన్నారు. అవార్డు అందుకున్న అనంతరం డాక్టర్ రఘురామ్ ‘సాక్షి’తో మాట్లాడుతూ ఏఎస్‌ఏను 1880లో స్థాపించారని, అది అమెరికాకు చెందిన అత్యంత ప్రతిష్టాత్మకమైన సర్జికల్ అసోసియేషన్ అని చెప్పారు. అందులో సభ్యత్వం పొందడం మన దేశానికి గౌరవంగా భావిస్తున్నానన్నారు. తాను పద్మశ్రీ, డాక్టర్ బీసీ.రాయ్ అవార్డులు అందుకున్నానని తెలిపారు.



ఫెలోషిప్ అందుకున్న డాక్టర్ రఘురామ్ (కుడి చివర)

శ్రీశైలంలో ఉగాది ఉత్సవాలకు నేడు అంకురార్పణ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహాక్షేత్రంలో నిర్వహించనున్న ఉగాది మహోత్సవాలకు శనివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. దీంతో శ్రీగిరి క్షేత్రం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఐదు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేసింది. పాదయాత్ర భక్తులకు తాగునీరు, వైద్య శిబిరాలు, దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ, చలువ పందిర్లు ఏర్పాటు చేసింది.

స్వామి, అమ్మవార్ల దర్శనానికి మూడు రకాల క్యూలైన్లు సిద్ధం చేసింది. ఉత్సవాల్లో ప్రతిరోజు శ్రీభ్రమరాంబదేవికి ప్రత్యేక అలంకారం, శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి విశేష వాహన సేవ నిర్వహిస్తారు.

వ్యాపారంలా బతుకమ్మ చీరల పథకం

- టెస్కోకు గత ప్రభుత్వ బకాయిలు రూ.488.38 కోట్లు
- ప్రకటన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్: ‘బతుకమ్మ చీరల పథకాన్ని గడిచిన పదేళ్లుగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యాపారంగా మార్చింది. గత ఏడాది అక్టోబర్‌లో పంపిణీ చేసిన బతుకమ్మ చీరలకు సంబంధించి రూ.351.52 కోట్లు బకాయిలు పెట్టింది. మొత్తంగా నవంబర్ 2023 వరకు టెస్కోకు ప్రభుత్వం నుంచి రూ.488.38 కోట్లు బకాయిలు చెల్లించలేదు’ అని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాల్లో కేవలం 105 చేనేత సహకార సంఘాలకు మాత్రమే పని కల్పించింది’ అని ఆ ప్రకటనలో వెల్లడించింది. ‘రాష్ట్రంలో 140 మాక్స్ సొసైటీలు, 135 ఎస్‌ఎస్‌ఐ యూనిట్లు ఉన్నాయి. వీటి నుంచి గతంలో చేసిన కొనుగోళ్లు, చెల్లించిన బిల్లులు, విద్యుత్ వాడకం తదితరాలను పరిశీలిస్తే 30శాతం బోగస్ సొసైటీలు ఉన్నట్టుగా తేలింది’ అని ప్రకటనలో పేర్కొంది.

నేతన్నకు భరోసా

చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమానికి ‘నేతన్నకు భరోసా’ పేరిట దీర్ఘకాలిక లబ్ధి చేకూరే పథకాలకు రూపకల్పన చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కొత్త ప్రభుత్వం గడిచిన మూడు నెలల్లోనే సమగ్ర శిక్షా అభియాన్ యూనిఫామ్‌ల సరఫరాకు సుమారు రూ.47 కోట్లు అడ్వాన్స్‌గా చెల్లించింది. అన్ని చేనేత సంఘాలకు పని కల్పించేందుకు ఇప్పటికే రూ.53 కోట్ల విలువైన వస్త్రాలు కొనుగోలు చేసింది. చేనేత సహకార సంఘాలకు రూ.8.81 కోట్ల బకాయిలు విడుదల చేయడంతో పాటు అన్ని ప్రభుత్వ శాఖలు టెస్కో ద్వారానే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. టెస్కోలో లభ్యం కాని వస్త్రాలు కూడా నాన్ అవైలబులిటీ సర్టిఫికెట్ ఇస్తే తప్ప ప్రైవేటు ఏజెన్సీల నుంచి కొనుగోలు చేసే ప్రసక్తి ఉండదు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖలు వస్త్రాల సరఫరాకు టెస్కోకు రూ. 255.27 కోట్ల విలువైన ఆర్డర్లు ఇచ్చాయి’ అని ప్రభుత్వం ఆ ప్రకటనలో స్పష్టం చేసింది.

నేతన్నల జీవన ప్రమాణాలు పెంచుతాం

చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: నేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని, కానీ కొందరు రాజకీయ లబ్ధి కోసం తమ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం నేతన్నల బతుకులు ఆగం చేసిందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు.గతంలో కంటే ఎక్కువగా నేతన్నలకు చేతినిండా ఆర్డర్లు ఇస్తున్నామని, గత ప్రభుత్వం చేసిన బకాయిలను కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. బతుకమ్మ చీరల పేరు మీద అనర్హులకు లబ్ధి చేకూర్చి, నేతన్నల బతుకులని ఆగం చేసిన మీరు.. ఇప్పుడు లేఖ పేరిట రాజకీయం చేయడం చూస్తుంటే, దొంగే దొంగా దొంగ అన్నట్లు ఉందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం చేనేత సహకార సంఘాలను విస్మరించి మాక్స్ సహకార సంఘాలను ప్రోత్సహించటంతో నిజమైన చేనేత కార్మికులకు లబ్ధి చేకూరలేదని, వాస్తవంగా 393 చేనేత సహకార సంఘాలు ఉన్నప్పటికీ, 105 చేనేత సహకార సంఘాలకు మాత్రమే పని కలిపించారని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలోని మొత్తం చేనేత సహకార సంఘాల సభ్యులకు పని కల్పించేందుకు రూ. 53 కోట్ల విలువైన వస్త్రాలను కొనుగోలు చేశామని, ఇప్పటికైనా బీఆర్‌ఎస్ నాయకులు ఆత్మవిమర్శ చేసుకొని తెలంగాణ సమాజ శ్రేయస్సు కోసం నిర్మాణాత్మక సలహాలు ఇస్తే వాటిని పరిశీలించడానికి ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని మంత్రి తుమ్మల తెలిపారు.

నేతన్న, గీతన్నలకు అండగా ఉంటాం: మంత్రి పొన్నం

- బీఆర్‌ఎస్ ట్రాప్‌లో పడకండి
- కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే వర్షాభావ పరిస్థితులు



సాక్షి,హైదరాబాద్: రాష్ట్రంలో నేత, గీత కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగానే ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హామీనిచ్చారు. రాష్ట్ర ప్రజలు బీఆర్‌ఎస్ ట్రాప్‌లో పడవద్దని ఆయన కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడే వర్షాభావ పరిస్థితులేర్పడ్డాయన్నారు. ఆ కారణంగానే భూగర్భ జలాలు అడుగంటాయని, రైతులకు నష్టం జరిగేందుకు వర్షాభావ పరిస్థితులే కారణమని మంత్రి పొన్నం వివరించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పటి నీటినిల్వలు, నీటి లభ్యత, తాము అధికారంలోకి వచ్చాక ఎలా వాడామో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కరువు కాంగ్రెస్ తెచ్చిందని అర్థం లేని మాటలు మాట్లాడటం సరైంది కాదని, కరువుకు కారణం బీఆర్‌ఎస్ పార్టీయేనని విమర్శించారు. ప్రతిపక్ష నేత కేసీఆర్ పంటపొలాల సందర్శన సందర్భంగా రైతుకు ఎక్కడైనా ఇబ్బంది వచ్చి ఉంటే ప్రభుత్వానికి చూపించాలన్నారు. ం బీజేపీ నేతలకు రైతు ప్రయోజనాల గురించి చిత్తశుద్ధి ఉంటే తమతో కలిసి వస్తే ప్రధాని మోదీ దగ్గర అడుగుదామని, మధ్యవర్తిగా కిషన్‌రెడ్డి వచ్చి కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల భారతం చూసొద్దాం!

ఎలక్షన్ టూరిజం.. ఇదో సరికొత్త ట్రెండ్

ఓట్ల పండుగను కళ్లారా చూసేందుకు విదేశీ టూరిస్టుల క్యూ | విహార యాత్రలతో కలగలిపి ప్యాకేజీలు | రూ.40,000 – 1.5 లక్షల రేంజ్‌లో...

97 కోట్ల మంది ఓటర్లు | **1.5** కోట్ల మంది పోలింగ్–భద్రతా సిబ్బంది | **55** లక్షల ఈవీఎంలు | **10.5** లక్షల పోలింగ్ స్టేషన్లు

ప్రపంచ ప్రజాస్వామ్య జాతరలో పూనకాలు లోడింగ్... అని చెప్పేందుకు ఈ అంకెలు చాలు! 1952 నుంచి ఇప్పటిదాకా ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా క్రమం తప్పకుండా ఎన్నికలు జరిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ట్రాక్ రికార్డు ఇది. అంతేకాదండోయ్... యూరప్ మొత్తం జనాభా (75 కోట్లు) కంటే ఈ ఎన్నికల్లో మన ఓటర్లే ఎక్కువ! అందుకే ఇప్పుడు ప్రపంచమంతా మన ఓట్ల పండుగ వైపు చూస్తోంది. విదేశీ టూరిస్టులు కూడా ఈ కోలాహలాన్ని కళ్లారా చూసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ ఆసక్తిని గమనించిన పలు భారతీయ ట్రావెల్ కంపెనీలు వినూత్న ఐడియాతో వారికి 'ద గ్రేట్ ఇండియన్ ఎలక్షన్ మేజిక్'ను చూపించేందుకు ప్లాన్ చేశాయి. అదే 'ఎన్నికల టూరిజం'. దేశంలో ఇప్పుడిది నయా ట్రెండ్!

'కోడ్' కూతతో 7 విడతల్లో 44 రోజుల పాటు ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మెగా సార్వత్రిక సమరంలో పార్టీల ప్రచారం జోరందుకుంది. ఇసుకేస్తే రాలనంత జనంతో భారీ సభలు.. పోటీ చేసే అభ్యర్థులు చేసే విన్యాసాలు... ప్రసంగాల్లో నేతల వాగ్దాటి... రాత్రికిరాత్రే పార్టీలు మార్చే ఆయారాంలు, గయారాంలు.. హోరెత్తించే ర్యాలీలు.. కార్యకర్తల సందడితో దేశమంతా ఎన్నికల జ్వరం ఆవహించింది. మనకు ఇవేమీ కొత్తకాదు. అయితే, ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల క్రతువును ప్రత్యక్షంగా చూడాలనుకునే విదేశీయుల కోసం దేశంలోని పలు ట్రావెల్ ఏజెన్సీలు ఎన్నికల టూరిజం పేరుతో ప్రత్యేక ప్యాకేజీలను అందిస్తున్నాయి.



2019లో ప్రత్యేకంగా పార్లమెంట్ ఎన్నికలను చూసేందుకు దాదాపు 8,000 మంది విదేశీ టూరిస్టులు వచ్చినట్లు అంచనా. ముఖ్యంగా అమెరికా, చైనా, నేపాల్, యూఏఈ, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలకు చెందిన వారు ఇందులో ఉన్నారు. విద్యార్థులు, జర్నలిస్టులు, రీసెర్చ్ స్కాలర్లు, మహిళా బృందాలు, చరిత్ర–సంస్కృతి, రాజకీయాల పట్ల మక్కువ చూపేవారు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. ఈసారి ఎన్నికల టూరిజం కోసం 25,000 మందికి పైగానే విదేశీ పర్యాటకులు రావచ్చని ట్రావెల్ కంపెనీలు లెక్కలేస్తున్నాయి.

మెక్సికో స్ఫూర్తి

2005లో మెక్సికోలో బాగా విజయవంతమైన పోల్ టూరిజం స్ఫూర్తితో అహ్మదాబాద్‌కు చెందిన అక్షర్ ట్రావెల్స్ అనే సంస్థ ఈ కాన్సెప్టును తొలిసారి దేశంలో ప్రవేశపెట్టింది. 2012 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రత్యేక ప్యాకేజీలతో ఆకట్టుకుంది. వన్యప్రాణుల టూరిజం... మెడికల్ టూరిజం... విలేజ్ టూరిజం... హిమాలయన్ ట్రెక్కింగ్ టూరిజం... తీర్థయాత్రల టూరిజం... దేవాలయాలు–ఆధ్యాత్మిక టూరిజం.. యోగా టూరిజం.. ఇలా విదేశీ టూరిస్టులను ఆకర్షిస్తున్న జాబితాలోకి ఎన్నికల టూరిజాన్ని కూడా చేర్చింది. గుజరాత్‌లో సక్సెస్ కావడంతో 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ దేశవ్యాప్తంగా దీన్ని కొనసాగించినట్లు ఆ సంస్థ చైర్మన్ మనీష్ శర్మ చెప్పారు. 'ఎన్నికల సమయంలో భారత్‌ను సందర్శించేందుకు ఆసక్తి చూపుతున్న విదేశీ టూరిస్టుల్లో యూరోపియన్లు, మధ్య ప్రాచ్యం, పశ్చిమాసియాకు చెందిన వారు ఎక్కువ. ర్యాలీల్లో లక్షలాది మంది పాల్గొనడం వారికి సరికొత్త అనుభూతిని అందిస్తోంది' అని ఆయన వివరించారు. ప్రస్తుతం దేశంలో 20కి పైగానే ట్రావెల్ ఏజెన్సీలు ఎలక్షన్ టూరిజం ప్యాకేజీలను ఆఫర్ చేస్తున్నాయి. 6 రోజులకు ప్రారంభ ధర రూ.40,000 కాగా, 2 వారాల ప్యాకేజీకి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు వసూలు చేస్తున్నాయి.

ప్యాకేజీల ప్రత్యేకతేంటి?

అటు పర్యాటకంగా, ఇటు రాజకీయంగా ఆసక్తి రేకెత్తించే కీలక ప్రాంతాలు, రాష్ట్రాలను ఏజెన్సీలు ప్రధానంగా ఎంచుకుంటున్నాయి. వారణాసి, ఢిల్లీతో సహా కేరళ, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటివి ఎన్నికల టూరిజం ప్యాకేజీల్లో ప్రధానంగా చోటు దక్కించుకుంటున్నాయి. భారీ ఎన్నికల ర్యాలీలు, సభల్లో పాల్గొనడంతో పాటు స్థానిక రాజకీయ నాయకులతో మాటామంతీ, కలిసి భోజనం చేయడం, గ్రామ పంచాయతీలను సందర్శించడం వంటివన్నీ ప్యాకేజీల్లో చేరుస్తున్నారు. పోటీ చేసే అభ్యర్థులను కలుసుకునే అవకాశాన్ని కూడా టూరిస్టులకు కల్పిస్తున్నారు. దీనివల్ల వారి ప్రచార వ్యూహాలు, ఇతరత్రా ఎన్నికల సంబంధ విషయాలను నేరుగా తెలుసుకోవడానికి వీలవుతుంది. కేవలం ఎన్నికల కార్యక్రమాలనే కాకుండా చుట్టుపక్కల గుళ్లూ గోపురాలు, కోటలు, బీచ్‌ల వంటి ముఖ్యమైన పర్యాటక ప్రదేశాలను చుట్టేసే విధంగా ప్యాకేజీలను రూపొందిస్తున్నామని శర్మ వివరించారు. అంతేకాదు ధాబాల్లో భోజనం, స్థానికంగా నోరూరించే వంటకాలను రుచి చూపించడం, ఆ ప్రాంతంలోని సంస్కృతి, సంప్రదాయాలతో పర్యాటకులు మమేకం కావడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కాగా, ఢిల్లీకి చెందిన ఇన్‌క్రెడిబుల్ హాలిడేస్ అనే సంస్థ విదేశీ టూరిస్టులతో పాటు దేశీ పర్యాటకులకు కూడా ఇలాంటి ప్యాకేజీలను అందిస్తోంది. సందర్శనీయ ప్రదేశాలను చూపడంతో పాటు ఎన్నికల సంబంధ కార్యక్రమాల్లో కూడా పాల్గొనే విధంగా పర్యాటకుల అభిరుచిని బట్టి ప్యాకేజీలను రూపొందిస్తున్నామని ఈ కంపెనీ కన్సల్టింగ్ పార్ట్‌నర్ సుదేశ్ రాజ్‌పుత్ పేర్కొన్నారు. ఒక్కో వ్యక్తికి ప్యాకేజీ రూ.25,000 నుంచి ప్రారంభమవుతుందని ఆయన వివరించారు. ట్రావెట్రిబేట్.కామ్ ప్యాకేజీ కూడా ఇలాంటిదే. ఢిల్లీలోని ఎలక్షన్ మ్యూజియం సందర్శనలో మన ఎన్నికల చరిత్ర, చిరస్మరణీయ నాయకుల గురించి తెలుసుకోవడం, పోలింగ్‌ను తీరును చూపించడం, ఫలితాల రోజు కౌంటింగ్ కేంద్రాల వద్ద ఉత్కంఠ, విజేతల సంబరాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం వంటి పలు ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్



ఎన్నికల వి‘చిత్రం’

కేరళలోని త్రిసూర్ జిల్లాలో అధికార ఎల్డీఎఫ్‌కు చెందిన త్రిసూర్ లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి వీఎస్ సునీల్ కుమార్ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతో ఇలా ఓ మహిళ సెల్ఫీ సరదా తీర్చుకున్నారు.

ముంచుకొస్తున్న బర్డ్‌ఫ్లూ ముప్పు!

- అమెరికాలో మరో హెచ్5ఎన్1 వేరియంట్ కేసు
- కోవిడ్–19 తరహాలో మహమ్మారిగా మారొచ్చు
- అమెరికా సైంటిస్టుల హెచ్చరిక

ప్రపంచమంతటా కోవిడ్–19 మహమ్మారి సృష్టించిన విలయం అందరికీ తెలిసిందే. లక్షల మంది బలయ్యారు. అలాంటి ప్రాణాంతక మహమ్మారి మరొకటి మానవులకు వ్యాపించే అవకాశాలు అధికంగా ఉన్నాయని అమెరికా సైంటిస్టులు హెచ్చరిస్తున్నారు. అమెరికాలోని టెక్సాస్‌లో బర్డ్‌ఫ్లూ వైరస్‌లో హెచ్5ఎన్1 అనే వేరియంట్ తొలుత ఆవులకు, తర్వాత ఆవుల నుంచి ఓ కార్మికుడికి వ్యాప్తి చెందినట్లు గుర్తించారు. అతడిని పరీక్షించగా బర్డ్‌ఫ్లూ పాజిటివ్‌గా తేలింది. ఏప్రిల్ 1న ఈ కేసు బయటపడినట్లు యూఎస్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ప్రివెన్షన్(సీడీసీ) నిర్ధారించింది. బాధితుడి కళ్లు ఎర్రగా మారాయి. బర్డ్‌ఫ్లూ లక్షణాల్లో కండ్లకలక కూడా ఒకటి. అమెరికాలో మనిషికి బర్డ్‌ఫ్లూ హెచ్5ఎన్1 వేరియంట్ సోకడం ఇది రెండో కేసు. బాధితుడిని ఐసోలేషన్‌కు తరలించి, చికిత్స అందించారు. ప్రస్తుతం కోలుకుంటున్నట్లు డాక్టర్లు చెప్పారు. వైరస్ సోకినట్లు వెంటనే గుర్తించడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు.

- అమెరికాలో మనుషులకు సోకిన తొలి బర్డ్‌ఫ్లూ కేసు 2022లో కొలరాడోలో బయటపడింది.
- బర్డ్‌ఫ్లూ వైరస్ గత కొన్ని దశాబ్దాలుగా మహమ్మారుల జాబితాలో తొలి స్థానంలో ఉందని పిట్స్‌బర్గ్‌కు చెందిన బర్డ్‌ఫ్లూ పరిశోధకుడు డాక్టర్ సురేశ్ కూచిపూడి చెప్పారు. ఇది ప్రమాదకరంగా మారుతోందని, మనుషులకు సోకే అవకాశాలు పెరుగుతున్నాయని వెల్లడించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.
- కోవిడ్–19తో పోలిస్తే బర్డ్‌ఫ్లూ హెచ్5ఎన్1 వేరియంట్ 100 రెట్లు ప్రాణాంతకం కావొచ్చని ఫార్మా ఇండస్ట్రీ కన్సల్టెంట్ జాన్ ఫల్టన్ వెల్లడించారు. ఇందులో మ్యుటేషన్లు(మార్పులు) జరిగితే బాధితుల్లో మరణాల రేటు భారీగా పెరుగుతుందని చెప్పారు.
- నిజానికి ఇతర దేశాల్లోనూ మనుషులకు బర్డ్‌ఫ్లూ సోకిన సంఘటనలున్నాయి. 2003 జనవరి 1 నుంచి 2024 ఫిబ్రవరి 26 దాకా 23 దేశాల్లో 887 కేసులు బయటపడ్డాయి. వీరిలో 462 మంది బాధితులు ప్రాణాలు కోల్పోయారు. అంటే 52 శాతం మంది మృత్యువాత పడినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలియజేసింది.
- మనుషులు బర్డ్‌ఫ్లూ బారినపడితే శ్వాస ఆడకపోవడం, చలి, అలసట, తలనొప్పి, గొంతునొప్పి, జ్వరం, కండరాల నొప్పి వంటి లక్షణాలు ఉంటాయి. బాధితులకు యాంటీ వైరల్ ఔషధాలు ఇస్తుంటారు.

సాక్షి, నేషనల్ డెస్క్

ఐదు న్యాయాలు.. 25 గ్యారంటీలు

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో 'న్యాయ్ పత్ర–2024' విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ప్రకటనకు ముందు వివిధ సందర్భాల్లో ఇచ్చిన హామీలతో కూడిన ఎన్నికల ప్రణాళిక(మేనిఫెస్టో)ను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. యువతకు ఉద్యోగాల కల్పన, నిమ్నవర్గాల సంక్షేమం, సంపద సృష్టి వంటి కీలక హామీలను ప్రకటించింది. పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ఆపన్న హస్తం అందిస్తామని వాగ్దానం చేసింది. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, అగ్నిపథ్ పథకం రద్దు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తివేత, దేశవ్యాప్తంగా కుల గణన వంటి అంశాలను మేనిఫెస్టోలో చేర్చింది. శుక్రవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ చిదంబరం, కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ 'న్యాయ్ పత్ర–2024' పేరిట 45 పేజీల మేనిఫెస్టోను విడుదల చేశారు. ఇందులో ప్రధానంగా వివిధ వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఐదు న్యాయాలను ప్రకటించారు. ఒక్కో న్యాయం కింద ఐదు గ్యారంటీల చొప్పున మొత్తం 25 గ్యారంటీలు ఇచ్చారు.



శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేస్తున్న సోనియా, ఖర్గే, రాహుల్

ఐదు న్యాయాలు ఏమిటంటే..

నారీ న్యాయ్
- మహాలక్ష్మీ పథకం కింద దేశవ్యాప్తంగా పేద కుటుంబాల్లోని మహిళకు ఏడాదికి రూ.లక్ష నగదు బదిలీ
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు
- ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు రెట్టింపు వేతనం
- మహిళ హక్కుల రక్షణ కోసం ప్రత్యేకంగా 'మైత్రి' అధికారి నియామకం
- మహిళా ఉద్యోగుల కోసం సావిత్రి బాయి పూలే పేరుతో వసతి గృహాలు

యువ న్యాయ్
- కేంద్ర ప్రభుత్వంలో వివిధ శాఖల్లో 30 లక్షల ఉద్యోగాల భర్తీ
- యువత కోసం 'అప్రెంటీస్‌షిప్ హక్కు చట్టం'. డిప్లొమా చదివినవారికి లేదా 25 ఏళ్లలోపు ఉన్న గ్రాడ్యుయేట్‌కు ఏడాది పాటు అప్రెంటీస్‌షిప్ చేసే అవకాశం. వారికి సంవత్సరానికి రూ.లక్ష సాయం.
- ప్రశ్నాపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కఠిన చట్టం
- గిగ్ వర్కర్ల సామాజిక భద్రతకు చర్యలు
- స్టార్టప్ కంపెనీలు ప్రారంభించే యువత కోసం రూ.5,000 కోట్ల నిధి

కిసాన్ న్యాయ్
- స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస గిట్టుబాటు ధర(ఎంఎస్పీ)కు చట్టబద్ధత
- రుణమాఫీ కమిషన్ ఏర్పాటు
- పంట నష్టపోయిన 30 రోజుల్లో బీమా పరిహారం చెల్లింపు
- రైతులు లబ్ధి పొందేలా ఎగుమతి, దిగుమతి విధానం
- వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ మినహాయింపు

శ్రామిక్ న్యాయ్
- కార్మికుల కోసం ఆరోగ్య హక్కు చట్టం
- కనీస వేతనం రోజుకు రూ.400. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సైతం వర్తింపు
- పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ పథకం అమలు
- అసంఘటిత రంగాల్లోని కార్మికులకు జీవిత బీమా, ప్రమాద బీమా వర్తింపు
- ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాలు రద్దు

హిస్సేదారీ న్యాయ్
- అధికారంలోకి రాగానే సామాజిక, ఆర్థిక కుల గణన
- ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ల విషయంలో 50 శాతం సీలింగ్(పరిమితి) తొలగింపు
- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు
- జల్, జంగల్, జమీన్‌పై చట్టబద్ధమైన హక్కులు
- గిరిజనులు అధికంగా ఉన్న ప్రాంతాలకు షెడ్యూల్డ్ ఏరియాలుగా గుర్తింపు

న్యాయ్ పత్రలోని కీలక హామీలు

- సీనియర్ సిటిజన్లు, వితంతువులకు నెలకు రూ.1,000 చొప్పున పెన్షన్
- రైల్వే ప్రయాణాల్లో వృద్ధులకు రాయితీ
- 'ఒకే దేశం, ఒకే ఎన్నిక' ఆలోచనకు చెల్లుచీటి..
- పదో షెడ్యూల్ సవరణ. పార్టీ ఫిరాయించిన నేతల లోక్‌సభ, అసెంబ్లీ సభ్యత్వాలు రద్దు
- సైన్యంలో నియామకాలకు ఉద్దేశించిన అగ్నిపథ్ పథకం రద్దు
- అన్ని కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం కోటా అమలు.
- జమ్మూకశ్మీర్‌కు, పుదుచ్చేరికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా
- ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా

ఎన్నికల తర్వాత ప్రధాని అభ్యర్థి: రాహుల్

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అధికార ఎన్డీయేకు పరాభవం తప్పదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. 2004లో 'భారత్ వెలిగిపోతోంది' అంటూ ఎన్నికలకు వెళ్లిన ఎన్డీయే బోల్తా పడిందని, ఈసారి కూడా అదే పునరావృతం కాబోతోందని జోస్యం చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో 'ఇండియా' కూటమి విజయం ఖాయమని అన్నారు. ఎన్నికల్లో నెగ్గిన తర్వాత తమ ప్రధానమంత్రి అభ్యర్థిని ఉమ్మడిగా నిర్ణయిస్తామని తెలిపారు. తమ పార్టీ మేనిఫెస్టోను ప్రజలే రూపొందించారని, ఇందులో అక్షరాలను మాత్రమే తాము ముద్రించామని వివరించారు. 99 శాతం మంది ప్రజలు కోరుకున్న అంశాలు మేనిఫెస్టోలో ఉన్నాయని తెలిపారు. అదానీ లాంటి కేవలం ఒకటి, రెండు శాతం మంది బడా బాబులు కోరుకున్న అంశాలు బీజేపీ మేనిఫెస్టోలో ఉంటాయని ఎద్దేవా చేశారు.

సోమా కాంతిసేన్‌కు బెయిల్

న్యూఢిల్లీ: 2018 నాటి ఎల్గార్ పరిషత్–మావోయిస్ట్ సంబంధాల కేసులో ఉద్యమకారిణి సోమా కాంతి సేన్(66)కు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆమెను సుదీర్ఘకాలం నిర్బంధించడంతోపాటు అభియోగాల నమోదులో అవుతున్న జాప్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ ఆగస్టిన్ జార్జి మసీహ్‌ల ధర్మాసనం తెలిపింది. మావోయిస్ట్ పార్టీకి కొత్త రిక్రూట్‌మెంట్ల కోసం ఆమె సాయం చేసినట్లుగా ఎన్ఐఏ ఎటువంటి ఆధారాలను చూపలేకపోయిందని పేర్కొంది.

కేజ్రీవాల్ అరెస్ట్ వెనుక బీజేపీ సీనియర్ కుట్ర

ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ ఆరోపణ

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీలో అవకతవకల కేసులో బీజేపీ సీనియర్ నేత ఒకరు కుట్ర పన్ని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయించారని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. కేసులో అప్రూవర్‌గా మారిన మాగుంట రాఘవ్‌పై ఒత్తిడి చేసి కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా తప్పుడు వాంగ్మూలం ఇచ్చేలా చేశారని శుక్రవారం ఢిల్లీలో పత్రికాసమావేశంలో సంజయ్ చెప్పారు. ఇదే కేసులో చాలా వారాలపాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉండి సంజయ్ రెండు రోజుల క్రితమే బెయిల్‌పై విడుదలైన సంగతి విదితమే. '' కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇవ్వాలని లోక్‌సభ ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిపై బీజేపీ ఒత్తిడి చేసింది. అందుకు ఆయన ఒప్పుకోలేదు. దీంతో ఆయన కుమారుడు మాగుంట రాఘవ్‌ను లక్ష్యంగా చేసుకుని అరెస్ట్‌చేశారు. పలుమార్లు అధికారులు ప్రశ్నించడంతో మాగుంట రాఘవ్ కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా తప్పుడు వాంగ్మూలం ఇచ్చారు. ఇలా పెద్ద కుట్రలో భాగమయ్యారు. ఢిల్లీ సీఎంను కటకటాల వెనక్కి పంపడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది' అని సంజయ్ అన్నారు.

రష్యాపై డ్రోన్లతో దాడి

కీవ్: రష్యా భూభాగంపై ప్రతి దాడులను ఉక్రెయిన్ ముమ్మరం చేసింది. శుక్రవారం సరిహద్దుల్లోని రష్యాకు చెందిన రోస్టోవ్ ప్రాంతంపైకి ఉక్రెయిన్ పదుల సంఖ్యలో డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో మొరొజొవ్‌స్కీ ఎయిర్ ఫీల్డ్‌లోని ఆరు సైనిక విమానాలు ధ్వంసం కాగా, మరో ఎనిమిదింటికి నష్టం వాటిల్లిందని ఉక్రెయిన్ తెలిపింది. 20 మంది సిబ్బంది చనిపోయినట్లు ప్రకటించుకుంది. మొరొజొవ్‌స్కీ ప్రాంతంపైకి వచ్చిన 44 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. వైమానిక స్థావరంపై దాడి, యుద్ధ విమానాలకు జరిగిన నష్టంపై రష్యా స్పందించలేదు. దాడుల్లో ఒక విద్యుత్ ఉపకేంద్రం మాత్రం ధ్వంసమైందని పేర్కొంది. సరటోవ్, కుర్స్క్, బెల్గొరోడ్, క్రాస్నోడార్‌లపైకి వచ్చిన డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా ఆర్మీ తెలిపింది.

ఆ పదాలు తొలగింపు


స్కూలు పాఠ్యపుస్తకాల్లో మార్పులు సూచించిన ఎన్‌సీఈఆర్‌టీ

న్యూఢిల్లీ: పాఠశాల పాఠ్యపుస్తకాల్లో బాబ్రీ మసీదు కూల్చివేత, గుజరాత్ అల్లర్లలో ముస్లింల హత్య, హిందూత్వ తదితర పదాలు, వాక్యాలను తొలగిస్తున్నట్లు జాతీయ విద్యాపరిశోధనా, శిక్షణా మండలి(ఎన్‌సీఈఆర్‌టీ) పేర్కొంది. పాఠ్యపుస్తకాల్లో కాలానుగుణంగా చేయాల్సిన మార్పుల్లో భాగంగా ఈ సవరణలు చేపట్టినట్లు ఎన్‌సీఈఆర్‌టీ తెలిపింది. ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన అంశంలో పాక్ ఆక్రమిత జమ్మూకశ్మీర్(పీఓకే) అనే పదానికి బదులు ఆజాద్ పాకిస్తాన్ అనే పదాన్ని చేర్చారు. పుస్తకాల నుంచి కొన్ని పాఠ్యాంశాల తొలగింపుపై ఎన్‌సీఈఆర్‌టీ స్పందించింది. '' పుస్తకాల ఆధునీకరణలో జరిగే సాధారణ ప్రక్రియ ఇది. నూతన విద్యా ప్రణాళిక కింద చేసే కొత్త పాఠ్యపుస్తకాల తయారీకి దీనితో ఏ సంబంధం లేదని అధికారులు స్పష్టంచేశారు. ఇతర తరగతుల పుస్తకాలతోపాటు 11, 12 తరగతుల రాజనీతి శాస్త్రం, సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకాల్లో ఈ మార్పులు చేశారు. 11వ తరగతిలో లౌకికవాదం అనే 8వ చాప్టర్‌లో '' 2002 గుజరాత్ గోధ్రా అల్లర్ల తర్వాత వేయికిపైగా ఊచకోతకు బలయ్యారు. ఇందులో ముస్లింలే ఎక్కువ'' అనే వాక్యంలో ముస్లింలు అనే పదం తొలగించారు. అల్లర్ల ప్రభావం అన్ని మతాలపై ఉన్న కారణంగా ఒక్క మతాన్నే ప్రస్తావించడం సబబు కాదని ఎన్‌సీఈఆర్‌టీ భావించింది. 12వ తరగతి రాజనీతిశాస్త్రం పుస్తకంలోని 'స్వాతంత్ర్యం నుంచి భారత రాజకీయాలు' చాప్టర్‌లో కొత్తగా ఆర్టికల్ 370 రద్దును జతచేశారు. 8వ చాప్టర్‌లో '' 1992 డిసెంబర్‌లో బాబ్రీ మసీదు కూల్చివేతతో ఎన్నో విపరిణామాలు జరిగాయి. ఇది బీజేపీ, హిందూత్వ వ్యాప్తికి దారితీసింది''అన్న వాక్యాలకు బదులు ' శతాబ్దాలనాటి రామజన్మభూమి ఆలయ వివాదం దేశ రాజకీయాలనే మార్చేసింది'' అని మార్చారు. ఇందులో హిందూత్వ పదాన్ని తొలగించారు.

ఎలక్షన్ బీట్

అసలైన అభివృద్ధి ముందుంది

గత పదేళ్ల పాలన భోజనంలో ఒక స్టార్టర్ మాత్రమే: మోదీ



జైపూర్: ప్రధాని నరేంద్ర మోదీ తమ పదేళ్లకాలంలో దేశంలో జరిగిన అభివృద్ధిని ఆకలి పుట్టించే స్టార్టర్‌గా అభివర్ణించారు. అసలైన అభివృద్ధి భోజనం ముందుందని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజస్థాన్‌లోని చురులో జరిగిన ర్యాలీలో మోదీ మాట్లాడారు. భారత సైన్యాన్ని కాంగ్రెస్ అవమానిస్తోందని ఇదే కాంగ్రెస్ అసలైన మనస్తత్వమని విపక్ష పార్టీపై మోదీ విమర్శలు గుప్పించారు. ' ఇప్పుడున్న నయా భారత్ శత్రువును ఇంట్లోకి చొరబడి మరీ దెబ్బ కొట్టగలదు. శత్రువు గడ్డపైనా దాడి చేసే సరికొత్త భారత్ ఆవిష్కృతమైంది' అని అన్నారు. '' గత పదేళ్లలో జరిగిన అభివృద్ధి ఒక ట్రైలర్ మాత్రమే. అది భోజనాల వేళ ఆకలి పుట్టించే స్టార్టర్ మాత్రమే. అసలైన మెయిన్ కోర్సు భోజనం(అభివృద్ధి) ముందుంది. చేయాల్సిన అభివృద్ధి ఇంకా చాలా ఉంది. ఇంకా ఎన్నో కలలున్నాయి. దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి మనం' అని అన్నారు.

మంత్రి అతిశికి ఈసీ నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ: ఆప్ నాయకురాలు, ఢిల్లీ మంత్రి అతిశికి కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. బీజేపీలో చేరకపోతే నెలరోజుల్లోపు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్ట్‌చేస్తుందని బీజేపీ తనను తన సన్నిహిత వ్యక్తి ద్వారా సంప్రదించిందని అతిశి ఏప్రిల్ రెండో తేదీన సంచలన వ్యాఖ్యలు చేయడం తెల్సిందే. ఈ వాఖ్యలు అవాస్తవాలని పేర్కొంటూ బీజేపీ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దీంతో శుక్రవారం అతిశికి ఈసీ షోకాజ్ నోటీసులు పంపింది. బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు బలం చేకూర్చే అంశాలను పేర్కొంటూ సోమవారం మధ్యాహ్నంకల్లా తమకు సవివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులో ఈసీ పేర్కొంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న వేళ ఇతర పార్టీల నేతలపై ఆరోపణలు చేసేప్పుడు అప్రమత్తంగా ఉండాలని, నిరాధార ఆరోపణలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన కిందకు వస్తాయని ఈసీ స్పష్టంచేసింది.

బీజేపీలో చేరిన ఎంపీ సుమలత



యశవంతపుర: బహుభాషా నటి, కర్ణాటకలోని మాండ్య స్వతంత్ర ఎంపీ సుమలతా అంబరీశ్(60) శుక్రవారం బీజేపీలో చేరారు. బెంగళూరులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ నేత యడియూరప్ప, పార్టీ రాష్ట్ర చీఫ్ విజయేంద్ర తదితరుల సమక్షంలో సుమలత పార్టీ కండువా కప్పుకున్నారు. తన రాజకీయ జీవితంలో ఇది ముఖ్యమైన మంచి రోజుగా సుమలత పేర్కొన్నారు.


ఎస్పీ అభ్యర్థి నామినేషన్ తిరస్కృతి

పన్నా(మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని ఖజురహో లోక్‌సభ స్థానంలో ప్రతిపక్ష ఇండియా కూటమికి ఎదురుదెబ్బ తగిలింది. కూటమి సీట్ల సర్దుబాటులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాన్ని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి కేటాయించింది. ఎస్పీ అభ్యర్థి వేసిన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. 'ఎస్పీ అభ్యర్థిని మీరా యాదవ్ బీ ఫారంలో సంతకం చేయలేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల ఓటరు జాబితా ధ్రువీకరించిన ప్రతిని జత చేయలేదు. ఈ కారణాలతో రిటర్నింగ్ అధికారి కూడా అయిన పన్నా జిల్లా కలెక్టర్ ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు' అని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

శశి థరూర్‌కు రూ. 55 కోట్ల ఆస్తులు

తిరువనంతపురం: కేరళలోని తిరువనంతపురం లోక్‌సభ సీటును వరుసగా నాలుగోసారి కైవసం చేసుకోవాలని చూస్తున్న కాంగ్రెస్ నేత శశి థరూర్ తనకు రూ.55 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు ప్రకటించారు. ఇందులో చరాస్తుల విలువ రూ.49 కోట్లు కాగా, రూ.6.75 కోట్ల విలువైన స్థిరాస్తులు ఉన్నట్లు తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.4.32 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రెండు కార్లు ఉన్నట్లు చెప్పారు. 2014 ఎన్నికల సమయంలో రూ.23 కోట్ల ఆస్తులు, 2019 ఎన్నికల అఫిడవిట్‌లో రూ.35 కోట్ల విలువైన ఆస్తులున్నట్లు థరూర్ వెల్లడించారు.

ప్రపంచంలోనే 'పిన్న' బిలియనీర్‌గా లివియా



వాషింగ్టన్: ప్రపంచంలోనే అత్యంత చిన్న వయసులోనే ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో స్థానం సంపాదించి 19 ఏళ్ల కాలేజీ అమ్మాయి లివియా వొయిట్ చరిత్ర సృష్టించింది. 20 ఏళ్లుకూడా నిండని ఈమెకు అత్యంత సంపన్నుడైన తాత నుంచి వారసత్వంగా కోట్ల షేర్లు దక్కడంతో ఒక్కసారిగా వేల కోట్ల అధిపతి అయ్యింది. బ్రెజిల్‌కు చెందిన డబ్ల్యూఈజీ కంపెనీని లివియా తాత వెర్నెర్ రికార్డో వొయిట్ మరో ఇద్దరితో కలిసి స్థాపించారు. ఫోర్బ్స్ సంస్థ 33 ఏళ్ల వయసులోపు ఉన్న 25 మంది యువ బిలియనీర్ల జాబితాను తాజాగా విడుదలచేసింది. ఇందులో లివియా పేరు కూడా ఉంది. దాదాపు రూ.9,165 కోట్ల(1.1 బిలియన్ డాలర్ల) సంపదతో ప్రపంచంలో బిలియనీర్ అయిన అత్యంత చిన్న వయస్కురాలుగా ఈమె పేరు రికార్డులకెక్కింది. కోట్లకు పడగలెత్తినా ఇంకా ఆమె కంపెనీ బోర్డులో సభ్యురాలిగా చేరలేదు. ఆస్తులతో నాకేం పని అన్నట్లుగా నిరాడంబరంగా లివియా ప్రస్తుతం బ్రెజిల్ విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదువుతోంది.

అమెరికాలో తెలుగు విద్యార్థి మృతి

న్యూయార్క్: అమెరికాలోని ఓహియో రాష్ట్రం క్లీవ్‌లాండ్‌లో ఉమా సత్యసాయి గద్దె అనే తెలుగు విద్యార్థి చనిపోయాడు. ఈ విషయాన్ని న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ కార్యాలయం శుక్రవారం తెలిపింది. ఘటనపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నట్లు 'ఎక్స్'లో పేర్కొంది. ఉమా గద్దె మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా భారత్‌కు పంపేందుకు అవసరమైన సాయం అందిస్తామని తెలిపింది.



శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌ను గ్యాలరీ నుంచి వీక్షిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్న సీఎం రేవంత్ దంపతులు, హీరో వెంకటేశ్

అసైన్డ్ అని తెలిసే ఆ భూమిని కొన్నారు

బుద్వేల్ ల్యాండ్స్ కేసులో శివానందరెడ్డి కుట్ర

- అసైనీలను భయపెట్టి ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా భూములు కొట్టేయాలని పన్నాగం
- 10న విచారణకు రావాల్సిందిగా సీసీఎస్ నోటీసులు
- ఆయనతో పాటు మరో నిందితుడు ఆరోగ్యం రెడ్డికీ ఇచ్చాం
- నగర సీసీఎస్ డీసీపీ ఎన్.శ్వేత వెల్లడి



శివానందరెడ్డి

సాక్షి, హైదరాబాద్: నగర శివార్లలోని బుద్వేల్‌లో ఉన్న 26 ఎకరాల భూమి అసైన్డ్ ల్యాండ్ అని తెలిసే తెలుగుదేశం పార్టీ నేత, వెస్సెల్లా గ్రూప్ సీఈఓ, మాజీ పోలీసు అధికారి మాండ్ర శివానందరెడ్డి ఖరీదు చేసినట్లు వెలుగులోకి వచ్చిందని సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) డీసీపీ ఎన్.శ్వేత శుక్రవారం తెలిపారు. ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్క్‌తో పాటు మరో నిందితుడిని విచారించిన నేపథ్యంలో ఇవి వెలుగులోకి వచ్చాయని వివరించారు. దీంతో సీసీఎస్ పోలీసులు న్యాయస్థానం ఆదేశాలను పాటిస్తూ శివానందరెడ్డితో పాటు మరో నిందితుడు ఆరోగ్యం రెడ్డికి ఈనెల 10న విచారణకు రావాల్సిందిగా నోటీసులు జారీ చేసినట్టు వెల్లడించారు. మరిన్ని సాక్ష్యాధారాలు సేకరించడం కోసం కేసు దర్యాప్తు చేస్తున్నామని శ్వేత వివరించారు. ఈ మేరకు ఆమె ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు.

పలుకుబడితో పరిష్కరిస్తానని చెప్పి..

తొలుత అసైనీల నుంచి భూమిని చేజిక్కించుకోవాలని చూసిన రియల్టర్లు టీజే ప్రకాష్, గాంధీ, రామారావు 2021లో రియల్ ఎస్టేట్ బ్రోకర్ దయానంద్ ద్వారా మాజీ పోలీసు అధికారి, వెస్సెల్లా గ్రూపు సీఈఓ మాండ్ర శివానందరెడ్డిని సంప్రదించారు. బుద్వేల్ భూమి పూర్వాపరాలు తెలిసిన ఆయన తన పరిచయాలు, పలుకుబడి వినియోగించి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. చివరికి ఆ 26 ఎకరాల భూమి తానే తీసుకుంటానని, చదరపు గజానికి రూ.12 వేల చొప్పున (మార్కెట్ కంటే తక్కువ ధర) ఇస్తానని ఎర వేశాడు. 2021–22 మధ్య కాలంలో అసైనీలకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు చెక్కుల రూపంలో చెల్లించారు. ఆ అసైన్డ్ ల్యాండ్ కన్వర్షన్ కోసం శివానందరెడ్డి తదితరులు 2022–23 మధ్య కాలంలో వివిధ స్థాయిల్లో లాబీయింగ్ చేశారు. దీని ఫలితంగా అసైనీలు, ఆక్రమణదారులకు కన్వేయన్స్ డీడ్స్ ద్వారా అభివృద్ధి చేసిన ప్లాట్లు కేటాయించాలంటూ రాజేంద్రనగర్ ఎమ్మార్వోకు ఓ సాధారణ మెమో జారీ అయింది. దీంతో గత ఏడాది ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య అసైనీలు, ఆక్రమణదారులకు కన్వేయన్స్ డీడ్స్ జరిగాయి. వీటి ఆధారంగా వీళ్లు ఆ భూమిని ఏ అండ్ యూ ఇన్‌ఫ్రా పార్క్, వెస్సెల్లా గ్రీన్ కంపెనీస్‌లకు చెందిన శివానందరెడ్డి, ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్కలతో పాటు ప్రశాంత్‌రెడ్డికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా శివానందరెడ్డి తదితరులు అసైనీలను భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి, ప్రభుత్వ ఉత్తర్వులు, మంత్రివర్గం ఆమోదం లేకుండా అసైన్డ్ భూములను లాక్కోవడానికి కుట్ర పన్నారు.

పోలీసులను నెట్టేసి పరారు

ఈ కేసుల విచారణ కోసం సీసీఎస్ పోలీసులు నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం అల్లూరులోని శివానందరెడ్డి ఇంటికి వెళ్లారు. ఆయన వీళ్లను తోసేసి పారిపోయిన ఉదంతంపై బ్రాహ్మణ కొట్కూరు ఠాణాలో కేసు నమోదైంది. మాండ్ర కనిష్క, మాండ్ర ఉమాదేవి, పైరెడ్డి ప్రశాంత్‌రెడ్డికి సీసీఎస్ పోలీసులు గత మంగళవారం నోటీసులు జారీ చేశారు. దీంతో వీళ్లు శుక్రవారం విచారణకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలోనే వీళ్లు భూమి కొనుగోలుతో పాటు కంపెనీకి సంబంధించిన అన్ని ముఖ్యమైన వ్యవహారాలను శివానందరెడ్డి చూసుకుంటున్నారని బయటపెట్టారు. బుద్వేల్‌లోని భూమి స్వభావంపై తమకు అవగాహన ఉందని కూడా అంగీకరించారు. ఈ భూములపై అప్పటికే ఎంపోయాలు ఉన్నాయని తెలిసినా, భారీ ప్రయోజనాలను పొందే ప్రణాళికతో భూములను కొనుగోలు చేయాలని భావించినట్లు పేర్కొన్నారు. శివానందరెడ్డి ఆదేశాల మేరకు వారికి నగదు, చెక్కులు అందించారని బయటపెట్టారు. కన్వేయన్స్ డీడ్ అమలు చేసిన రోజునే వారి నుంచి తమ పేర్లపై భూములు రిజిస్ట్రేషన్ చేసుకున్నామని పోలీసులకు తెలిపారు.

ఎమ్మెల్సీ కవితను విచారించనున్న సీబీఐ

- ఆమెను ప్రశ్నించాల్సి ఉందంటూ ప్రత్యేక కోర్టులో సీబీఐ పిటిషన్
- తీహార్ జైలులోనే విచారించేందుకు కోర్టు అనుమతి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కవితను ప్రశ్నించేందుకు సీబీఐకి ప్రత్యేక కోర్టు అనుమతినిచ్చింది. ఈ కేసులో కవిత నుంచి మరింత సమాచారం సేకరించాల్సి ఉందని, ప్రశ్నించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సీబీఐ శుక్రవారం ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కవిత తీహార్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నేపథ్యంలో.. అక్కడే విచారిస్తామని కోర్టుకు విన్నవించింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టైన కొందరు కవిత పేరును ప్రస్తావించారని, ఈ నేపథ్యంలో ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేయాల్సిన అవసరం ఉందని వివరించింది. సీబీఐ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు.. జైలులో కవితను విచారించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ మేరకు తీహార్ జైలు అధికారులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కవితను విచారించేందుకు ఒక రోజు ముందుగానే జైలు అధికారులకు సమాచారం ఇవ్వాలని సీబీఐకి ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. విచారణ సమయంలో మహిళా సిబ్బంది తప్పకుండా ఉండాలని.. విచారణకు సంబంధించిన అన్ని నిబంధనలను పాటించాలని సూచించింది.

ఇంతకు ముందు ఓసారి విచారణ: ఢిల్లీ లిక్కర్ వ్యవహారంలో.. కేంద్ర హోం శాఖ ఫిర్యాదు ఆధారంగా ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాతోపాటు మరో 14 మందిపై 2022 జూన్ 22న సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసులో అమిత్ అరోరా ఇచ్చిన వాంగ్మూలం, పలు విచారణ అంశాల ఆధారంగా ప్రశ్నించాల్సి ఉందంటూ.. అదే ఏడాది డిసెంబర్ 2న ఎమ్మెల్సీ కవితకు సీబీఐ అధికారులు నోటీసులిచ్చారు. డిసెంబర్ 11న హైదరాబాద్‌లోని ఆమె నివాసానికి వచ్చి ప్రశ్నించారు. తర్వాత ఈ ఏడాది మార్చిలో ఢిల్లీలోని సీబీఐ కార్యాలయానికి విచారణకు రావాలంటూ నోటీసులు జారీ చేశారు. అయితే అలోగానే కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈడీ అదుపులోకి తీసుకుంది.

బెయిల్‌పై సోమవారం స్పష్టత

ఈ కేసులో కవిత దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై సోమవారం స్పష్టత రానుంది. ఇక రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌పై ఈనెల 20న విచారణ చేపడతామని సీబీఐ ప్రత్యేక కోర్టు తెలిపింది. అయితే కవితను ప్రశ్నించేందుకు కోర్టు అనుమతించిన నేపథ్యంలో.. వచ్చే వారం జైలులోనే ఆమెను విచారించాలని భావిస్తున్నట్టు తెలిసింది.

చచ్చినా కూడా ఆగని లోన్‌యాప్ మెసేజ్‌లు

- ఆత్మహత్య చేసుకున్న తర్వాత లోన్ కట్టాలంటూ ఫోన్‌కు సందేశాలు



శ్రీకాంత్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

వట్‌పల్లి(అందోల్): చస్తే చావండి కానీ చచ్చే ముందు మా లోన్ మాత్రం కట్టండి అంటూ లోన్‌యాప్‌దారులు రెచ్చిపోవడంతో వారి వేధింపులకు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయినా సరే వదలకుండా లోన్‌యాప్ దారులు మెసేజ్‌లు పంపిస్తున్న దారుణ నిర్వాకమిది. లోన్‌యాప్ వేధింపులు తాళలేక అందోలు మండలం కన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన కాడెం శ్రీకాంత్(21) మార్చి 30న గడ్డిమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 4వ తేదీ గురువారం మృతి చెందాడు. ఈ క్రమంలో లోన్‌యాప్ నిర్వాహకులు శుక్రవారం ఉదయం రూ.4 వేలకు పైగా లోన్ డబ్బులు కట్టాలంటూ మృతుడి ఫోన్‌కు సందేశం పంపించారు. కుటుంబీకులు జోగిపేట పోలీసులకు తెలియజేయగా సదరు ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

రికవరీ ఏజెంట్ల చెర తట్టుకోలేక.. చెరువులో పడి

- బండి కిస్తీ చెల్లించాలని మార్బుల్ కూలీకి వేధింపులు
- ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ల నుంచి తప్పించుకునే క్రమంలో చెరువులో పడి మృత్యువాత
- ఖమ్మం నగరంలో ఘటన



వినయ్

ఖమ్మం అర్బన్: ఆటోఫైనాన్స్ సంస్థ రికవరీ ఏజెంట్ల దాష్టీకంతో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. వాహనం రుణ కిస్తీ చెల్లించాలని వేధిస్తుండగా, వారి నుంచి తప్పించుకునే క్రమంలో చెరువులో పడి మృతి చెందిన ఘటన శుక్రవారం ఖమ్మంలో చోటుచేసుకుంది. నగరంలోని దానవాయిగూడెంలో నివాసముంటూ మార్బుల్ పనిచేస్తున్న యూపీ రాష్ట్రానికి చెందిన వినయ్(20)తో పాటు అతన్ని పనికి తీసుకొచ్చిన రాజస్తాన్ వాసి అజయ్‌ఠాగూర్ ఖమ్మంలోని మోహన్‌సాయి ఫైనాన్స్ సంస్థలో ఫైనాన్స్ తీసుకుని ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేశారు. ఇందులో వినయ్ వాహనంపై రూ.4 వేలు, ఠాగూర్ వాహనంపై రూ.14 వేల బకాయి ఉంది. దీంతో రికవరీ ఏజెంట్లు డి.రామచందర్, ఎస్.అజయ్‌కుమార్ నాలుగు రోజుల క్రితమే వినయ్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆపై ఠాగూర్ వాహనం కోసం తిరుగుతుండగా అతను కానరాకపోవడంతో వినయ్‌ను శుక్రవారం ప్రశ్నించగా ఖానాపురంలో పనిచేస్తున్న ఇంటి వద్ద వాహనం ఉందని చెప్పాడు. వినయ్‌ను తీసుకుని అక్కడకు వెళ్లగా ఆ ఇంటి యజమాని ఎస్.రవి తన వద్ద ఠాగూర్ రూ.50వేలు తీసుకుని పనికిరావడం లేదని, అందువల్ల ఠాగూర్ బండి తీసుకువెళ్లేందుకు కుదరదని నిరాకరించాడు. అక్కడ వాదన జరుగుతుండగా భయపడిన వినయ్ పారిపోయే ప్రయత్నంలో సమీపంలోని ఖానాపురం చెరువు మీదుగా వెళ్తూ చెరువులోని నీటి గుంతలో పడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఖమ్మం అర్బన్ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించగా.. కేసు నమోదు చేసినట్లు ఖమ్మం ఏసీపీ రమణమూర్తి తెలిపారు. కాగా, ఘటనకు కారకులైన ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

తల్లిని కొట్టాడు.. తనువు చాలించాడు

చదువుకోవాలని చెప్పినందుకు బలవన్మరణం • వేములవాడలో విషాదం



నేరెళ్ల రిషి

వేములవాడ: కన్న కొడుకు జులాయిగా తిరుగుతుండటంతో విసుగెత్తిపోయిన తల్లి.. చదువుకోమని హితబోధ చేసింది. దాంతో కోపగించుకున్న కొడుకు తల్లిపై చేయిచేసుకున్నాడు. తర్వాత మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఈ విషాదకర ఘటన జరిగింది. ఎస్సై అంజయ్య కథనం ప్రకారం.. వేములవాడలోని ఉప్పుగడ్డకు చెందిన నేరెళ్ల ఆంజనేయులుగౌడ్–లక్ష్మి దంపతులకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. ఆంజనేయులుగౌడ్‌కు ఏడాది కిందట ప్రమాదంలో రెండు కాళ్లు విరిగాయి. దాంతో ఇంటికే పరిమితమయ్యాడు. ఇంటర్మీడియెట్ పూర్తయిన పెద్ద కుమారుడు రిషి (18) పై చదువులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతూ, రాత్రి పొద్దుపోయాక ఇంటికి వస్తుండడంతో తల్లి గురువారం రాత్రి మందలించింది. దీంతో కోపోద్రిక్తుడైన రిషి తల్లిని కొట్టి బయటకు వెళ్లాడు. అయితే మరుసటి రోజు శుక్రవారం ఉదయం ఇంట్లోనే ఉరివేసుకొని కనిపించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

మందలించాడని గొంతు కోసేశాడు

- జులాయిగా తిరగొద్దన్నందుకు మారుతండ్రిని హత్య చేసిన వైనం
- జగిత్యాల జిల్లాలో ఘటన



అంబదాస్

మల్లాపూర్ (మెట్‌పల్లి): డ్రగ్స్‌కు బానిసైన కొడుకుని మందలించాడన్న కోపంతో ఇబ్రహీంపట్నంలో ఓ తండ్రిని పెట్రోల్ పోసి రెండో భార్య కుమారుడు హత్య చేసిన ఘటన మరువకముందే జగిత్యాల జిల్లాలో అటువంటి ఘటనే మరొకటి చోటుచేసుకుంది. పనీపాటా లేకుండా జులాయిగా తిరగొద్దని బుద్ధి చెప్పిన మారుతండ్రిని రెండో భార్య కుమారుడు గొంతు కోసి హత్య చేశాడు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన అంబదాస్(54) ఇరవైఏళ్ల క్రితం తన కుటుంబాన్ని వదిలి మల్లాపూర్ గ్రామానికి వలస వచ్చాడు. 15 ఏళ్ల క్రితం కుస్తాపూర్ గ్రామానికి చెందిన కండెల బోజమ్మను రెండో వివాహం చేసుకున్నాడు. అప్పటికే బోజమ్మకు కుమారుడు రవితేజ (ప్రస్తుత వయసు 21) ఉన్నాడు. రవితేజ ఏ పనీచేయకుండా జల్సాలకు అలవాటు పడి జులాయిగా తిరుగుతున్నాడు. ఈ విషయంలో అంబదాస్ తరచూ రవితేజను మందలిస్తూ వస్తున్నాడు. గత నెల ఇదే విషయంపై తీవ్రంగా మందలించాడు. దీంతో కోపం పెంచుకున్న రవితేజ శుక్రవారం ఇంట్లో భోజనం చేస్తున్న అంబదాస్‌పై కత్తితో గొంతుకోసి పారిపోయాడు. తీవ్రరక్తస్రావమై అంబదాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మెట్‌పల్లి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

టీటీడీ ఆధ్వర్యంలో తొలిసారిగా తెలుగు క్యాలెండర్

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి



తిరుమల: తొలిసారిగా తెలుగు పంచాంగాన్ని టీటీడీ ప్రచురించినట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి చెప్పారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలో శుక్రవారం జరిగిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ...ఈ పంచాంగాన్ని తిరుమల, తిరుపతిలోని టీటీడీ బుక్‌స్టాళ్లలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. హైదరాబాద్, విశాఖ, విజయవాడ, చెన్నై బెంగళూరులోని టీటీడీ సమాచార కేంద్రాల్లోనూ పంచాంగం అందుబాటులో ఉందన్నారు. ఏప్రిల్ 9న శ్రీవారి ఆలయంలో శ్రీ క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 21–23 వరకు తిరుమలలోని వసంత మండపంలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 22న ఉదయం స్వామి, అమ్మవార్లు స్వర్ణరథంపై ఊరేగుతారన్నారు. ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఈ నెల 17–25 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 22న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

మా కోసం వచ్చాడు మా నాయకుడు

దేశ రాజకీయ చరిత్రలో అరుదైన ఘట్టాలకు వేదికగా 'మేమంతా' సిద్ధం బస్సు యాత్ర

- ఐదేళ్లు తమకు కాపు కాచిన ఏపీ సీఎం జగన్‌కు ఊరూరా.. అడుగడుగునా జనం నీరాజనం
- జననేతను చూసేందుకు.. కరచాలనం.. మాట కలిపేందుకు.. ఫొటోల కోసం ఆరాటం
- మండుటెండల్లోనూ గంటల తరబడి రోడ్డుపై జననేత కోసం ఓపిగ్గా నిరీక్షణ
- చంటి బిడ్డలను చంకనేసుకుని బస్సు వెంట పరుగులు తీస్తున్న తల్లులు
- కిలోమీటరు పరిధిలోనే ఐదారు సార్లు బస్సు దిగి ఆత్మీయంగా పలకరిస్తున్న సీఎం జగన్
- షెడ్యూలు సమయం కంటే రెండుమూడు గంటలు ఆలస్యంగా సాగుతున్న యాత్ర

మరిన్ని వివరాలు, వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బాబు కోసం బరితెగించొద్దు!



'ఈనాడు' 'ఆంధ్రజ్యోతి' హద్దులు మీరుతున్నాయి

- ఆ పార్టీల నేతలు నోటికొచ్చినట్లు వాగుతున్నారు
- దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం... ఈసీకి ఇప్పటికే ఫిర్యాదు చేశాం
- అందరిపైనా చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటాం
- 'పచ్చ' మందకు ఐపీఎస్ అధికారుల వార్నింగ్
- 'వీళ్లా ఐపీఎస్‌లు' కథనంపై మండిపడ్డ ఏపీ చీఫ్ సెక్రటరీ
- పరువునష్టం చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
- తమ కౌంటర్‌ను 'ఈనాడు' బ్యానర్‌గా వెయ్యాలని డిమాండ్

సాక్షి, అమరావతి : ''వీళ్లా ఎస్పీలు?'' అంటే అర్థమేంటి రామోజీరావ్? ఎస్పీలు మీరు ఊహించినట్లు ఉండాలా? మీకు కావాల్సినట్లు ఉండాలా? ఇదెక్కడి దుర్మార్గం!. అత్యున్నత సర్వీసుల్లో పని చేస్తున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు అవినీతి అంటగట్టడం, ఎవరెవరు ఎక్కడెక్కడ పని చేయాలో కూడా మీరే నిర్దేశించటం.. ఆఖరికి ఎన్నికల కమిషన్ ఎవరిని నియమించాలో కూడా మీరే సిఫారసు చేయటం ఇదెక్కడి దౌర్భాగ్యం? అసలిది పత్రికేనా? ''వీళ్లా ఎస్పీలు?'' అంటూ శుక్రవారం 'ఈనాడు' పతాక స్థాయిలో ప్రచురించిన హీనాతిహీనమైన కథనంపై అటు ఐఏఎస్ అధికారులు, ఇటు ఐపీఎస్ అధికారులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. 'ఈనాడు' 'ఆంధ్రజ్యోతి' హద్దులు మీరుతున్నాయని, ఆ పార్టీల నేతలు నోటికొచ్చినట్లు వాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈసీకి ఇప్పటికే ఫిర్యాదు చేశామని తెలిపారు. అందరిపైనా చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ 'పచ్చ' మందకు ఐపీఎస్ అధికారులు వార్నింగ్ ఇచ్చారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదిగా నిలుస్తున్న రాజ్యాంగబద్ధ సంస్థ కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ప్రతిష్టకు భంగం కలిగిస్తూ ఈనాడు పత్రిక దుష్ప్రచారపూరిత కథనాన్ని ప్రచురించడం దారుణం అని ఇంకో వైపు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి మండిపడ్డారు. ఈసీ రాజ్యాంగ నిబంధనలను పాటిస్తూ కొత్తగా ఒక ఐజీ, ఐదుగురు ఎస్పీలు, ముగ్గురు కలెక్టర్లను నియమిస్తే 'వీళ్లా.. కొత్త ఎస్పీలు' అంటూ ప్రశ్నించే హక్కు రామోజీకి ఎక్కడిదని ప్రశ్నించారు. నిరాధార ఆరోపణలతో ఈనాడు పత్రిక ఈసీ ప్రతిష్టకు భంగం కలిగించడంతోపాటు యావత్ ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐపీఎస్ అధికారులంటే.. రామోజీ తన ఫిల్మ్ సిటీలో పని చేస్తున్న గార్డులుగా భావిస్తున్నట్లుందని పౌర సంఘాలు సైతం తీవ్రంగా తప్పు పట్టాయి. ఎలక్షన్ కమిషన్ నియామకాలను తప్పు పడుతున్నారంటే రామోజీ తనకు తాను రాజ్యాంగేతర శక్తిగా భావిస్తున్నట్లుందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఒక వర్గానికి కొమ్ము కాసేలా, రెండు ప్రభుత్వ వ్యవస్థల మధ్య అపోహలు కల్పించేలా ఈనాడు, దాని తోక పత్రిక, కొంత మంది టీడీపీ నేతలు నిత్యం పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని నిప్పులు చెరిగాయి.

అదీ రాజకీయ దురుద్దేశమే

ఎన్నికల విధులు నిర్వహిస్తున్న రాష్ట్ర అధికార యంత్రాంగం నిబద్ధత, మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఈనాడు పత్రిక దురుద్దేశపూరిత కథనాన్ని ప్రచురించడం ఏ మాత్రం భావ్యం కాదని సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. అధికారుల ప్రతిష్టకు భంగం కలిగిస్తూ వారిని అవమానపరిచే రీతిలో రాసిన కథనాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఒక్కో పోస్టుకు మూడేసి పేర్లతో పంపిన జాబితాను పరిశీలించి ఈసీ తన విచక్షణాధికారాల మేరకు నిర్ణయం తీసుకుంటుందన్నారు. తాము పంపించే జాబితాపై సందేహాలు ఉంటే దాన్ని తిరస్కరిస్తూ కొత్తగా మరికొందరు అధికారుల పేర్లతో మరో జాబితాను పంపించమని ఈసీ ఆదేశిస్తుందన్నారు. గుంటూరు ఐజీ పోస్టు కోసం తాము పంపిన జాబితాను ఈసీ వెనక్కి పంపడంతో మరో జాబితాను పంపించామని తెలిపారు. కీలకమైన ఎన్నికల తరుణంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, అఖిల భారత సర్వీసు అధికారుల ప్రతిష్టకు భంగకరంగా ఈనాడు తప్పుడు కథనాన్ని ప్రచురించడం వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని భావిస్తున్నామన్నారు. పాత్రికేయ ప్రమాణాలు, విలువలకు విరుద్ధంగా ఈనాడు పత్రిక వ్యవహరించిందని చెప్పారు. ఈనాడు కథనంపై తన అభిప్రాయాన్ని సైతం బ్యానర్‌గా ప్రచురించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. లేదంటే న్యాయపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని స్పష్టం చేశారు.

సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటాం

పోలీసు అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు ఈనాడు పత్రిక దుష్ప్రచారం చేస్తోందని రాష్ట్ర ఐపీఎస్ అధికారుల సంఘం తీవ్రంగా విమర్శించింది. ప్రజల భద్రత, ఎన్నికల సక్రమ నిర్వహణ కోసం రాష్ట్రంలోని పోలీసు యంత్రాంగం మొత్తం సమష్టిగా కృషి చేస్తోందని స్పష్టం చేసింది. తమ విద్యుక్త ధర్మాన్ని సక్రమంగా నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు ఈనాడు పత్రిక దురుద్దేశాలు ఆపాదించడాన్ని తీవ్రంగా ఖండించింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ దురుద్దేశంతోనే అవాస్తవ కథనాలను ప్రచురించారని మండి పడింది. దుష్ప్రచారం చేస్తున్న వారికి వ్యతిరేకంగా సంబంధిత ఐపీఎస్ అధికారులు వ్యక్తిగతంగా, సమష్టిగా సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటారని కూడా తెలిపింది. ఈ మేరకు ఐపీఎస్ అధికారుల సంఘం తరఫున ఆ సంఘం కార్యనిర్వాహక సభ్యుడు క్రాంతిరాణా టాటా శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పలువురు ఐఏఎస్ అధికారులు సైతం ఈనాడు వైఖరిని తీవ్రంగా తప్పుపట్టారు. తామంతా ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరించాలన్నట్లు రామోజీ వైఖరి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఇది మంచిది కాదని, రామోజీ తన హద్దులెరిగి ప్రవర్తించాలన్నారు.

ఈసీ, ప్రెస్ కౌన్సిల్‌కు ఫిర్యాదు

ఈనాడు దినపత్రికలో శుక్రవారం పతాక శీర్షికన ప్రచురితమైన కథనం ఒక వర్గానికి కొమ్ము కాసేలా, రెండు ప్రభుత్వ వ్యవస్థల మధ్య అపోహలు కల్పించేదిగా ఉందంటూ ఎన్నికల సంఘానికి రెండు పౌర సంఘాలు ఫిర్యాదు చేశాయి. ఏపీ ఇంటిలెక్చువల్ అండ్ సిటిజన్స్ ఫోరం, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలోని ఎన్నికల కార్యాలయంలోని ఫిర్యాదుల విభాగానికి ఈ మేరకు ఒక లేఖను అందజేశారు. అనంతరం ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు పి.విజయబాబు మాట్లాడుతూ.. ఈనాడులో 'వీళ్లా కొత్త ఎస్పీలు.. సగానికి పైగా వైకాపా విధేయులే' అన్న కథనం ఎటువంటి ఆధారాలు లేని అర్థరహిత కథనంగా ఉందన్నారు. ఒక రాజకీయ పార్టీపై వ్యతిరేకతతో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి పై అసత్య ఆరోపణలు చేసే విధంగా వార్తను ప్రచురించారని, అందువల్ల ఆ పత్రిక యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈనాడు పత్రిక కథనాలు సత్య దూరంగా ఉంటున్నాయని, అందువల్ల దీనిపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు కూడా ఫిర్యాదు చేయబోతున్నామని ఆయన తెలిపారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు మాట్లాడుతూ.. కొత్త ఎస్పీల నియామకం నిబంధనల ప్రకారమే జరిగినప్పటికీ జవహర్ రెడ్డిపై అనవసర విమర్శలు చేశారన్నారు. జవహర్ రెడ్డి ఒక్కో పోస్టుకు ముగ్గురు అభ్యర్థుల పేర్లను మాత్రమే సూచించారని వారిలో ఒకరి పేరు నిర్ధారించే అధికారం ఎన్నికల సంఘానికే ఉందని కృష్ణంరాజు వివరించారు. ఎస్పీల నియామకాన్ని తప్పు పట్టడం అంటే ఎన్నికల సంఘాన్ని తప్పు పట్టడమేనని ఆయన అభిప్రాయపడ్డారు.

వీళ్లా.. అభ్యర్థులు!

రోజురోజుకు బలహీన పడుతున్న తెలుగుదేశం పార్టీ

మరోపక్క ఏపీ సీఎం జగన్ బస్సు యాత్రతో మరింత కుదేలు


కోనేటి ఆదిమూలం


కొలికపూడి శ్రీనివాసరావు


మంతెన రామరాజు


రఘురామ కృష్ణరాజు

సాక్షి, అమరావతి: ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ తెలుగుదేశం పార్టీ మరింతగా బలహీనపడిపోతోంది. 2019లో ప్రజలు కొట్టిన దెబ్బకు పార్టీ ఇప్పటికీ కోలుకోలేకపోతోంది. దీంతో ఈ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులే దొరకలేదు. డబ్బున్నదనో, ఇతర కారణాలతోనే మొత్తంమీద అభ్యర్థులనైతే ఎంపిక చేశారు. వీరిలో అధిక శాతం పోటీకై తే సిద్ధమయ్యారు కానీ, క్షేత్రస్థాయిలో కనీస ప్రభావం చూపించలేకపోతున్నారు. దీంతో టీడీపీ అధినేత చంద్రబాబు బెంబేలెత్తుతున్నారు. కొందరిని అయినా మార్చి ఇంకా ధన బలం ఉన్న వారిని పోటీకి పెట్టడానికి కసరత్తు చేస్తున్నారు. మరోపక్క సీఎం జగన్ చేపట్టిన సిద్ధం సభలు, బస్సు యాత్రతో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఎంత ఆదరణ ఉందో స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో కనీస పోటీ ఇచ్చేందుకై నా మరింత బలమైన అభ్యర్థులను నిలపాలని చంద్రబాబు భావిస్తున్నారు.

పనిచేయని పొత్తులు

2019 ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిన తర్వాత టీడీపీ పరిస్థితి దయనీయంగా మారిపోవడంతో ఈ ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తులు ఉంటే తప్ప ముందుకు వెళ్లే పరిస్థితి లేదని గ్రహించిన చంద్రబాబు జనసేన, బీజేపీతో కలిశారు. అయినా పార్టీ బలం పెరగకపోగా మరింతగా క్షీణించడంతో సహనం కోల్పోయి ఎన్నికల ప్రచార సభల్లో అవాకులు చవాకులు పేలుతున్నారు. మరోవైపు చంద్రబాబు సభలు, రోడ్‌షోలకు జనం నుంచి స్పందన లేకపోవడంతో టీడీపీలో ఆందోళన పెరిగిపోతోంది. ఒకవైపు వైఎస్ జగన్ రోడ్‌షోలు, సభలకు జనం పోటెత్తుతుంటే తమ సభలకు జనం రాకపోవడంతో టీడీపీ నాయకులకు కళ్లెదుటే ఓటమి కనిపిస్తోంది. చంద్రబాబు నాలుగు నెలల క్రితమే ప్రకటించిన మేనిఫెస్టో, ఇప్పుడు తాజాగా ఇస్తున్న ఎన్నికల హామీలు ప్రజలను ఏమాత్రం నమ్మించలేకపోతున్నాయి.

తప్పుడు ప్రచారమూ పని చేయలేదు..

క్షేత్ర స్థాయిలో పార్టీ పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో మొన్నటివరకు తప్పుడు ప్రచారం ద్వారా హంగామా సృష్టించారు. ఎల్లో మీడియా, సోషల్ మీడియా, మౌత్ క్యాంపెయినర్ల ద్వారా వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా విస్తృత ప్రచారం చేయించి ప్రజలను తికమక పెట్టాలని చేసిన ప్రయత్నం కూడా బెడిసికొట్టింది. అయినా వాపునే బలుపు అనుకుని టీడీపీ గ్రాఫ్ పెరిగిపోయిందని చంద్రబాబు, టీడీపీ నేతలు కొద్దిరోజులుగా గాల్లో తేలిపోయారు. తీరా ఎన్నికలు దగ్గరకు వచ్చాక వైఎస్సార్‌సీపీ నిర్వహించిన నాలుగు 'సిద్ధం' సభలు టీడీపీ అబద్ధపు ప్రచారాన్ని పటాపంచలు చేశాయి. ఇప్పుడు వైఎస్ జగన్ చేపడుతున్న బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటం ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఆదరణను తేటతెల్లం చేస్తోంది. దీంతో టీడీపీ అంతర్మథనంలో మునిగిపోయింది. పొత్తులు కూడా వికటించినట్లు తేలడంతో ఇప్పుడు 10 శాతం అభ్యర్థులనైనా మార్చి ఉన్నంతలో పరిస్థితిని చక్కదిద్దుకోవాలనే దిశగా చంద్రబాబు మల్లగుల్లాలు పడుతున్నారు.

సత్యవేడు అభ్యర్థి మార్పు!

చిత్తూరు జిల్లా సత్యవేడులో ఫిరాయింపు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని మార్చడం దాదాపు ఖాయమైనట్లు చెబుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలానికి ప్రజల్లో ఆదరణ లేదని గ్రహించిన వైఎస్సార్‌సీపీ సీటు నిరాకరించింది. ఆయన్ని టీడీపీలో చేర్చుకుని చంద్రబాబు అదే సీటు కేటాయించారు. ఇప్పుడు తత్వం బోధపడటంతో ఆదిమూలాన్ని తప్పించి మరో వ్యక్తికి సీటు ఇవ్వాలని చూస్తున్నారు. అడ్డగోలు వాదనలు చేయడం ద్వారా ఎల్లో మీడియాలో గుర్తింపు పొందిన కొలికపూడి శ్రీనివాస్‌ని గొప్ప వ్యక్తిగా భావించి తిరువూరు సీటు ఇచ్చేశారు. కానీ అక్కడ ఆయన్ని తట్టుకోలేక సొంత పార్టీ నేతలే లబోదిబోమంటున్నారు. దీంతో శ్రీనివాస్‌ని వదిలించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. చింతలపూడిలో స్థానిక నేతలను కాదని ఎన్ఆర్ఐ సొంగా రోషన్‌ను ఎంపిక చేశారు. ఆయన కనీస పోటీ ఇచ్చే పరిస్థితి లేదని తెలియడంతో మరొక డబ్బున్న నేత కోసం కసరత్తు చేస్తున్నారు. గజపతినగరం, శ్రీకాకుళం, పాతపట్నం, మడకశిర స్థానాల్లోనూ అభ్యర్థులను మార్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఉండి, అనపర్తి సీట్లపై అనిశ్చితి

పశ్చిమ గోదావరి జిల్లా ఉండి సీటుపైనా అనిశ్చితి నెలకొంది. ఉండి సీటును సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజుకు ప్రకటించినప్పటికీ, చంద్రబాబు ఒత్తిడితో వివాదాస్పద నేత రఘురామ కృష్ణరాజును అక్కడ నుంచి పోటీ చేయిస్తారనే ప్రచారం జరుగుతోంది. రఘురామరాజుకు బీజేపీ నర్సాపురం ఎంపీగా అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన టీడీపీలో చేరి ఉండి నుంచి పోటీ చేస్తారని చెబుతున్నారు. రఘురామరాజు నర్సాపురం ఎంపీ సీటు కోసం ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అది సాధ్యం కాకపోతే ఉండి సీటు కేటాయించక తప్పదని టీడీపీ నేతలు చెబుతున్నారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలోని మాడుగల అభ్యర్థిని మార్చాలని అక్కడి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఒత్తిడి తెస్తుండడంతో ఆ దిశగానూ కసరత్తు నడుస్తోంది. కడప ఎంపీ, జమ్మలమడుగు ఎమ్మెల్యే స్థానాల మార్పుపైనా చంద్రబాబు తర్జనభర్జన పడుతున్నారు. అనపర్తి సీటు మళ్లీ తిరిగి టీడీపీకి కేటాయించే దిశగా బీజేపీ, టీడీపీ నేతల మధ్య చర్చలు జరుగుతున్నాయి. జనసేనకు కేటాయించిన నర్సాపురం స్థానాన్ని టీడీపీ తీసుకుంటుందనే చర్చ కూడా నడుస్తోంది. మొత్తంగా 20కిపైగా ఎమ్మెల్యే, ఒకట్రెండు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను మార్చడం ద్వారా బలమైన వైఎస్సార్‌సీపీకి కనీస పోటీ ఇచ్చేలా వాతావరణాన్ని మార్చాలని చంద్రబాబు ఆలోచిస్తున్నారు.

'పాలమూరు'కు జాతీయ హోదా!

- తెలంగాణకు 23 ప్రత్యేక హామీలు ఇవ్వనున్న కాంగ్రెస్ పార్టీ
- హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్.. నీతి ఆయోగ్ ప్రాంతీయ కార్యాలయం
- జాతీయ క్రీడా విశ్వవిద్యాలయం.. ప్రత్యేక ఇండస్ట్రియల్ కారిడార్లు
- ఐటీఐఆర్.. పునర్విభజన చట్టంలోని అంశాల అమలుకు హామీలు



సాక్షి, హైదరాబాద్: కేంద్రంలో అధికారంలోకి వస్తే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వనుంది. రాష్ట్ర విభజన చట్టంలో ఉన్నప్పటికీ ఎన్డీయే ప్రభుత్వం ఉపసంహరించుకున్న ఐటీఐఆర్‌ను ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేయనుంది. ఈ మేరకు శనివారం తుక్కుగూడ జన జాతర సభలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజలకు ఇచ్చే 23 ప్రత్యేక హామీలను కాంగ్రెస్ పార్టీ సిద్ధం చేసింది. మంత్రి, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ డి.శ్రీధర్‌బాబు నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల కమిటీ ఖరారు చేసిన ఈ ప్రత్యేక హామీలను సీఎం రేవంత్‌రెడ్డి తుక్కుగూడ సభ వేదికపై ప్రకటించనున్నారు.

కాంగ్రెస్ ఇవ్వనున్న ప్రత్యేక హామీలివే..!

1) ఐటీఐఆర్ ఏర్పాటు 2) ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం.. కాజీపేట్ రైల్‌కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ, హైదరాబాద్‌లో ఐఐఎం, హైదరాబాద్–విజయవాడ హైవేలో ర్యాపిడ్ రైల్వే సిస్టం, మైనింగ్ యూనివర్సిటీ ఏర్పాటు. 3) భద్రాచలం సమీపంలోని ఏటపాక, గుండాల, పురుషోత్తమ పట్నం, కన్నాయిగూడెం, పిచుకలపాడు గ్రామాలు తిరిగి తెలంగాణలో విలీనం. 4) పాలమూరు–రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా. 5) హైదరాబాద్‌లో నీతి ఆయోగ్ ప్రాంతీయ కార్యాలయం 6) కొత్త విమానాశ్రయాల నిర్మాణం 7) రామగుండం, మణుగూరు రైల్వేలైన్ 8) కొత్తగా నాలుగు సైనిక్ స్కూళ్ల ఏర్పాటు 9) కేంద్రీయ విశ్వవిద్యాలయాలు పెంపు 10) నవోదయ విద్యాలయాల సంఖ్య రెట్టింపు 11) నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు 12) ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఎస్ఈఆర్) 13) ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌ఫారిన్ ట్రేడ్ 14) నేషనల్ ఏవియేషన్ యూనివర్సిటీ 15) ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐఏఆర్ఐ) క్యాంపస్ 16) అధునాతన వైద్య ఆరోగ్య పరిశోధనా కేంద్రం 17) కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు కేటాయింపు 18) ప్రతి ఇంటికీ సోలార్ విద్యుత్ యూనిట్ 19) ఐదు పారిశ్రామిక కారిడార్ల నిర్మాణం (హైదరాబాద్– బెంగళూరు, హైదరాబాద్–నాగ్‌పూర్, హైదరాబాద్– వరంగల్, హైదరాబాద్–నల్లగొండ–మిర్యాలగూడ, సింగరేణి పారిశ్రామిక కారిడార్) 20) అంతర్జాతీయ స్థాయి కల్చరల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్ 21) మేడారం జాతరకు జాతీయ హోదా 22) న్యూ డ్రైపోర్టు ఏర్పాటు 23) హైదరాబాద్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ఏర్పాటు

ప్రజాస్వామ్యం నిలవాలంటే కాంగ్రెస్ రావాలి

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

మంత్రులతో కలసి తుక్కుగూడ సభ ఏర్పాట్ల పరిశీలన



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ''కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇప్పటికే భారత్ జోడో యాత్రతో జనంలోకి వెళ్లారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను గుర్తించారు. జనాలకు ఏం కావాలో తెలుసుకున్నారు. అందులో భాగంగానే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలను ప్రకటించి అమల్లోకి తెచ్చాం. ఇప్పుడు జాతీయ స్థాయిలో ఐదు గ్యారంటీలు ఇచ్చాం. అమలు చేసి తీరుతాం'' అని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ చెప్పారు. శుక్రవారం ఆమె తుక్కుగూడలో జనజాతర సభ ఏర్పాట్లను పార్టీ నేతలతో కలసి పరిశీలించారు. తర్వాత మీడియాతో మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం నిలవాలన్నా, రాజ్యాంగం పరిరక్షించబడాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. మత రాజకీయాలకు కాంగ్రెస్ దూరమన్నారు. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని కోరారు. తుక్కుగూడ సభకు కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆమె వెంట మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్‌చౌదరి, సీనియర్ నాయకుడు వీహెచ్, టీపీసీసీ వర్కింగ్ వైస్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

షర్మిలది నీచమైన రాజకీయం

- ఆమె రాజకీయం వైఎస్సార్ కుటుంబానికి తలవంపులు తెచ్చేలా ఉంది
- చంద్రబాబుతో కలసి ఏపీ సీఎం జగన్‌పై కుట్రలు చేస్తున్నారు
- వైఎస్సార్‌సీపీ నాయకురాలు వాసిరెడ్డి పద్మ



సాక్షి, అమరావతి: షర్మిల నీచమైన రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మండిపడ్డారు. కోర్టు పరిధిలో ఉన్న వైఎస్ వివేకానందరెడ్డి హత్యపై ఆమె ఎలా మాట్లాడతారని, హంతకుడు అంటూ అవినాష్‌రెడ్డిపై ఎలా నిందలు వేస్తున్నారని నిలదీశారు. వాసిరెడ్డి పద్మ శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. కోర్టు పరిధిలో ఉన్న కేసుపై షర్మిలే తీర్పు చెప్పేస్తున్నారని, శిక్ష కూడా ఆమే వేస్తున్నారని, వైఎస్సార్ కుమార్తె చేయాల్సిన పనేనా ఇది అని అన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాలను ఎన్నికల అంశంగా మార్చి ఇంత అన్యాయంగా రాజకీయం చేయడం అవసరమా అని ప్రశ్నించారు. అది కూడా కడప గడ్డపై నిలబడి మాట్లాడుతున్నారన్నారు. షర్మిలకు కోర్టులపైన, వ్యవస్థలపైన నమ్మకం లేదా అని నిలదీశారు. కడప లోక్‌సభ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్ అవినాష్ రెడ్డి గురించి హంతకుడు అని ప్రచారం చేయడంపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్ కుటుంబంలో చిచ్చు పెట్టడానికే

వైఎస్సార్ కుటుంబంలో చిచ్చు పెట్టడానికి మూడు దశాబ్దాలుగా కుట్ర జరుగుతోందన్నారు. వైఎస్సార్ బతికున్న సమయంలోనే కాంగ్రెస్ పార్టీలో ఉన్న పెద్ద తలకాయలు కొందరు చంద్రబాబుతో చేతులు కలిపి ఆ కుటుంబాన్ని విడదీయాలని చేసిన కుట్రలు కడప ప్రజలకు కొత్త కాదన్నారు. వైఎస్సార్ చనిపోయాక ఈరోజు వీరు సానుభూతి కోసం మాట్లాడుతున్న వివేకానందరెడ్డే వైఎస్ కుటుంబం నుంచి విడిపోయి ఓ మంత్రి పదవి కోసం కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపారని, సీఎం జగన్‌కి, వైఎస్ బిడ్డలకు వ్యతిరేకంగా రాజకీయం చేశారని, ఇదంతా కడప ప్రజలు చూడలేదా అని నిలదీశారు. వివేకానందరెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించిన బీటెక్ రవి ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేసిన వ్యక్తి అని, ఆదే బీటెక్ రవి ఇప్పుడు షర్మిల పక్కన మాట్లాడుతున్నారని అన్నారు. చంద్రబాబు ఉచ్చులో షర్మిల చిక్కుకున్నారని తెలిపారు. వైఎస్ కుటుంబంలో చిచ్చు పెట్టాలని బాబు చూస్తున్నారని, ఆయనతో కలిసి షర్మిల సీఎం జగన్‌పై కుట్రలు చేస్తున్నారని తెలిపారు. వ్యక్తిగత ఎజెండాతో సీఎం జగన్‌పై నిందలు వేస్తున్నారని, వాటిని నమ్మే వారు ఒక్కరు కూడా రాష్ట్రంలో లేరని చెప్పారు.

వైఎస్సార్‌పై కేసులు పెట్టిన కాంగ్రెస్‌లో ఎందుకు చేరారు?

షర్మిల ఏం రాజకీయం చేయాలనుకుంటున్నారో ప్రజలకు చెప్పాలని పద్మ డిమాండ్ చేశారు. స్వార్థపూరిత రాజకీయాల కోసం మీరు ఏమైనా చేస్తారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సమాధి దగ్గర షర్మిల కాంగ్రెస్ జాబితా చదువుతుంటే చాలామంది హృదయాలు ముక్కలయ్యాయన్నారు. వైఎస్సార్‌ను అవినీతిపరుడుగా చిత్రించి కేసులు పెట్టి, ఆయన పేరును ఛార్జిషీట్‌లో చేర్చిన కాంగ్రెస్ పార్టీలో షర్మిల ఎందుకు చేరారని నిలదీశారు. సీఎం జగన్‌ని జైలు నుంచి బయటకు రాకూడదని కుట్ర పన్నిన కాంగ్రెస్ పార్టీ తరఫున మాట్లాడుతున్న షర్మిలను చూసి ఊసరవెల్లులు కూడా సిగ్గుపడుతున్నాయని చెప్పారు.

తుక్కుగూడ నుంచే సమర శంఖం

- కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల ప్రచారం తెలంగాణ నుంచే ప్రారంభం
- నేడు జనజాతర సభ.. హాజరుకానున్న రాహుల్.. ఖర్గే, ప్రియాంకల షెడ్యూల్ రద్దు


తుక్కుగూడ సభాప్రాంగణం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ తెలంగాణ నుంచి లోక్‌సభ ఎన్నికల సమర శంఖాన్ని పూరించేందుకు సిద్ధమైంది. శనివారం సాయంత్రం హైదరాబాద్ నగర శివార్లలోని రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జన జాతర పేరిట నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభ దీనికి వేదిక కానుంది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ సభ వేదికగా పార్టీ మేనిఫెస్టోను తెలుగులో విడుదల చేయనున్నారు. దీంతోపాటు తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేకమైన హామీలను కూడా ప్రకటించనున్నారు. మరోవైపు ఈ సభలోగానీ, అంతకుముందుగానీ కాంగ్రెస్ పెద్దల సమక్షంలో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన పలువురు ముఖ్య నేతలు పార్టీలో చేరుతారని అంటున్నారు. ఇందులో ముగ్గురి నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నారని ప్రచారం జరుగుతోంది. తుక్కుగూడ సభ ప్రారంభానికి ముందు నోవాటెల్ హోటల్‌లో రాహుల్ సమక్షంలో ఈ చేరికలు జరగొచ్చని.. తర్వాత వారు సభలో పాల్గొంటారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. చేరేది ఎవరన్నదానిపై మాత్రం గోప్యత పాటిస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి..

టీపీసీసీ జన జాతర సభకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేపట్టింది. 70 ఎకరాల్లో సభా ప్రాంగణం, 550 ఎకరాల్లో పార్కింగ్ సిద్ధం చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీపీసీసీ ఇదే ప్రాంగణంలో సభ నిర్వహించి.. సోనియా గాంధీతో ఆరు గ్యారంటీలను ప్రకటింపజేసింది. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల శంఖారావానికి కూడా ఇదే ప్రాంగణాన్ని ఎంచుకోవడం గమనార్హం. ఇక ఎండలు మండిపోతున్న నేపథ్యంలో సభకు వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, మంచినీటి కొరత రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. పార్లమెంటు స్థానాల వారీ ఇన్‌చార్జులు, అసెంబ్లీ సమన్వయకర్తల సమన్వయంతో.. సభకు 10లక్షల మందికి పైగా తరలి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల పాలన విజయాలను ప్రజలకు వివరించనున్నారు.

శంషాబాద్ నుంచి నోవాటెల్‌కు.. తర్వాత సభకు..

రాహుల్ గాంధీ శనివారం సాయంత్రం 5 గంటలకు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి నోవాటెల్ హోటల్‌కు వస్తారు. కొంతసేపు పార్టీ నేతలతో భేటీ అయ్యాక.. తుక్కుగూడ సభకు చేరుకుంటారు. సభ ముగిశాక రాత్రి 7 గంటల సమయంలో శంషాబాద్ మీదుగా తిరిగి ఢిల్లీకి బయలుదేరుతారు.

తెలంగాణకు ప్రత్యేక హామీలు

తుక్కుగూడ సభలో కాంగ్రెస్ జాతీయ స్థాయి మేనిఫెస్టో 'పాంచ్ న్యాయ్'ను తెలుగులో విడుదల చేయనుంది. దీనితోపాటు రాహుల్ గాంధీ తెలంగాణకు ప్రత్యేక హామీలను ఇవ్వనున్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీలో కలిపిన ఐదు భద్రాచలం సమీప గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేస్తామని.. విభజన చట్టం హామీలన్నీ అమలు చేస్తామని హామీ ఇవ్వనున్నట్టు సమాచారం. ఐటీఐఆర్ వంటి ఉపాధి ప్రాజెక్టును కేటాయిస్తామనే హామీ కూడా ఉంటుందని తెలిసింది.

చేరికలపై గోప్యత

జన జాతర సభ సందర్భంగా బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ చేరికల అంశాన్ని టీపీసీసీ గోప్యంగా ఉంచుతోంది. పార్టీ ముఖ్య నేతతోపాటు ఆయనకు అత్యంత సన్నిహితుడైన ఓ నాయకుడికి మాత్రమే దీనిపై స్పష్టత ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేరే అవకాశం ఉందని.. నోవాటెల్ హోటల్‌లో రాహుల్ గాంధీని ఎంపీ కె.కేశవరావు కలుస్తారని మాత్రం పేర్కొంటున్నాయి. మరోవైపు కాంగ్రెస్‌లో చేరేవారు వీరే అంటూ కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పేర్లు ప్రచారం అవుతున్నాయి. కాలేరు వెంకటేశ్, కోవ లక్ష్మి, కాలె యాదయ్య, బండారి లక్ష్మారెడ్డి, గంగుల కమలాకర్, టి.ప్రకాశ్‌గౌడ్, మాణిక్‌రావు, డి.సుధీర్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్ ఈ జాబితాలో ఉన్నట్టు చెప్తున్నారు. కానీ వీరిలో ఎందరు చేరుతారు, ఎవరు చేరుతారన్నది స్పష్టత లేదు. దీనిపై టీపీసీసీ ముఖ్య నాయకుడొకరు మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్‌కు చెందిన మెజార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడమైతే ఖాయమే. అన్ని సన్నివేశాలను వెండితెరపై చూడాల్సిందే..'' అని వ్యాఖ్యానించడం గమనార్హం.

వివేకాను చంపిన వాళ్లు రోడ్లపై తిరుగుతున్నారు

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

కాశినాయన/కలసపాడు/పోరుమామిళ్ల/బి.కోడూరు/బద్వేలు అర్బన్/అట్లూరు: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డిని చంపిన వాళ్లు స్వేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నారని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. ఆమె శుక్రవారం వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం అమగంపల్లి నుంచి బస్సు యాత్ర ప్రారంభించారు. కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, అట్లూరు తదితర ప్రాంతాల మీదుగా ఆమె రోడ్ షో సాగింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అధికారాన్ని అడ్డుపెట్టి వివేకా హంతకులను కాపాడుతున్నారని అన్నారు. అవినాష్‌రెడ్డి వివేకాను చంపించారని, ఆయనే దోషి అని సీబీఐ చెబుతోందని అన్నారు. హత్య జరిగినపుడు హంతకులు, అవినాష్‌రెడ్డి ఒకే చోట ఉన్నట్లు రుజువులు ఉన్నాయన్నారు. గొడ్డలితో నరికితే హార్ట్ ఎటాక్ అని ఎలా చెబుతారని ప్రశ్నించారు. వైఎస్ వివేకా కుమార్తె సునీత మాట్లాడుతూ ఎంపీ టికెట్ అవినాష్‌రెడ్డికి ఇవ్వవద్దని, షర్మిలకు ఇవ్వాలని చెప్పినందుకే వివేకాను హత్య చేశారన్నారు. షర్మిల రోడ్‌షోలకు జనస్పందన కరువైంది. ఎక్కడా పట్టుమని రెండు వందల మంది జనం లేరు. అక్కడక్కడా షర్మిల కార్యక్రమం ముగింపులో ప్రజలనుంచి జై జగన్ నినాదాలు వినిపించాయి.

సాక్షి హైదరాబాద్

శనివారం ၊ 6 ၊ ఏప్రిల్ ၊ 2024























జై ధోని..

జయహో సన్ రైజర్స్

ఈ ఐపీఎల్ సీజన్‌లో భాగ్యనగర అభిమానులు రెండో మ్యాచ్‌నూ ఆస్వాదించారు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు పరుగుల వరద పారించగా.. శుక్రవారం డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్లు సత్తా చాటారు. మ్యాచ్ జరిగింది హైదరాబాద్ సొంత మైదానం ఉప్పల్ స్టేడియంలో అయినా.. అందరి దృష్టి మాత్రం చెన్నై సూపర్ కింగ్స్ స్టార్, భారత దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనిపై నిలిచింది. మ్యాచ్ ప్రారంభానికి కొన్ని గంటలముందే అభిమానులు ఉప్పల్ స్టేడియానికి తరలి వచ్చారు. ఒక దశలో స్టేడియంలోకి వెళ్లేందుకు తోపులాట జరిగినంత పనైంది. ఇక చెన్నై ఇన్నింగ్స్ సమయంలో ధోని క్రీజులోకి వచ్చిన సమయంలో మైదానమంతా ధోని పేరుతో మార్మోగిపోయింది. మ్యాచ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో తిలకించగా.. పలువురు మంత్రులు, సినీతారలు హాజరయ్యారు. సన్‌రైజర్స్ అలవోక విజయంతో అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండాపోయింది.

– ఉప్పల్/సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు

203 కిలోల గంజాయి స్వాధీనం

రైలులో తరలిస్తున్న ఇద్దరు మహిళల అరెస్ట్



ఉస్మానియా యూనివర్సిటీ: నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలులో తరలిస్తున్న గంజాయిని శుక్రవారం రైల్వే పోలీసులు పట్టుకున్నారు. ఏపీ నుంచి మహారాష్ట్రలోని జలగావ్‌కు రూ.50.85 లక్షల విలువ చేసే 203 కేజీల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసిన్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన చందాభాయి భీమా బిల్దర్, ఉషాదీలిప్ చవాన్‌లు ప్లాస్టిక్ సంచుల్లో 97 గంజాయి ప్యాకెట్లను కాజీపేట, వరంగల్ రైల్వే పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేసిన్నట్లు సికింద్రాబాద్ ఏడీజీ మహేష్ భగవత్ వివరించారు. ఈ సందర్భంగా రైల్వే పోలీసులు టి.కృపాకర్, నరేష్, షేక్ సుభానీలను ఏడీజీ అభినందించారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో..



గ్రేటర్‌లో శుక్రవారం గరిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)		
	బంజారాహిల్స్	42.4
	బన్సీలాల్‌పేట	42.3
	విజయనగర్ కాలనీ	42.2
	హఫీజ్‌పేట	42.1
	సరూర్‌నగర్	42.1
	నాచారం	42.0

సాక్షి, సిటీబ్యూరో: భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. మహా నగరంలో సాధారణం కంటే మూడు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతల నమోదవుతుండటంతో జనం అల్లాడుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఉష్ణతాపం కనిపిస్తోంది. 10 గంటల తర్వాత బయటకు వెళ్లలేని పరిస్థితి. అత్యవసర పనులపై బయటకు వెళ్లినవారు వడగాలులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొందరు వడదెబ్బ బారిన పడుతున్నారు. శివారులో సగటున గరిష్ట ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటగా.. నగరం మాత్రం 42 పైనే రికార్డు అవుతోంది. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

సొత్తుతో పాటు కుక్క పిల్లనూ ఎత్తుకెళ్లారు



దుండగులు ఎత్తుకెళ్లిన కుక్కపిల్ల

ఘట్‌కేసర్: పెళ్లికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో దొంగలు పడ్డారు. సొత్తుతో పాటు అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న శునకాన్ని సైతం ఎత్తుకెళ్లిన ఘటన ఘట్‌కేసర్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్‌ఎఫ్‌సీనగర్ బాలాజీ నగర్‌కు చెందిన ఐలయ్య గురువారం కుటుంబ సభ్యులతో కలిసి నల్లగొండ జిల్లా అంబాల గ్రామంలో జరిగిన వివాహానికి హాజరయ్యారు. శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి మెయిన్ డోర్ తాళాలు పగులగొట్టి కనిపించాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా అల్మరా తాళం పగులగొట్టి వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. అందులో దాచిన 7.5 గ్రాముల బంగారం, 11 తులాల వెండి రూ. 5 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. వీటితో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుక్కపిల్లను కూడా అపహరించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం (వేలి ముద్రల నిపుణులు)తో కలిసి వివరాలు సేకరించారు. ఐలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

హైదరాబాద్ క్రికెటర్ లేకుంటే మ్యాచ్‌లు జరగనివ్వం

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ జట్టులో ఒక్క హైదరాబాదీ క్రికెటర్ కూడా లేకపోవడం దురదృష్టకరమని, ఈ ఒరవడి ఇలాగే ఉంటే వచ్చే ఐపీఎల్ సీజన్‌లో హైదరాబాద్‌లో ఒక్క మ్యాచ్ కూడా జరగనివ్వమని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. శుక్రవారం నగరంలో జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్‌లో పెద్ద ఎత్తున టికెట్ల గోల్‌మాల్ జరిగిందని ఈ అంశంపై తాను ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తానన్నారు. సామాన్యులకు, క్రీడాభిమానులకు టికెట్లు దొరకకుండా సన్‌రైజర్స్ జట్టు యాజమాన్యంతో పాటు హెచ్‌సీఏ ప్రయత్నిస్తోందని, ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేయాల్సిందిగా తాను ప్రభుత్వానికి లేఖ రాస్తానన్నారు. 40 వేల టికెట్లు గంట సేపట్లో ఎలా అమ్మారో.. ఎవరికి అమ్మారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఒక్కో టికెట్‌ను రూ.10 వేల నుంచి రూ.20 వేలకు అమ్ముతున్నారని ఈ బ్లాక్ దందాను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు హెచ్‌సీఏపై సుమోటో కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌సీఏకి ఇచ్చిన 3 వేల కాంప్లిమెంటరీ టికెట్లు కూడా మార్కెట్‌లో వేలాది రూపాయలకు విక్రయిస్తున్నారని దానం ఆరోపించారు.

క్రికెట్ అభిమానులతో కిక్కిరిసిన మెట్రో రైళ్లు

సాక్షి, సిటీబ్యూరో: క్రికెట్ అభిమానులు పోటెత్తారు. ఉప్పల్ క్రికెట్ స్టేడియానికి తరలివచ్చిన క్రీడాభిమానులతో శుక్రవారం మెట్రో రైళ్లు, సిటీ బస్సులు కిక్కిరిశాయి. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా స్టేడియం వరకు వివిధ మార్గాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది. రాయదుర్గం నుంచి నాగోల్ వరకు అదనపు మెట్రో సర్వీసులను ఏర్పాటు చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు తరలి వచ్చే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మెట్రో రైళ్లను అర్ధరాత్రి వరకు నడిపారు. నాగోల్-రాయదుర్గం, ఎల్‌బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్ కారిడార్‌లలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా స్టేషన్‌ల నుంచి అర్ధరాత్రి 12.15 గంటల వరకు మెట్రో సర్వీసులను అందుబాటులో ఉంచారు. తెల్లవారు జామున 1.10 గంటల వరకు చివరి స్టేషన్‌కు చేరుకొనేలా ఉప్పల్, స్టేడియం, ఎన్‌జీఆర్‌ఐ తదితర స్టేషన్‌లలో రాకపోకలకు అవకాశం కల్పించినట్లు హెచ్‌ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

ఎన్నికలు పూర్తయ్యాక అభివృద్ధి కమిటీలు

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



ఫిలింనగర్: పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు డివిజన్ స్థాయి నుంచే అభివృద్ధి కమిటీలు వేస్తామని ఎస్సీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. ఫిలింనగర్‌లోని కొత్త చెరువు వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవాల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దాన నాగేందర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నామన్నారు. డివిజన్‌కు అయిదు మందితో ఓ కమిటీ వేస్తామని అందులో ఒక ఎస్సీ కూడా ఉంటారని అన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి ఏం చేశారని ఆయన ఎద్దేవా చేశారు.

భలే బల్దియా!

అధికార బలం తక్కువ..

- ప్రతిపక్షాల బలం ఎక్కువ!!
- మేయర్, డిప్యూటీ మేయర్ జంపింగ్‌తో..
- జీహెచ్‌ఎంసీలో విచిత్ర పరిస్థితి



సాక్షి, సిటీబ్యూరో: మున్సిపల్ కార్పొరేషన్లలో ఏ పార్టీ సభ్యులెక్కువగా ఉంటే ఆ పార్టీ వారు మేయర్, డిప్యూటీ మేయర్ పదవుల్లో ఉంటారు. ఇది సాధారణం. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ)లో మేయర్, డిప్యూటీ మేయర్‌ల పార్టీ సభ్యులు తక్కువగా ఉన్నారు. మిగతా పార్టీల సభ్యులు ఎక్కువమంది ఉన్నారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత బీఆర్‌ఎస్ కార్పొరేటర్లుగా గెలిచి.. ఆ పార్టీ సభ్యుల బలంతో మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. వారి ఎన్నిక జరిగినప్పుడు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం .. ఇటీవల వారు ప్రస్తుత అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరడం తెలిసిందే. జీహెచ్‌ఎంసీ నిబంధనల మేరకు ఒకసారి మేయర్, డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యాక నాలుగేళ్ల వరకు అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అవకాశం లేదు. దీంతో వారు ఏ పార్టీలోకి మారినా వారి పదవులకు ముప్పు లేదు. జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరిగినప్పుడు కాంగ్రెస్ గెలిచింది కేవలం రెండు స్థానాలే. మారిన రాజకీయ పరిణామాలతో ప్రస్తుతం ఆ పార్టీ సభ్యుల బలం 15కు చేరువలో ఉంది. అయినప్పటికీ మిగతా పార్టీల సభ్యుల బలం కంటే దాని బలం చాలా తక్కువ. దాదాపుగా బీఆర్‌ఎస్‌కు 50, బీజేపీకి 40 మంది సభ్యుల బలం ఉండగా.. ఎంఐఎంకు 42 మంది ఉన్నారు. పాలకమండలి సమావేశం నిర్వహించేది, సభకు అధ్యక్షత వహించేది మేయరే అయినప్పటికీ.. కాంగ్రెస్ సభ్యులు మిగతా పార్టీల సభ్యుల కంటే తక్కువ కావడంతో ఏ అంశమైనా ఆమోదం పొందాలంటే ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

స్టాండింగ్ కమిటీలో స్థానమే లేదు

- జీహెచ్‌ఎంసీలో ఎంతో కీలకమైన స్టాండింగ్ కమిటీలో కాంగ్రెస్‌కు స్థానమే లేదు. మొత్తం 15 మంది సభ్యుల్లో బీఆర్‌ఎస్ సభ్యులు 8 మంది, ఎంఐఎం నుంచి ఏడుగురు ఉన్నారు. జీహెచ్‌ఎంసీలో ఏ పాలసీ అమలు చేయాలన్నా స్టాండింగ్ కమిటీ ఆమోదం తప్పనిసరి. అంతేకాదు.. రూ. 2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు విలువైన పనులు చేపట్టాలంటే అందుకు స్టాండింగ్ కమిటీ అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో.. మేయర్ డిప్యూటీ మేయర్ అధికార కాంగ్రెస్‌లో ఉన్నప్పటికీ, జీహెచ్‌ఎంసీ చేపట్టే పనుల్లో బీఆర్‌ఎస్, ఎంఐఎంల మాటే చెల్లుబాటయ్యే పరిస్థితి ఉంది. ఎంఐఎం ఇప్పటి వరకు బీఆర్‌ఎస్‌తో పరస్పర సహకారంతో పనిచేస్తోంది. అంత మాత్రాన కాంగ్రెస్‌తో శత్రుత్వం లేదు.
- ఈ నేపథ్యంలో జీహెచ్‌ఎంసీలో ఎంఐఎం వైఖరి ఎలా ఉండబోతుందన్నది ముందు ముందు వెల్లడి కానుంది. స్టాండింగ్ కమిటీ కాల పరిమితి ఏడాది. కొత్త స్టాండింగ్ కమిటీ ఏర్పడి నెల మాత్రమే దాటింది. కొత్త కమిటీ ఎన్నికకు దాదాపు 11 నెలల సమయముంది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌కు చెందిన స్టాండింగ్ కమిటీ సభ్యులు, పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్తేనే ఆ పార్టీ మాట చెల్లుబాటయ్యే పరిస్థితి ఉంటుంది. లేని పక్షంలో రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉన్నా, మేయర్, డిప్యూటీ మేయర్ ఆ పార్టీవారే అయినా ఇబ్బందులు తప్పవు. పనుల్లో అలసత్వం, అవినీతి, నిధుల దుబారా వంటి వాటిని ప్రతిపక్షాలు లేవనెత్తుతాయి. ఇటీవల మేయర్ దాదాపు రూ. 1.45 లక్షలతో యాపిల్ ఐప్యాడ్ కొనుగోలుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇలాంటి వాటినీ అడ్డుకునే పరిస్థితి ఎదురవుతుంది.

బలోపేతం దిశగా..

వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకునే కాబోలు ఎక్కువమంది కార్పొరేటర్లను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ ఆకర్ష్ మంత్రాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారితోపాటు మరికొందరికి ఆ బాధ్యతల ప్పగించినట్లు చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికల్లోపుగానే దాదాపు 30 మంది కార్పొరేటర్లు బీఆర్‌ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం జరిగింది. మిగతా పార్టీల కంటే తమ పార్టీ సభ్యుల బలం ఎక్కువగా ఉంటేనే జీహెచ్‌ఎంసీలో కాంగ్రెస్ మాట చెల్లుబాటవుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొనే అటు ఎమ్మెల్యేలతో పాటు ఇటు కార్పొరేటర్లపైనా కాంగ్రెస్ వల విసురుతోందని రాజకీయ పరిశీలకులంటున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని కొందరు ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే వారితో పాటు వారి నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లోకి వెళ్లే అవకాశముంది.

బీజేపీకి షాక్

- కాంగ్రెస్‌లో కూన శ్రీశైలం గౌడ్ చేరికతో స్థానికంగా చర్చ
- మరో కొందరు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు చేరే అవకాశం



దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు రోజు రోజుకూ మారుతున్నాయి.. నిన్న నిజాంపేట్ మేయర్ కొలన్ నీలా రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరగా తాజాగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలం గౌడ్ ఆ పార్టీని వీడి సొంతగూటికి చేరడంతో నియోజకవర్గంలో చర్చగా మారింది. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి నియోజకవర్గంలో చరిత్ర సృష్టించిన కూన శ్రీశైలం గౌడ్ అనంతరం కాంగ్రెస్ పార్టీ అనుబంధంగానే పనిచేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో జరిగిన రాజకీయ పరిణామాలతో బీజేపీలో చేరగా ఆ పార్టీలో మల్కాజిగిరి ఎంపీ టికెట్ విషయంలో వచ్చిన విభేదాల వల్ల తిరిగి సొంతగూటికి రావాలని శ్రీశైలం గౌడ్ నిశ్చయించుకున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ పెద్దలు గురువారం శ్రీశైలం గౌడ్‌తో చర్చించి శుక్రవారం ఏఐసీసీ ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతంత మాత్రంగానే ఉన్న బీజేపీ కూన వెళ్లిపోవడంతో ఎంపీగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్‌కు గట్టి షాక్ తగిలినట్లు అయింది.

రెండు మున్సిపాలిటీలు, ఒక కార్పొరేషన్‌లో...

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల నుంచి ఇప్పటికే పలువురు కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధం అవుతుండగా... నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి పలువురు కార్పొరేటర్లు గురువారం పార్టీలో చేరగా సుమారు 20 మందికి పైగా కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు రెడీగా ఉన్నారు. గ్రేటర్ పరిధిలోని గాజులరామారం, కుత్బుల్లాపూర్ సర్కిల్లో ఉన్న మొత్తం ఎనిమిది మంది కార్పొరేటర్లలో ఏడుగురు కార్పొరేటర్లు ఇప్పటికే మాజీ మంత్రి మహేందర్ రెడ్డితో సమావేశం ఏర్పాటు చేసుకొని త్వరలోనే ముహూర్తం చూసుకొని వస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

ఎవరూ ఊహించి ఉండరు..

- నియోజకవర్గంలో బీసీ నేతగా మంచి పట్టున్న నాయకుడిగా ఉన్న శ్రీశైలం గౌడ్ గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో లక్షకుపైగా ఓట్లు సాధించి రెండో స్థానంతో నిలిచాడు. ఎన్నడూ లేనివిధంగా కూన శ్రీశైలం గౌడ్ అత్యధికంగా బీజేపీకి ఓట్లు పోలయ్యేలా కష్టపడ్డారు. గతంలో ఇక్కడ పోటీ చేసిన బీజేపీ అభ్యర్థులు డిపాజిట్లు కోల్పోగా 10వేల నుంచి 20వేల ఓట్లు దాటలేదు. బలమైన పేరున్న కూన పోటీ చేయడంతో ఏకంగా లక్షకు పైగా ఓట్లు పోల్ కావడం విశేషం.

తుక్కుగూడ బాటలో..

జన జాతరకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి, సిటీబ్యూరో: జన జాతరకు సర్వం సిద్ధమైంది. తుక్కుగూడ వేదికగా నేటి సాయంత్రం 5 గంటలకు కాంగ్రెస్ పార్టీ నిర్వహించతలపెట్టిన ఈ సభను టీపీసీసీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్, ప్రియాంక గాంధీ, ఖర్గే సహా ఇతర ముఖ్య నేతలంతా హాజరవుతుండటంతో భారీ జనసమీకరణకు ఏర్పాట్లు చేసింది. ఈ వేదిక నుంచే కాంగ్రెస్ జాతీయ అయిదు గ్యారంటీలను ప్రకటించనుంది. సభకు ఏఐసీసీ ముఖ్య నేతలతో పాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థులు హాజరవుతుండటంతో 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు సహా శ్రీశైలం జాతీయ రహదారిపై సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వాహనాల రాకపోకలపై ఆంక్షలు విధించారు. ఇప్పటికే సీఎం రేవంత్ సహా మంత్రులు సభాస్థలికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. తాజాగా శుక్రవారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్‌మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీనియర్ నాయకులు వీహెచ్, మాజీ ఎంపీ రాజయ్య, ఎమ్మెల్యే వివేక్, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి తదితర నేతలు సభాస్థలిని సందర్శించారు.



సభా స్థలి వద్ద కాంగ్రెస్ అగ్ర నేతల ఫ్లెక్సీలు

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు

చార్మినార్: రంజాన్ మాసం చివరి శుక్రవారం జుమ్మాతుల్ విదా సందర్భంగా పాతబస్తీ మక్కా మసీదు ప్రాంగణంతో పాటు చార్మినార్, చార్ కమాన్ గ్రానైట్ రోడ్లపై ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేశారు. నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్యలు బందోబస్తును పర్యవేక్షించారు.



బడుగుల నేతకు బాలిక పుష్పాంజలి

భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శుక్రవారం నగర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు బషీర్‌బాగ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ఉన్నతికి జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని కొనియాడారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా అభివర్ణించారు. ఇక్కడే ఓ చిన్నారి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన దృశ్యం కనిపించింది.



హాట్..హాట్.. కూల్ కూల్..

ఎండ తీవ్రతతో సిటీజనులు అల్లాడిపోతున్నారు. వేసవి తాపాన్ని తట్టుకోలేక పళ్ల రసాలు, కొబ్బరి బోండాలు, తాటిముంజలు, పుచ్చకాయలు, సోడాలతో సేదదీరుతున్నారు. శుక్రవారం నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్ తదితర ప్రాంతాల్లో కనిపించిన దృశ్యాలివీ – సాక్షి ఫొటోగ్రాఫర్



బషీర్‌బాగ్‌లో లస్సీ పంపిణీ చేస్తున్న పోలీసులు..



ఎన్టీఆర్ మార్గ్‌లో..



మింట్ కాంపౌండ్ వద్ద..




ఎన్టీఆర్ మార్గ్‌లో..





ఇందిరా పార్క్ వద్ద..



ఘనంగా 'కలశ' వార్షికోత్సవం

లక్డీకాపూల్ : కలశ ఫైన్ జ్యువెలర్స్ 7వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకుంది. ఈ సందర్భంగా సరికొత్త డిజైన్లతో కూడిన ఏడు వారాల నగలను విడుదల చేసింది. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం.,10లోని కలశ జ్యువెలర్స్‌లో జరిగిన వేడుకల్లో ప్రముఖ సినీ నటి ముచ్చర్ల అరుణ పాల్గొని సందడి చేశారు. ఈ సదర్భంగా ఆమె కలశ నిర్వాహకులు అభిషేక్, వాణి చెందాలతో కలిసి ఏడు వారాల నగలకు సంబంధించిన ప్రత్యేక డిజైన్లతో కూడిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కలశ ఏడు వారాల నగలతో పాటు ఏడు వసంతాల కార్యక్రమాన్ని కనులపండువగా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ నగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. అమ్మమ్మల జ్ఞాపకాలను నెమరు వేసుకునే రీతిలో తయారు చేసిన ఈ నగలు ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అనుభూతిని కలిగిస్తున్నాయన్నారు. బంగారం, వెండి, వజ్రాభరణాలను మేకింగ్ చార్జీలు లేకుండా తయారు చేస్తున్నట్లు కలశ మార్కెటింగ్ హెడ్ అంజనీ.టి తెలిపారు. వజ్రాభరణాలకు సంబంధించి స్వర్ణ కలశం సేవింగ్ స్కీమ్‌ను ప్రవేశ పెట్టామన్నారు. ఏడు వారాల నగల ప్రదర్శన ఈ నెల 25 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.



నంబర్ ప్లేట్ లేకుండా తిరిగినందుకు

క్రిమినల్ కేసు నమోదు

చంచల్‌గూడ: ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు అక్రమ మార్గాలను అనుసరిస్తే జైలుకు వెళ్లక తప్పదు. కొత్త వాహనాలు కొనేవారు రిజిస్ట్రేషన్ గడువు ముగియక ముందే వాహనానికి రిజిస్ట్రేషన్ చేయించి నంబరు ప్లేట్ పెట్టుకోవాల్సిందే. లేని పక్షంలో ట్రాఫిక్ చలాన్లతో పాటు క్రిమినల్ కేసులను కూడా ఎదుర్కోవాల్సి వస్తుంది. ఐదేళ్లుగా వాహనానికి నంబరు లేకుండా తిరుగుతున్న యుకుకుడిపై బుధవారం మాదన్నపేట పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. సైదాబాద్ దోబీఘాట్‌పై తనిఖీలు నిర్వహిస్తున్న సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులకు బీఎన్ రెడ్డి నగర్‌కు చెందిన పతలావత్ భాస్కర్ నంబర్ ప్లేట్ లేని యాక్టీవా వాహనంతో పట్టుబడ్డాడు. అతడిని విచారించగా 2020 ఫిబ్రవరిలో వాహనం కొనుగోలు చేసినట్లు తెలిందింది. రిజిస్ట్రేషన్ గడువు ముగియడంతో నంబరు ప్లేటు రాలేదు. దీంతో ఐదేళ్లుగా ట్రాఫిక్, ఆర్టీఏ శాఖలను మోసం చేస్తూ 29 వేల కిలోమీటర్లు ప్రయాణించాడని ట్రాఫిక్ ఎస్‌ఐ సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిపై చీటింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

'ఐఎస్‌బీ'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

- పీజీపీ క్లాస్–2024, డాక్టోరల్ ఎఫ్‌పీఎం,ఈఎఫ్‌పీఎం విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్
- ఐఎస్‌బీ క్యాంపస్‌లో కోలాహలం



బెలూన్‌లతో విద్యార్థులు



మాట్లాడుతున్న సెబీ చైర్మన్ మధబిపూరిబుచ్



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీపీ) క్లాస్–2024, డాక్టోరల్ ప్రోగ్రామ్ ఫెల్లో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం), ఎగ్జిక్యూటివ్ ఫెల్లో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఈఎఫ్‌పీఎం) కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా 617 మంది విద్యార్థులు, వారిలో 598 మంది పీజీపీ క్లాస్–2024, 19 మంది ఈఎఫ్‌పీఎం విద్యార్థులకు, ఐదుగురు ఎఫ్‌పీఎం విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెబీ చైర్పన్ మదబి పూరి బుచ్ హాజరయ్యారు. ఐఎస్‌బీ చైర్మన్ హరీష్ మన్వాని, పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి, డీన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, మెడల్స్‌ను ప్రదానం చేశారు.

అంకితభావం, నిబద్ధత ప్రశంసనీయం
– సెబీ చైర్మన్ మధబిపూరిబుచ్

నేటి తరం విద్యార్థుల అంకిత భావం, నిబద్ధత ప్రశంసనీయమని సెబి చైర్మన్ మధబిపూరిబుచ్ అన్నారు. నేటి డిజిటల్ యుగంలో ప్రపంచ చిన్నదిగా భావించినప్పుడు సమృద్ధిగా అవకాశాలను అందిస్తూ కాలం వేగంగా కదులుతున్నట్లు కనిపిస్తుందన్నారు. పని–జీవితం, కుటుంబ ం మధ్య సమతుల్యతను కొనసాగిస్తూ, కార్పొరేట్, ప్రభుత్వ పాత్రలను అన్వేషించడానికి, బ్యాలెన్స్ చేయడానికి అనేక రకాల కెరీర్ ఎంపికలు ఉన్నాయన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం సమయాన్ని వెచ్చించాలని సూచించారు. ఇటీవలే యువతిని కలిశానని ఆమె పలు దేశాల్లో 32 స్టార్టప్‌లను నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని ఆశ్చర్య పోయానన్నారు. ఐఎస్‌బీ చైర్మన్ హరీష్ మన్వాని మాట్లాడుతూ ఐఎస్‌బీలో చదివినవారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయన్నారు. ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్ పిల్లుట్ల మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో గ్రాడ్యుయేషన్ డే ఎంతో విలువైనదని, భవిష్యత్తు ఎంతో చక్కగా ఉంటుందని భావిస్తూ ముందుకు సాగే రోజు వచ్చిందన్నారు. కార్యక్రమంలో పలువురు ఐఎస్‌బీ ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో కచ్చితమైన చికిత్స

ఛత్తీస్‌ఘడ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

మాదాపూర్: ప్రజలు తమ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని ఛత్తీస్‌ఘడ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. మాదాపూర్‌లో శుక్రవారం ఆయన ఓషియన్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పిటల్‌ను నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి దంత సమస్యలకైనా ఓషియన్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పిటల్‌లో(ఏఐ) ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సరైన డయాగ్నోసిస్ చేసి కచ్చితమైన చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. చికిత్స తర్వాత ఫలితం ఎలా ఉంటుందో ముందే తెలుసుకునే వీలు ఉంటుందన్నారు. తెలంగాణ ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ పెనుబాకుల మాట్లాడుతూ చిన్నారులకు దంత సమస్యలపై ప్రత్యేక చికిత్సా విధానం ఉందన్నారు. ప్రత్యేక వైద్య సదుపాయాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందించడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఓషియన్ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న ఛత్తీస్‌ఘడ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ తదితరులు

ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ల ఆకస్మిక తనిఖీ

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి పరిధిలోని పలు ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లను ఎండీ సుదర్శన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఎల్లారెడ్డి గూడ, ఎర్రగడ్డ, ఫతేనగర్, ఎస్.ఆర్. నగర్1, 2, బోరబండ ఫిల్లింగ్ స్టేషన్ల సందర్శించి ట్యాంకర్ల బుకింగ్ లాగ్ బుక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాంకర్ బుకింగ్స్ డెలివరీ రికార్డ్స్ పక్కాగా నమోదు చేయాలని సూచించారు. డెలివరీలో ఆలస్యం చేయరాదని, బుకింగ్స్ అయిన తర్వాత.. సాధ్యమైనంత త్వరగా డెలివరీ చేయాలన్నారు. పెండెన్సీ లేకుండా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. వాణిజ్య వినియోగదారులకు రాత్రి సమయాల్లో ఎక్కువ ట్యాంకర్ డెలివరీలు చేస్తే... పెండెన్సీ లేకుండా చూడవచ్చన్నారు. కార్యక్రమంలో జీఎం హరిశంకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు



ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో బుకింగ్ లాగ్ బుక్స్‌ను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

శంషాబాద్ రూరల్: జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని స్కూటీ ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఫరూఖ్‌నగర్ మండలం, సోలిపూర్ గ్రామానికి చెందిన తాళ్లపల్లి జనార్దన్‌రెడ్డి(68), జానమ్మ దంపతులు శంషాబాద్‌లోని కుమార్తె ఇంటికి వచ్చారు. శుక్రవారం స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు జానమ్మ బస్సులో బయలుదేరగా, జనార్దన్‌రెడ్డి స్కూటీపై వెళ్తున్నాడు. మార్గ మధ్యలో మదన్‌పల్లి శివారులో బెంగళూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని స్కూటీ ఢీకొంది. తీవ్ర గాయాలైన జనార్దన్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్‌ఐసీసీలో సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం



సూత్ర ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన నటి రాశీసింగ్, నిర్వాహకుడు ఉమేశ్ మధ్యమ్ తదితరులు

మాదాపూర్: ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న సూత్ర ఎగ్జిబిషన్‌ను నటి రాశీసింగ్ నిర్వాహకుడు ఉమేశ్‌మధ్యన్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మగువల మనసుకు నచ్చే విధంగా పలురకాల డిజైన్‌లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వేసవిలో ధరించేందుకు ప్రత్యేక వస్త్రాలు, వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక దుస్తులు అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ తదితరులు పాల్గొన్నారు.

చెరువును రక్షించేందుకు సుప్రీం కోర్టుకైనా వెళ్తా..

పంజగుట్ట: దాదాపు 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న ఒమ్ రుక్నుద్ దౌల చెరువును రక్షించేందుకు సుప్రీంకోర్టుకైనా వెళ్లేందుకైనా తాను సిద్ధంగా ఉన్నట్లు సెంటర్ ఫర్ వెల్ బీయింగ్ ఎకనామిక్స్ హైదరాబాద్ వ్యవస్థాపక డైరెక్టర్ లుబ్నా సర్వత్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ .. జీవరాసుల మనుగడకు ప్రధాన వనరైన నీటిని, చెరువులను రక్షించుకోవడంలో ప్రజలు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు బాధాకరమన్నిరు. శివరాంపల్లి, నేషనల్ పోలీస్ అకాడమీకి ఎదురుగా ఉన్న బమ్ రుక్నాదౌ దౌల చెరువు ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని, అప్పటి ప్రజలకు మంచినీటి అవసరాలు తీర్చిందని గుర్తుచేశారు. అలాంటి చెరువు ప్రస్తుతం కనుమరుగయ్యే స్థితిలో ఉందన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం కబ్జాలు మరింత పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో చెరువు విస్తీర్ణం సుమారు 17 ఎకరాలుగా చూపించిన ప్రభుత్వం ప్రస్తుతం 10 ఎకరాలే చూపించడం విచారకరమన్నారు. ఇలా పొంతనలేని సర్వే రిపోర్టులు ముందు పెట్టి చెరువును కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. చెరువు కబ్జాపై తాను ఇప్పటికే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ మైనార్టీ కమిషన్ మాజీ సభ్యుడు, న్యాయవాది సయ్యద్ తారక్ ఖాద్రీ, ఫారుఖ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయాలంటూ..

రూ. 25 లక్షలు టోకరా

హిమాయత్‌నగర్: ఇన్సూరెన్స్ రెన్యువల్ చేయాలంటూ సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తికి భారీగా టోకరా వేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన వ్యక్తి గతంలో మ్యాక్స్ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకున్నాడు. సదరు ఇన్సూరెన్స్ ఎక్స్‌పైర్ అయిందని వెంటనే రెన్యువల్ చేసుకోవాలని సైబర్ నేరగాళ్లు అతడికి మ్యాక్స్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి కాల్ చేస్తున్నట్లు చెప్పారు. వెంటనే రెన్యువల్ చేయకపోతే పాలసీ రద్దు అవుతుందని భయపెట్టారు. వారి మాటలు నమ్మిన అతను వారు చెప్పిన విధంగా రూ. 1.20 లక్షలు చెల్లించాడు. మళ్లీ డబ్బు రాలేదని మరోసారి కాల్ చేసి చెల్లించమన్నారు. విడతల వారిగా బాధితుడికి పలు కారణాలు చెబుతూ రూ. 25 లక్షలు కాజేశారు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపారు.

పోలీసు కస్టడీలో నీతూబాయి

- పీటీ వారెంట్‌పై అదుపులోకి..
- గంజాయి విక్రయాల కేసులో విచారణ



నీతూబాయిని విచారిస్తున్న రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న హైదరాబాద్ నానక్‌రామ్ గూడకు చెందిన నీతూబాయిని శుక్రవారం గజ్వేల్ రూరల్ పోలీసులు రెండు రోజుల కస్టడీ నిమిత్తం పీటీ వారంటుపై వర్గల్ మండలం గౌరారం పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చారు. ఈ ప్రాంతంలో గంజాయి విక్రయాలకు సంబంధించి రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఆమెను విచారించారు. గంజాయి ఎక్కడి నుంచి తెచ్చేది, ఎవరెవరికి అమ్మేది, ఆమె గూగుల్‌పే, ఫోన్‌పే డిజిటల్ లావాదేవీలపై ఆరా తీశారు. సీఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నానక్‌రామ్‌గూడకు చెందిన నీతూబాయి గత కొన్నేళ్లుగా గంజాయి అమ్ముతుంది. ఈ క్రమంలో ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులు, గోల్కొండ, గచ్చిబౌలి పోలీసులు 18 కేసుల్లో అరెస్టు చేశారు. గతంలో హైదరాబాద్ పోలీసులు ఆమెపై పీడీ యాక్ట్ నమోదు చేసి సుమారు సంవత్సరం పాటు జైలులో ఉంచారు. ఆమె ఆస్తులను అటాచ్ చేశారు. అయినా ఆమె తన పంథా మార్చుకోలేదు. నీతూబాయి తెలిపిన వివరాల మేరకు వర్గల్ మండలంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో గంజాయికి అలవాటు పడిన యువకులను త్వరలో విచారిస్తామని రూరల్ సీఐ పేర్కొన్నారు. సమావేశంలో గౌరారం ఎస్సై శివకుమార్ ఉన్నారు.

రూ.40 లక్షల నగదు పట్టివేత

గన్‌ఫౌండ్రీ: కారులో వాహనంలో రూ.40 లక్షలు తరలిస్తుండగా శుక్రవారం సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అబిడ్స్‌లోని రామకృష్ణ థియేటర్ పార్కింగ్ ఆవరణలోని ఓ కారులో అక్రమంగా నగదు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కారులో రూ.40 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు కారు డ్రైవర్ ముత్యాలు, కె.రాజేష్‌లను అదుపులోకి తీసుకుని విచారించగా తాము హఫీజ్ పేట్‌కు చెందిన విల్సన్ బాబు దగ్గర పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు తాము నగదు తీసుకెళుతున్నట్లు తెలిపారు. నగదును స్వాధీనం చేసుకుని అబిడ్స్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



నగదుతో పట్టుబడ్డ నిందితులు

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్



జయచంద్

రాజేంద్రనగర్: మాదకద్రవ్యాలకు బానిసైన ఓ యువకుడు సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో బెంగుళూర్ నుంచి ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకువచ్చి నగరంలో విక్రయిచేందుకు ప్రయత్నిస్తూ చిక్కాడు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ శుక్రవారం కేసు వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లాకు చెందిన జయచంద్ (26) ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చిన అతను ఎస్ఆర్‌నగర్‌లో ఓ లాడ్జిని నిర్వహించి అప్పుల పాలయ్యాడు. అనంతరం ఓ సంస్థలో ఉద్యోగం చేశాడు. జీతం చాలకపోవడంతో ఇసుక రవాణా దందా నిర్వహించాడు. అప్పులు పెరిగిపోవడంతో పాటు గంజాయి, మత్తు మందులకు అలవాటు పడ్డాడు. బెంగుళూర్‌లో ఓ వ్యక్తి ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తాడని తెచ్చుకొని నగరంలో విక్రయిస్తే మంచి లాభాలు ఉంటాయని ఓ స్నేహితుడు సలహా ఇచ్చాడు. దీంతో బెంగళూరు వెళ్లిన జయచంద్ 2 గ్రాములు మత్తు పదార్థాన్ని తీసుకొచ్చాడు. దానిని తానే వినియోగించాడు. గత నెల 26 మరోసారి బెంగుళూర్‌కు వెళ్లి 20 గ్రాముల డ్రగ్స్ తీసుకొచ్చాడు. 5 గ్రాములు తాను వాడుకుని 15 గ్రాములను విక్రయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించాడు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధి సన్‌సిటీలోని నివాసంలో మత్తు పదార్థాన్ని దాచినట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు, రాజేంద్రనగర్ పోలీసులు దాడి చేసి జయచంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 15 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి కాల్ డేటా ఆధారంగా బెంగుళూర్‌లో ఎవరు విక్రయించారు... ఎవరెవరికి విక్రయించారో పూర్తి వివరాలు ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

బహిరంగంగా బెదిరిస్తున్నారు: అసదుద్దీన్ ఒవైసీ

సాక్షి,సిటీబ్యూరో: ఘాజీపూర్‌లో మృతి చెందిన ముఖ్తార్ అన్సారీ కుటుంబాన్ని పరామర్శించి వచ్చిన అనంతరం తమకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఏఐఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. శుక్రవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ దేశంలో ఒక వాతావరణం ఏర్పడిందని, కొందరు వ్యక్తులకు అర్థంలేని పని చేసే ధైర్యం పెరుగుతోందన్నారు. ఎన్నికల నేపథ్యంలో బహిరంగంగా బెదిరింపులకు పాల్పడుతున్న వ్యవహారాలను ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఎవరి జీవితం శాశ్వతం కాదని, అందరు ఏదో ఒక పోవాల్సిన వారేనని పేర్కొన్నారు. సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్ఆర్‌సీల పేరుతో ముస్లింలకు దేశం లేకుండా చేయడమే బీజేపీ లక్ష్యమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్



టీపీసీసీ కార్యదర్శి విజయారెడ్డి



ఫిలింనగర్ చౌరస్తాలో...





బషీర్‌బాగ్‌లో నివాళులర్పిస్తున్న ఆప్ నేతలు



అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో...

గరీబోళ్ల బిడ్డకు ఘనంగా నివాళి

వాడవాడలా బాబూజగ్జీవన్‌రామ్ జయంతి
ఆయన బాటలో నడవాలని నేతలు పిలుపు

బంజారాహిల్స్: సామాజిక అసమానతలను తొలగించేందుకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు, దళిత అభ్యున్నతికి బాటలు వేసిన మాజీ ఉప ప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు శుక్రవారం వాడవాడలా ఘనంగా జరిగాయి. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, శ్రీనగర్‌కాలనీ తదితర డివిజన్ల పరిధిలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు.



రహమత్‌నగర్‌లో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



కళ్యాణ్‌నగర్ వెంచర్-3లో పీవీ రవిశేఖర్‌రెడ్డి...

మహిళల మదిదోచే 'ప్రత్యేక కలెక్షన్స్'



ప్రత్యేక కలెక్షన్స్‌ను తిలకిస్తున్న శ్రీదేవి నిరుప్

శ్రీనగర్‌కాలనీ: ఉగాది, సమ్మర్ ప్రత్యేక కలెక్షన్స్‌తో మై గ్లామ్ పాప్‌అప్ ఎగ్జిబిషన్‌లోని వస్త్రాలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని హస్తకళా ఆర్టిషన్ ఫౌండేషన్, సిలాయి ఫౌండర్, డిజైనర్ శ్రీదేవి నిరుప్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ తాజ్‌కృష్ణ ఎదురుగా ఉన్న లేబుల్స్ పాప్‌అప్ స్పేస్‌లో రెండు రోజులపాటు నిర్వహించనున్న మై గ్లామ్ పాప్ అప్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. నగర ఫ్యాషన్ ప్రియులకు ఈ ఎగ్జిబిషన్ అమితంగా ఆకట్టుకుంటుదన్నారు. డిజైనరీ, వీవర్స్ కలెక్షన్స్, జ్యువెలరీ ప్రత్యేక కలెక్షన్స్‌ను ఏర్పాటు చేశామని నిర్వాహకురాలు సుచరితారావు అన్నారు. మహిళలు ఈ ఎగ్జిబిషన్‌ను సందర్శించి సరికొత్త కలెక్షన్స్‌ను తిలకించాలని కోరారు.

రేపు సామూహిక నిరాహార దీక్ష: ఆప్

లిబర్టీ: ప్రజాస్వామ్యంలో నియంతృత్వ ప్రధాని నరేంద్రమోదీ భయాకన రాజకీయ అణచివేతలకు పాల్పడుతున్నారని, బీజేపీ రాజకీయ హింసపై దేశంలో తీవ్ర ప్రజా ప్రతిఘటన తప్పదని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ హెచ్చరించారు. లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఏప్రిల్ 7వ తేదీన నిర్వహించే ఆప్ సామూహిక నిరాహార దీక్ష పోస్టర్‌ను రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాముగౌడ్, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హేమ జిల్లోజు, నర్సింగ్ యమునగౌడ్, దివ్యాంగ విభాగం కన్వీనర్ దర్శనం రమేష్, టి.రాకేష్‌సింగ్, కొడంగల్ శ్రీనివాస్, శివాజీ, మౌనికలతో కలిసి డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాజకీయ ప్రతీకారం తీర్చుకోవడానికి నిరాధారమైన కేసులు బనాయించి ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణం కేసులో ఇరికించారని ఆరోపించారు.

విజ్ఞాన భాండాగారాలు.. పురాతన కట్టడాలు

- విద్యార్థులు ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు
- విజయనగర ఉజ్జీవని ట్రస్టీ రాణి రత్నశ్రీ



ఆర్కిటెక్చరల్ హెరిటేజ్ భవనాలపై రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

బంజారాహిల్స్: హెరిటేజ్ భవనాల నుంచి ఎన్నో గొప్ప విషయాలు విద్యార్థులు నేర్చుకునేందుకు అవకాశం ఉందని విజయనగర ఉజ్జీవనీ ట్రస్టీ రాణి రత్నశ్రీ అన్నారు. బంజారాహిల్స్‌లోని జవహర్ లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్ స్టడీస్ కాలేజీ రెండు రోజుల నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఆర్కిటెక్చరల్ అండ్ కల్చరల్ కార్నర్ స్టోన్స్ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దేశంలో కాకతీయులు, చోళులు, విజయనగర రాజులు ఎన్నో అద్భుతమైన కట్టడాలు నిర్మించి ఒక కల్చర్‌ను ఏర్పాటు చేశారని నాటి కట్టడాలను నేటి విద్యార్థులు కచ్చితంగా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. చరిత్ర అంటే ఏదో ఒక పదం కాదని నాటి సంస్కృతులు, సంప్రదాయాలు, నాటి పద్ధతులు అప్పటి కట్టడాల్లో ఉంటాయని అన్నారు. హెరిటేజ్ భవనాలు, బావులు, ఆస్తులు కాపాడేందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ఎంతో సహకరిస్తున్నాయని విద్యార్థులుగా, పౌరులుగా ప్రతి ఒక్కరూ కూడా వాటి సంరక్షణకు నడుం బిగించాలని అన్నారు. ఆర్కియాలజి సర్వే ఆఫ్ ఇండియా అదనపు డైరెక్టర్ జాన్విజ్ కపూర్ మాట్లాడుతూ వరంగల్‌లోని వెయ్యి స్తంభాల గుడితో పాటు పలు పురాతన నిర్మాణాలను కాపాడేందుకు చేసిన ప్రయత్నాలను వివరించారు. నాటి రాజులు దేశంలో వేలాది బావులను తాగునీటి కోసం తవ్వించారని అవి ఇప్పుడు ఒక్కొక్కటిగా రిసోర్ట్ చేయబడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం హెరిటేజ్ భవనాలపై ప్రత్యేకంగా రూపొందించిన సావనీర్‌ను వారు ఆవిష్కరించారు. ఐటీపీఏ హైదరాబాద్ చాప్టర్ ప్రొఫెసర్ వీఐఐ. నర్సింహులు, మూర్తి క్షేత్ర ఆర్కిటెక్ జి. సూర్యనారాయణ, ఇంటాక్ సంస్థ కన్వీనర్ పి.అనురాధారెడ్డి, జేఎన్ఐఏఎస్ ప్రిన్సిపాల్ శాలిని, జేఎన్ఐఏఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.సురేష్ పాల్గొన్నారు.

దానం విజయానికి కృషి: మనోహర్‌బాబు



షబ్బీర్ అలీని కలిసిన మనోహర్‌బాబు

బంజారాహిల్స్: నాంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి మెజార్టీ తీసుకురావడానికి కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు. గ్రేటర్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి, నాంపల్లి సీనియర్ నేత బత్తుల మనోహర్‌బాబు శుక్రవారం షబ్బీర్‌అలీతో పాటు సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను ఫిలింనగర్‌లో కలిశారు. తాను గతంలో నాగేందర్‌తో కలిసి కాంగ్రెస్‌లో పనిచేశానని, ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఉందని, అదే స్ఫూర్తితో ఈ ఎన్నికల్లో కూడా దానం విజయానికి కృషి చేస్తానని మనోహర్ బాబు తెలిపారు.

డెక్కన్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 1లోని జలగం వెంగళరావు పార్కులో హైదరాబాద్ డెక్కన్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా టీపీసీసీ కార్యదర్శి పి. విజయారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... డెక్కన్ పేరెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఏటా క్రమం తప్పకుండా పార్కులో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. ప్రెసిడెంట్ ఎం.ఎ.ఫయాజ్, జనరల్ సెక్రటరీ మహ్మద్ అజీమ్, సలహాదారుడు అఫ్జల్ ఉద్దీన్ బక్షి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 40, పచ్చిమిర్చి 55, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 65, పచ్చకాకర 35, పందిరి బీర 28, క్యాబేజీ 18, క్యారెట్ 23, దొండ 23, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 33, చామగడ్డ 35, మొరంగడ్డ 16, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

బీఆర్ఎస్, బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: మంత్రి కోమటిరెడ్డి



మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ధన్‌రాజ్ రాథోడ్

బంజారాహిల్స్: సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని శుక్రవారం ఎమ్మెల్యే కాలనీలోని ఆయన నివాసంలో బంజారాహిల్స్ డివిజన్ కాంగ్రెస్ కంటెస్టెడ్ కార్పొరేటర్ ధన్‌రాజ్ రాథోడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపు కోసం కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటి నుంచే సమన్వయంగా పనిచేసి గెలిపించాలని మంత్రి సూచించారు. దానం నాగేందర్ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తూ బీఆర్ఎస్, బీజేపీ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన చిన్న రమేష్

- ముఖ్య మహిళానేతలు కూడా...
- ఎమ్మెల్యే మాగంటికి మరో ఎదురుదెబ్బ



అజహరుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన చిన్న రమేష్, సీనియర్ మహిళానేతలు

వెంగళరావునగర్: ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ముఖ్య అనుచరుడు, జీటీఎస్ ఆలయ చైర్మన్ చిన్న రమేష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ అజహరుద్దీన్ సమక్షంలో శుక్రవారం ఆయన తన అనుచరులతో కలిసి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి విజయం సాధించిన కార్పొరేటర్లు ఇద్దరు ఇప్పటికే ఎమ్మెల్యే మాగంటి నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆ పార్టీని వీడిపోయారు. తాజాగా జీటీఎస్ టెంపుల్ చైర్మన్‌గా ఎమ్మెల్యే సూచించిన అతి ముఖ్య అనుచరుడు, దళిత నాయకుడైన చిన్న రమేష్ కూడా బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. చిన్న రమేష్‌తో పాటుగా బీఆర్ఎస్ పార్టీకి ఎన్నో సేవలు అందించి, ఎమ్మెల్యే మూడుసార్లు గెలవడానికి ప్రధాన కారణమైన మహిళా నాయకులు సైతం కాంగ్రెస్‌లో చేరడంతో ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు అతి పెద్ద దెబ్బ తగిలినట్టే అయింది.

సర్వీస్ హోంలో యువతి అదృశ్యం

వెంగళరావునగర్: ప్రభుత్వ సర్వీస్ హోంలో ఉంటున్న ఓ యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... మధురానగర్‌లోని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాంగణంలో ఉన్న దుర్గాభాయి దేశ్‌ముఖ్ కళాశాలలో 19 ఏళ్ల యువతి డిప్లొమో (సీఎంఈ) మూడో సంవత్సరం చదువుతోంది. ఆమె అదే ప్రాంగణంలోని సర్వీస్ హోంలో 2021 నుంచి ఉంటుంది. ఈ నెల 3వ తేదీన మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆ బాలిక కనిపించడం లేదు. సర్వీస్ హోం ఇన్‌చార్జి ఎస్.అమరావతి అనేక ప్రాంతాల్లో ఆ బాలిక కోసం వెతికినా ప్రయోజనం లేదు. దీంతో శుక్రవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఫోన్ ట్యాపింగ్‌పై సమగ్ర దర్యాప్తు చేయాలి

తెలంగాణ న్యాయవాదుల జేఏసీ



మాట్లాడుతున్న నాగుల శ్రీనివాస్ యాదవ్

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై సమగ్ర దర్యాప్తు చేసి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర డీజీపీకి వినతి పత్రాలను సమర్పించామని జేఏసీ నాయకులు తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాసాయాదవ్, కన్వీనర్ బత్తుల కృష్ణలు మాట్లాడుతూ... రాష్ట్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు, పౌరులపై కూడా ఫోన్ ట్యాపింగ్ పాల్పడిన వారిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఆర్టికల్ 27 వ్యక్తిగత స్వేచ్ఛ, దీనిని దుర్వినియోగం చేయరాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో జరిగే 17 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. జేఏసీ నేతలు జి.విజయకుమారి, జి. రామారావు, అనురాధ, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆకృతి ఎగ్జిబిషన్

బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో శుక్రవారం ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఎగ్జిబిషన్‌ను ఆకృతి డైరెక్టర్ శశి నాథ ప్రారంభించారు. శని, ఆది వారాల్లో కూడా ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



'బీఎస్పీలో చేరి మోసపోయాం'

పంజగుట్ట: ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ (ఆర్ఎస్పీ)ని నమ్మి పార్టీలో చేరి మోసపోయామని బీఎస్పీ ఆలంపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి, ఆర్ఎస్పీ సోదరుడు ఆర్.ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం చెన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి దాసారపు శ్రీనివాస్‌తో కలసి ప్రసన్న కుమార్ విలేకరులతో మాట్లాడారు. బీఎస్పీకి రాజీనామా చేసి త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు వారు తెలిపారు. ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మీదున్న నమ్మకంతో ఉద్యోగాలు వదులుకుని మరీ తాము బీఎస్పీలో చేరామని, తమలాగే ఎంతోమంది పార్టీలో చేరి రూ. కోట్లు వృథా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రికి రాత్రి మాజీ సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ఫాంహౌస్‌లో బీఆర్ఎస్ కండువా కప్పుకుని ఆర్ఎస్పీ జుగుప్సాకర నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రజలు తిరస్కరించిన పార్టీలో చేరి ఆయన ఏవిధంగా ప్రజాసేవ చేస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన ఫోన్ ట్యాపింగ్, ఎన్నికల్లో పోలీస్ వాహనాల్లో డబ్బు తరలింపు, కాళేశ్వరం అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో చోరీ

బంజారాహిల్స్: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ హైలన్‌కాలనీ బిల్డింగ్ నం 94లోని ఫ్లాట్ నం 303లో నివాసం ఉండే పామర్తి నాగేంద్ర ఓ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. గురువారం అర్ధరాత్రి 11 గంటల సమయలో ఆఫీస్‌కు వెళ్లాడు. తిరిగి శుక్రవారం తెల్లవారుజాము 3 గంటలకు ఇంటికి వచ్చాడు. ఇంటి తాళం లేకపోవడంతో లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో దొంగతనం జరిగిందని తెలుసుకున్నాడు. ఇంట్లో బీరువాలో ఉన్న 56 గ్రాముల (ఐదున్నర తులాల) బంగారు ఆభరణాలు, 4 గ్రాముల వెండి, రూ. 73 వేల నగదు చోరీకి గురైనట్లు నాగేంద్ర జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

'కవి సాయంత్రం' అధ్యక్షుడిగా రామకృష్ణ

లక్డీకాపూల్: ప్రముఖ సోషల్ మీడియా గ్రూప్ 'కవి సాయంత్రం' అధ్యక్షుడిగా ప్రముఖ కవి అత్తలూరి రామకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకులు ముక్కెర సంపత్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సంతప్ కుమార్ మాట్లాడుతూ.. ఈ 'కవి సాయంత్రం' గ్రూపు ప్రముఖ సాహిత్య, స్వచ్ఛంద సేవా సంస్థ జన జాగృతి కళా సమితిలో అంతర్భాగమని చెప్పారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో విడివిడిగా కమిటీలను నియమించామన్నారు. తెలుగు భాషా వికాసం కోసం, ఔత్సాహికులలో సాహిత్యాన్ని మరింత పెంపొందించడం కోసం ఈ సమూహం పని చేస్తుందన్నారు. ఈ నియామకం రెండు సంవత్సరాల వరకు వర్తిస్తుందని సంపత్ పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ప్రభుత్వ నిధుల ఆధారంగా బాండ్ల చెల్లింపులు: ఆర్టీసీ



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగులకు బాండ్ల తాలూకు బకాయిలను ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల ప్రకారం చెల్లిస్తున్నామని తెలంగాణ ఆర్టీసీ ఒక ప్రకటనలో తెలిపింది. 'లాభాలొస్తున్నా.. ఫలితం సున్నా' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంస్థ వివరణ ఇచ్చింది. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చినట్లుగా ఆ మొత్తాన్ని చెల్లిస్తున్నట్లు తెలిపింది. ఇక మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం ఆర్టీసీకి రావాల్సిన డబ్బులు రీయింబర్స్ చేస్తోందని వెల్లడించింది. ఉచిత ప్రయాణానికి సంబంధించి మహిళలకు జారీ చేసిన జీరో టికెట్ల వివరాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపుతున్నామని, దాని ప్రకారం ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని తెలిపింది. టీఎస్ ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటం వల్లనే ఇటీవల 21 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించిన ట్లు పేర్కొంది. ఉద్యోగులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, సీసీఎస్ బకాయిలను చెల్లించేందుకు సంస్థ ప్రయత్నిస్తోందని తెలిపింది.

నీట్, ఐఐటీపై 30 రోజుల ఆన్‌లైన్ క్లాసులు

సాక్షి, హైదరాబాద్: టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులకు 30 రోజుల పాటు ఐఐటీ, నీట్‌పై ఉచిత ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు మెటామైండ్ అకాడమీ చైర్మన్ మనోజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐఐటీయన్లు, మెడికోలతో ఈ క్లాసులు ఉంటాయని, వారు అన్ని సందేహాలు నివృత్తి చేస్తారని తెలిపారు. దీంతో పాటు సైకాలజిస్టులతో కూడా క్లాసులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9090898928 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మేనిఫెస్టోలో పాత పింఛన్ హామీ

ఎన్‌ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: కంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వోద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరిస్తామనే హామీని దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్‌ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ కోరారు. దేశంలోని 84 లక్షల మంది సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలతో పాటు.. తెలంగాణలోని 2.30 లక్షల కుటుంబాలు పాత పింఛన్ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాయన్న విషయాన్ని రాజకీయ పార్టీలు విస్మరించవద్దని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు. పార్టీలు ఎన్నికల ప్రణాళికల్లో ఈ అంశాన్ని చేర్చడం ద్వారా లక్షలాది ఉద్యోగ కుటుంబాలకు భరోసా కల్పించాలని స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు.

ఎన్‌సీఎల్‌టీ బార్ అసోసియేషన్ చైర్మన్‌గా చంద్రసేన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ బార్ అసోసియేషన్ (2024-25) అధ్యక్షునిగా న్యాయవాది బి.చంద్రసేన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా ఎల్.వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శిగా ఎస్.రాజశేఖర్‌రావు, కోశాధికారిగా టి.విజయ్‌కుమార్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా వీవీఎస్‌వీ రాజు, సి.రోహిణి సుమిత, ఏవీ మోహన్ రావులు కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు.

నేడు సిరిసిల్లలో నేతన్నల మహాగర్జన

సిరిసిల్ల టౌన్: ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నేతన్నలు పోరుబాట పట్టారు. వస్త్రపరిశ్రమను సంక్షోభం నుంచి కాపాడాలని కోరుతూ శనివారం సిరిసిల్లలో నేతన్నలు మహాగర్జన పేరిట భారీ సభ నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. వస్త్రపరిశ్రమ ప్రతినిధులు మాట్లాడుతూ నాలుగు నెలలుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలిపినా.. ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. పార్టీలకతీతంగా మహాగర్జన సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. బతుకమ్మ చీరల పెండింగ్ బిల్లులు రూ.272 కోట్లు విడుదల చేయాలని, యారన్ సబ్సిడీ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమచేయాలని, ప్రభుత్వం తరపున వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'దళితుల అభ్యున్నతికి విధి విధానాలు ప్రకటించాలి'

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ దళితుల అభ్యున్నతి కోసం విధి విధానాలు ప్రకటించాలని, అన్ని వర్గాలకు దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్‌ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళితులను ఆకాశమంత ఎత్తుకు ఎత్తితే.. కాంగ్రెస్ ప్రభుత్వం అవమానాలకు గురిచేస్తోందన్నారు. గత బీఆర్‌ఎస్ సర్కార్ పలు పథకాలను అమలు చేసిందన్నారు.

నేడు బీజేపీ టిఫిన్ బాక్స్ బైఠక్‌లు

సంస్థాపక దినోత్సవం సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో నిర్వహణ

- ఎవరి అల్పాహారం వారే తెచ్చుకోనున్న నేతలు, కార్యకర్తలు
- లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధత, పార్టీ కార్యక్రమాలపై చర్చ
- కేడర్ మధ్య సమన్వయం మెరుగవుతుందని భావిస్తున్న నాయకత్వం
- పార్టీ పతాకాలు ఆవిష్కరించనున్న నేతలు

సాక్షి, హైదరాబాద్: శనివారం బీజేపీ 44వ సంస్థాపక దినోత్సవం సందర్భంగా.. రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో 'టిఫిన్ బాక్స్ బైఠక్'ల నిర్వహణకు పార్టీ సిద్ధమౌతోంది. కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, పార్టీ సికింద్రాబాద్ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి మొదలు అన్ని స్థాయిల నేతలు, కార్యకర్తలు తమ తమ ఓటున్న సొంత పోలింగ్ బూత్ కేంద్రాల్లో జరిగే సమావేశాల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయాలు, పోలింగ్ బూత్‌ల వద్ద పార్టీ పతాకాలను ఆవిష్కరించనున్నారు. కాగా రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్ల పరిధిలోని పోలింగ్ బూత్ కేంద్రాలకు ఎవరి అల్పాహారం (టిఫిన్) వారు తెచ్చుకుని, అక్కడే తింటూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భేటీలు నిర్వహించనున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు పార్టీపరంగా సన్నద్ధతపై, పార్టీ చేపడుతున్న కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నారు. పార్టీ కేడర్ మధ్య మెరుగైన సమన్వయ సాధన, కార్యాచరణ రూప కల్పనకు ఈ భేటీలు దోహదపడతాయని నేతలు చెబుతున్నారు.



మూడు లక్ష్యాల సాధనకు సంకల్పం

ఒక్కో పోలింగ్ బూత్‌లోని మూడు, నాలుగు పోలింగ్ స్టేషన్లలో ఆయా సామాజికవర్గాల ఓట్లు, వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, వారికి సంబంధించి సమాచారం, ఇతర అంశాలపై చర్చించనున్నట్టు సమాచారం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, యువత, మహిళలు, రైతులు ఇలా వివిధ వర్గాల ఓటర్లను ఏవిధంగా చేరుకోవాలి, దళిత బస్తీలు, గిరిజన తండాల్లో ఎలాంటి ప్రచారాన్ని నిర్వహించాలన్న దానిపై అభిప్రాయ సేకరణ జరపనున్నారు. ఫిర్ ఏక్‌బార్ నరేంద్ర మోదీ సర్కార్ కోసం 370 సీట్ల సాధన, ప్రతి పోలింగ్ బూత్‌లో అదనంగా 370 ఓట్ల సాధన, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి బూత్‌లో 50 ఓట్ల సాధనకు ఈ సందర్భంగా సంకల్పం తీసుకోనున్నారు.

కాచిగూడలో కిషన్‌రెడ్డి.. మహబూబ్‌నగర్‌లో డీకే అరుణ

శనివారం ఉదయం అంబర్‌పేట నియోజకవర్గం కాచిగూడలోని 214 పోలింగ్ స్టేషన్‌లో కిషన్‌రెడ్డి టిఫిన్ బాక్స్ బైఠక్‌లో పాల్గొంటారు. పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్‌పాటిల్ సికింద్రాబాద్ అసెంబ్లీలోని మెట్టుగూడ 33-35 పోలింగ్ స్టేషన్లలో, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మహబూబ్ నగర్ అభ్యర్థి డీకే అరుణ నారాయణపేట అసెంబ్లీ కోయిల్‌కొండలోని 23-27 పోలింగ్ స్టేషన్లలో పాల్గొంటారు. ప్రధాన కార్యదర్శి కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ కరీంనగర్‌లోని సాధనా స్కూల్ 174వ పోలింగ్ స్టేషన్‌లో, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ ముషీరాబాద్ నియోజకవర్గం చిక్కడపల్లిలోని 9వ పోలింగ్‌స్టేషన్‌లో, జాతీయ కార్యవర్గ సభ్యుడు, మల్కాజిగిరి అభ్యర్థి ఈటల రాజేందర్ మల్కాజిగిరిలోని వినాయక్‌నగర్ 155-157 పోలింగ్‌స్టేషన్లలో, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి నిర్మల్ అసెంబ్లీలోని గాజులపేట 192 పోలింగ్ స్టేషన్‌లో, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి మహేశ్వరం అసెంబ్లీలోని నాదర్‌గుల్, బడంగ్‌పేట పోలింగ్ స్టేషన్లలో పాల్గొంటారు.

ఈసారి ఇంకా ఆలస్యంగా టీఎస్ఈఏపీ కౌన్సెలింగ్!

ఇప్పటికీ మొదలవ్వని కాలేజీల తనిఖీలు
సీట్ల పెంపుపై ఏఐసీటీఈ నుంచి రాని స్పష్టత


లింబాద్రి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి కౌన్సెలింగ్ ఈ ఏడాది మరింత ఆలస్యమయ్యేలా కన్పిస్తోంది. ప్రైవేటు కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియ ఇప్పటికీ మొదలవ్వకపోవడం ఈ అనుమానాలకు తావిస్తోంది. ఇంజనీరింగ్‌కు సంబంధించిన కొన్ని బ్రాంచీల్లో సీట్ల పెంపునకు పెద్ద ఎత్తున దరఖాస్తులొచ్చాయి. మరికొన్ని బ్రాంచీల్లో సీట్ల కుదింపును కాలేజీలు కోరుకుంటున్నాయి. వీటన్నింటిపైనా అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ సీట్లపై స్పష్టత వచ్చినప్పటికీ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు కాలేజీలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం యూనివర్సిటీ బృందాలు కాలేజీలను సందర్శించాల్సి ఉంటుంది. మౌలిక వసతులు ఏ మేరకు ఉన్నాయి? ఫ్యాకల్టీ పరిస్థితి ఏమిటి? అనే అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది. అన్ని అర్హతలు ఉన్నప్పుడు మాత్రమే అనుబంధ గుర్తింపు ఇస్తారు. అప్పుడే కాలేజీలు కౌన్సెలింగ్‌లో పాల్గొనే వీలుంటుంది. కానీ ఇప్పటివరకు ఇందుకు సంబంధించిన సమావేశమే జరగలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఆలస్యానికి కారణాలేంటి?

రాష్ట్ర ఈఏపీసెట్ మే 7వ తేదీ నుంచి మొదలై 11తో ముగుస్తుంది. నెల రోజుల్లో ఫలితాలు వెల్లడిస్తారు. అదే రోజు కౌన్సెలింగ్ తేదీలనూ ప్రకటిస్తారు. కౌన్సెలింగ్ మొదలయ్యే నాటికి రాష్ట్రంలోని 175 కాలేజీల్లో ఉండే కన్వీనర్ కోటా సీట్లను బ్రాంచీల వారీగా వెల్లడించాల్సి ఉంటుంది. గత ఏడాది లెక్కల ప్రకారం 90 వేలకు పైగా ఇంజనీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది మొత్తం 14 వేల సీట్లు కంప్యూటర్ సైన్స్ బ్రాంచీల్లో పెరిగాయి. ఈ ఏడాది కూడా మరి కొన్ని సీట్లు పెంచాలని కాలేజీలు కోరుతున్నాయి. గత ఏడాది తనిఖీల ప్రక్రియపై ఆరోపణలు వచ్చాయి. మౌలిక వసతులు, సరైన అధ్యాపకులు లేకుండా అనుబంధ గుర్తింపు ఇచ్చినట్టు కొన్ని వర్సిటీలపై విమర్శలు వచ్చాయి. దీంతో ఈసారి ప్రత్యేక బృందాలను నియమించాలని నిర్ణయించారు. వసతులు లేని కాలేజీల్లో కంప్యూటర్ సైన్స్ బ్రాంచి సీట్ల కుదింపు అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కౌన్సెలింగ్ ఆలస్యమయ్యే సూచనలు కన్పిస్తున్నాయి. అయితే కౌన్సెలింగ్ సకాలంలోనే జరుగుతుందని భావిస్తున్నట్లు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు.

జస్టిస్ రామలింగేశ్వర్‌రావు కన్నుమూత



సాక్షి, హైదరాబాద్: జస్టిస్ ఎ.రామలింగేశ్వర్‌రావు గుండె పోటుతో కన్ను మూశారు. జర్మనీలో ఉన్న కూతురును చూడడానికి వెళ్లగా శుక్రవారం ఉదయం ఒక్కసారిగా రామలింగేశ్వర్‌రావుకు ఛాతీలో నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 1956, మే 21న ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాలో ఆయన జన్మించారు. ఉస్మానియా నుంచి ఎల్ఎల్ఎం పూర్తి చేసిన ఆయన 1982లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1984లో జస్టిస్ ఏ.వెంకట్రామిరెడ్డి వద్ద జూనియర్‌గా చేరి 1987లో స్వతంత్ర న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. న్యాయవాదిగా కొనసాగుతూనే ఉస్మానియాలో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా పీజీ విద్యార్థులకు ఇంటర్నేషనల్ లా పాఠాలు చెప్పారు. 2013లో న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టే వరకు సామాజిక న్యాయం, పర్యావరణంతోపాటు పలు విభాగాల్లో సమర్థవంతమైన న్యాయవాదిగా వాదనలు వినిపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని అడవుల రక్షణకు వాదించిన కేసు దేశమంతటా 'సమత' కేసుగా ప్రసిద్ధి చెందింది. ప్రభుత్వ న్యాయవాదిగా, టీటీడీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ తదితరాలకు న్యాయవాదిగా పనిచేశారు. సాహిత్యం, కళలపై ఆయనకు మక్కువ ఎక్కువ. విపరీతంగా పుస్తకాలు చదవడంతో పాటు రాయడం అలవాటు. న్యాయమూర్తిగా దాదాపు 13 వేల తీర్పులు ఇచ్చారు. వీటిలో 100కు పైగా లా జర్నల్‌లో ప్రచురితం కావడం విశేషం. 2018లో న్యాయమూర్తిగా పదవీ విరమణ పొందారు. అనంతరం ఏపీ ప్రభుత్వం ఆయన్ను స్కూల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ చైర్మన్‌గా నియమించింది.

చివరి నిమిషంలో హడావుడి వద్దు

- అప్పటికప్పుడు పరిష్కారాలకు బదులు వ్యవస్థీకృత, దీర్ఘకాలిక కార్యక్రమాలు చేపట్టండి
- ఓటర్ల సమస్యలను తీర్చి పోలింగ్ శాతం పెంచండి
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ సూచన
- వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన సీఈవో వికాస్‌రాజ్, సర్ఫరాజ్ అహ్మద్



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదు కావడానికి గల నిర్దిష్ట కారణాలను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకురావాలని, చివరి నిమిషంలో పరిష్కారాలకు బదులుగా వ్యవస్థీకృత, దీర్ఘకాలిక కార్యక్రమాలను చేపట్టాలని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ కోరారు. యువత, నగర, పట్టణ ఓటర్ల ఉదాసీనతతో పాటు వివిధ కారణాల వల్ల దేశంలోని పలు ప్రాంతాల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజాస్వామ్యాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ఆయన సూచించారు. శుక్రవారం ఢిల్లీలోని నిర్వాచన్‌సదన్ నుంచి దేశంలోని అన్ని రాష్ట్రాల ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాజీవ్‌కుమార్ మాట్లాడారు. ఓటింగ్ శాతం తగ్గకుండా ఉండేలా అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాన్ఫరెన్స్‌లో భాగంగా మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన అధికారులు మాట్లాడుతూ తమ రాష్ట్రాల్లో ఓటింగ్ శాతాన్ని మెరుగుపర్చేందుకు చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. బస్టాండ్‌లతో పాటు బహిరంగ ప్రదేశాల్లో ఎన్నికల సందేశాలను ప్రదర్శించడంతో పాటు పార్కులు, మార్కెట్లు, మాల్స్ లాంటి బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు.

ఈసారి హైదరాబాద్‌లో పోలింగ్ శాతం పెంచుతాం

హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రోస్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో పోలింగ్ సరళిని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. 2019 ఎన్నికల్లో తక్కువ పోలింగ్ శాతం నమోదైందని, పోలింగ్ రోజున సెలవు ప్రకటించినప్పటికీ అనేక కారణాలతో తక్కువ పోలింగ్ నమోదైందని చెప్పారు. ఈసారి ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కాన్ఫరెన్స్‌కు తెలంగాణ పక్షాన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్‌తో పాటు కేంద్ర ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్బీర్‌సింగ్ సంధు, మనోజ్‌కుమార్ సాహూ, ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, ముంబై, బెంగళూరు, అహ్మదాబాద్, పుణే, లక్నో, నాగ్‌పూర్, థానే లాంటి ప్రధాన నగరాల సీఈవోలు, మున్సిపల్ కమిషనర్లు హాజరయ్యారు.

రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

జిల్లా కేంద్రాల్లో రైతు సత్యాగ్రహ దీక్షలకు దిగిన బీజేపీ

సాక్షి, హైదరాబాద్: రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలంటూ రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్షలు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికలప్పుడు మేనిఫెస్టోలో, ఆరు గ్యారంటీల అమలు చేపట్టాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు.అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించిన దీక్షలకు రాష్ట్ర ముఖ్యనేతలు హాజరయ్యారు. ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500ల బోనస్, 2 లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని, కరువుతో పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం, రైతుకూలీలకు రూ.12 వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేల చొప్పున జమ తదితర డిమాండ్లపై ఈ దీక్షలు నిర్వహించింది. శుక్రవారం బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకపోతే బీజేపీ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తుందని ప్రకటించారు.

నేడు పార్టీ 44వ సంస్థాపక దినోత్సవం

బీజేపీ 44వ సంస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బీజేపీ జెండా ఎగుర వేస్తారు. ఈ సందర్భంగా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్టు ప్రేమేందర్‌రెడ్డి వెల్లడించారు. పార్టీ జెండాలు ఆవిష్కరించడంతో పాటు పోలింగ్ కూడళ్ల వారీగా టిఫిన్ బైఠక్‌లు నిర్వహిస్తామన్నారు.

పార్లమెంటు ఎన్నికల తర్వాత జాబ్ కేలండర్

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలకు రాష్ట్రంలోని యువకులు, నిరుద్యోగులు తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు కోరారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 16 చోట్ల గెలుపే లక్ష్యంగా ఎన్‌ఎస్‌యూఐ పనిచేస్తుందని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల కోసం ఎన్‌ఎస్‌యూఐ సన్నాహక సమావేశాల పోస్టర్‌ను శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులు నిర్లక్ష్యానికి గురయ్యారని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలిచ్చామన్నారు. నిరుద్యోగుల కోరిక మేరకే టెట్ పరీక్షను మరో మారు నిర్వహిస్తున్నామని, లోక్‌సభ ఎన్నికల తర్వాత వచ్చే ఏడాదికి సంబంధించిన జాబ్ కేలండర్ కూడా విడుదల చేస్తామని వెంకట్ వెల్లడించారు.

శాంతి స్వరూప్ కన్నుమూత

తొలి తెలుగు న్యూస్ రీడర్ మృతికి సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్ సంతాపం



రామంతాపూర్, సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ప్రచార సాధనమైన దూరదర్శన్ చానల్‌లో తొలి తెలుగు యాంకర్‌గా ప్రసిద్ధులు, తెలుగు ప్రజలకు తన కంచు కంఠంతో వార్తలు చెప్పిన జయంత్ శాంతి స్వరూప్ (74) కన్నుమూశారు. శుక్రవారం ఉదయం ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండెపోటుతో మృతిచెందారు. హైదరాబాద్ చిక్కడపల్లిలో పుట్టి పెరిగిన శాంతి స్వరూప్ దూరదర్శన్ సీనియర్ యాంకర్ రోజా రాణిని వివాహమాడారు. ఆమె కొన్ని సంవత్సరాల క్రితమే చనిపోయారు. శాంతి స్వరూప్‌కు ఇద్దరు కుమారులు మేగాన్ష్, అగ్నేయ. 1978లో దూరదర్శన్ కేంద్రంలో యాంకర్‌గా చేరిన ఆయన 1983 నుంచి తెలుగులో వార్తలు చదవడం మొదలుపెట్టారు. 2011లో పదవీ విరమణ చేశారు. టెలిప్రాంప్టర్ లేని రోజుల్లోనే వార్తలను ముందుగానే మననం చేసుకుని తెర ముందు పొల్లు పోకుండా తప్పులు లేకుండా అనర్గళంగా చదివి తెలుగు ప్రజలకు వార్తలు అందించారు. శాంతి స్వరూప్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డుతో పాటు పలు సంస్థలు ఎన్నో అవార్డులతో సత్కరించాయి. భూపాల్ గ్యాస్ దుర్ఘటన కవరేజ్‌ను వీక్షకులకు కళ్ళకు కట్టినట్లుగా అందించిన ఆయన రాతి మేఘం, క్రికెట్ మీద క్రేజ్, అర్ధాగ్ని అనే నవలలు కూడా రాశారు. ఆయన పార్థివ దేహాన్ని రామంతాపూర్ టీవీ కాలనీలోని స్వగృహానికి తరలించి అక్కడి నుంచి అంబర్‌పేట్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కంచుకంఠం మూగబోయిందనీ, తొలితరం న్యూస్ రీడర్‌గా అందరికీ సుపరిచితులైన శాంతి స్వరూప్ మృతి బాధాకరమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ సంతాపాన్ని ప్రకటించారు.

శాంతి స్వరూప్ సేవలు చిరస్మరణీయం

తెలుగులో వార్తలు చదివిన తొలి తరం న్యూస్ రీడర్ శాంతి స్వరూప్ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన అందించిన సేవలు తెలుగు మీడియా రంగంలో చిరస్మరణీయమని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. శాంతి స్వరూప్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

న్యూస్‌రీడర్‌గా తనదైన ముద్ర

శాంతి స్వరూప్ మరణం పట్ల బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. టీవీలో వార్తలను చదివే తొలితరం న్యూస్ రీడర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును పొందిన శాంతి స్వరూప్ మీడియా రంగంలో తనదైన ముద్ర వేశారని గుర్తు చేసుకున్నారు. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

110 మంది స్పెషల్ అసిస్టెంట్లకు నోటీసులు

ఆదిలాబాద్ టౌన్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) విధులకు గైర్హాజరైన 110 మంది స్పెషల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆదిలాబాద్ డీఈవో ప్రణీత తెలిపారు. స్పాట్ విధులు కేటాయించినా.. మూల్యాంకనానికి హాజరు కాని ఎస్టీటీలపై చర్యలకు సిద్ధమయ్యారు. దాదాపు 200 మంది ఉపాధ్యాయులకు స్పెషల్ అసిస్టెంట్ విధులు కేటాయించగా.. 50 మంది వరకు విధుల్లో చేరారు. దీంతో మూల్యాంకనం ఆలస్యంగా కొనసాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల్లోగా విధుల్లో చేరాలని, లేకుంటే వివరణ ఇవ్వాలని ఆదేశించారు. వారి వివరణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు.

మృతిచెందిన ఉపాధ్యాయురాలికీ షోకాజ్

జవహర్‌నగర్: టెన్త్ మూల్యాంకానికి రాలేదని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖ 385 మంది ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. వీరిలో మృతిచెందిన ఉపాధ్యాయురాలు ఉండటం గమనార్హం. జవహర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘికశాస్త్రం ఉపాధ్యాయురాలైన గీత క్యాన్సర్‌తో 2023లో మృతిచెందారు. ఆమె పేరిట షోకాజ్ నోటీస్ రావడంతో తోటి ఉపాధ్యాయులు నివ్వెరపోయారు.

జూన్‌లో జాబ్‌ల జాతర

▶ మొదటి పేజీ తరువాయి

కేటగిరీలో దాదాపు 2వేలకు పైబడి ఉద్యోగాలున్నాయి. వీటికి కూడా జీఆర్‌ఎల్ విడుదల చేశారు. భూగర్భ జలవనరుల శాఖలో గెజిటెడ్ అధికారులు, పట్టణ ప్రణాళిక విభాగం, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, ఇతర సంక్షేమ శాఖలు, ఇంటర్మీడియట్ విద్య, సాంకేతిక విద్య ఇలా పలు విభాగాల్లో దాదాపు 5వేల ఉద్యోగాలకు సంబంధించిన కసరత్తు ఓ కొలిక్కి వచ్చింది. హారిజాంటల్ రిజర్వేషన్లకు అనుగుణంగా ఆయా శాఖల నుంచి సవరించిన రోస్టర్ జాబితాలకు అనుగుణంగా ఖాళీల వివరాలను సైతం టీఎస్‌పీఎస్సీ తెప్పించింది. ఆ మేరకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వేగవంతం చేసింది. తాజాగా ఒక్కో కేటగిరీలో జిల్లాస్థాయిలో 1:2 నిష్పత్తి, జోనల్, మల్టీ జోనల్ కేటగిరీల్లో 1:3 నిష్పత్తిలో ప్రాథమిక ఎంపిక జాబితాలను సైతం రూపొందిస్తోంది. ప్రాథమిక ఎంపిక జాబితాల ప్రక్రియ అనంతరం అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేసి తుది జాబితాలను విడుదల చేస్తుంది. ఈ ప్రక్రియ జూన్ రెండోవారంకల్లా పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకున్నట్టు సమాచారం. ఆలోపు పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి సైతం తొలగిపోనుంది. దీంతో టీఎస్‌పీఎస్సీ తుది జాబితాలను బహిర్గతం చేసిన తర్వాత ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందిస్తారు. జూన్ మూడోవారం నుంచి నియామక పత్రాల పంపిణీ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. గురుకుల పోస్టుల్లో కూడా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఉమ్మడి రంగారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన దాదాపు 1500 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వలేదు. పార్లమెంట్ కోడ్ ముగియగానే జూన్ మొదటివారం తర్వాత వీరికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇస్తారు.

ఫిబ్రవరి నుంచే..

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసి నియామక పత్రాలు అందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి వరుసగా పోలీస్‌శాఖలో కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలతో పాటు వైద్య,ఆరోగ్య శాఖ పరిధిలో స్టాఫ్ నర్సులు, గురుకుల విద్యాసంస్థల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్, లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్ తదితర కేటగిరీల్లో దాదాపు 33వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. ఇవన్నీ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీసు నియామకాల బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ), తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐ ఆర్‌బీ), తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఎంహెచ్ఎస్ఆర్‌బీ) ద్వారా భర్తీ చేసినవే. మూడు బోర్డుల ద్వారా భర్తీ చేసిన ఉద్యోగాలు ఒక ఎత్తయితే... టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసే ఉద్యోగాలు మరో ఎత్తు. ఎందుకంటే ఈ మూడు బోర్డుల పరిధిలోని ఉద్యోగాల సంఖ్యతో దాదాపు సమానంగా టీఎస్‌పీ ఎస్సీ ద్వారా ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఉంటుంది. ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ పలు కేటగిరీల్లో అర్హత పరీక్షలు నిర్వహించి ఫలితాల విడుదలకు కసరత్తు చేస్తోంది.

ఎన్నికల వార్‌రూమ్‌లపైనా సిట్ ఫోకస్!

- ఉప ఎన్నికల సమయాల్లో అక్కడి నుంచే 'ట్యాపింగ్'
- రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ఏర్పాటు చేసినట్టు తేల్చిన అధికారులు
- నల్లగొండకు సంబంధించి ఈ 'పని' చేసిన ఇద్దరు కానిస్టేబుళ్ల గుర్తింపు
- విచారిస్తున్న పోలీసులు
- కస్టడీలో ఉన్న రాధాకిషన్‌రావుకు స్వల్ప అస్వస్థత
- బంజారాహిల్స్ ఠాణాలోనే వైద్యం

సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు మాజీ ఓఎస్డీ టి.ప్రభాకర్‌రావు నేతృత్వంలో జరిగిన 'ట్యాపింగ్' వ్యవహారంపై దర్యాప్తు చేసిన సిట్... తాజాగా 'ఎన్నికల వార్‌రూమ్'లపై ఫోకస్ పెట్టింది. గత కొన్నేళ్లలో ఆయా ప్రాంతాల్లోని వార్ రూమ్‌లలో పనిచేసిన సిబ్బందిని గుర్తించే పని చేపట్టింది. ఈ క్రమంలో శుక్రవారం నల్లగొండకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తోంది. మరోవైపు పోలీసు కస్టడీలో ఉన్న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావును సిట్ అధికారులు రెండో రోజు ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో ఆయన స్వల్ప అస్వస్థతకు గురవడంతో.. వైద్య బృందాన్ని బంజారాహిల్స్ ఠాణా పిలిపించి వైద్యం చేయించారు.

అవసరాన్ని బట్టి ఏర్పాటు చేస్తూ..

ఎస్ఐబీలో ఏర్పాటు చేసిన వార్‌రూమ్ 2018 నుంచీ కొనసాగగా.. 2020లో హైదరాబాద్‌లోని మరో ప్రాంతంలో సర్వర్ ఏర్పాటు చేసుకుని మరో వార్ రూమ్ నిర్వహించారు. వీటితోపాటు అవసరాన్ని బట్టి వరంగల్, సిరిసిల్లల్లోనూ ఏర్పాటు చేశారు. 2018 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో వీటిన్నింటినీ వాడటం మొదలెట్టారు. 2020లో జరిగిన దుబ్బాక, 2021 అక్టోబర్‌లో జరిగిన హుజూరాబాద్, 2022 అక్టోబర్ రెండో వారంలో జరిగిన మునుగోడు ఉప ఎన్నికల సమయంలో.. ప్రభాకర్‌రావు ఆయా ప్రాంతాల్లో వార్ రూమ్‌లు ఏర్పాటు చేయించారు. ఎస్ఐబీ కార్యాలయం నుంచి ప్రణీత్‌రావు, తిరుతపన్న, వేణుగోపాల్‌రావుతోపాటు ఇంటెలిజెన్స్ కార్యాలయం నుంచి భుజంగరావు వీటిని పర్యవేక్షించారు. ఆయా తాత్కాలిక వార్ రూమ్స్‌లో పనిచేయడానికి స్థానికంగా తమకు నమ్మకమైన పోలీసులను వినియోగించుకున్నారు. కొందరి ఫోన్లను ఆ వార్ రూమ్‌ల నుంచి ట్యాప్ చేయించారు.

వీలైనన్ని ఆధారాల సేకరణపై దృష్టి..

పటిష్ట సాక్ష్యాధారాలు లేకుంటే ట్యాపింగ్ కేసును కోర్టులో నిరూపించడం కష్టసాధ్యమని పోలీసులు భావిస్తున్నట్టు తెలిసింది. దీంతో వీలైనన్ని ఆధారాలు, వాంగ్మూలాలు సేకరించడంపై ఫోకస్ పెట్టారు. ఇందులో భాగంగా ఆయా వార్‌రూమ్‌లలో పనిచేసిన సిబ్బందిని గుర్తించి విచారిస్తున్నారు. 'ఎవరి ఆదేశాల మేరకు అక్కడ విధులు నిర్వర్తించారు? ప్రతిపక్షాలపై నిఘాతోపాటు ఇంకా ఎలాంటి పనులు చేశారు? ఆ సమాచారం ఎవరికి అందించారు? ఉప ఎన్నిక పూర్తయిన తర్వాత వార్‌రూమ్‌లో వాడిన సర్వర్లు, కంప్యూటర్లు, ఇతర సామాగ్రిని ఎవరికి అప్పగించారు?' వంటి అంశాలపై ప్రశ్నలు వేస్తూ వాంగ్మూలాలను నమోదు చేస్తున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక వార్ రూమ్‌లో పనిచేసిన నల్లగొండకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను గుర్తించి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని హైదరాబాద్‌కు తరలించి ప్రశ్నిస్తున్నారు. ఇలా మిగతా వార్ రూమ్‌లలో పనిచేసిన వారినీ ప్రశ్నించి వాంగ్మూలాలు నమోదు చేయాలని నిర్ణయించారు.

సాక్షి రియల్టీ
శనివారం
6-4-2024

వేసవి కూల్ కూల్‌గా..!

వేసవి కాలం రాకముందే ఎండ మండిపోతుంది. బయటే కాదు ఇంట్లో ఉన్నా ఎండ వేడి తగులుతుంది. అసలు ఇంటి పైకప్పు ఉందా లేదా అన్నట్టుగా ఉంటుంది ఇంట్లో వేడి. సాధారణ సీలింగ్ ఉన్న ఇంట్లో అయితే ఈ వేడిమి తీవ్రత మరింత ఎక్కువే. దీనికి పరిష్కారం చూపించి.. మండు వేసవిలో ఇంటిని చల్లగా మార్చేస్తుంది 'ఫాల్స్ సీలింగ్'!

సాక్షి, హైదరాబాద్: గదిలో ఆహ్లాదభరిత వాతావరణం ఏర్పర్చడమే ఫాల్స్ సీలింగ్ ప్రధాన ఉద్దేశం. అలసిన మనసు, శరీరానికి సాంత్వన చేకూర్చడమే. ఫాల్స్ సీలింగ్‌తో ఇంట్లోని వాతావరణాన్ని అందంగా, ఆహ్లాదంగా మార్చుకోవటమే కాకుండా సాధారణ ఇంటి పైకప్పును డైమండ్, చతురస్రం, గోళాకారం వంటి విభిన్న ఆకృతుల్లో అందంగా తీర్చిదిద్దుకోవచ్చు కూడా.

జాగ్రత్తలివే..

- ఫాల్స్ సీలింగ్ ఎంపికలో ధర కంటే నాణ్యతకే ప్రాధాన్యమివ్వాలి.
- ఫ్లోర్ నుంచి పైకప్పు మధ్య కనీసం 12 అడుగుల ఎత్తు అయినా ఉండాలి.
- ఏమరుపాటుగా ఉంటే ఫాల్స్ సీలింగ్‌తో పాటు ఎయిర్ కండిషన్ మెషిన్ కూడా పాడయ్యే అవకాశం ఉంటుంది.
- ఉడెన్ ఫాల్స్ సీలింగ్‌లో అయితే ఎలుకలతో పాటు చెదలు, పురుగులు చేరే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్త వహించాలి.
- దుమ్ము, ధూళి చేరకుండా అప్పుడప్పుడు శుభ్రం చేయాలి.



వర్ణాల ఎంపిక ఇలా..

- గోడ రంగుతో పోల్చుకుంటే సీలింగ్‌కు వేసే వర్ణం తేలికగా ఉండాలి. అప్పుడు పైకప్పు తక్కువ ఎత్తులో ఉందనిపిస్తూ, విశాలంగా ఉన్న భావనను కలిగిస్తుంది. ముదురు షేడ్లను ఎంచుకుంటే పైకప్పు ఎత్తులో ఉందన్న అభిప్రాయాన్ని కలిగిస్తుంది.
- మిగతా గదులతో పోల్చుకుంటే పడకగది సీలింగ్‌నే ఎక్కువసేపు చూస్తాం కాబట్టి వర్ణాల్లో సాదాసీదావి కాకుండా నేటి పోకడలకు అద్దంపట్టేవి ఎంచుకోవాలి. మధ్యస్థం, డార్క్, బ్రౌన్ వర్ణాలు పడకగదికి చక్కగా నప్పుతాయి. ఎందుకంటే ఈ వర్ణాలు ఉత్సాహపరిచే విధంగా, స్వభావానికి అనుకూలంగా ఉంటాయి మరి.
- తాజాదనం ఉట్టిపడుతున్న లుక్ రావాలంటే మోనోక్రోమాటిక్ థీమ్‌ను ఎంచుకోవాలి. రెండు, మూడు వర్ణాలు కలిసినవి ఎంచుకుంటే మాత్రం అది పడకగది గోడలకు వేసిన రంగు కంటే తేలికగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే మీ సీలింగ్ ప్రశాంత భావనను కలగజేస్తుంది.
- గోడల రంగుకు, సీలింగ్‌కు ఒకే రకమైనవి కాకుండా.. వేర్వేరు వర్ణాల్ని కూడా వేసుకోవచ్చు. దగ్గర దగ్గర రంగులు కాకుండా, చూడగానే తేడా ఇట్టే కన్పించే వర్ణాలను ఎంపిక చేసుకోవటం మేలు. దృశ్య వ్యక్తీకరణ ప్రదేశంగా సీలింగ్‌ను వినియోగించుకోండి. ఆహ్లాదభరితమైన ఆకాశం, లేదంటే గదితో కలిసిపోయేలా ఆకట్టుకునే ఆకారాలు, వర్ణాలతో నాటకీయత కన్పించేలా అలంకరించుకోవచ్చు.

ప్రభుత్వం మారితే.. విరామం సహజమే!



- విధానాల సమీక్ష, కొత్త పాలసీల రూపకల్పనకు కొంత సమయం
- ఎన్నికల తర్వాతే మార్కెట్‌లో రెట్టింపు
- కొత్త ప్రాజెక్ట్‌ల లాంచింగ్స్‌తో ఇన్వెంటరీని పెంచొద్దు
- పాత వాటిల్లో విక్రయాలు, నిర్మాణాల పూర్తిపై దృష్టిపెట్టాలి
- బిల్డర్లతో బేరసారాలకు కస్టమర్లకు ఇదే సరైన సమయం

సాక్షి, హైదరాబాద్: ఎక్కడైనా సరే స్థిరాస్తి మార్కెట్‌లో ప్రభుత్వం మారితే విరామం సహజమే. బ్రేక్ తర్వాతే సినిమాలో అసలు కథ మొదలైనట్టే.. రియల్ ఎస్టేట్ మార్కెట్‌లోనూ తాత్కాలిక స్తబ్దత తర్వాతే రెట్టింపు వేగంతో పరుగులు పెడుతుందని నిపుణులు చెబుతున్నారు. పాత విధానాల సమీక్ష, కొత్త పాలసీల రూపకల్పనకు సమయం పడుతుందని అప్పటివరకు మార్కెట్ మందకొడిగా ఉండటం సాధారణమేనని అభిప్రాయపడ్డారు.

- అనుమతుల మంజూరులో కమిటీల నియామకం, మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేర్పులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థిరాస్తి రంగంపై ప్రభావం పడుతుంది ఇది సాధారణ ప్రక్రియే. దీంతో భూ లావాదేవీలలో స్తబ్దత ఏర్పడుతుంది. గత 4 ఏళ్లలో హైదరాబాద్‌లో భూముల ధరలు అసహజంగా పెరిగిపోయాయి. స్థిరమైన ప్రభుత్వం అధికారంలోకి వస్తే హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్ఎన్ఐ), ప్రవాసులు, బడా వ్యాపారస్తుల భూముల కొనుగోళ్లు జరుపుతుంటారు. దీంతో సహజంగానే రేట్లు పెరుగుతాయి నగరంలో జరిగిందే.

కొత్త లాంచింగ్‌లొద్దు..

ప్రతికూల సమయంలో కొత్త ప్రాజెక్ట్‌లను లాంచింగ్ చేసి పరిశ్రమ మీద భారం వేయకూడదు. వచ్చే 1-2 ఏళ్ల పాటు కొత్త యూనిట్లను ప్రారంభించడం కంటే పాత ప్రాజెక్ట్‌లలో విక్రయాలు చేపట్టడం, నిర్మాణాలను పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలి. మార్కెట్ పరిస్థితులు, ధోరణులను సమగ్రంగా అధ్యయనం చేయకుండా తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. వృథా ఖర్చులు తగ్గించుకుంటూ నిర్మాణ పనులకే నిధులను కేటాయించాలి.

కొనేముందు జాగ్రత్తలివే..

- రాత్రికి రాత్రే బిల్డర్లుగా అవతారం ఎత్తి, తక్కువ ధరకే ఫ్లాట్లను ఇస్తామని మాయ మాటలు చెప్పే డెవలపర్లకు దూరంగా ఉంటే బెటర్.
- అప్పటికప్పుడే నిర్ణయాలుకాకుండా 2-3 నెలలు ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించాలి.
- ప్రతికూల సమయంలోనూ గడువులోగా నిర్మాణాలను పూర్తి చేసే ఆర్థిక స్తోమత ఉన్న బిల్డర్ల వద్ద కొనుగోలు చేయడమే సురక్షితం.
- అన్ని అనుమతులతో పాటు మార్కెట్‌లో పేరున్న నిర్మాణ సంస్థలోనే కొనడం ఉత్తమం.

ప్రభుత్వం దృష్టి పెట్టాల్సినవివే..

- 111 జీ.ఓ రద్దు చేశారు కానీ విధి విధానాలపై స్పష్టత ఇవ్వలేదు. జోన్ల కేటాయింపు, నిర్మాణ పనులకు అనుమతి తదితరాలపై క్లారిటీ ఇవ్వాలి. మాస్టర్ ప్లాన్‌లో భూ వినియోగ మార్పు చాలా క్లిష్టతరంగా మారింది. బిల్డర్లకే కాదు సామాన్యులకు సైతం భూ మార్పిడి చేసుకునేందుకు వీలుండే విధంగా ప్రక్రియను సులభతరం చేయాలి.
- ధరణి లోటుపాట్లపై కమిటీ సమర్పించిన నివేదికను సాధ్యమైనంత తర్వగా అమలు చేయాలి. పర్యావరణ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలి.

బేరసారాలకు ఇదే సమయం

భౌగోళికంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ.. హైదరాబాద్‌లో ఇప్పటికీ స్థిరాస్తి పెట్టుబడులలో సింహభాగం వాటా తెలుగు ప్రజలవే ఉంటాయని ప్రణీత్ గ్రూప్ ఎండీ నరేంద్ర కుమార్ కామరాజు తెలిపారు. హైదరాబాద్ స్థిరమైన నగరం కావడంతో పాటు అధిక ఆదాయం, ఉద్యోగ కల్పన, మెరుగైన మౌలిక వసతులు, పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో ఇక్కడ స్థిర నివాసానికి మొగ్గు చూపిస్తుంటారన్నారు. సాధారణంగా ఎన్నికల ఏడాదిలో మార్కెట్ స్తబ్దుగానే ఉంటుంది. అయితే వాస్తవానికి నిజమైన కొనుగోలుదారులకు గృహ కొనుగోళ్లకు ఇదే సరైన సమయం. ఎందుకంటే విక్రయాలు మందకొడిగా సాగే ఈసమయంలో బిల్డర్లతో బేరసారాలకు అవకాశం ఉంటుంది. రోజువారి కార్యకలాపాలు, నిర్మాణ పనులకు అవసరమైన వ్యయం కోసం రేటు కాస్త అటుఇటైనా డెవలపర్ ఒక మెట్టు దిగే ఛాన్స్ ఉంటుంది.

పన్ను ఎవరు కట్టాలి?

- ల్యాండ్ ఓనర్, బిల్డర్ల మధ్య సందిగ్ధం
- చెల్లించాల్సిన బాధ్యత బిల్డర్‌దే
- కొత్తవైనా, రీ-డెవలప్‌మెంట్ అయినా 5 శాతం జీఎస్టీ



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో గృహాలకు డిమాండ్ పెరుగుతుంది. మెరుగైన మౌలిక వసతులు, పారిశ్రామిక ప్రగతి కారణంగా కొత్త ప్రాంతాలలో అభివృద్ధి పరుగులు పెడుతుంది. మరో వైపు ప్రధాన నగరంలో స్థలం కొరత కారణంగా గృహ నిర్మాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాత ఇళ్లను కూల్చివేసి వాటి స్థానంలో కొత్తవి నిర్మించడం మినహా నిర్మాణదారులకు ప్రత్యామ్నాయం లేదు. ఖైరతాబాద్, అబిడ్స్, బేగంపేట, సనత్‌నగర్, ఈఎస్ఐ, బంజారాహిల్స్ వంటి ప్రాంతాలలో ఇలాంటి రీ-డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇండిపెండెంట్ హౌస్‌లు, నాలుగైదు అంతస్తుల అపార్ట్‌మెంట్లను కూల్చేసి ఆ స్థలంలో హైరైజ్ భవనాలను నిర్మిస్తున్నారు. ఇందుకోసం భూ యజమానులు, ఫ్లాట్ ఓనర్లతో బిల్డర్లు డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకుంటారు. ఖాళీ స్థలాలను అభివృద్ధికి తీసుకుంటే 50 నుంచి 40 శాతం, ప్రాంతాన్ని బట్టి 60 శాతం ఫ్లాట్లను భూ యజమానికి ఇస్తామని ఒప్పందం చేసుకుంటారు. మిగిలిన వాటినే డెవలపర్ అమ్ముకుంటాడు.

- కూల్చి కట్టినా, ఖాళీ ప్రదేశంలో కొత్త భవనాలు కట్టినా పూర్తయిన ఇళ్లకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ) చెల్లించాల్సి ఉంటుంది. భూ యజమాని వాటా కింద వచ్చిన జీఎస్టీ ఎవరు చెల్లించాలనే అంశంపై ల్యాండ్ ఓనర్లకు, బిల్డర్లు మధ్య వాగ్వాదం నెలకొంటుంది. డెవలపరే చెల్లించాలని భూ యజమాని, ల్యాండ్ ఓనరే కట్టాలని బిల్డర్ల మధ్య సందిగ్ధం నెలకొంది. భవనం కట్టడంతో స్థలం విలువ పెరిగిందని, దీంతో 5 శాతం జీఎస్టీ చెల్లించాలని ప్రభుత్వం బిల్డర్‌కు నోటీసులు పంపిస్తుంది. వాస్తవానికి కొత్తవైనా, పాతవైనా భవనానికి జీఎస్టీ చెల్లించాల్సిన బాధ్యత బిల్డర్‌దే. కాకపోతే భూ యజమాని, కస్టమర్ల నుంచి బిల్డర్ జీఎస్టీ వసూలు చేసి కట్టాల్సింది డెవలపరే.

3 కిలోమీటర్లు నడిచి..
ప్రసవం చేసిన 108 సిబ్బంది



పాల్వంచ రూరల్(భద్రాద్రి కొత్తగూడెం): దట్టమైన అటవీ ప్రాంతం.. వాహనం వెళ్లే దారిలేదు.. అయినా తెల్లవారుజామున మూడుగంటలకు అందిన సమాచారంతో 108 సిబ్బంది కాలినడకన వెళ్లి గర్భిణీకి ప్రసవం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం దంతలబోరు పంచాయతీ పరిధి లోని సీతారాంపురంలో శుక్రవారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. సీతారాంపురానికి చెందిన గర్భిణీ మడకం ఇడుమమ్మకు శుక్రవారం తెల్లవారుజామున పురిటినొప్పులు మొదలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారమందించారు. అయితే అటవీ ప్రాంతంలో ఉన్న గ్రామానికి వాహనం వెళ్లే మార్గం లేకపోవడంతో 108 వాహనాన్ని దూరాన నిలిపిన ఈఎన్‌టీ అనురాధ, సిబ్బంది 3 కి.మీ. కాలి నడకన చేరుకుని వైద్యుల సూచనలతో ఇడుమమ్మకు ప్రసవం చేయగా మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను డోలీలో వాహనం ఉన్న చోటకు చేర్చి ఆస్పత్రికి తీసుకెళ్లారు.

సామాన్యులకు భారంగా ఔషధాల ధరలు
'పారాసిటమాల్, అజిత్రోమైసిన్ లాంటి యాంటీబయాటిక్'ఈ జాబితాలో...

సాక్షి, హైదరాబాద్: అత్యవసర ఔషధాల ధరలు పెంచుతున్నట్టు జాతీయ ఔషధాల ధరల సంస్థ (ఎన్‌పీపీఏ) వెల్లడించింది. ఇందులో 923 రకాల ఫార్ములాలతో కూడిన ఉన్నాయని, ప్రస్తుతం మార్కెట్‌లో అమ్ముతున్న దానికంటే 10 శాతానికి పైగా ధరలు పెరుగుతాయని తెలిపింది. పారాసిటమాల్, అజిత్రోమైసిన్ లాంటి యాంటీబయాటిక్, యాంటీ అనీమియా మెడిసిన్స్, విటమిన్స్, మినరల్స్‌తోపాటు కోవిడ్ చికిత్సలో ఉపయోగించే నిత్యావసర మందుల ధరలు పెరగనున్నట్టు వైద్యారోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా బీపీ మందులు, మధుమేహం ఉన్నవారు వాడే ఇన్సులిన్, మోకాళ్ల నొప్పి మందులు, గుండె జబ్బులకు వాడే మందులు, ఓరల్ రీహైడ్రేషన్, గ్లూకోస్, విటమిన్, మినరల్ టాబ్లెట్లు, స్టెరాయిడ్ల ధరలూ పెరుగుతాయి. దీంతో ఈ నెల నుంచి సామాన్యులపై అత్యవసర ఔషధాల ధరల భారం పడనుంది. ఇప్పటికే తయారైన మందుల ధరల్లో మార్పు ఉండదు. ఏప్రిల్ 1 తర్వాత తయారయ్యే మందుల ధరలు మాత్రమే పెరుగుతాయని కేంద్రం తెలిపింది. ప్రతి మూడు నుంచి ఐదేళ్లకోసారి ఔషధాల రేట్లు పెరుగుతాయి. సాధారణంగా 2 నుంచి 3 శాతం వరకు పెరిగితే, ఈసారి 10.75 శాతం వరకు ధరలు పెరుగుతుండం ఆందోళన కలిగిస్తోంది. ముడిసరుకులు (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్) మీద ఖర్చులు పెరగడం వల్లే ఔషధాల ధరలు కూడా పెంచాల్సి వచ్చిందని కేంద్రం తెలిపింది. ఈ ముడిసరుకులు ఇవి మనదేశంలో దొరకవు. ఎక్కువగా చైనా మీద ఆధారపడాలి. వీటి దిగుమతుల చార్జీలు పెరిగాయి. ఫార్ములేషన్‌కు వాడే విద్యుత్ మీద చార్జీలు, ట్యాక్సులు, సిబ్బందిపై పెట్టే ఖర్చు, మాన్యుఫాక్చరింగ్ లైసెన్సు, ప్యాకింగ్, రవాణా చార్జీలు తదితర ఖర్చులు పెరిగాయి. అందుకే మందులు ధరలు కూడా పెరుగుతున్నాయని అంటున్నారు. ఇక ఫార్ములేషన్‌కు ఉపయోగించే కాలమ్స్ వంటివి కూడా జపాన్ లాంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఇది కూడా ఔషధాల ధరలు పెరగడానికి మరో కారణం. ఫలితంగా సామాన్యులకు పెను భారంగా ఔషధాల ఖర్చు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు ఎ.సంజయ్‌రెడ్డి తెలిపారు.



గోదావరి తీరాన జింకల సందడి
గోదావరి తీరం వన్యప్రాణుల ఆవాసంగా మారింది. నిజామాబాద్ జిల్లా నందిపేట మండలం నూత్‌పల్లి గంగసారం శివారు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రాంతానికి నిత్యం జింకలు వస్తుంటాయి. నదీ తీరంలో చెంగుచెంగున దూకుతూ కనువిందు చేస్తున్నాయి.
- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అంతరిక్ష పర్యాటకం సాధ్యమే!

- భవిష్యత్‌లో పూర్తిస్థాయి దేశీయ అంతరిక్ష పరిశోధనలు
- చంద్రయాన్ ల్యాండర్ మన పరిశోధనల సక్సెస్‌కు సూచిక
- సైన్స్‌కు లింగ భేదం లేదు.. పురుషులు, మహిళలు ఉమ్మడి లక్ష్యం కోసం పనిచేస్తున్నారు
- ఫిక్కీ కార్యక్రమంలో డీఆర్‌డీఓ, ఇస్రో మహిళా శాస్త్రవేత్తలు టెస్సీ థామస్, కల్పన కాళహస్తి



కార్యక్రమంలో ప్రియా గజ్జర్, టెస్సీ థామస్, కల్పన కాళహస్తి

సాక్షి, హైదరాబాద్: భవిష్యత్తులో అంతరిక్ష పర్యాటకం సాధ్యమేనని.. మన దేశం పూర్తిస్థాయి దేశీయ పరిశోధనలతో ముందుకు వెళ్తోందని ఇస్రో శాస్త్రవేత్త కల్పన కాళహస్తి, మిస్సైల్ విమెన్ ఆఫ్ ఇండియాగా పేరుపొందిన డీఆర్‌డీవో శాస్త్రవేత్త టెస్సీ థామస్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ది పార్క్ హోటల్‌లో ఫిక్కీ ఫ్లో ఆధ్వర్యంలో శుక్రవారం 'స్టెల్లార్ జర్నీస్'కార్యక్రమం నిర్వహించారు. ఫిక్కీ చైర్‌పర్సన్ ప్రియా గజ్జర్.. పలువురు శాస్త్రవేత్తలు, ఫిక్కీ ఆధ్వర్యంలోని 200 మంది మహిళలు ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టెస్సీ థామస్, కల్పన కాళహస్తి తమ అనుభవాలను పంచుకున్నారు.

మార్స్‌పైకి మనిషి వెళ్లడం చూడాలి..

సైన్స్‌కు లింగ భేదం లేదని.. డీఆర్‌డీఓ, ఇస్రో వంటి వేదికల్లో పురుషులు, మహిళలు ఉమ్మడి లక్ష్యం కోసం కలసి పనిచేస్తున్నారని టెస్సీ థామస్ పేర్కొన్నారు. తాను డీఆర్‌డీఓ వేదికగా పరిశోధన రంగంలోకి అడుగుపెట్టినప్పుడు మహిళలు ఒకట్రెండు శాతమే ఉండేవారని.. ఇప్పుడు 15 శాతం ఉన్నారని తెలిపారు. వినయం, నిబద్ధతను తన గురువు అబ్దుల్ కలాం వద్ద నేర్చుకున్నానని చెప్పారు. దేశ రక్షణ వ్యవస్థ కోసం అగ్ని క్షిపణులను రూపొందించడంలో కృషి తనకు జీవితకాల సంతృప్తిని ఇచ్చిందన్నారు. అగ్ని-4, అగ్ని-5 క్షిపణుల రూపకల్పనలో దేశీయ సాంకేతికత వాడుతున్నామని వివరించారు. మార్స్‌పైకి మనిషిని పంపడాన్ని చూడాలనేది తన కోరిక అని చెప్పారు.

ఏలియన్స్ లేవని చెప్పలేం..: సాధారణ హాలీవుడ్ సినిమా బడ్జెట్ కన్నా తక్కువ ఖర్చుతో భారత్ మూన్ ల్యాండర్‌ను ప్రయోగించడం దేశ ఆర్థిక క్రమశిక్షణకు అద్దం పడుతుందని ఇస్రో శాస్త్రవేత్త కల్పన కాళహస్తి తెలిపారు. ''మూన్ ల్యాండర్ 4 లక్షల కిలోమీటర్లు ప్రయాణించి, అధిక వేగంతో చంద్రుడి సమీపానికి చేరుకుంది. ఆ వేగాన్ని సమర్థవంతంగా నియంత్రించి.. చంద్రుడి ఉపరితలంపై సురక్షితంగా ల్యాండ్ చేయగలిగాం. శక్తివంతమైన భారత పరిశోధనలకు ఇది మంచి ఉదాహరణ. భవిష్యత్‌లో మరిన్ని అద్భుతాలు సృష్టిస్తాం. ప్రయోగాల్లో పూర్తిస్థాయిలో దేశీయ సాంకేతికతను ఉపయోగించనుండటం గర్వకారణం..'' అని చెప్పారు. అంతరిక్ష పర్యాటకం దిశగా ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు సాగుతున్నాయన్నారు. అంగారకుడిపై పరిశోధన కూడా తన కలల ప్రాజెక్టు అని చెప్పారు. ఏలియన్ల గురించి ప్రస్తావిస్తూ.. విశ్వంలో మనకు తెలియని అద్భుతాలెన్నో ఉన్నాయని, అందులో ఏలియన్స్ కూడా భాగం కావొచ్చని పేర్కొన్నారు.

ఎట్టకేలకు తప్పిన ఏనుగు గండం!



పెంచికల్‌పేట్ మండలంలోని ముసలమ్మ గుట్ట వద్ద సంచరిస్తున్న ఏనుగు

పెంచికల్‌పేట్(సిర్పూర్), సాక్షి, హైదరాబాద్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో బీభత్సం సృష్టించి ఇద్దరు రైతులను చంపిన ఏనుగు పెంచికల్‌పేట్ మండలం మురళీగూడ వద్ద శుక్రవారం ప్రాణహిత నది దాటింది. మూడు రోజులుగా భయపెడుతున్న గజరాజు మహారాష్ట్ర అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. చింతలమానెపల్లి మండలం సరిహద్దులోని ప్రాణహిత నది దాటి వచ్చిన ఏనుగు ఈ నెల 3న బూరెపల్లి సమీపంలో పంట చేనులో పని చేస్తున్న అల్లూరి శంకర్‌పై దాడి చేసి చంపింది. అక్కడి నుంచి రుద్రాపూర్, ఖర్జెల్లి, సులుగుపల్లి ప్రాంతాల మీదుగా పెంచికల్‌పేట్ మండలంలోకి ప్రవేశించి కొండపల్లి గ్రామ శివారులో పొలానికి వెళ్తున్న కారు పోశన్నపై దాడి చేసి హతమార్చింది. 24 గంటల్లోనే ఇద్దరిని పొట్టన పెట్టుకున్న ఏనుగు కదలికలను గుర్తించేందుకు అటవీశాఖ అధికారులు డ్రోన్‌లు, ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. శుక్రవారం ఉదయం కమ్మర్‌గాం వద్ద గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో ఏనుగు సంచారాన్ని నిర్ధారించుకున్నారు. అక్కడి నుంచి జిల్లెడ మీదుగా రాత్రి 7.30 గంటలకు ఏనుగు మురళీగూడ వద్ద ప్రాణహిత నది దాటి మహారాష్ట్రలోని చిన్నవట్ర అటవీప్రాంతంలోకి వెళ్లినట్లు అధికారులు వెల్లడించారు. మూడు రోజులుగా అధికారులు, ప్రత్యేక బృందాలు, పోలీసులు చేసిన కృషి ఫలించింది.

థర్మల్ డ్రోన్‌తో స్కాన్: ఏనుగు సంచారంపై ప్రజలిచ్చిన సమాచారం మేరకు అటవీశాఖ అధికారులు ఆయా ప్రాంతాలను థర్మల్ డ్రోన్ ఉపయోగించి స్కాన్ చేశారు. ఏనుగు సెర్చ్ ఆపరేషన్‌ను చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ మోహన్ చంద్ర పర్గెన్, ఫీల్డ్ డైరెక్టర్ శాంతారామ్, నీరజ్ టిబర్‌వాల్ పర్యవేక్షించగా.. అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీ ప్రసాద్, పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తాం
మాన్కుగూడను సందర్శించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



జైనూర్(ఆసిఫాబాద్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తాగునీటి సమస్యపై శుక్రవారం 'సాక్షి' మెయిన్‌లో ప్రచురితమైన 'గొంతెండిపోతోంది' కథనానికి అధికారులు స్పందించారు. జైనూర్ మండలం మాన్కుగూడ గ్రామాన్ని ఎంపీడీఓ ప్రభుదయ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఖలీల్ సందర్శించారు. మిషన్ భగీరథ పథకం నీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతోనే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొన్ని కుటుంబాలకు మాత్రమే తాగు నీరందుతుందని, పైప్‌లైన్ సరిగా లేక మరికొన్ని కుటుంబాలకు అందడం లేదని చెప్పారు. 15 రోజుల్లో మరమ్మతులు పూర్తిచేసి మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో వారం రోజుల్లో కొత్త బోరుబావులు తవ్వించి నీటిఎద్దడి లేకుండా చర్యలు చేపడతామని ఎంపీడీఓ ప్రభుదయ వెల్లడించారు.

5 జిల్లాల్లో 43 డిగ్రీల పైనే..
▶ మొదటి పేజీ తరువాయి

ఐదుగురు మృతిచెందారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం వెంకటాద్రిపేట గ్రామానికి చెందిన గాదె జయపాల్‌రెడ్డి (55) గురువారం వడదెబ్బకు గురికాగా హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. మహబూబాబాద్ జిల్లాలో సికింద్రాబాద్ తండా గ్రామానికి చెందిన ధరావత్ మంచ్యా (55) వడదెబ్బకు గురై శుక్రవారం మృతిచెందాడు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని జీఎన్ఆర్ కాలనీకి చెందిన స్వర్ణలత (45) రెండ్రోజుల క్రితం నిజామాబాద్‌లో పెళ్లికి హాజరైంది. ఎండల తీవ్రతతో అస్వస్థతకు గురైంది. నిర్మల్‌కు వచ్చిన తర్వాత గురువారం రాత్రి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. అలాగే నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం శ్రీరంగాపూర్ గ్రామానికి చెందిన రైతు మర్రిపల్లి ఈరయ్య (70) పొలం పనులకు వెళ్లి ఎండ దెబ్బతగలడంతో గురువారం మృతి చెందాడు. కామారెడ్డి జిల్లా మొగులాన్‌పల్లి తండాకు చెందిన దేవియానాయక్ (50) వడదెబ్బతో మృతి చెందాడు.

ఊరిడిసి ఎక్కడికీ ఎళ్లం

గట్టు: 'తాతల కాలం నుంచి ఉంటున్న ఊరు ఇడిసి మేం ఎక్కడికీ ఎళ్లం..' అని జోగుళాంబ గద్వాల జిల్లా చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామస్తులు తెగేసి చెప్పారు. ఈ భూమి తమదని, ఊరు ఖాళీ చేయాలంటూ గ్రామ ప్రజలను కొందరు ఒత్తిడి చేస్తుండటంపై శుక్రవారం 'సాక్షి'లో 'ఈ ఊరు మాది.. ఖాళీ చేయండి' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. కాగా ఈ కథనం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ– కర్ణాటక సరిహద్దులోని చమన్‌ఖాన్‌దొడ్డి భూమి తమ పూర్వీకులదని

తెగేసి చెబుతున్న చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామస్తులు
చర్చనీయాంశంగా మారిన 'సాక్షి' కథనం



'సాక్షి'లో వచ్చిన కథనాన్ని చూస్తున్న చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామస్తులు

కొందరు వ్యక్తులు కోర్టును ఆశ్రయించి, ఎక్స్‌పార్టీ డిక్రీ ఆర్డర్ తీసుకువచ్చి.. ఊరు ఖాళీ చేయమంటూ ఒత్తిడి తీసుకువస్తుండటంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అదే సమయంలో తాము ఏళ్ల తరబడి ఇక్కడే నివాసం ఉంటున్నామని, ఇక ముందు కూడా ఇక్కడే ఉంటామని స్పష్టం చేస్తున్నారు. కాగా శుక్రవారం ఉదయం గ్రామంలో పదుల సంఖ్యలో ప్రజలు 'సాక్షి' పేపర్ ఆసక్తిగా చదవడం కనిపించింది. పలువురు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులు గ్రామానికి వచ్చి స్థానికుల నుంచి వివరాలు సేకరించి అభిప్రాయాలు తీసుకున్నారు.



కన్నీటి 'ముత్యాలు'
కరువు తరుముకొస్తోంది. వాగులు ఎడారిని తలపిస్తున్నాయి. వాటి గర్భాన బతుకుతున్న జీవరాశులు చనిపోతున్నాయి. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఆకేరు వాగు మొత్తం ఎండిపోవడంతో అందులోని ఆల్చిప్పలు బయటపడ్డాయి. దీంతో కొందరు ముత్యాల కోసం వెతికారు.
- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

తోకచుక్కల నుంచి కాదు.. భూమి అడుగు నుంచే నీళ్లు..



700 కిలోమీటర్ల లోతున భారీ జలరాశిని గుర్తించిన శాస్త్రవేత్తలు

భూమ్మీద ఉన్న మొత్తం నీటి కంటే మూడింతలు ఎక్కువ

సౌర కుటుంబంలో ఏ గ్రహంపైనా లేని నీళ్లు భూమ్మీదికి ఎక్కడి నుంచి వచ్చాయన్నది చాన్నాళ్లుగా శాస్త్రవేత్తలను తొలిచేస్తున్న సందేహం. కోట్ల ఏళ్ల కింద భూమిని ఢీకొన్న తోక చుక్కలు, భారీ గ్రహ శకలాల ద్వారానే నీరు భూమిని చేరిందన్నది ఓ ప్రతిపాదన. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా శాస్త్రవేత్తలు పరిగణనలోకి తీసుకుంటున్నదీ దీనినే. కానీ ఈ అంచనాలను పటాపంచలు చేసేలా.. అసలు భూమి అడుగునే అపార జలరాశి ఉందని అమెరికాలోని ఎవాన్స్టన్‌కు చెందిన నార్త్ వెస్టర్న్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు గుర్తించారు. భూమిపైని నీళ్లు ఏ తోకచుక్కలు, గ్రహశకలాల నుంచో కాకుండా.. భూమి అడుగు నుంచే వచ్చాయని తమ పరిశోధన తేల్చిందని వారు చెప్తున్నారు.

భూమిపై ఉన్న నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయన్న అంశంపై పరిశోధన చేపట్టిన నార్త్ వెస్టర్న్ వర్సిటీ శాస్త్రవేత్తలు.. అమెరికావ్యాప్తంగా 2వేలకుపైగా సిస్మోగ్రాఫ్‌లను ఏర్పాటు చేసి, సుమారు 500 భూకంపాలను విశ్లేషించారు. ఈ భూకంపాల తరంగాలు భూమి పొరల్లో ప్రయాణించిన తీరును బట్టి.. ఉపరితలం నుంచి సుమారు 700 కిలోమీటర్ల లోతున భారీ జలరాశి ఉన్నట్టు గుర్తించామని పరిశోధనకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త స్టీవెన్ జేకబ్‌సెన్ తెలిపారు. రింగ్‌వూడైట్‌గా పిలిచే రాతిపొరల్లో ఈ నీళ్లు ఉన్నాయని వివరించారు. ఉపరితలంపై ఉన్న సముద్రాలన్నింటి నీటి కంటే.. మూడు రెట్లు ఎక్కువగా ఆ జలరాశి ఉందని.. సాంకేతికంగా చూస్తే ఓ మహా సముద్రం ఉన్నట్టేనని తెలిపారు.

కేవలం పర్వత శిఖరాలే మిగిలేవి..

"గ్రహశకలాలు, తోకచుక్కల ద్వారా భూమ్మీదకు నీరు వచ్చిందంటూ ఇన్ని రోజులుగా ఉన్న అంచనాలను మా పరిశోధన మార్చేసింది. భూమ్మీద ఉన్న నీరు మన గ్రహం అంతర్భాగం నుంచే వచ్చిందన్న దానికి మా పరిశోధన సాక్ష్యంగా నిలుస్తోంది. ఒకవేళ ఆ నీరంతా భూమి ఉపరితలంపైనే ఉండుంటే.. అంతా నీరే నిండిపోయేది. కేవలం పర్వతాల శిఖరాలు మాత్రమే పైకి కనిపించేవి..." అని జేకబ్‌సెన్ చెప్పారు. సాక్షి, సెంట్రల్‌డెస్క్

మధ్యాహ్నం వేళ.. బయటకు రావొద్దు
ఎండల నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి • ప్రజలకు వైద్యారోగ్యశాఖ సూచనలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వడగాల్పుల హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల మధ్య బయటకు రావొద్దని వైద్యారోగ్యశాఖ సూచించింది. ఈ మేరకు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 43 డిగ్రీల సెల్సియస్‌కు ఎగబాకడంతో వాతావరణశాఖ రాష్ట్రానికి హీట్ వేవ్ అలర్ట్ జారీ చేసిందన్నారు. ఈ మేరకు ఆయన పలు సూచనలు చేశారు.

జాగ్రత్తలు...

- దాహం వేయకపోయినా వీలైనంత వరకు తగినంత నీరు తాగాలి. ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్ఎస్) తాగాలి. ఇంట్లో తయారు చేసిన నిమ్మరసం, లస్సీ, మజ్జిగ, పండ్ల రసాలు తాగాలి.
- ప్రయాణ సమయంలో వెంట నీటిని తీసుకెళ్లాలి. పుచ్చకాయ, మస్క్ మెలోన్, ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ, పాలకూర లేదా ఇతర స్థానికంగా లభించే పండ్లు మరియు కూరగాయలు వంటి అధిక నీటి కంటెంట్ ఉన్న సీజనల్ పండ్లు, కూరగాయలు తినాలి.
- సన్నని వదులుగా ఉండే కాటన్ వస్త్రాలు ధరించడం మంచిది.
- ఎండలో వెళ్లేప్పుడు గొడుగు, టోపీ, టవల్ వంటి వాటిని ధరించాలి.
- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు బూట్లు లేదా చప్పల్స్ వేసుకోవాలి.
- వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలి. బాగా వెంటిలేషన్, చల్లని ప్రదేశాలలో ఉండాలి.
- పగటిపూట కిటికీలు, కర్టెన్లు మూసి ఉంచాలి.
- శిశువులు, చిన్న పిల్లలు, ఆరుబయట పనిచేసే వ్యక్తులు, గర్భిణులు, మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు, శారీరకంగా అనారోగ్యంతో, ముఖ్యంగా గుండె జబ్బులు లేదా అధిక రక్తపోటుతో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవాలి. మధ్యాహ్నం బయట ఉన్నప్పుడు శారీరక శ్రమకు సంబంధించిన కార్యకలాపాలకు దూరంగా ఉండాలి.
- ఆల్కహాల్, టీ, కాఫీ, శీతల పానీయాలు లేదా పెద్ద మొత్తంలో చక్కెరతో కూడిన పానీయాలను నివారించాలి. ఇవి వాస్తవానికి ఎక్కువ శరీర ద్రవాన్ని కోల్పోయేలా చేస్తాయి.
- అధిక ప్రోటీన్ కలిగిన ఆహారం తీసుకోవద్దు, పాచిపోయిన ఆహారం తినవద్దు.
- పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలు, లేదా పెంపుడు జంతువులను వదిలివేయవద్దు.
- ప్రమాద సంకేతాలు ఉంటే ఏదైనా ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల నుంచి వెంటనే వైద్యసాయం తీసుకోవాలి.
- గందరగోళం, ఆందోళన, చిరాకు, అటాక్సియా, మూర్ఛ, కోమా వంటి పరిస్థితులు ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలి.
- శరీర ఉష్ణోగ్రత 104 ఫారిన్‌హీట్, తీవ్రమైన తలనొప్పి, కండరాల బలహీనత లేదా తిమ్మిరి, వికారం, వాంతులు, వేగవంతమైన హృదయ స్పందన, శ్వాసలో ఇబ్బందులు ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.
- ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రభుత్వం అన్ని ఆస్పత్రుల్లో ప్రత్యేక పడకలు, ఐవీ ఫ్లూయిడ్‌లు, అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచింది.

నిన్న నిండుకుండ... నేడు ఓటికుండ
ఇరవై టీఎంసీలతో కళకళలాడే పెద్దపల్లి జిల్లా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిమట్టం 8 టీఎంసీలకు పడిపోయింది. గతేడాది ఏప్రిల్‌లో నిండుగా కళకళలాడిన జలాశయం కళతప్పి కన్నీటిగోస పెడుతోంది. ఈ ఏడాది అదే సమయంలో ఇలా కనిపిస్తోంది.



తాటివనం సింహభాగం వద్ద ఎల్లంపల్లి నీరు



నీరులేక కనిపిస్తున్న తాటివనం

సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ఆ'ధార'మేదీ
అడుగంటిపోయిన భూగర్భజలాలకు అద్దం పడుతున్న ఈ చేదబావి సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల కేంద్రంలోనిది. ఎండల తీవ్రతకు ఈ బావి పూర్తిగా ఎండిపోయి అందులో పడిపోయిన ప్లాస్టిక్ బిందెలు దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు గ్రామానికంతటికీ ఇదే బావి నీరే ఆధారం. కానీ ఇప్పుడు ఈ బావి ఎండిపోవడంతో స్థానికులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.
- సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

ఆరోగ్యానికి 6 రుచులు



త్వరలో ఉగాది వస్తోంది. ఆరు రుచులున్న ఉగాది పచ్చడిని ఈ రోజు తప్పనిసరిగా సేవించడం ఈ పండగ ఆచారం. ఉగాది రోజున షడ్రుచుల సమ్మేళనం అయిన ఉగాది పచ్చడి సేవిస్తే ఆయా రుచుల్లాగే సంవత్సరమంతా మనకు ఆయా ఫలాలు అందుతాయని, అలా రకరకాల అనుభవాలూ, అనుభూతులను ఆస్వాదించడమే జీవితమని పెద్దలు చెబుతారు. అయితే అలా కేవలం ఉగాది నాడు మాత్రమే కాదు, వీలయితే ప్రతిరోజూ ఆరు రుచుల ఆహారాలను తీసుకోవడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండచ్చని ఆయుర్వేదం చెబుతోంది. ఏయే రుచులు ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల మనకు ఎలాంటి లాభాలు కలుగుతాయో తెలుసుకుందాం.



1. తీపి

శరీరంలోని వాత, పిత్త దోషాలను ఈ రుచి సమం చేస్తుంది. తీపి పదార్థాలను తీసుకోవడం వల్ల ఆయుర్దాయం పెరుగుతుంది, శరీరం దృఢంగా మారుతుంది. శక్తి అందుతుంది. శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. అయితే వీటిని చాలా తక్కువగా తినాలి. లేదంటే శరీరంలో కఫ దోషం పెరుగుతుంది. ఫలితంగా అధిక బరువు, స్థూలకాయం, డయాబెటిస్ వంటి వ్యాధులు వస్తాయి. కనుక ఈ రుచి ఉన్న ఆహారాలను నిత్యం తక్కువ మోతాదులో తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు.



2. పులుపు

వాత దోషాలను పులుపు తగ్గిస్తుంది. పులుపు రుచి ఉన్న ఆహారాలను తినడం వల్ల ఆకలి పెరుగుతుంది. జీర్ణ సమస్యలు ఉండవు. నిమ్మ, చింతకాయ వంటి పులుపు ఉన్న ఆహారాలను నిత్యం పరిమితంగా తీసుకోవచ్చు. అయితే ఎక్కువగా తీసుకుంటే పిత్త, కఫ దోషాలు పెరుగుతాయి. కనక పులుపు ఆహారాలను కూడా తక్కువగా తీసుకోవాలి.



3. ఉప్పు

ఉప్పు ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల వాత దోషం తగ్గుతుంది. ఉప్పు అధికమైతే పిత్త, కఫ దోషాలు పెరుగుతాయి. ఉప్పు ఉన్న ఆహారాల వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. కణాలు శుభ్రమవుతాయి. ఉప్పు ఉన్న పదార్థాలను కూడా తక్కువగా తీసుకోవాలి. ఎక్కువైతే బీపీ పెరుగుతుంది. గుండె జబ్బులు వస్తాయి.



4. కారం

కారపు రుచి గల ఆహారాలను తీసుకుంటే జీర్ణశక్తి పెరుగుతుంది. ఆకలి వేస్తుంది. కణాలు శుభ్రమవుతాయి. రక్త సరఫరా మెరుగు పడుతుంది. కఫ దోషం తగ్గుతుంది. కారం ఎక్కువైతే పిత్తదోషం పెరుగుతుంది. అందువల్ల కారాన్ని నిత్యం తక్కువగానే తీసుకోవాలి.



5. చేదు

చేదుగా ఉన్న పదార్థాలను తినడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. పిత్త, కఫ దోషాలు తగ్గుతాయి. చేదుగా ఉన్న పదార్థాలను నిత్యం కొద్దిగా ఎక్కువ మోతాదులో తీసుకున్నా పెద్దగా సమస్యలు ఉత్పన్నం కావు.

6. వగరు

వగరు ఉన్న పదార్థాలను కూడా నిత్యం తినాలి. కానీ వీటిని తక్కువగా తీసుకోవాలి. లేదంటే జీర్ణాశయంలో గ్యాస్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఇక పిత్త దోషం ఉన్న వారికి ఈ రుచి ఉన్న పదార్థాలు ఎంతగానో మేలు చేస్తాయి. పచ్చి అరటి పండ్లు, క్రాన్ బెర్రీలు, గ్రీన్ బీన్స్ వంటివి ఈ రుచి ఉన్న పదార్థాలకు ఉదాహరణలుగా చెప్పవచ్చు.

అయితే భోజనం చేసేటప్పుడు ఒకేసారి ఆరు రుచులు కలిసిన పదార్థాలను తినాల్సిన పనిలేదు. రోజులో మొత్తంగా చూసుకుంటే ఈ ఆరు రుచులు ఉన్న పదార్థాలను తిన్నామా లేదో అని చెక్ చేసుకుంటే చాలు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల్లో ఈ ఆరు రుచుల నుంచి ఏవైనా రెండు రుచులు కలిగిన ఆహారాలను ఎంచుకుని తింటే చాలు. అంటే ఉదయం చేదు, కారం, మధ్యాహ్నం తీపి, వగరు, రాత్రి పులుపు, ఉప్పు.. ఇలా రెండేసి రుచులు ఉండేలా ఆహారాలను తీసుకుంటే చాలు. ఇవే తినాలని ఏమీ లేదు. ఎవరికి నచ్చినట్లు వారు ఆహారాలను ఎంచుకుని ఆరు రుచులు కవర్ అయ్యేలా చూసుకుంటే చాలు.

హెల్త్ టిప్స్


- రోజూ కప్పు నల్ల ద్రాక్ష రసం తీసుకుంటే గుండెపోటుకు దూరంగా ఉండవచ్చు.
- పడుకునేటప్పుడు ఎడమ పక్కకు తిరిగి పడుకుంటే ఎసిడిటి రాదు.
- 10 తులసి ఆకుల రసం ఒక కప్పు చొప్పున రెండు పూటలా తీసుకుంటే చర్మ వ్యాధులు, రాషెస్ కు సంబంధించి వెంటనే ఫలితం కనిపిస్తుంది.
- రెండు స్పూన్లు ఉసిరి రసం, తేనెను అర కప్పు నీటిలో బాగా కలిపి 3 పూటలా సేవిస్తే బీపీ తగ్గుముఖం పడుతుంది.

మీకు తెలుసా?

'రోజు ఒక కప్పు ఉడకబెట్టిన శనగలు తింటే...

- గుండె జబ్బులు దరిచేరవు.
- రోజంతా ఉత్సాహంగా ఉంటారు.
- కాలేయం సమస్యల నుంచి త్వరగా కోలుకుంటారు.
- ఒత్తిడి, ఆందోళన దూరం అవుతాయి.
- జీర్ణ సమస్యలు తగ్గుతాయి.
- ఎముకలు దృఢంగా మారుతాయి.
- రక్త సరఫరా మెరుగుపడి బీపీ అదుపులో ఉంటుంది.

వేసవి తాపానికి కర్బూజ పండు



వేసవిలో మనకు విరివిగా దొరికే పండు కర్బూజ. ఈ పండులో అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. కర్బూజ పండులో దాదాపు తొంభై శాతం నీరు ఉంటుంది. కాబట్టి వేసవి తాపాన్ని తగ్గించుకోవడానికి, వేసవిలో శరీరం కోల్పోయే నీటి శాతాన్ని భర్తీ చేయడానికీ కర్బూజ పండు బాగా ఉపయోగపడుతుంది. కర్బూజ ముఖ్యంగా శరీరంలోని వేడిని, అధిక రక్త పోటుని తగ్గిస్తుంది. ఈ పండులో ఉన్న పోషక విలువలేంటో తెలుసుకుందాం.

- కర్బూజ పండులో ఎక్కువ శాతం ఉండే బీటాకెరోటిన్ క్యాన్సర్‌కు దారితీసే ఫ్రీ-రాడికల్స్‌ని తొలగిస్తుంది. దీనిలో ఉన్న విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు శరీరంలో తెల్ల రక్త కణాలు వృద్ధి చెందేలా చేసి రక్తంలో ఇన్ఫెక్షన్స్ రాకుండా కాపాడుతుంది.
- కర్బూజ లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి సంబంధిత సమస్యలను దూరం చేసి కంటిచూపు బాగా ఉండేలా చేస్తుంది. వడదెబ్బ నుండి రక్షిస్తుంది.
- కర్బూజ పండులో విటమిన్ కె, విటమిన్ ఇ సమృద్ధిగా ఉంటాయి. దీనివల్ల ప్రత్యుత్పత్తి వ్యవస్థ బాగా పనిచేస్తుంది. అంతేకాకుండా రక్త ప్రసరణ చక్కగా జరిగేలా ఉపయోగపడుతుంది.
- కర్బూజలో అధిక మోతాదులో ఉండే పొటాషియం గుండెకు మంచి న్యూట్రియన్స్‌ని అందజేస్తుంది. దీనిలో ఫోలెట్ ఉండటం వలన అది హార్ట్ ఎటాక్ నుండి మరియు గుండె జబ్బుల నుండి కాపాడుతుంది.
- ఖర్బూజలో తక్కువ క్యాలరీస్ కలిగి ఎక్కువగా పీచు పదార్థం ఉండటం వలన అధిక బరువుని తగ్గిస్తుంది.
- కర్బూజ రసం తాగడం వల్ల మెదడుకి ఆక్సిజన్ సరఫరా బాగా జరిగి, ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది. ఈ జ్యూస్‌ని క్రమం తప్పకుండా సేవిస్తే రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది.
- ఈ పండు కిడ్నీలో రాళ్లను సైతం కరిగిస్తుంది. జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. ఈ పండులో ఫోలిక్ యాసిడ్ సమృద్ధిగా ఉండడం వలన గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు బాగా తోడ్పడుతుంది.
- కంటి ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి, శ్లేష్మాన్ని తగ్గించడానికి కర్బూజా సహాయపడుతుంది.

వేసవిలో కర్బూజ పండు ముక్కలతో పాటు జ్యూస్ తాగటం వల్ల మెరుగైన ఆరోగ్యం పొందవచ్చు.





వడదెబ్బ

ముందే జాగ్రత్త పడదాం...

ఇంకా ఏప్రిల్ మొదటివారంలోనే ఉన్నాం. అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. వివిధ వృత్తి ఉద్యోగ వ్యాపారాల రీత్యా రోజూ ఎండలోకి వెళ్లక తప్పనివారిని వేధించే సమస్య వడదెబ్బ. ఈ నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆరోగ్య నిపుణులు, అనుభవజ్ఞులు చెప్పిన చిట్కాలు కొన్ని...

ముందు జాగ్రత్తలు

ఎండల ధాటికి వడదెబ్బ ప్రభావం శరీరంపై పడే అవకాశం ఉంది, శరీరంలో నీటి శాతం తగ్గితే, వడదెబ్బ తగులుతుంది, అందువల్ల వేసవిలో శరీరంలో నీటిశాతం తగ్గకుండా చూసుకోవాలి, ఎండలో తిరగటంతో రక్తకణాలు కుచించుకుపోతాయి. దీనిమూలంగా కిడ్నీలు, లివర్ దెబ్బతింటాయి. అందువల్ల కొన్ని రకాల జాగ్రత్తలు పాటించడం అవసరం. ● ఎండలో బయటకు వెళ్లేటప్పుడు తలకు క్యాప్ పెట్టుకోవాలి. గొడుగు తీసుకెళ్లాలి ● రోజుకు ఐదారు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలి ● సమయానికి తగిన ఆహారం తీసుకోవాలి ● ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలి ● వదులైన కాటన్ దుస్తులు ధరించాలి ● కొబ్బరి బోండాం, మజ్జిగ తాగుతుండాలి ● బయటకు వెళ్లేప్పుడు తప్పకుండా సన్‌గ్లాసెస్ పెట్టుకోవడం, నీళ్ల సీసా తీసుకెళ్లడం తప్పనిసరి. ● మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరగకూడదు ● కీరదోస ముక్కల్ని ఎక్కువగా తినడం వల్ల శరీరానికి నీటితోపాటు పోషకాలు కూడా అందుతాయి. ● శరీరంలో నీటి శాతాన్ని పెంచే పుచ్చకాయ, కొబ్బరినీళ్లు తాగాలి ● వడదెబ్బ తగిలిన వ్యక్తికి ఉల్లిపాయను మెత్తగా నూరి శరీరానికి రాయాలి ● జీలకర్ర దోరగా వేయించి పొడిచేయండి. అర స్పూన్ పొడిని ఒక గ్లాసు నిమ్మరసంలో కలిపి ఉప్పు, పంచదార వేసుకొని తాగితే శరీరానికి బోలెడంత ఎనర్జీ వస్తుంది ● ఈ కాలంలో సలాడ్స్, తాజా కాయగూరలు, ఫ్రూట్ జ్యూస్‌లు తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ● ఉడికించిన పచ్చి మామిడికాయ రసంలో ఉప్పు, జీలకర్ర కలిపి తాగుతుంటే వడదెబ్బ తగలదు.

వడదెబ్బ తగిలితే ఏం చేయాలి?

- నీరుల్లిపాయ రసం రెండు కణతలకు, ఛాతీమీద పూస్తే వడదెబ్బ నుంచి ఉపశమనం కలుగుతుంది.
- వడదెబ్బ తగిలిన వారి ముఖం మీద, ఒంటి మీద నీళ్లు చల్లుతూ ఉండాలి. గ్లాసుడు నీటిలో నిమ్మరసం, చిటికడు ఉప్పు కలిపి తాగిస్తుండాలి ● శరీరం మీద ఉన్న దుస్తులను వదులు చేసి విశ్రాంతిగా పడుకోనివ్వాలి ● గ్లాసు నీళ్లలో స్పూను తేనె కలిపి ఇచ్చిన వడదెబ్బ నివారణ అవుతుంది ● వడగళ్ళు పడినపుడు ఆ ఐస్ గడ్డలను ఏరి విభూతిలో వేసి నిలువ ఉంచి జాగ్రత్తగా దాచి ఆ విభూతిని మూడువేళ్ళకు వచ్చినంత తీసుకుని మంచినీటిలో వేసి వడదెబ్బ తగిలిన వారికి ఇస్తే వడదెబ్బ నివారణ అవుతుంది ● తరువాణి తేటలో ఉప్పును చేర్చి ఇవ్వాలి ● లేత తాటిముంజలను పంచదారతో కలిపి తినిపించాలి ● నాలుకకు పాత ఉసిరిక పచ్చడి రాసి పుల్లని మజ్జిగ లో ఉప్పువేసి అన్నంలో పోసి పిసికి పిప్పిని పారవేసి ఆ రసాన్ని తాగించాలి ● వేడి వేడి పలచటి గంజిలో ఉప్పు వేసి తాగించాలి.

ఎండవేళలో తప్పనిసరిగా బయటకు వెళ్లవలసి వస్తే, గొడుగు వాడాలి లేదా కనీసం నెత్తిన టోపీ లేదా రుమాలు పెట్టుకుని ఉంటే కొంత ఉపశమనం కలుగుతుంది.

సినిమా



● ప్రభాస్

సరికొత్త ప్రయత్నం?

ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. భైరవ పాత్రలో ప్రభాస్, పద్మావతి పాత్రలో దీపికా పదుకోన్, అశ్వత్థామ పాత్రలో అమితాబ్ కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న విడుదల కావాల్సింది. అయితే వాయిదా పడే అవకాశం ఉందట. కాగా ఈ చిత్రం యూనిట్ ఓ సరికొత్త ప్రయత్నం చేస్తోందనే టాక్ ప్రచారంలోకి వచ్చింది. ఈ చిత్రంలో లీడ్ రోల్స్‌లో కనిపించే ప్రభాస్, దీపికా పదుకోన్, అమితాబ్ బచ్చన్‌ల పాత్రలకు సంబంధించిన పూర్వాపరాలను, ఆ పాత్రల తీరు తెన్నులను చెబుతూ ఓ యానిమేటెడ్ వీడియోను రెడీ చేస్తున్నారట. ఈ వీడియో నేరుగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుందని భోగట్టా. ఈ వీడియోలోని తన పాత్రకు ప్రభాస్ ఇప్పటికే డబ్బింగ్ కూడా పూర్తి చేశారని తెలిసింది. అయితే ఈ యానిమేటెడ్ వీడియో ఏ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఎప్పట్నుంచి స్ట్రీమింగ్ కానుంది? వీడియో నిడివి ఎంత? అసలు వార్తల్లో ఉన్నట్లు యానిమేటెడ్ వీడియో షూట్ జరిగిందా? లేదా అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

● రష్మిక



బర్త్‌డే స్పెషల్

'పుష్ప: ది రైజ్' చిత్రంలో శ్రీవల్లి పాత్రతో నేషనల్ క్రష్‌గా మారిపోయారు రష్మికా మందన్న. ఇటు దక్షిణాదితో పాటు అటు ఉత్తరాదిలో వరుస సినిమాలు చేస్తూ ఫుల్ స్వింగ్‌లో దూసుకెళుతున్న రష్మికా మందన్న పుట్టినరోజు ఏప్రిల్ 5. ఈ సందర్భంగా ఆమె నటిస్తున్న తాజా చిత్రాలు 'పుష్ప 2: ది రూల్', 'ది గర్ల్ ఫ్రెండ్', 'రెయిన్‌బో' నుంచి బర్త్ డే స్పెషల్‌గా ఆమె కొత్త లుక్స్ విడుదల చేశారు మేకర్స్. అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'పుష్ప: ది రూల్'. సుకుమార్ రైటింగ్స్ భాగస్వామ్యంతో మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మిక బర్త్ డే సందర్భంగా 'పుష్ప: ది రూల్'లో ఆమె పాత్ర గెటప్‌ను రివీల్ చేస్తూ పోస్టర్‌ను రిలీజ్ చేసింది యూనిట్. ఈ ఆగస్టు 15న ఈ సినిమా విడుదలవుతోంది. ఇదిలా ఉంటే.. రష్మికా మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నటుడు రాహుల్ రవీంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. వైవిధ్యమైన ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ మూవీ 60 శాతం షూటింగ్ పూర్తయింది. అదే విధంగా రష్మిక లీడ్ రోల్‌లో నటిస్తున్న మరో చిత్రం 'రెయిన్‌బో'. శాంతరూబన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దేవ్ మోహన్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. తెలుగు-తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ మూవీ నుంచి కూడా రష్మిక లుక్ విడుదలైంది.

రామాయణ్‌కు సంగీతం?



● హన్స్ జిమ్మెర్, ఏఆర్ రెహమాన్

ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్స్ ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ హిందీ 'రామాయణ్'కు సంగీతం అందించనున్నారన్నది తాజా టాక్. రామాయణం ఆధారంగా దర్శకుడు నితీష్ తివారీ 'రామాయణ్' అనే ట్రయాలజీని తెరకెక్కిస్తున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ముంబైలోని ఓ స్టూడియోలో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోందని సమాచారం. ఈ సినిమాలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడి పాత్రలో యశ్, కైకేయి పాత్రలో లారా దత్తా కనిపించనున్నారనే ప్రచారం జరుగుతోంది. నటీనటుల పేర్లను యూనిట్ అధికారికంగా ప్రకటించలేదు. తాజాగా 'రామాయణ్' ట్రయాలజీకి ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ సంగీతం అందించనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. హాలీవుడ్‌లో 'ది లయన్ కింగ్' (యానిమేటెడ్) 'డ్యూన్', 'గ్లాడియేటర్', 'ఇన్సెప్షన్' వంటి హిట్ సినిమాలకు హన్స్ జిమ్మెర్ సంగీతం అందించారు. 'ది లయన్ కింగ్', 'డ్యూన్' సినిమాలకు గాను హన్స్‌కు బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఆస్కార్ అవార్డులు వచ్చాయి. 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాకుగాను బెస్ట్ ఒరిజినల్ సాంగ్, బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగంలో ఏఆర్ రెహమాన్‌కు ఆస్కార్ అవార్డులు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. కాగా వచ్చే శ్రీరామ నవమి సందర్భంగా 'రామాయణ్' చిత్రాన్ని అధికారికంగా ప్రకటించాలనుకున్నారట మేకర్స్. మరి... ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తారా? నటీనటులు ఎవరు? అనేది ఆ రోజు తెలిసిపోతుంది. ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా, అల్లు అరవింద్, మధు మంతెన దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నారట.

● అశోక్ గల్లా



ఏమయ్యిందే..!

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, హీరో మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. 'గుణ 369' ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో వారణాసి మానస హీరోయిన్. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్‌పై సోమినేని బాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం (ఏప్రిల్ 5) అశోక్ గల్లా బర్త్ డే. ఈ సందర్భంగా ఈ మూవీ నుంచి 'ఏమయ్యిందే..' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు. అశోక్, మానసల మధ్య వచ్చే ఈ పాట కలర్‌ఫుల్‌గా ఉంది.

● ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో అశోక్ గల్లా హీరోగా కొత్త సినిమా ప్రకటన వచ్చింది. ఈ చిత్రంతో ఉద్భవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 'లవర్', 'మ్యాడ్' చిత్రాల ఫేమ్ శ్రీ గౌరీప్రియ కథానాయికగా నటించనున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు నిర్మాతలు.

ఇక వ్యక్తిగత జీవితంపై ఫోకస్



● మథియాస్, తాప్సీ

వ్యక్తిగత జీవితానికి తాను ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చుకోవాల్సిన తరుణం వచ్చిందన్నట్లుగా మాట్లాడుతున్నారు హీరోయిన్ తాప్సీ. డెన్మార్క్ బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో తాప్సీ వివాహం గత నెల 23న ఉదయ్‌పూర్‌లో జరిగిందనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. అయితే తాప్సీ, మథియాస్ తమ పెళ్లి గురించి అధికారికంగా ప్రకటించలేదు. కానీ వధూవరులుగా తాప్సీ, మథియాస్ ఉన్న వీడియోలు వైరల్ అవుతుండటంతో వీరిద్దరికీ వివాహం జరిగిందని స్పష్టమైంది. కాగా పెళ్లి తర్వాత తాప్సీ ఓ ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''కొన్నేళ్లు గడిచిన తర్వాత నేను నటించిన సినిమాల జాబితాను ఓ సారి చూసుకున్నప్పుడు ఆ జాబితా నాకు సంతోషాన్నివ్వాలి. ఎందుకుంటే నా జీవితంలోని ఎక్కువ సమయాన్ని సినిమాలకే కేటాయించాను. 24 గంటల్లో నేను పన్నెండు గంటలు పని చేసిన రోజులూ ఉన్నాయి. అయితే ఇకపై నేను నా వృత్తి జీవితంపైకన్నా, వ్యక్తిగత జీవితంపై ఎక్కువ ఫోకస్ పెట్టాలనుకుంటున్నా. అందుకే ఈ సినిమా వదులుకోకూడదు అనిపించేంత మంచి స్క్రిప్ట్ అయితేనే చేయాలనుకుంటున్నాను. కెరీర్‌కి మించిన జీవితం ఒకటి ఉంటుంది. ఆ జీవితాన్ని ఆస్వాదించాలనుకుంటున్నాను. కుటుంబ సభ్యులు, సన్నిహితులు, స్నేహితులతో సమయం గడపాలనుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు తాప్సీ.



● తాప్సీ

బ్యాక్ టు షూట్

దాదాపు రెండు నెలల తర్వాత తిరిగి నటిగా మేకప్ వేసుకున్నారు ప్రియాంకా చోప్రా. ఇద్రిస్ ఎల్బా, జాన్ సెనా, ప్రియాంకా చోప్రా, జాక్ క్వాయిడ్, స్టీఫెన్ రూట్ ప్రధాన పాత్రధారులుగా హాలీవుడ్‌లో 'హెడ్స్ ఆఫ్ స్టేట్' అనే కామెడీ యాక్షన్ థ్రిల్లర్ మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాకు ఇలియా నైషుల్లర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ అమెరికాలో మొదలైంది. ''..అండ్ వుయ్ ఆర్ బ్యాక్..'' అంటూ 'హెడ్స్ ఆఫ్ స్టేట్' సినిమా స్క్రిప్ట్‌ను తన ఇన్‌స్టా స్టేటస్‌లో షేర్ చేశారు ప్రియాంకా చోప్రా. దీంతో 'హెడ్స్ ఆఫ్ స్టేట్' షూట్‌లో ఆమె పాల్గొంటున్నారని స్పష్టమైంది. ఇక రెండు నెలల క్రితం తన వ్యక్తిగత పనుల కోసం ప్రియాంకా చోప్రా ఇండియా వచ్చారు. సోదరుడు సిద్ధార్థ్ చోప్రా నిశ్చితార్థం వేడుకలో చురుగ్గా పాల్గొన్నారు ప్రియాంక. ఈ వేడుకతో పాటు మరికొన్ని పనులను చక్కబెట్టుకుని ప్రియాంకా చోప్రా మళ్లీ నటిగా బిజీ అవుతున్నారు.



● ప్రియాంకా చోప్రా

స్నేహం నేపథ్యంలో...



● సత్యదేవ్

దర్శకుడు కొరటాల శివ సమర్పణలో సత్యదేవ్ హీరోగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ'. వీవీ గోపాలకృష్ణ దర్శకత్వం వహించిన ఈ మూవీలో అతీరా రాజ్, లక్ష్మణ్ మీసాల, రఘు కుంచె, నందగోపాల్ కీలక పాత్రధారులు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మించిన ఈ సినిమా మే 3 రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కృష్ణ కొమ్మాలపాటి మాట్లాడుతూ– ''రా అండ్ రస్టిక్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీగా తెరకెక్కించిన సినిమా ఇది. ఈ సినిమాతో సత్యదేవ్ మరో రేంజ్‌కి చేరుకుంటారు. కాలభైరవ అద్భుతమైన సంగీతం ఇచ్చారు'' అన్నారు. ''ఇంటెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో స్నేహం విలువను చూపిస్తున్నాం'' అన్నారు వీవీ గోపాలకృష్ణ.

భవనమ్‌లో థ్రిల్

సప్తగిరి, ధనరాజ్, షకలక శంకర్, అజయ్, మాళవికా సతీషన్, స్నేహా ఉల్లాల్ ముఖ్య తారలుగా రూపొందుతున్న చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ట్యాగ్‌లైన్. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్ గుడ్ ఫిలిమ్స్ సమర్పణలో ఆర్‌బి చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి నిర్మిస్తున్న ఈ చిత్రానికి బాలాచారి కూరెళ్ల దర్శకుడు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ఫస్ట్ లుక్, టీజర్‌ని విడుదల చేశారు. ''సస్పెన్స్ థ్రిల్లింగ్ హారర్‌తో పాటు కామెడీ ఎలిమెంట్స్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ఉంటుంది'' అని మేకర్స్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమెరా: మురళీమోహన్ రెడ్డి ఎస్.



● అజయ్

సాక్షి బిజినెస్

శనివారం
6-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▽
20	1
74,248	22,514

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,299	▲	249
డోజోన్స్	38,977	▲	380
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,911	▽	65
డాక్స్	18,175	▽	228
షాంఘై (బుధవారం ముగింపు)	3,069	▽	6
నికాయ్	38,992	▽	781

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	68,280
బంగారం (22 క్యారెట్)	65,030
వెండి (కేజీ)	85,000

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		83.04	84.05
£	బ్రిటన్ పౌండ్		104.22	106.77
€	యూరో		89.38	91.74
¥	జపాన్ ఎన్ (100)		54.64	55.87
AUS	ఆస్ట్రేలియా డాలర్		53.98	55.90
S$	సింగపూర్ డాలర్		59.51	64.17
SAR	సౌదీ రియాల్		21.32	22.87
UAE D	యూఏఈ దిర్హామ్		21.79	23.57
¥	చైనా యువాన్		10.39	12.47

ఆర్‌బీఐ ఏడోసారీ

రెపో రేటును తగ్గించని ఆర్‌బీఐ

- 6.50 శాతంగా కొనసాగింపు
- ఆహార ద్రవ్యోల్బణం ఆందోళనకరంగా ఉండటం కారణం
- గృహ, ఆటో ఈఎంఐలు యథాతథం
- వృద్ధి 7%, ద్రవ్యోల్బణం 4.5 శాతంగా అంచనాలు



- యూపీఐని వినియోగించడం ద్వారా త్వరలో బ్యాంకుల్లో నగదు డిపాజిట్ సౌకర్యం
- ప్రభుత్వ బాండ్లలో రిటైల్ భాగస్వామ్యం సులభతరానికి మొబైల్ యాప్ ప్రారంభం
- ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్‌లో సావరిన్ గ్రీన్ బాండ్ల ట్రేడింగ్‌కు అనుమతి
- సీబీడీసీ వాలెట్‌లను అందించడానికి నాన్-బ్యాంక్ పేమెంట్ సిస్టమ్ ఆపరేటర్‌లకు అనుమతి
- బ్యాంకింగ్ ద్రవ్య సంబంధ ఇబ్బందులు పడకుండా లిక్విడిటీ కవరేజ్ రేషియో సమీక్ష
- 2023-24లో ఎఫ్‌పీఐల పెట్టుబడులు 41.6 బిలియన్ డాలర్లు. 2014-15 తర్వాత అత్యధికం
- డాలర్ మారకంలో రూపాయి విలువ స్థిర శ్రేణిలో కదలాడుతోంది. ఆందోళన అక్కర్లేదు
- నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలకు వ్యవస్థాగతంగా ఎటువంటి ఇబ్బందులూ లేవు
- జూన్ 5 నుంచి 7 వరకూ 2024-25 ఆర్‌బీఐ రెండవ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష

ముంబై: ఏప్రిల్ నుంచి జూన్ మధ్యలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే ఎక్కువ ఉండొచ్చన్న వాతావరణ శాఖ అంచనాలతో ఆహార ద్రవ్యోల్బణంపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ వరుసగా ఏడోసారీ కీలక వడ్డీ రేట్లలో ఎటువంటి మార్పులు చేయలేదు. రెపో రేటును ప్రస్తుత 6.5 శాతం స్థాయిలోనే కొనసాగించాలని నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ ఈ మేరకు పాలసీ నిర్ణయం తీసుకుంది. దీంతో గృహ, వాహన రుణాలపై ఈఎంఐలు మరికొన్నాళ్ల పాటు స్థిరంగా ప్రస్తుత స్థాయిలోనే కొనసాగే అవకాశం ఉంది. 2023 ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ రెపో రేటును మార్చలేదు. అంటే ఏడు ద్వైమాసిక సమావేశాల నుంచి ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో రేటు యథాతథంగా కొనసాగింది. తాజాగా రెపో రేటును యథాతథంగా ఉంచాలన్న ప్రతిపాదనను మానిటరీ పాలసీ కమిటీలోని (ఎంపీసీ) ఆరుగురు సభ్యుల్లో ఒకరు వ్యతిరేకించగా అయిదుగురు సభ్యులు సానుకూలత వ్యక్తపర్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి 7 శాతం స్థాయిలోనూ (2023-24లో 7.6 శాతం), ద్రవ్యోల్బణం 4.5 శాతం స్థాయిలోను (2023-24లో 5.4 శాతం) ఉంటుందన్న అంచనాలను ఆర్‌బీఐ కొనసాగించింది. ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా, ఆహార ధరల బాస్కెట్ ద్రవ్యోల్బణం 8.66 శాతంగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉంటుందని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం క్యూ1లో 4.9 శాతం, క్యూ2లో 3.8 శాతం, క్యూ3లో 4.6 శాతం, క్యూ4లో 4.5 శాతం చొప్పున మొత్తం మీద సగటున 4.5 శాతంగా ఉండొచ్చని ఆర్‌బీఐ అంచనా వేస్తోంది. కాగా విదేశాల నుంచి స్వదేశానికి పంపించే డబ్బుకు (రెమిటెన్స్) సంబంధించి భారత్ తొలి స్థానంలో ఉన్నట్లు ఆర్‌బీఐ పేర్కొంది.

ఆహార ధరలపై అనిశ్చితి..

ఆహార ధరల్లో నెలకొన్ని అనిశ్చితి రాబోయే రోజుల్లో ద్రవ్యోల్బణం తీరుతెన్నులపై ప్రభావం చూపవచ్చు. ఈ ఏడాది వేసవిలో కూరగాయల ధరల కదలికలపై మనం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఒకవైపు వృద్ధికి ఊతమిస్తూనే మరోవైపు లక్ష్యించుకున్న స్థాయికి (4 శాతం) ద్రవ్యోల్బణం దిగి వస్తే కీలక రేట్లను తగ్గించడంపైనే ఎంపీసీ ప్రధానంగా దృష్టి పెడుతుంది.

– శక్తికాంతదాస్, ఆర్‌బీఐ గవర్నర్

సాగుపై చల్లని అంచనాలు

తీవ్ర వేసవి, నీటి ఎద్దడి భయాందోళనల నేపథ్యంలో ఆర్‌బీఐ ఎకానమీపై చల్లని అంచనాలను వెలువరించింది. తగిన వర్షపాతం అంచనాల నేపథ్యంలో వ్యవసాయ, గ్రామీణ క్రియాశీలతలో సానుకూలతలు కనిపిస్తున్నాయని పేర్కొంది. ఆశించిన స్థాయిలో సాధారణ రుతుపవనాల అంచనాలు, మంచి రబీ గోధుమ పంట, ఖరీఫ్ పంటల మెరుగైన అవకాశాలు దీనికి కారణంగా పేర్కొంది. బలమైన గ్రామీణ డిమాండ్, ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గడం, తయారీ- సేవల రంగంలో స్థిరమైన పురోగతి ప్రైవేట్ వినియోగాన్ని పెంచడానికి దోహదపడే అంశాలుగా పేర్కొంది. అయితే దీర్ఘకాలిక భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య మార్గాలలో పెరుగుతున్న అంతరాయాలు దేశ ఎకానమీకి ఆందోళన కలిగిస్తున్న అంశాలుగా పేర్కొంది.



పసిడి నిల్వల పెంపు

విదేశీ మారక ద్రవ్య నిల్వల పటిష్టతలో భాగంగా పసిడి వాటాను భారత్ పెంచుకుంటుందని ఆర్‌బీఐ పేర్కొంది. మార్చి 29వ తేదీ నాటికి భారత్ విదేశీ మారకద్రవ్య నిల్వలు ఆల్ టైమ్ హై 645.6 బిలియన్ డాలర్లకు చేరితే, అందులో పసిడి వాటా 51.487 బిలియన్ డాలర్లుగా ఉంది.

మార్కెట్ ఫ్లాట్

ఆర్‌బీఐ పాలసీపై స్పందన కరువు



ముంబై: ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను ఏడోసారి యథాతథంగా కొనసాగించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 20 పాయింట్లు పెరిగి కొత్త రికార్డు స్థాయి 74,248 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక పాయింటు నష్టంతో 22,514 వద్ద నిలిచింది. ఉదయం సూచీలు ఫ్లాటుగా మొదలయ్యాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల ప్రభావంతో ట్రేడింగ్ ప్రారంభంలోనే నష్టాల్లోకి మళ్లాయి. సెన్సెక్స్ 286 పాయింట్లు క్షీణించి 73,947 వద్ద, నిఫ్టీ 86 పాయింట్లు కోల్పోయి 22,428 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. అయితే ఆర్‌బీఐ ద్రవ్య పరపతి సమీక్ష నిర్ణయాలు వెల్లడి తర్వాత బ్యాంకులు, ఫైనాన్స్, రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో సూచీలు ఆరంభ నష్టాలు భర్తీ చేసుకొని స్వల్ప లాభాలతో గట్టెక్కా యి. మరోవైపు టెక్, ఐటీ, క్యాపిటల్ గూడ్స్, ఆటో, ఆయిల్‌అండ్ గ్యాస్, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,659 కోట్ల విలువ షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.3,370 కోట్ల విలువ షేర్లు అమ్మారు.

బిగ్ 'సి' ఉగాది ప్రత్యేక ఆఫర్లు

హైదరాబాద్: మొబైల్స్ విక్రయ సంస్థ బిగ్ 'సి' ఉగాది సందర్భంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. మొబైల్స్, స్మార్ట్ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఏసీల కొనుగోలుపై 7.50% వరకు తక్షణ తగ్గింపు అందిస్తుంది. ఎలాంటి వడ్డీ, డౌన్‌పేమెంట్ లేకుండా సులభ వాయిదాల పద్ధతిలో వీటిని కొనుగోలు చేయవచ్చు. మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతితో పాటు సంవత్సరం పూర్తిగా, రెండో ఏటా రూ.8వేల వరకు 'మొబైల్ ప్రొటెక్షన్' అదనంగా పొందవచ్చు. బ్రాండెడ్ ఉపకరణాలపై 51% వరకు తగ్గింపు పొందవచ్చు. ప్రజలంతా ఉగాది ప్రత్యేక ఆఫర్లను వినియోగించుకోవాలని సంస్థ సీఎండీ బాలు చౌదరి కోరారు.



రామ్‌కీ ఇన్‌ఫ్రాకు విశ్వకర్మ పురస్కారాలు..

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మౌలిక రంగ దిగ్గజం రామ్‌కీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు 15వ సీఐడీసీ విశ్వకర్మ అవార్డుల కార్యక్రమంలో వివిధ విభాగాల్లో పురస్కారాలు లభించాయి. ఉత్తమ నిర్మాణ ప్రాజెక్టులు, సామాజిక అభివృద్ధి..ప్రభావం, ప్రొఫెషనల్‌గా అత్యుత్తమంగా నడుస్తున్న సంస్థ తదితర విభాగాల్లో ఈ అవార్డులు దక్కినట్లు కంపెనీ తెలిపింది. నిర్మాణ రంగంలో తాము పాటించే అత్యుత్తమ ప్రమాణాలకు ఇవి నిదర్శనమని రామ్‌కీ ఇన్‌ఫ్రా ఎండీ వై.ఆర్. నాగరాజ తెలిపారు. ప్లానింగ్ కమిషన్ (ప్రస్తుతం నీతి ఆయోగ్), భారతీయ నిర్మాణ పరిశ్రమ కలిసి ఏర్పాటు చేసిన కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీఐడీసీ) ఈ పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించింది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-4-2024 ఫామ్ ధర...	
విశాఖ	415-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403-00
విజయవాడ	403-00
రిటైల్ ధర (డజను)	60.00
హైదరాబాద్	375-00
వరంగల్	377-00
రిటైల్ ధర	4.35

యాపిల్‌లో 600 మంది ఉద్యోగులకు ఉద్వాసన

వాషింగ్టన్: టెక్ దిగ్గజం యాపిల్ 600 మందికి పైగా ఉద్యోగులను తొలగించింది. మే 27 నుంచి తొలగింపు వర్తిస్తుందంటూ మార్చి 28న 614 మంది వర్కర్లకు పంపిన లేఖలో యాపిల్ పేర్కొంది. ఈ ఉద్యోగులంతా శాంటా క్లారాలోని ఎనిమిది కార్యాలయాల్లో పని చేస్తున్నారు. కోవిడ్-19 తర్వాత యాపిల్ ఇంత భారీ స్థాయిలో ఉద్వాసనలకు తెర తీయడం ఇదే ప్రథమం. కోవిడ్ సమయంలో భారీగా రిక్రూట్‌మెంట్ చేపట్టిన చాలామటుకు టెక్ కంపెనీలు గత రెండేళ్లుగా పెద్దయెత్తున ఉద్యోగులను తొలగిస్తూ వస్తున్నాయి.

బంధన్ బ్యాంక్‌కు సీఈవో గుడ్‌బై



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ సంస్థ బంధన్ బ్యాంక్ వ్యవస్థాపకుడు, సీఈవో సీఎస్ ఘోష్ బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. ప్రస్తుత సర్వీసు 2024 జూలై9తో ముగియనుండటంతో పదవీవిరమణ చేయనున్నట్లు బ్యాంక్ తెలిపింది. వరుసగా మూడుసార్లు ఎండీ, సీఈవోగా దాదాపు దశాబ్ద కాలం బ్యాంకుకు నాయకత్వం వహించిన తాను బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు బోర్డుకు రాసిన లేఖలో ఘోష్ పేర్కొన్నారు.

సాక్షి స్పోర్ట్స్

హంపి తొలి గేమ్ 'డ్రా'

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌లో ఐదుగురు భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, వైశాలి, ప్రజ్ఞానంద, గుకేశ్, విదిత్ తమ తొలి రౌండ్ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. మహిళల విభాగంలో తమిళనాడు అమ్మాయి వైశాలితో జరిగిన తొలి గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ స్టార్ హంపి 41 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. ఓపెన్ విభాగంలో అలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్)తో జరిగిన గేమ్‌ను ప్రజ్ఞానంద 39 ఎత్తుల్లో... విదిత్‌తో జరిగిన గేమ్‌ను గుకేశ్ 21 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నారు. ఓపెన్ విభాగంలో ఎనిమిది మంది మధ్య... మహిళల విభాగంలో ఎనిమిది మంది మధ్య డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో ఈ టోర్నీ జరుగుతోంది. రెండు విభాగాల విజేతలు ప్రస్తుత ప్రపంచ చాంపియన్స్‌తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.



రైజర్స్... విన్నర్స్



అభిషేక్ శర్మ

ఉప్పల్ మైదానంలో ఒక్కసారిగా ఎంత మార్పు! గత మ్యాచ్‌లో రెండు జట్లు పోటీ పడి పరుగుల వరద పారించడంతో 38 సిక్సర్లతో ఏకంగా 523 పరుగులు నమోదయ్యాయి. కానీ ఇప్పుడు చెన్నై ఒక్కో పరుగు కోసం శ్రమించింది. అసలు మెరుపులు, భారీ షాట్లే లేకుండా సాధారణ స్కోరుకే పరిమితమైంది. గత మ్యాచ్‌లో ఆడింది కాకుండా మరో పిచ్‌పై ఈ మ్యాచ్ జరిగినా... పిచ్‌కంటే కూడా సన్‌రైజర్స్ బౌలర్లు ప్రభావం చూపించి ప్రత్యర్థిని కట్టిపడేశారు. నియంత్రణతో కూడిన తమ చక్కటి బౌలింగ్‌తో సన్‌రైజర్స్ ఒకప్పటి తమ బలాన్ని మళ్లీ గుర్తుకు తెచ్చింది. అనంతరం లక్ష్యాన్ని ఛేదించడంలో హైదరాబాద్‌కు ఇబ్బందీ ఎదురు కాలేదు. అభిషేక్ శర్మ బలమైన పునాది వేశాక మార్క్‌రమ్ బ్యాటింగ్ జట్టును విజయం దిశగా నడిపించింది.

సొంతగడ్డపై హైదరాబాద్‌కు మరో విజయం

- 6 వికెట్లతో చెన్నై పరాజయం
- సన్‌రైజర్స్ బౌలర్ల సమష్టి ప్రదర్శన
- రాణించిన అభిషేక్ శర్మ, మార్క్‌రమ్

సాక్షి, హైదరాబాద్: సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా తమ రెండో మ్యాచ్‌లోనూ విజయాన్ని నమోదు చేసింది. తొలి పోరులో మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను శాసించిన జట్టు... ఇప్పుడు బౌలింగ్ బలంతో తమ ఖాతాలో మరో గెలుపును వేసుకుంది. శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రైజర్స్ 6 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. శివమ్ దూబే (24 బంతుల్లో 45; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలవగా... అజింక్య రహానే (30 బంతుల్లో 35; 2 ఫోర్లు, 1 సిక్స్), రవీంద్ర జడేజా (23 బంతుల్లో 31 నాటౌట్; 4 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. అనంతరం హైదరాబాద్ 18.1 ఓవర్లలో 4 వికెట్లకు 166 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (12 బంతుల్లో 37; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), మార్క్‌రమ్ (36 బంతుల్లో 50; 4 ఫోర్లు, 1 సిక్స్), హెడ్ (24 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులతో హాజరై మ్యాచ్ మొత్తాన్ని తిలకించారు. మ్యాచ్ ముగిశాక అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డును ఆయన అందజేశారు.

రాణించిన దూబే...


ఒక్క దూబే క్రీజ్‌లో ఉన్నంత సేపు మినహా మిగిలిన చెన్నై ఇన్నింగ్స్ మొత్తం పేలవంగా సాగింది. సన్‌రైజర్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌లో పరుగులు సాధించడంలో చెన్నై బ్యాటర్లు విఫలమయ్యారు. ఓపెనర్ రచిన్ రవీంద్ర (12) విఫలం కాగా... రుతురాజ్ గైక్వాడ్ (21 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడలేకపోయాడు. పవర్‌ప్లేలో జట్టు 48 పరుగులు చేసింది. ఈ దశలో దూబే ధాటిని చూపించాడు. షహబాజ్, మర్కండే బౌలింగ్‌లలో ఒక్కో సిక్స్ బాదిన అతను నటరాజన్ ఓవర్లో 2 సిక్స్‌లు కొట్టాడు. దూబే, రహానే 8 పరుగుల వ్యవధిలో వెనుదిరిగాక స్కోరు వేగం మరింత తగ్గిపోయింది.

అలవోకగా...

ఓపెనర్ అభిషేక్ మెరుపు బ్యాటింగ్‌తో రైజర్స్‌కు ఘనారంభం అందించాడు. అతను చెలరేగుతుంటే హెడ్ ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యాడు. ముకేశ్ వేసిన ఇన్నింగ్స్ రెండో ఓవర్లో అభిషేక్ 3 సిక్స్‌లు, 2 ఫోర్‌లు బాదడంతో మొత్తం 27 పరుగులు వచ్చాయి. చహర్ ఓవర్లోనూ వరుసగా 6, 4 కొట్టిన అతను తర్వాతి బంతికి వెనుదిరిగాడు. అనంతరం హెడ్, మార్క్‌రమ్ కలిసి కొన్ని చక్కటి షాట్లతో వేగాన్ని కొనసాగించారు. 6 ఓవర్లు ముగిసే సరికి స్కోరు 78 పరుగులకు చేరింది. హెడ్‌ను తీక్షణ వెనక్కి పంపించగా... 35 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న వెంటనే మార్క్‌రమ్ పెవిలియన్ చేరాడు. ఈ దశలో 36 బంతుల్లో 34 పరుగులే చేయాల్సి ఉండటంతో హైదరాబాద్ అలవోకగా లక్ష్యం చేరింది. ఆంధ్ర ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి (14 నాటౌట్) మరో 11 బంతులు మిగిలి ఉండగానే సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు.



మార్క్‌రమ్



నితీశ్ కుమార్ రెడ్డి

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రచిన్ (సి) మార్క్‌రమ్ (బి) భువనేశ్వర్ 12; రుతురాజ్ (సి) సమద్ (బి) షహబాజ్ 26; రహానే (సి) మార్కండే (బి) ఉనాద్కట్ 35; దూబే (సి) భువనేశ్వర్ (బి) కమిన్స్ 45; జడేజా (నాటౌట్) 31; మిచెల్ (సి) సమద్ (బి) నటరాజన్ 13; ధోని (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 165.** **వికెట్ల పతనం:** 1-25, 2-54, 3-119, 4-127, 5-160. **బౌలింగ్:** అభిషేక్ 1-0-7-0, భువనేశ్వర్ 4-0-28-1, నటరాజన్ 4-0-39-1, కమిన్స్ 4-0-29-1, మయాంక్ మార్కండే 2-0-21-0, షహబాజ్ అహ్మద్ 1-0-11-1, జైదేవ్ ఉనాద్కట్ 4-0-29-1.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి) రచిన్ (బి) తీక్షణ 31; అభిషేక్ (సి) జడేజా (బి) చహర్ 37; మార్క్‌రమ్ (ఎల్బీ) (బి) అలీ 50; షహబాజ్ (ఎల్బీ) (బి) అలీ 18; క్లాసెన్ (నాటౌట్) 10; నితీశ్ కుమార్ రెడ్డి (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (18.1 ఓవర్లలో 4 వికెట్లకు) 166.** **వికెట్ల పతనం:** 1-46, 2-106, 3-132, 4-141. **బౌలింగ్:** దీపక్ చహర్ 3.1-0- 32-1, ముకేశ్ చౌదరి 1-0-27-0, తీక్షణ 4-0-27-1, తుషార్ 2-0-20-0, రవీంద్ర జడేజా 4-0-30-0, మొయిన్ అలీ 3-0-23-2, రచిన్ రవీంద్ర 1-0-3-0.

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ × బెంగళూరు
వేదిక: జైపూర్
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
కోల్‌కతా	3	3	0	6	2.518
రాజస్తాన్	3	3	0	6	1.249
చెన్నై	4	2	2	4	0.517
లక్నో	3	2	1	4	0.483
హైదరాబాద్	4	2	2	4	0.409
పంజాబ్	4	2	2	4	-0.220
గుజరాత్	4	2	2	4	-0.580
బెంగళూరు	4	1	3	2	-0.876
ఢిల్లీ	4	1	3	2	-1.347
ముంబై	3	0	3	0	-1.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

టైటిల్ పోరుకు తరుణ్



అస్తానా: కజకిస్తాన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నెపల్లి ఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో ప్రపంచ 190వ ర్యాంకర్ తరుణ్ 21-8, 21-7తో ప్రపంచ 78వ ర్యాంకర్ లె డక్ ఫాట్ (వియత్నాం)పై సంచలన విజయం సాధించాడు. నేడు జరిగే ఫైనల్లో ప్రపంచ 76వ ర్యాంకర్ సూంగ్ జూ వెన్ (మలేసియా)తో తరుణ్ తలపడతాడు. క్వార్టర్ ఫైనల్లో తరుణ్ 22-20, 21-14తో దిమిత్రీ పనారిన్ (కజకిస్తాన్)ను ఓడించాడు. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో రుత్విక శివాని-రోహన్ కపూర్ (భారత్) జోడీ 15-21, 15-21తో వోంగ్ తియెన్ సి-లిమ్ చియెవ్ సియెన్ (మలేసియా) జంట చేతిలో ఓడిపోగా... సెమీఫైనల్లో మనీషా-సంజయ్ (భారత్) ద్వయం 21-16, 10-21, 21-14తో కొసియెలా-తసీనా (అల్జీరియా) జోడీపై గెలిచి ఫైనల్ చేరింది. మహిళల సింగిల్స్ విభాగంలో భారత్‌కు టైటిల్ ఖరారైంది. ఫైనల్ పోరు ఇద్దరు భారత క్రీడాకారిణులు అనుపమా ఉపాధ్యాయ, ఇషారాణి బారువా మధ్య జరగనుంది.

ఫైనల్లో సౌత్‌జోన్

రాణించిన దుర్గా, తమన్నా



దుర్గా

పుణే: జాతీయ సీనియర్ మహిళల ఇంటర్ జోనల్ క్రికెట్ టోర్నీలో సౌత్‌జోన్, ఈస్ట్‌జోన్ జట్లు ఫైనల్లోకి దూసుకెళ్లాయి. సౌత్‌జోన్, వెస్ట్ జోన్ జట్ల మధ్య జరిగిన మూడు రోజుల తొలి సెమీఫైనల్ 'డ్రా'గా ముగిసింది. అయితే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించిన కారణంగా సౌత్‌జోన్ జట్టుకు ఫైనల్ బెర్త్ ఖరారైంది. ఓవర్‌నైట్ స్కోరు 58/2తో చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన సౌత్‌జోన్ 101 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 262 పరుగుల వద్ద డిక్లేర్ చేసి 322 పరుగుల విజయలక్ష్యాన్ని నిర్దేశించింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి, వికెట్ కీపర్ మిరియాల దుర్గ (205 బంతుల్లో 81; 10 ఫోర్లు) అర్ధ సెంచరీ చేయగా... తమన్నా నిగమ్ (200 బంతుల్లో 99; 16 ఫోర్లు) ఒక్క పరుగు తేడాతో సెంచరీని చేజార్చుకుంది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో వెస్ట్‌జోన్ రెండో ఇన్నింగ్స్ ఆడలేదు. నార్త్‌జోన్‌తో జరిగిన రెండో సెమీఫైనల్లో ఈస్ట్‌జోన్ 135 పరుగుల తేడాతో గెలిచింది.

మూడు బంతులు చాలు..
ముచ్చట తీర్చేందుకు...

ఉప్పల్ స్టేడియం ధోని మయం ● ఆరేళ్ల తర్వాత హైదరాబాద్‌లో ఆడిన ఎమ్మెస్



సాక్షి, హైదరాబాద్: ఒక్కో వికెట్ పడుతోంది... ఇప్పుడు వస్తాడా...ఇప్పుడైనా వస్తాడా...ఇంకెప్పుడు వస్తాడు...ఎట్టకేలకు 19.3 ఓవర్ల తర్వాత వచ్చాడు. చెన్నై ఇన్నింగ్స్‌లో ఐదో వికెట్ పడిన తర్వాత మహేంద్ర సింగ్ (ఎమ్మెస్) ధోని క్రీజ్‌లోకి వచ్చాడు. అంతే...ఉప్పల్ స్టేడియం ఒక్కసారిగా ఊగిపోయింది. అప్పటి వరకు ఆట సాగినంత సేపు మైదానంలో పరిస్థితి వేరు. కానీ ఆ సమయంలో డెసిబుల్స్ లెవల్స్ లెక్క తీస్తే అది రికార్డు స్థాయికి చేరిపోయే ఉంటుంది. అంతసేపు అందరి జేబుల్లో భద్రంగా ఉన్న సెల్ ఫోన్లు బయటకు వచ్చేశాయి. ఫోన్ లైట్‌లు ఆన్ అయిపోయాయి. కాస్త స్తబ్దతగా కనిపించిన చోటనే ఎక్కడలేని ఉత్సాహం వచ్చేసింది. ఈ క్షణాలను బంధించి నేనూ ఆ సమయంలో గ్రౌండ్‌లో ఉన్నానోచ్ అనిపించుకోవాలనే తపన వారిలో కనిపించింది. నిజానికి గత మ్యాచ్‌లో 8వ స్థానంలో అతను బ్యాటింగ్‌కు వచ్చాడు. అలా చూస్తే ఈసారి సందేహమే! మొయిన్ అలీని ముందుకు పంపుతాడేమో అనిపించింది. కానీ ఏడో స్థానంలో బరిలోకి దిగాడు. ఇన్నింగ్స్‌లో 3 బంతులే మిగిలాయి. గత మ్యాచ్ తరహాలో ఏమైనా మాయ చేస్తాడేమో అనుకున్నారు. అలాంటిదేమీ జరగలేదు. తొలి బంతికి పరుగు తీయలేదు. రెండో బంతికి సింగిల్‌తో నాన్ స్ట్రయికింగ్ ఎండ్‌కు చేరిపోయాడు. అంతే! హైదరాబాద్‌లో ధోని బ్యాటింగ్ ముగిసింది. కానీ బాధ లేదు... ఎందుకంటే అతని విషయంలో ఎన్ని బంతులు ఆడాడన్నది లెక్క కాదు. ధోని క్రీజ్‌లోకి వస్తే మొత్తం ఐపీఎల్ మ్యాచ్ చూసిన సంతృప్తి.

ఇంత ఆసక్తి ఎందుకంటే...

ధోని గురించి ఇంతగా ఆసక్తి చూపించడం, అభిమానులు ఎంతో ఆశించడంలో తప్పు లేదు. ఎందుకంటే ఉప్పల్ మైదానంలో అతని ఆట చూసి ఆరేళ్లు గడిచిపోయాయి. నిజం...ధోని ఈ స్టేడియంలో ఆఖరిసారిగా 2018 ఏప్రిల్ 22న ఐపీఎల్ మ్యాచ్ ఆడాడు. 2019 సీజన్‌లో టీమ్ ఆడినా... ఆఖరి నిమిషంలో వెన్నునొప్పితో మ్యాచ్ నుంచి తప్పుకోవడంతో సురేశ్ రైనా కెప్టెన్‌గా బరిలోకి దిగాడు. తర్వాతి 2020, 2021, 2022 సీజన్లు కోవిడ్ కారణంగా యూఏఈతో పాటు భారత్‌లో కొన్ని వేదికలకే పరిమితమైంది. 2023 షెడ్యూల్ ప్రకారం చెన్నై సూపర్ కింగ్స్ హైదరాబాద్‌లో మ్యాచ్ ఆడనే లేదు. అందుకే ఈ మ్యాచ్ గురించి అంతటి ఆసక్తి, ఆకర్షణ. టికెట్లు అమ్మకానికి ఉంచిన క్షణం మొదలు అంతా ధోనినామ జపమే!



మ్యాచ్‌ను తిలకిస్తున్న ధోని భార్య సాక్షి, కూతురు జివా



ధోనిని సన్మానించిన హెచ్‌సీఏ కార్యవర్గ సభ్యులు



ఫుల్ డిమాండ్....

ముంబై ఇండియన్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య ఇక్కడ జరిగిన గత మ్యాచ్‌తో పోలిస్తే చెన్నైతో పోరుకు చాలా పెద్ద మొత్తంలో డిమాండ్ కనిపించింది. పైరవీలు, బ్లాక్ టికెట్లు అంతా అతని కోసమే సాగాయి. వాస్తవంగా కూడా ఈ టీమ్‌లో మరో ఆకర్షణీయమైన ప్లేయర్ ఎవరూ లేరు. మ్యాచ్ ముందు రోజు అతను గాయంతో ఉన్నాడని, ఆడకపోవచ్చని వినిపించింది. దాంతో మైదానంలోకి వెళుతున్న ఫ్యాన్స్‌లో కొంత నిరాశ. కానీ అదృష్టవశాత్తూ అలా జరగలేదు. గ్రౌండ్‌లో పరిస్థితి చూస్తే మ్యాచ్ చెన్నైలో జరుగుతోందా అనిపించింది. అంతటా 7 నంబర్ ఎల్లో జెర్సీలతో పసుపు మయమైపోయింది. బయట అమ్మే చోట కూడా అది తప్ప మరో జెర్సీ కనిపించలేదు. 80 శాతం ధోని ఫ్యాన్స్ ఉండగా... మరో 20 శాతం సన్‌రైజర్స్ అభిమానులు ఉన్నారేమో. ఇదే అతని ఆఖరి సీజన్‌గా భావిస్తున్న నేపథ్యంలో మన ఫ్యాన్స్‌కు మళ్లీ అతని ఆటను ప్రత్యక్షంగా చూసే అవకాశం దక్కకపోవచ్చు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుటుంబసభ్యులతో వచ్చి మ్యాచ్‌ను తిలకించడం విశేషం. మ్యాచ్‌కు ముందు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, మిగతా కార్యవర్గ సభ్యులు ధోనిని శాలువాతో సన్మానించి చార్మినార్ ప్రతిమను జ్ఞాపికగా అందజేశారు.

● ఈ ఐపీఎల్‌లో కొత్త కెప్టెన్‌తో సీజన్‌ను ఆరంభించిన ముంబై ఇండియన్స్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఓడి పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. గాయం నుంచి కోలుకోకపోవడంతో స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ ఈ మూడు మ్యాచ్‌ల్లో బరిలోకి దిగలేదు. ప్రస్తుతం సూర్య పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌లో అతను బరిలోకి దిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. సూర్య రాకతో ముంబై గెలుపు బోణీపై ఆశలు పెట్టుకుంది.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.